సాక్షి

సత్యమేవ జయతే


WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 18 సంచిక: 107

మంగళవారం 8-7-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'తెలుగువారి గుండెచప్పుడు వినగలిగే ఆత్మీయుడిగా ఉంటే చాలు... నా జన్మ ధన్యమైనట్టే'



367 నాటౌట్

టెస్టుల్లో ఐదో అత్యుత్తమ వ్యక్తిగత స్కోరు సాధించిన దక్షిణాఫ్రికా బ్యాటర్ -14లో



మరో కీలక పదవి...

అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ కొత్త సీఈఓగా సంజోగ్ గుప్తా -14లో



రీల్ కోసం పాకులాట

రాజస్తాన్‌కు చెందిన ఓ వ్యక్తి తన కుమార్తె ప్రాణాలను పణంగా పెట్టి రీల్ సృష్టించడానికి ప్రయత్నిస్తున్న వీడియో వైరల్‌గా మారింది.

వివరాలు 6లో ▸



ఖాళీ చేయడానికి సిద్ధం..

అధికారిక నివాసాన్ని ఖాళీ చేసేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయని సుప్రీంకోర్టు మాజీ సీజేఐ జస్టిస్ చంద్రచూడ్ తెలిపారు.

వివరాలు 6లో ▸



బ్రహ్మపుత్రలో కొత్త చేప

బ్రహ్మపుత్ర నదీజలాల్లో కొత్తగా కనిపించిన చేపను శాస్త్రవేత్తలు కనుగొన్నారు. దీనికి పేథియా దిబ్రూఘర్నేసిస్ అనే పేరుపెట్టారు.

వివరాలు 6లో ▸



'ముంబై' ప్లాన్‌ను పర్యవేక్షించా

ముంబైలో లష్కరే ఉగ్రవాదుల మారణ హోమం వెనక తన పాత్ర ఉందని పాకిస్తాన్ ఉగ్రవాది తహవ్వుర్ రాణా అంగీకరించాడు.

వివరాలు 6లో ▸

న్యూస్‌రీల్

యువత చేతిలోనే..



యువత చేతిలోనే దేశ భవిష్యత్తు ఉందని, దేశాభివృద్ధిలో వారిదే కీలకపాత్ర అని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. స్నాతకోత్సవం కేవలం ఉత్సవం కాదని, అది ఒక శాస్త్రీయ సంకల్పం అని స్పష్టం చేశారు. కాకతీయ యూనివర్సిటీ స్నాతకోత్సవం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

- వివరాలు 16లో▶

కాంగ్రెస్‌లో సంస్థాగత సందడి



సంస్థాగత నిర్మాణంపై కాంగ్రెస్ దృష్టి సారించింది. గ్రామస్థాయి నుంచి మండల, బ్లాక్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుల నియామకాలను త్వరలోనే పూర్తి చేసే పనిలో పడింది. ఈ పదవులను భర్తీ చేసే కార్యాచరణను టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ రూపొందించారు.

- వివరాలు 12లో▶

బ్యాంకుల పేరుతో బురిడీ!



భారత్‌లో బ్యాంకుల పేరుతో జరిగే సైబర్ మోసాలు ఏటా పెరుగుతున్నాయి. బ్యాంకులలో పాలన, ముప్పు నిర్వహణలో లోపాలు సైతం ఇందుకు ఆజ్యం పోస్తున్నాయి. 2020–21తో పోలిస్తే మోసాల సంఖ్య గత ఆర్థిక సంవత్సరంలో 3 రెట్లు పెరిగింది.

- వివరాలు 2లో▶

డిగ్రీతో 'దోస్త్' అంతంతే



డిగ్రీ కోర్సుల్లో చేరేవారి సంఖ్య అంతంత మాత్రంగానే ఉంటోంది. రాష్ట్రంలో 957 డిగ్రీ కాలేజీల్లో 4,36,947 సీట్లు అందుబాటులో ఉంటే, 3 విడతల దోస్త్ కౌన్సెలింగ్ తర్వాత చేరిన వారి సంఖ్య 1,41,590 మాత్రమే. కనీసం సగంమంది కూడా చేరలేదు.

- వివరాలు 3లో▶

ఇదండీ సంగతి



జాబ్ క్యాలెండర్ జాడేది!

జాబ్ క్యాలెండర్‌లో పేర్కొన్న ప్రకారం వెలువడని నోటిఫికేషన్లు


- ఎస్సీ వర్గీకరణ ప్రక్రియ పెండింగ్‌తో నిలిచిన నోటిఫికేషన్ల జారీ
- ప్రస్తుతం వర్గీకరణ ప్రక్రియ పూర్తయినా ఇప్పటికీ వెలువడని వైనం
- గతేడాది క్యాలెండర్ ప్రకటనల గడువు ముగిసి 4 నెలలు కావొస్తున్నా కొత్త క్యాలెండర్ ఊసేలేదు
- ఉద్యోగ ప్రకటనలు ఎప్పుడో తెలియక నిరుద్యోగుల్లో నిరాశ, అయోమయం

రెండేళ్లుగా ఎదురుచూస్తున్నా...

దాదాపు రెండేళ్లుగా ఫుడ్ ఇన్‌స్పెక్టర్, ఇతర అర్హతగల ఉద్యోగాలకు సిద్ధమవుతున్నా. కోచింగ్, పుస్తకాల కోసం ఇప్పటివరకు రూ. లక్ష ఖర్చు చేశా. కానీ ఇప్పటివరకు తగిన ఉద్యోగాలకు నోటిఫికేషన్లు విడుదల కాలేదు. దీంతో ఆర్థిక ఇబ్బందులు ప్రారంభం అయ్యాయి. తప్పని పరిస్థితుల్లో ప్రిపరేషన్ ఆపేసి ప్రైవేటు ఉద్యోగం కోసం ప్రయత్నం మొదలు పెట్టా.

- ఎం. సతీశ్, ఎంఎస్సీ ఫుడ్ టెక్నాలజీ, మహబూబాబాద్





సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగ ఖాళీల భర్తీ ప్రక్రియను నిర్దిష్ట విధానంలో చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకురావాలనుకున్న జాబ్ క్యాలెండర్ అమలు జాడలేదు. ఏడాది కాలంలో భర్తీ చేయనున్న ఉద్యోగాలకు సంబంధించి నోటిఫికేషన్లను ఏ సమయంలో విడుదల చేస్తారు... పరీక్షల నిర్వహణ ఎప్పుడు తదితర అంశాలపై అభ్యర్థులకు ముందస్తుగా స్పష్టత ఇవ్వడమే జాబ్ క్యాలెండర్ ముఖ్య ఉద్దేశం. ఈ క్యాలెండర్‌ను ఏటా ప్రకటిస్తే అభ్యర్థులు వ్యూహాత్మక లక్ష్యంతో ముందుకు పోవచ్చనే ఆలోచనతో ప్రజాప్రభుత్వం జాబ్ క్యాలెండర్‌ను తెరపైకి తెచ్చింది. ఇందులో భాగంగా గతేడాది ఆగస్టులో తొలి జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేసింది. అందులో గ్రూప్–1 ఉద్యోగాలతోపాటు ఇతర కేటగిరీలకు చెందిన 15 రకాల ఉద్యోగాల భర్తీకి సంబంధించి నోటిఫికేషన్ల విడుదల, పరీక్షల నిర్వహణకు తేదీలు ప్రకటించింది. కానీ ఎస్సీ వర్గీకరణకు సంబంధించి అత్యున్నత న్యాయస్థానం తీర్పు ఇవ్వడం.. ఆ తీర్పునకు

మిగతా 2వ పేజీలో ▶



రియో డి జనిరోలో బ్రిక్స్ సదస్సు సందర్భంగా చైనా ప్రధాని లీ కియాంగ్, బ్రెజిల్ అధ్యక్షుడు లూయిస్ దసిల్వా తదితర నేతలతో కలసి నవ్వులు చిందిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ

ప్రపంచానికి బ్రిక్స్ ఆశాదీపం

భిన్నత్వమే కూటమి బలం: ప్రధాని మోదీ

- గ్లోబల్ సౌత్‌కు బ్రిక్స్‌పై ఎన్నో ఆశలు
- వాటిని నెరవేర్చి చూపిద్దామని పిలుపు
- బ్రిక్స్ పరిశోధన సంస్థ ఏర్పాటుకు ప్రతిపాదన..
- పర్యావరణ న్యాయం... తమకు పవిత్ర నైతిక విధి అని వెల్లడి
- పలువురు దేశాధినేతలతో భేటీలు

6లో

"విద్య నుంచి వ్యవసాయం దాకా అన్ని రంగాల్లోనూ ఏఐని భారత్ చురుగ్గా, విస్తృతంగా ఉపయోగిస్తోంది. ఏఐపై నెలకొన్న ఆందోళనలకు సమర్థంగా చెక్ పెట్టాలంటే ఇటు పాలనకు, అటు ఇన్నోవేషన్లకు సమ ప్రాధాన్యం ఇవ్వడమే మార్గం. బాధ్యతాయుతమైన ఏఐ మనందరి లక్ష్యం కావాలి

–ప్రధాని మోదీ

బ్రిక్స్‌కు మద్దతిచ్చే దేశాలపై 10% అదనపు సుంకాలు

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటన.. తీవ్రంగా ఖండించిన చైనా

- వివరాలు 6లో▶

మహిళలకు 60 ఎమ్మెల్యే సీట్లు

వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చే బాధ్యత.. గెలిపించే పూచీ నాదే

- త్వరలోనే అసెంబ్లీ ఎన్నికల్లోనూ 33% మహిళా రిజర్వేషన్లు
- కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే ప్రభుత్వ లక్ష్యం: సీఎం రేవంత్
- మంత్రి కొండా సురేఖతో కలిసి వనమహోత్సవం ప్రారంభం



వ్యవసాయ వర్సిటీలో రుద్రాక్ష మొక్క నాటుతున్న సీఎం రేవంత్ రెడ్డి. చిత్రంలో మంత్రి సురేఖ

ఏజీ వర్సిటీ (హైదరాబాద్): త్వరలోనే నియోజకవర్గాల పునర్విభజనతో అసెంబ్లీ ఎన్నికల్లోనూ మహిళా రిజర్వేషన్లు రాబోతున్నాయని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. వచ్చే ఎన్నికల్లో 153 అసెంబ్లీ సీట్లకుగాను 50 సీట్లు అంటే 33 శాతం మంది ఆడబిడ్డలు ఎమ్మెల్యేలు అవుతారని చెప్పారు. 33 శాతం సీట్లకు ఇంకో 10 సీట్లు కలిపి మొత్తం 60 సీట్లను ఆడబిడ్డలకు ఇచ్చే బాధ్యత తాను తీసుకుంటానన్నారు. మంచిపనులు చేసి పేరు తెచ్చుకొనే మహిళలను గుర్తించి ఎమ్మెల్యే టికెట్లు ఇవ్వడమే కాకుండా వారిని గెలిపించే పూచీ కూడా తనదేనన్నారు. సోమవారం హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో అటవీ శాఖ మంత్రి కొండా సురేఖతో

మిగతా 12వ పేజీలో ▶

తెలంగాణలో ఖేలో ఇండియా గేమ్స్ నిర్వహించండి

క్రీడాభివృద్ధికి రూ.100 కోట్లు కేటాయించండి

- ఒలింపిక్స్ ఈవెంట్లను రాష్ట్రంలో నిర్వహించండి
- కేంద్రమంత్రి మన్‌సుఖ్ మాండవీయకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వినతి
- రేవంత్‌ను కలిసిన నటుడు అజయ్‌దేవగణ్, భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ కపిల్‌దేవ్

- వివరాలు 12లో

అమెరికాలో ఘోర రోడ్డు ప్రమాదం

కుటుంబం సజీవ దహనం

- రాంగ్‌రూట్‌లో వచ్చి కారును ఢీకొన్న ట్రక్కు
- కారులోనే నలుగురు మృతి
- మృతులంతా హైదరాబాద్‌వాసులు



పిల్లలతో వెంకట్, తేజస్విని

కుత్బుల్లాపూర్: అమెరికాలోని డాలస్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు సజీవ దహనమయ్యారు. ఆదివారం రాంగ్ రూట్లో వచ్చిన ట్రక్కు కారును ఢీకొట్టింది. దీంతో కారులో పెద్ద ఎత్తున మంటలు చెలరేగి అందులో ప్రయాణిస్తున్న శ్రీ వెంకట్, తేజస్విని దంపతులతో పాటు కొడుకు సిద్ధార్థ, కూతురు మృద కాలిపోయారు. తిరుమలగిరికి చెందిన పశుపతినాథ్–గిరిజ దంపతుల కుమారుడు శ్రీ వెంకట్‌కు జీడిమెట్లకు చెందిన తేజస్వినితో 2013లో వివాహం జరిగింది. పశుపతినాథ్ కొంపల్లి ఎన్సీఎల్‌లో నివాసముంటున్నారు. ఉద్యోగ నిమిత్తం మూడేళ్ల క్రితం కుటుంబంతో సహా శ్రీ వెంకట్–తేజస్విని దంపతులు డాలస్‌కు వెళ్లారు. శ్రీ వెంకట్ సోదరి దీపిక అట్లాంటాలో ఉండగా, మూడు రోజుల క్రితం తల్లిదండ్రులతో కలిసి అక్కడకు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో వీరు ప్రయాణిస్తున్న కారును ట్రక్కు ఢీకొట్టగా మంటలు చెలరేగి నలుగురూ అక్కడికక్కడే మృతి చెందారు. అయితే వీరితో పాటు ప్రయాణించాల్సిన శ్రీవెంకట్ తల్లిదండ్రులు విమానంలో డాలస్‌కు వచ్చారు. తమ కొడుకు ఇంటికి రాలేదంటూ ఆరా తీయగా ఈ విషయం వెలుగులోకి వచ్చింది.

కిరికిరి శాఖలన్నీ నాకే ఇచ్చిర్రు..

ఇది అదృష్టమో.. దురదృష్టమో పొన్నమన్నే చెప్పాలె



- పదేళ్లు కిందా మీదా చేసినంక నా చేతిలో పెట్టి పోయిర్రు: మంత్రి వాకిటి శ్రీహరి
- మంత్రి వ్యాఖ్యలపై కాంగ్రెస్ నేతల్లో మిశ్రమ స్పందన

- వివరాలు 12లో



టాయిలెట్‌కు కూడా సర్కార్ స్థలం ఉండదేమో!

- ఓ కేసులో ప్రభుత్వాల తీరుపై హైకోర్టు అసహనం.. సంపన్నులకు ఎకరాలకు ఎకరాలు కేటాయిస్తారు
- పేదలకు మాత్రం ఇళ్ల స్థలాలకు భూమి కరువు.. మీ సొంత హేచరీతో ప్రజలకు ఏం లాభం?
- ప్రభుత్వ భూమిని అడిగిన పిటిషనర్‌కు కోర్టు ప్రశ్న

5లో

గ్రూప్–1 పిటిషన్లపై తీర్పు రిజర్వు

ఏప్రిల్ నుంచి వాదనలు విన్న హైకోర్టు

- 'పరీక్ష'లో అవకతవకలు జరిగాయన్న పిటిషనర్లు.. పారదర్శకంగా నిర్వహించామని టీజీపీఎస్సీ వాదనలు
- పోస్టింగ్‌లకు అనుమతించాలన్న ఎంపికైన అభ్యర్థులు

'హైరైజ్'పై వివరణ ఇవ్వండి

- 'అనధికారిక ప్రతివాదులకు హైకోర్టు నోటీసులు జారీ
- ఖాజాగూడ భూమి వివాదంపై సీజే ధర్మాసనం విచారణ
- సర్కార్ భూమిలో అక్రమ నిర్మాణాలు చేస్తున్నారని కాంగ్రెస్ ఎమ్మెల్యేల పిటిషన్
- అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపణ

- వివరాలు 2లో▶

కొలువుంది.. కౌశలమేదీ

దేశంలో ఏటా ఉద్యోగాలకు ప్రయత్నిస్తున్న 1.2 కోట్ల మంది యువత

- వారిలో 60 లక్షల మందిలోనే సరైన నైపుణ్యాలు
- నిపుణులు దొరక్క ఇబ్బందిపడుతున్న 48% కంపెనీలు
- ఏఐ–డేటా సైన్స్, సైబర్ సెక్యూరిటీ వంటి కొత్త రంగాల్లో లక్షలాదిగా ఖాళీలు
- స్కిల్స్ లేక ఇంజనీరింగ్ పట్టభద్రుల్లో 60% మందికి నో ప్లేస్‌మెంట్స్
- 78% మంది బీఏ, బీఎస్సీ డిగ్రీలు చేసిన వారిదీ అదే పరిస్థితి
- నేషనల్ శాంపిల్ సర్వే సంస్థ చేపట్టిన పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే నివేదికలో వెల్లడి



సాక్షి, న్యూఢిల్లీ: దేశంలో ఉద్యోగాలు లేవని ఓవైపు యువత ఆందోళన చెందుతుంటే మరోవైపు లక్షలాది ఉద్యోగ ఖాళీలు ఉన్నా పట్టభద్రుల్లో తగిన స్కిల్స్ లేకపోవడం వల్ల ఉద్యోగాలు భర్తీ కావట్లేదని తాజా అధ్యయనం వెల్లడించింది. ప్రస్తుతం దేశంలో ఏటా 1.2 కోట్ల మంది యువత ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్నప్పటికీ వారిలో సుమారు 60 లక్షల మందికే సరైన నైపుణ్యాలు ఉంటున్నాయని కేంద్ర గణాంకాల మంత్రిత్వశాఖ పరిధిలోని నేషనల్ శాంపిల్ సర్వే (ఎన్ఎస్ఎస్) సంస్థ చేపట్టిన పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే (పీఎల్ఎఫ్ఎస్) నివేదిక తెలిపింది. 48% కంపెనీలు నైపుణ్యంగల ఉద్యోగులు లేక ఇబ్బంది పడుతున్నాయని పేర్కొంది. ఈ సర్వే ప్రకారం ప్రస్తుతం ఇంజనీరింగ్ డిగ్రీ పూర్తి చేసిన వారిలో 60% మందికి ప్లేస్‌మెంట్స్ దొరకడం లేదు. 78% మంది బీఏ, బీఎస్సీ డిగ్రీలు పూర్తి చేసిన వారికి వెంటనే ఉపాధి లభించట్లేదు. నైపుణ్యాలు లేని కారణంగా కంపెనీలు ఉద్యోగాలను వేగంగా భర్తీ చేయలేక పోతున్నాయి. ఐటీ, డేటా సైన్స్, సైబర్

మిగతా 3వ పేజీలో ▶

సర్వే నివేదికలోని గణాంకాలు ఇలా..

- ➡ 48% కంపెనీలు నైపుణ్యాలు ఉన్న ఉద్యోగులు లేక ఇబ్బంది పడుతున్నాయి.
- ➡ 55% యువత సరైన ఉద్యోగం దొరకడం కష్టమని చెబుతున్నారు.
- ➡ 1.2 కోట్ల యువత ఏటా ఉద్యోగాల కోసం మార్కెట్లోకి వస్తున్నారు.
- ➡ అందులో 60 లక్షల మందికి మాత్రమే తగిన అనుభవం ఉంటోంది.
- ➡ నైపుణ్యంగల ఉద్యోగులను నియమించడం సవాల్‌గా మారిందని 60% కంపెనీలు చెబుతున్నాయి.
- ➡ 78% ఉద్యోగాలు డిజిటల్ టెక్నాలజీ, గ్రీన్ ఎనర్జీ, సైబర్ సెక్యూరిటీ, ఏఐ వంటి కొత్త రంగాలవే.

బ్యాంకుల పేరుతో.. బురిడీ!

ఎవరి చేతిలో చూసినా స్మార్ట్‌ఫోన్ కనపడుతోంది. దాదాపు అందరికీ బ్యాంకు ఖాతాలు ఉన్నాయి. బ్యాంకుల దూకుడు, చవక ఇంటర్నెట్ పుణ్యమా అని డిజిటల్ బ్యాంకింగ్, ఆన్‌లైన్ చెల్లింపులు వేగంగా విస్తరిస్తున్నాయి. ఇంకేముంది దోపిడీకి సైబర్ మోసగాళ్ళకు ఇవి కొత్త మార్గాలను తెరిచాయి. దీంతో భారత్‌లో బ్యాంకుల పేరుతో జరిగే సైబర్ మోసాలు ఏటా పెరుగుతున్నాయి. బ్యాంకులలో పాలన, ముప్పు నిర్వహణలో లోపాలు సైతం ఇందుకు ఆజ్యం పోస్తున్నాయి. 2020–21తో పోలిస్తే బ్యాంకు మోసాల కేసుల సంఖ్య గత ఆర్థిక సంవత్సరంలో మూడు రెట్లు అధికమయ్యాయి. తక్కువ విలువ కలిగిన మోసాలు ఎక్కువగా జరుగుతున్నాయని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) నివేదిక చెబుతోంది.

దేశంలో 2024–25లో బ్యాంకింగ్ రంగంలో 23,953 మోసాల కేసులు నమోదయ్యాయి. 2020–21లో ఈ సంఖ్య 7,359. అప్పట్లో ఆ మోసాల విలువ రూ.1,38,211 కోట్లు. సైబర్ మోసగాళ్లు దోపిడీకి కొత్త మార్గాలు ఎలా వెతుకుతున్నారో.. వీటిని అరికట్టడానికి బ్యాంకులు కూడా నిరంతరం శ్రమిస్తూ సాంకేతిక సామర్థ్యాన్ని పెంచుకుంటున్నాయి. ఫలితంగా ఈ మోసాల విలువ నాలుగేళ్లలో 74 శాతం తగ్గి గత ఆర్థిక సంవత్సరంలో రూ.36,014 కోట్లకు వచ్చింది. 2024–25లో లోన్లకు సంబంధించిన మోసాలలో గణనీయమైన తగ్గుదల కనిపించిందని ఆర్‌బీఐ తెలిపింది. భారత కార్పొరేట్ రంగంలో భారీ విలువ కలిగిన నిరర్థక రుణాల సంఖ్య గత 2024–25లో గణనీయంగా పెరగడంతో బ్యాంకులు కంపెనీలకు రుణాలు ఇవ్వడంలో జాగ్రత్తగా వ్యవహరిస్తూ క్రెడిట్ అంచనా ప్రక్రియలను కఠినతరం చేస్తున్నాయి. మరోవైపు బ్యాంకులు రిటైల్ రుణాలపై దృష్టి సారించి డిజిటల్ బ్యాంకింగ్‌ను పెంచాయి.



- సాక్షి, స్పెషల్ డెస్క్

- నాలుగేళ్లలో మూడింతలైన 'బ్యాంక్ ఫ్రాడ్స్' సంఖ్య
- నాలుగింట మూడొంతులు తగ్గిన మోసాల విలువ
- విలువలో రుణ సంబంధ మోసాలదే సింహభాగం
- కార్డులు, ఇంటర్నెట్ బ్యాంకింగ్ ఫ్రాడ్స్‌లో 5 రెట్ల వృద్ధి

బ్యాంకుల వారీగా మోసాల విలువ (రూ.కోట్లలో), సంఖ్య

సంవత్సరం		ప్రభుత్వ	ప్రైవేట్	ఇతర బ్యాంకులతో సహా మొత్తం
2020-21	విలువ	81,901	46,335	1,38,211
	సంఖ్య	2,901	3,710	7,359
2021-22	విలువ	40,282	17,588	60,414
	సంఖ్య	3,078	5,334	9,103
2022-23	విలువ	12,577	5,206	18,981
	సంఖ్య	3,331	8,971	13,494
2023-24	విలువ	9,254	2,722	12,230
	సంఖ్య	7,460	24,207	36,060
2024-25	విలువ	25,667	10,088	36,014
	సంఖ్య	6,935	14,233	23,953

అడ్వాన్సులు, కార్డ్/ఇంటర్నెట్ ఆధారిత మోసాల విలువ (రూ.కోట్లలో), సంఖ్య

సంవత్సరం		విలువ	సంఖ్య
2020-21	అడ్వాన్సులు	1,36,812	3,497
	కార్డ్/ఇంటర్నెట్	119	2,545
2021-22	అడ్వాన్సులు	17,542	4,021
	కార్డ్/ఇంటర్నెట్	278	3,596
2022-23	అడ్వాన్సులు	17,542	4,021
	కార్డ్/ఇంటర్నెట్	278	6,699
2023-24	అడ్వాన్సులు	10,072	4,118
	కార్డ్/ఇంటర్నెట్	1,457	29,082
2024-25	అడ్వాన్సులు	33,148	7,950
	కార్డ్/ఇంటర్నెట్	520	13,516

రుణ మోసాలే ఎక్కువ..

గత నాలుగేళ్లలో జరిగిన మోసాల్లో ప్రైవేట్ రంగ బ్యాంకుల పేరుతో జరిగినవే అధికం కావడం గమనార్హం. రిటైల్ రుణాలలో ప్రైవేట్ బ్యాంకులు మరింత దూకుడుగా వ్యవహరించడమే ఇందుకు కారణం. గత ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వ రంగ బ్యాంకులతో పోలిస్తే ప్రైవేట్ రంగంలో రెండింతలకుపైగా కేసులు నమోదయ్యాయి. మోసాల విలువ పరంగా మాత్రం ప్రైవేటు రంగ బ్యాంకుల కంటే ప్రభుత్వ రంగ బ్యాంకులు రెండున్నర రెట్లు అధికంగా మూటగట్టుకున్నాయి. విదేశీ బ్యాంకులు, చిన్న ఫైనాన్స్ బ్యాంకులు, పేమెంట్ బ్యాంక్స్‌లో మోసం విలువ తగ్గినప్పటికీ కేసుల సంఖ్యలో స్థిరమైన పెరుగుదల నమోదైంది. ఇందులో రుణ సంబంధిత మోసాలే ఎక్కువ. మొత్తం విలువలో వీటి వాటా 92 శాతానికిపైనే. క్రెడిట్/డెబిట్ కార్డులు, ఇంటర్నెట్ బ్యాంకింగ్ మోసాల సంఖ్య నాలుగేళ్లలో అయిదు రెట్లు దూసుకెళ్లడం ఆందోళన కలిగించే అంశం. గత ఆర్థిక సంవత్సరంలో మొత్తం మోసాలలో సగానికి పైగా కేసులు (13,516) ఇవే. ఈ కేసుల విలువ రూ.520 కోట్లు. డిపాజిట్ మోసాల విలువ రూ.527 కోట్లు ఉంది.

పాత కేసుల కారణంగా..: 2024–25 జాబితా ఇంతలా పెరగడానికి కారణం.. గత సంవత్సరాలకు సంబంధించిన కేసులు కూడా వచ్చి చేరడమే. అలా రూ.18,674 కోట్ల విలువైన 122 మోసం కేసులు ఇందులో వచ్చి పడ్డాయి. 2023 మార్చి 27 నాటి సుప్రీంకోర్టు తీర్పునకు అనుగుణంగా 2024–25 బుక్స్‌లో కొత్తగా వీటిని చేర్చారు. దుర్వినియోగం, నేరపూరిత నమ్మక ద్రోహం, నకిలీ సాధనాల ద్వారా మోసపూరితంగా నగదు తీసుకోవడం, ఖాతా పుస్తకాలను లేదా కల్పిత ఖాతాల ద్వారా తారుమారు చేయడం, ఆస్తిని మార్చడం వంటివి బ్యాంకు మోసాల జాబితాలో ఉన్నాయి.

10న రాష్ట్ర మంత్రివర్గ భేటీ

సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధ్యక్షతన ఈనెల 10న మధ్యాహ్నం 2 గంటలకు సచివాలయంలో రాష్ట్ర మంత్రివర్గ సమావేశం జరగనుంది. విధానపరమైన అంశాలపై ఎప్పటికప్పుడు నిర్ణయాలు తీసుకోవడానికి ప్రతి నెలా రెండు పర్యాయాలు మంత్రివర్గ సమావేశం నిర్వహించాలని నిర్ణయం తీ సుకున్న నేపథ్యంలో ప్రభుత్వం ఈ సమావేశా న్ని నిర్వహించనుంది. కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌ల శాశ్వత పునరుద్ధరణకు తీసుకోవాల్సిన చర్యలపై ఎన్డీఎస్‌ఏ నిపుణుల కమిటీ సమర్పించిన తుది నివేదికపై మంత్రివర్గ సమావేశంలో ప్రభుత్వం చర్చించి ఓ నిర్ణయం తీసుకోనుంది. దీని ఆధారంగా బరాజ్‌ల పునరుద్ధరణకు తదుపరి కార్యాచరణను ప్రభుత్వం సిద్ధం చేయనుంది. ఈనెల 14 నుంచి కొత్త రేషన్ కార్డుల జారీని ప్రభుత్వం ప్రారంభించనుంది. దీనిపై కూడా మంత్రివర్గం చర్చించి ఆమోదించనుంది. స్థానిక ఎన్నికల నిర్వహణపై చర్చించనుంది. స్టాంపుల చట్ట సవరణ బిల్లును మంత్రివర్గం ఆమోదించనుంది.

'రిజర్వేషన్ల' కేసులో తీర్పు రిజర్వు

సాక్షి, హైదరాబాద్: రిజర్వేషన్లకు సంబంధించి దాఖలైన ప్రైవేట్ కేసును కొట్టివేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌లో హైకోర్టు తీర్పు రిజర్వు చేసింది. గతేడాది పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా భద్రాద్రి కొత్తగూడెంలో కాంగ్రెస్ నిర్వహించిన సభలో రేవంత్ చేసిన ప్రసంగంపై వెంకటేశ్వర్లు పరువునష్టం దావా వేశారు. బీజేపీ అధికారంలోకి వస్తే రిజర్వేషన్లు రద్దు చేస్తుందని ఆరోపించారన్నారు. సీఎం ఆడియో క్లిప్పింగ్‌లను, మీడియా ప్రచురణలను అందజేశారు. ఆ పిటిషన్‌పై విచారణ చేపట్టిన ప్రజాప్రతినిధుల కోర్టు సాక్షుల వాంగ్మూలం రికార్డు చేసింది. ఈ నేపథ్యంలో రాజకీయ కక్ష సాధింపులో భాగంగా పెట్టిన ఈ కేసు కొట్టివేయాలని కోరుతూ రేవంత్ హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ కె.లక్ష్మణ్ సోమవారం మరోసారి విచారణ చేపట్టారు.

12లోగా ఎంపీటీసీ డీలిమిటేషన్ పూర్తి

సాక్షి, హైదరాబాద్: మండల పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాల (ఎంపీటీసీ) పునర్విభజన ప్రక్రియను ఈ నెల 12 నాటికి పూర్తి చేయాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ డైరెక్టర్ జి.శ్రీజన ఉత్తర్వులు జారీ చేశారు. పలు గ్రామ పంచాయతీలను మునిసిపాలిటీల్లో విలీనం చేయడం లేదా పక్క పంచాయతీల్లో విలీనం చేయడం, మండలాల ఏర్పాటుతో వేరే పంచాయతీల్లో కలవడం లేదా జిల్లా మారిపోవడం లాంటివి జరిగిన నేపథ్యంలో.. డీలిమిటేషన్ ప్రక్రియపై ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఈనెల 12వ తేదీన తుది జాబితాను ప్రకటించాలని ఆదేశించారు. అయితే ప్రతీ మండలంలో కనీసం ఐదు ఎంపీటీసీ స్థానాలు ఉండేలా చూడాలని స్పష్టం చేశారు. మంగళవారం ముసాయిదా ఎంపీటీసీ స్థానాలను ప్రచురించాలని, ప్రజల నుంచి మంగళ, బుధవారాల్లో (8, 9 తేదీల్లో) అభ్యంతరాలు స్వీకరించాలని, గురు, శుక్రవారాల్లో (10, 11 తేదీల్లో) అభ్యంతరాలను పరిష్కరించాలని శనివారం తుది జాబితా ప్రకటించాలన్నారు.

జాబ్ క్యాలెండర్ జాడేది!

▶ మొదటి పేజీ తరువాయి

అనుగుణంగా రిజర్వేషన్లు విభజించాల్సి రావడంతో ఉద్యోగ ప్రకటనలకు అంతరాయం ఏర్పడింది. దీంతో తొలి జాబ్ క్యాలెండర్‌లో నిర్దేశించిన ఉద్యోగ ప్రకటనలేవీ ఇప్పటికీ వెలువడలేదు. ప్రస్తుతం ఎస్సీ వర్గీకరణ ప్రక్రియ పూర్తయినప్పటికీ ఉద్యోగ ప్రకటనలు వెలువడకపోవడంతో నిరుద్యోగులు నిరాశ చెందుతున్నారు. తొలిజాబ్ క్యాలెండర్ గడువు సైతం ముగియడంతో కొత్త జాబ్ క్యాలెండర్ ఇస్తారా లేక గత క్యాలెండర్‌లో నిర్దేశించిన నోటిఫికేషన్లకు సంబంధించి తేదీలు మార్చి విడుదల చేస్తారా? అనే విషయం తెలియక నిరుద్యోగులు అయోమయానికి గురవుతున్నారు.

రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ పూర్తి...

ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి ఎస్సీ వర్గీకరణ తీర్పుతో బ్రేక్ పడటంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసెంబ్లీ వేదికగా వర్గీకరణ తీర్పును స్వాగతిస్తూ... ఈ ప్రక్రియ పూర్తయ్యాకే కొత్త ఉద్యోగ ప్రకటనలు జారీ చేస్తామని స్పష్టం చేశారు. దీంతో గతేడాది ఆగస్టు నుంచి ఎలాంటి ఉద్యోగ ప్రకటన వెలువడలేదు. ప్రభుత్వం ప్రకటించిన తొలి జాబ్ క్యాలెండర్ ప్రకారం గతేడాది సెప్టెంబర్ నుంచి ఉద్యోగ నియామకాలకు సంబంధించిన ప్రకటనలు వెలువడాలి. కానీ వర్గీకరణ అంశంతో నోటిఫికేషన్ల విడుదల ఎక్కడికక్కడ నిలిచిపోయింది. మరోవైపు రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ అమలుకు సంబంధించి ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేసి అభిప్రాయాల స్వీకరణ, అమలుకు సంబంధించిన అధ్యయనాన్ని ప్రభుత్వం మొదలుపెట్టింది. ఈ ఏడాది ఫిబ్రవరి నాటికి వర్గీకరణకు సంబంధించిన ప్రక్రియ పూర్తవగా ఏప్రిల్ 14న ఎస్సీ వర్గీకరణ ఉత్తర్వులను ప్రభుత్వం జారీ చేసింది. ఆ రోజు నుంచి రాష్ట్రంలో ఎస్సీ రిజర్వేషన్లు వర్గీకరించి అమలు చేస్తున్నారు. ఉద్యోగ నియామకాలకు అడ్డంకిగా మారిన వర్గీకరణ సమస్య తొలగిపోవడంతో ఉద్యోగ నియామకాల ప్రకటనల జారీకి మార్గం సుగమమైనప్పటికీ ఆ తర్వాత కూడా ఒక్క ఉద్యోగ ప్రకటన వెలువడలేదు.

కొత్త జాబ్ క్యాలెండర్ ఏమైంది?

రాష్ట్ర ప్రభుత్వం ఏటా ఏప్రిల్‌లో జాబ్ క్యాలెండర్ జారీ చేస్తామని ప్రకటించింది. గతేడాది కాస్త ఆలస్యమైనప్పటికీ ఈ ఏడాది నుంచి వార్షిక సంవత్సరం బడ్జెట్ సమావేశాల అనంతరం ఈ జాబ్ క్యాలెండర్ జారీ చేస్తామని పలు సందర్భాల్లో సీఎం తోపాటు మంత్రులు ప్రకటించారు. ఈ లెక్కన ఈ ఏడాది ఏప్రిల్ నాటికి కొత్త జాబ్ క్యాలెండర్ విడుదల చేయాల్సి ఉంది. ఎస్సీ వర్గీకరణ నేపథ్యంలో గత జాబ్ క్యాలెండర్‌లో నిర్దేశించిన ప్రకటనలు వెలువడకపోవడంతో ఆయా ఉద్యోగాలతోపాటు కొత్తగా గుర్తించిన ఖాళీలతో కూడిన ఉద్యోగ ప్రకటనలకు సంబంధించిన అంశాలను కొత్త జాబ్ క్యాలెండర్‌లో వస్తాయని నిరుద్యోగులు భావించారు. కానీ కొత్త వార్షిక సంవత్సరం ప్రారంభమై మూడు నెలలు గడిచినా ఇప్పటివరకు నూతన జాబ్ క్యాలెండర్ ఊసే లేదు. ఏయే ఉద్యోగాల భర్తీ ఎప్పుడు జరుగుతుందా? అనే సందిగ్ధంలో నిరుద్యోగ అభ్యర్థులు సతమతమవుతున్నారు. ఉద్యోగ ప్రకటనల జారీలో జాప్యంతో వయోపరిమితి దాటిపోతుందనే ఆందోళన కొందరిని తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. గత జాబ్ క్యాలెండర్‌తో తాత్కాలిక కొలువులను వదిలేసి ఉద్యోగాలకు సిద్ధమవుతున్న వారు ఇప్పటికీ నోటిఫికేషన్లు విడుద కాకపోవడంతో లబోదిబోమంటున్నారు.

తెలంగాణ జాబ్ క్యాలెండర్- 2024-25

నియామకాలు	పోస్టులు	నోటిఫికేషన్ జారీ నెల	పరీక్ష నిర్వహణ నెల	నియామక సంస్థ
ల్యాబ్ టెక్నీషియన్/నర్సింగ్ ఆఫీసర్/ ఫార్మసిస్ట్ (హెచ్‌ఎంఅండ్‌ఎఫ్‌డబ్ల్యూ)	నోటిఫికేషన్‌లో నిర్దేశించినవి	సెప్టెంబర్–2024	నవంబర్–2024	టీఎంహెచ్‌ఎస్‌ఆర్‌బీ
ఇంజనీరింగ్ పోస్టులు/ట్రాన్స్‌కో/ ఎన్పీడీసీఎల్/ఎస్పీడీసీఎల్	ఏఈఈ/ఏఈ/ఎస్‌ఈ	అక్టోబర్–2024	జనవరి–2025	టీజీ ట్రాన్స్‌కో
గెజిటెడ్ కేటగిరీ ఇంజనీరింగ్ సర్వీసెస్	ఇంజనీరింగ్ విభాగాల్లో ఏఈఈ/ఈక్వలెంట్ పోస్టులు	అక్టోబర్–2024	జనవరి–2025	టీజీపీఎస్సీ
గ్రూప్–1 ప్రిలిమ్స్ (అసిస్టెంట్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్–యూపీఎస్సీ ప్రిలిమినరీ ఫర్ ఇండియన్ ఫారెస్ట్ సర్వీసెస్)	జీఓ. 55లో గుర్తించిన 19 కేటగిరీల్లోని పోస్టులు	అక్టోబర్–2024	ఫిబ్రవరి–2025	టీజీపీఎస్సీ
గెజిటెడ్ స్కేల్ ఇతర ప్రొఫెషనల్ సర్వీసెస్ (గ్రూప్స్‌లో లేనివి)	ప్రభుత్వ శాఖలు/ కార్పొరేషన్లు/ సొసైటీల పరిధిలో ప్రొఫెషనల్ సర్వీసులు	జనవరి–2025	ఏప్రిల్–2025	టీజీపీఎస్సీ
టీచర్	ప్రభుత్వ పాఠశాలల్లో టీచర్లు	ఫిబ్రవరి–2025	ఏప్రిల్–2025	డీఎస్‌ఈ
ఫారెస్ట్ బీట్ ఆఫీసర్	ఫారెస్ట్ బీట్ ఆఫీసర్	ఫిబ్రవరి–2025	మే–2025	టీజీపీఎస్సీ
టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్	టీచర్	ఏప్రిల్–2025	జూన్–2025	డీఎస్‌ఈ
గ్రూప్–1 మెయిన్స్	గ్రూప్–1 సర్వీసుల్లోనివి	జూలై–2025	-	టీజీపీఎస్సీ
ఎస్‌ఐ సివిల్/ఈక్వలెంట్ పోస్టులు (ప్రిలిమినరీ రిటెన్ టెస్ట్)	సబ్ ఇన్‌స్పెక్టర్	ఏప్రిల్–2025	ఆగస్టు–2025	టీజీపీఆర్‌బీ
పీసీ సివిల్/ఈక్వలెంట్ పోస్టులు (ప్రిలిమినరీ రిటెన్ టెస్ట్)	పోలీస్ కానిస్టేబుల్	ఏప్రిల్–2025	ఆగస్టు–2025	టీజీపీఆర్‌బీ
డిగ్రీ కాలేజీల్లో అకడమిక్ పోస్టులు	లెక్చరర్/లైబ్రేరియన్/ ఫిజికల్ డైరెక్టర్(డిగ్రీ కాలేజీలు)	జూన్–2025	సెప్టెంబర్–2025	టీజీపీఎస్సీ
డిగ్రీ లెక్చరర్స్	గురుకులాల్లో డీఎల్	జూన్–2025	సెప్టెంబర్–2025	టీఆర్‌ఈఐఆర్‌బీ
గ్రూప్–2(ఎఫ్‌బీఓ కూడా)	జీఓ. ఎంఎస్ 55లో గుర్తించిన 16 కేటగిరీల్లోని పోస్టులు	మే–2025	అక్టోబర్–2025	టీజీపీఎస్సీ
గ్రూప్–3(క్లబ్‌డ్ విత్ గ్రూప్–4)	జీఓ. ఎంఎస్ 55లో గుర్తించిన 10 కేటగిరీల్లోని పోస్టులు	జూలై–2025	నవంబర్–2025	టీజీపీఎస్సీ
వివిధ కేటగిరీల్లో ఎగ్జిక్యూటివ్ పోస్టులు	మేనేజ్‌మెంట్ ట్రైనీ(మైనింగ్, ఇఅండ్‌ఎం, ఎఫ్‌అండ్‌ఏ, సివిల్) మెడికల్ ఆఫీసర్(జీడీఎంఓ)	జూలై–2025	నవంబర్–2025	ఎస్సీసీఎల్



వైఎస్సార్ జయంతి సందర్భంగా సోమవారం అర్ధరాత్రి దాటాక బంజారాహిల్స్ సిటీ సెంటర్ చౌరస్తాలో వైఎస్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న అభిమానులు

నేడు వైఎస్సార్ జయంతి

ఉదయం 11 గంటలకు గాంధీభవన్‌లో వేడుకలు

సాక్షి, హైదరాబాద్: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి సందర్భంగా మంగళవారం ఉదయం 10.30 గంటలకు పంజాగుట్టలోని వైఎస్సార్ విగ్రహానికి టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ నివాళులర్పించనున్నారు. ఉదయం 11 గంటలకు గాంధీభవన్‌లో జరగనున్న వైఎస్సార్ జయంతి వేడుకల్లో టీపీసీసీ అధ్యక్షుడు వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించనున్నారు. కార్యక్రమంలో పాండిచ్చేరి మాజీ సీఎం నారాయణస్వామి, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, సీనియర్ నాయకులు, కాంగ్రెస్ అభిమానులు, కార్యకర్తలు పాల్గొంటారని టీపీసీసీ తెలిపింది. కాగా, వైఎస్సార్ జయంతి సందర్భంగా పీసీసీ చీఫ్, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్ వైఎస్సార్ సేవలను స్మరించుకున్నారు. డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి కలలు కన్న సమాజాన్ని సాధించుకుందామని ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు.

నేడు వైఎస్సార్ అభిమానుల ఆత్మీయ సమ్మేళనం

హాజరు కానున్న మాజీ ఎంపీలు, హైకోర్టు మాజీ జడ్జీలు

సాక్షి, హైదరాబాద్: మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి 76వ జయంతి సందర్భంగా హైటెక్ సిటీ బుట్టా కన్వెన్షన్ సెంటర్‌లో మంగళవారం సాయంత్రం 4 గంటలకు వైఎస్సార్ అభిమానుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ స్ఫూర్తి ఫౌండేషన్ ఒక ప్రకటనలో తెలిపింది. కార్యక్రమంలో మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్ రెడ్డి, మాజీ జడ్జీలు పి.లక్ష్మణరెడ్డి, నాగార్జున రెడ్డి, బి.శేషశయన రెడ్డి, జి.కృష్ణ మోహన్ రెడ్డి, ఏపీ ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శులు అజేయ కల్లం, కేఎస్ జవహర్ రెడ్డి, మాజీ డీజీపీలు వి.దినేష్ రెడ్డి, సీఎన్ గోపీనాథ్ రెడ్డిలతో పాటు వైఎస్సార్ తో కలిసి పనిచేసిన అధికారులు పాల్గొంటారని ఈశ్వర ప్రసాద రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమానికి వైఎస్సార్ అభిమానులు, శ్రేయోభిలాషులు భారీగా హాజరై విజయవంతం చేయాలన్నారు.

సామాజిక న్యాయాన్ని విశ్వసించిన మహానేత: మీనాక్షి నటరాజన్

సాక్షి, హైదరాబాద్: రాజ్యాంగ పరిరక్షణ, సామాజిక న్యాయాన్ని విశ్వసించిన మహానేత దివంగత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి అని ఏఐసీసీ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ కొనియాడారు. ముఖ్యమంత్రిగా ఎన్నో ప్రజా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టి చిరస్థాయిగా నిలిచిన వైఎస్సార్ 76వ జయంతిని పురస్కరించుకొని ఘన నివాళులర్పిస్తున్నట్లు తెలిపారు. వైఎస్సార్ పదవీకాలంలో హక్కుల ఆధారిత విధానాలు, ఆరోగ్యశ్రీ, ఆరోగ్యబీమా వంటి పథకాలు సమర్థవంతంగా అమలయ్యాయని పేర్కొన్నారు. దారిద్ర్యరేఖకు దిగువనున్న కుటుంబాలకు విపత్కర ఆరోగ్య సమస్యల వల్ల అయ్యే ఆసుపత్రి ఖర్చుల నుంచి ఆరోగ్యశ్రీ రక్షించిందని కొనియాడారు. వైఎస్సార్ హయాంలో ప్రారంభమైన 108 ఈఎంఆర్‌ఐ అంబులెన్స్ కార్యక్రమం ద్వారా.. పేదలకు అంబులెన్స్ సేవలు అందుబాటులోకి వచ్చాయని గుర్తు చేశారు. మహిళలు గౌరవంగా జీవించడానికి వైఎస్సార్ అమలు చేసిన పెన్షన్ల పథకం వీలు కల్పించిందన్నారు.

'హైరైజ్'పై వివరణ ఇవ్వండి

- అనధికారిక ప్రతివాదులకు హైకోర్టు నోటీసులు జారీ.... ఖాజాగూడ భూమి వివాదంపై సీజే ధర్మాసనం విచారణ
- సర్కార్ భూమిలో అక్రమ నిర్మాణాలు చేస్తున్నారని కాంగ్రెస్ ఎమ్మెల్యేల పిటిషన్
- అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపణ

సాక్షి, హైదరాబాద్: రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం ఖాజాగూడలో సర్వే నంబర్ 27లోని 27.18 ఎకరాల భూ వివాదానికి సంబంధించి అనధికారిక ప్రతివాదులకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణలోగా 'హైరైజ్' నిర్మాణాలపై కూడా వివరణ ఇవ్వాలని ఆదేశించింది. తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది. ఖాజాగూడలో సర్వే నంబర్ 27లోని 27.18 ఎకరాల సర్కార్ భూమిలో ప్రైవేట్ వ్యక్తులు పెద్ద ఎత్తున టవర్లు నిర్మిస్తున్నా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదంటూ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు అనిరుధ్‌రెడ్డి (జడ్చర్ల), శ్రీనివాస్‌రెడ్డి(మహబూబ్‌నగర్), మురళీనాయక్ (మహబూబాబాద్), కూచకుళ్ల రాజేశ్‌రెడ్డి(నాగర్‌కర్నూల్) హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. సర్కార్ భూమి, అక్రమ నిర్మాణాలపై పూర్తి వివరాలతో మరోసారి వినతిపత్రం సమర్పించాలని గత విచారణ సందర్భంగా ఎమ్మెల్యేలను హైకోర్టు ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ పిల్‌పై తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్ పాల్, జస్టిస్ రేణుకా యారా ధర్మాసనం సోమవారం మరోసారి విచారణ చేపట్టింది.

సీఎస్ సహా అధికారులకు వినతిపత్రం..

పిటిషనర్ తరఫున న్యాయవాది చిక్కుడు ప్రభాకర్ వాదనలు వినిపిస్తూ.. పోరంబోకు భూమిగా కాస్రా పహాణీలో పేర్కొన్న 27.18 ఎకరాల సర్వే నంబర్‌ను మార్చి రంగారెడ్డి జిల్లా కలెక్టర్ ఎన్‌వోసీ ఇచ్చారన్నారు. అనంతరం జీహెచ్‌ఎంసీ అధికారులు అక్కడ బహుళ అంతస్తుల నిర్మాణాలకు అనుమతి మంజూరు చేశారని చెప్పారు. అయితే అది సర్కార్ భూమి అని, విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోర్టు ఆదేశాల మేరకు పూర్తి వివరాలతో గత నెల 25, 26న అధికారులకు వినతిపత్రం సమర్పించామన్నారు. సీఎస్, రెవెన్యూ, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ముఖ్య కార్యదర్శులు, సీసీఎల్‌ఏ, రంగారెడ్డి జిల్లా కలెక్టర్, ఆర్డీవోతోపాటు జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ కమిషనర్లు, హైడ్రా, పీసీబీ, శేరిలింగంపల్లి తహసీల్దార్, రేరాకు కూడా వినతి పత్రాలు అందజేశామన్నారు. అయినా ఇప్పటివరకు చర్యలు తీసుకోలేదని నివేదించారు. ప్రభుత్వం తరఫున ఏజీ ఎ.సుదర్శన్‌రెడ్డి హాజరయ్యారు. వాదనలు విన్న ధర్మాసనం.. అనధికారిక ప్రతివాదులు సికిందర్ ఖాన్, సలాబత్ ఖాన్, పల్లవి, బెవర్లీ హిల్స్ ఓనర్స్ వెల్ఫేర్ సొసైటీ, బండి బింధు (సోహిణి బిల్డర్స్)లకు నోటీసులు జారీ చేసింది.

గ్రూప్–1 పిటిషన్లపై తీర్పు రిజర్వు

- ఏప్రిల్ నుంచి సుదీర్ఘ వాదనలు విన్న హైకోర్టు
- 'పరీక్ష'లో అవకతవకలు జరిగాయన్న పిటిషనర్లు
- పారదర్శకంగా నిర్వహించామని టీజీపీఎస్సీ వాదనలు
- పోస్టింగ్‌లకు అనుమతించాలన్న ఎంపికైన అభ్యర్థులు



సాక్షి, హైదరాబాద్: గ్రూప్–1 మెయిన్స్ పరీక్ష నిర్వహణలో తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) అవకతవకలకు పాల్పడిందని దాఖలైన పిటిషన్లలో హైకోర్టు తీర్పు రిజర్వు చేసింది. ఏప్రిల్‌లో పిటిషన్లు దాఖలు కాగా.. పిటిషన్లు, కమిషన్, ఎంపికైన అభ్యర్థుల నుంచి సుదీర్ఘ వాదనలు విన్నది. విచారణలో భాగంగా గ్రూప్–1 నియామకాలను నిలిపివేస్తూ ఏప్రిల్ 17న హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. తాము తీర్పు వెలువరించే వరకు నియామక పత్రాలు జారీ చేయొద్దని టీజీపీఎస్సీకి స్పష్టం చేసింది. అయితే సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌ను మాత్రం కొనసాగించుకోవచ్చని వెలుసుబాటు ఇస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసిన విషయం విదితమే. 2024, అక్టోబర్ 21 నుంచి 27 వరకు నిర్వహించిన గ్రూప్–1 మెయిన్స్ పరీక్ష పత్రాల మూల్యాంకనంలో అవకతవకలు, అసమానతలు చోటుచేసుకున్నాయని, దీనిపై న్యాయ విచారణ జరిపించాలని కోరుతూ సిద్దిపేట శివనగర్‌కు చెందిన కె.పరశురాములుతోపాటు మరికొందరు హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై జస్టిస్ నామవరపు రాజేశ్వర్‌రావు సోమవారం విచారణ కొనసాగించారు.

తెలుగు అభ్యర్థులను కించపరిచేదిగా తీరు

పిటిషన్లతో పోస్టింగ్‌లు మరింత కాలయాపన జరుగుతోందని, ఆరోపణలతో వేసిన పిటిషన్లను కొట్టివేయాలని ఎంపికైన అభ్యర్థుల తరఫున న్యాయవాది లక్ష్మీనరసింహ కోరారు. సర్టిఫికెట్ల వెరిఫికేషన్ పూర్తయినందున పోస్టింగ్‌లకు అనుమతించాలని విజ్ఞప్తి చేశారు. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాదులు విద్యాసాగర్, రచనరెడ్డి మరోసారి వాదనలు వినిపించారు. అత్యంత ప్రతిష్టాత్మకమైన గ్రూప్–1 పోటీ పరీక్షను టీజీపీఎస్సీ యాదృచ్ఛిక పద్ధతిలో నిర్వహించిందని, అవకతవకలకు చోటిచ్చేలా ఏర్పాట్లు ఉన్నాయన్నారు. పరీక్ష నిర్వహణలో భారీ అక్రమాలు జరిగాయని, నియమ నిబంధనలను పూర్తిగా ఉల్లంఘించారని చెప్పారు. ఎక్కడా పారదర్శకత పాటించలేదన్నారు. నోటిఫికేషన్ ఇచ్చేటప్పుడే ప్రతీ అంశాన్ని గెజిట్‌లో పేర్కొనాలని, 3 రౌండ్ల మూల్యాంకనం, మోడరేషన్ విధానం లాంటి వాటిని అందులో కమిషన్ పేర్కొనలేదన్నారు. ఈ కారణంగానే పిటిషన్లు కోర్టు జోక్యాన్ని కోరాల్సి వచ్చిందన్నారు. ప్రిలిమ్స్, మెయిన్స్‌కు వేర్వేరు హాల్‌టికెట్లు జారీ చేయడం అభ్యర్థుల్లో గందరగోళాన్ని సృష్టించిందన్నారు. అర్హత లేని మూల్యాంకనదారులు తెలుగు మీడియం పత్రాలను దిద్దారని, అందుకే ఎంపికైన ఆంగ్ల, తెలుగు, ఉర్దూ మీడియం అభ్యర్థుల్లో భారీ వ్యత్యాసం వచ్చిందని నివేదించారు. టీజీపీఎస్సీ తీరు రాష్ట్రంలోని తెలుగు అభ్యర్థులను కించపరిచేదిగా ఉందన్నారు. బయోమెట్రిక్ వ్యవస్థను సరిగ్గా పాటించలేదని వాదించారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. తీర్పు రిజర్వు చేస్తున్నట్టు స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో అత్యంత కీలకమైన పోస్టులు కావడం, రాష్ట్ర ఏర్పాటు తర్వాత తొలిసారి నియమిస్తుండటంతో 563 పోస్టులపై ప్రాధాన్యం పెరిగి లక్షలాది మంది రాశారు. భవిష్యత్‌ను నిర్ణయించే తీర్పు కావడంతో ఎంపికైన అభ్యర్థులతోపాటు మెయిన్స్ రాసి ఎంపికకాని అభ్యర్థులు కూడా తీవ్ర ఉత్కంఠతో ఎదురుచూస్తున్నారు.

పరిమితికి మించి పాదరసం ఉన్న సౌందర్య సాధనాల (కాస్మెటిక్స్) విషయంలో కేంద్ర ప్రభుత్వం మరింత కఠినంగా వ్యవహరించనుంది. ఇప్పటికే డ్రగ్స్ కంట్రోలర్ జనరల్ ఆఫ్ ఇండియా (డి.సి.జి.ఐ.) నేతృత్వంలోని కమిటీ ఒకటి.. పాదరసం కలిసిన సౌందర్య సాధనాల ఉత్పత్తులపై నివేదికను సమర్పించింది. ఈ విషయాన్ని జూన్ 17న జరిగిన సమావేశం మినిట్స్‌లో డ్రగ్స్ కన్సల్టేటివ్ కమిటీ (డీసీసీ) ధ్రువీకరించింది. చట్టప్రకారం కాస్మెటిక్స్‌లో పాదరసం నిర్దేశిత మోతాదుపై ఎలాంటి మార్పూ చేయనప్పటికీ.. సౌందర్య సాధనాల తయారీపై నిఘాను కఠినతరం చేయనుంది. అసలింతకీ ప్రమాదకర లక్షణాలు పాదరసంలో ఏమున్నాయి.. ఇంతకూ దాన్ని సౌందర్య సంబంధ ఉత్పత్తుల్లో ఎందుకు వాడతారు?

- సాక్షి, స్పెషల్ డెస్క్



అందమైన శత్రువు.. పాదరసం!

కాస్మెటిక్స్‌లో పాదరసం స్థాయిపై కఠిన నిఘా
పర్యావరణానికీ, ఆరోగ్యానికీ ప్రమాదకారి

భారత్‌లో కాస్మెటిక్స్ అన్నది సుమారు 20 బిలియన్ డాలర్ల విలువైన వ్యాపారం. అమ్మకాల పరంగా ప్రపంచంలో నాలుగో అతిపెద్ద మార్కెట్ మనది. చాలా సౌందర్య సాధనాల్లో స్వల్ప స్థాయిల్లో పాదరసం వినియోగిస్తారు. అయితే పాదరసం మానవ ఆరోగ్యాన్నీ, పర్యావరణాన్నీ రెండింటినీ ప్రభావితం చేసే విషపూరిత మూలకం. అందుకే కాస్మెటిక్స్ తయారీలో ఈ లోహం వాడకాన్ని తగ్గించేలా కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే చర్యలు చేపట్టింది.

2013 'మినామాటా కన్వెన్షన్'..:
పాదరసం, పాదరస సమ్మేళనాల హానికర ప్రభావాల నుంచి మానవాళిని, పర్యావరణాన్ని పరిరక్షించే లక్ష్యంతో 2013లో జపాన్ వేదికగా 'మినామాటా కన్వెన్షన్' (మినామాటా అంతర్జాతీయ ఒప్పందం) కుదిరింది. దాని ప్రకారం సౌందర్య సాధనాలలో 1 పీపీఎం (ఒక పార్ట్స్ పర్ మిలియన్ – అంటే 0.0001 శాతం) కంటే ఎక్కువ పాదరసం ఉండకూడదు. ఆ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తూ పరిమితి దాటి పాదరసం ఉన్న కాస్మెటిక్స్ ఎగుమతులను, దిగుమతులను, తయారీని, ఇంకా ఇతర లోపాలను గుర్తించేందుకు డీసీజీఐ 2024లో ఒక ఉపసంఘాన్ని ఏర్పాటుచేసింది. మనదేశంలోని ప్రస్తుత కాస్మెటిక్స్ చట్టం.. 'మినామాటా కన్వెన్షన్' ఒప్పందానికి లోబడే ఉందని ఆ ఉపసంఘం నివేదిక పరిశీలించిన డీసీసీ స్పష్టం చేసింది.

దిగుమతులే ఆధారం
మనదేశం పాదరసం విషయంలో దిగుమతులపైనే ఆధారపడుతోంది. ప్రపంచ బ్యాంకు లెక్కల ప్రకారం 2023లో మనదేశం 32.77 లక్షల డాలర్ల విలువైన 73,085 కిలోల పాదరసం దిగుమతి చేసుకుంది. మనకు ఎగుమతి చేసే ప్రధాన దేశాలు పెరు, థాయ్‌లాండ్, జపాన్, జర్మనీ, యూకే. మనదేశ నిబంధనల ప్రకారం కంటి ప్రాంతంలో ఉపయోగించే సౌందర్య ఉత్పత్తులలో కలిపే పాదరసం స్థాయి 70 పీపీఎంలకు (అంటే 0.007 శాతం) మించకూడదు. ఇతర సౌందర్య సాధనాలలో ఇది 1 పీపీఎంను దాటకూడదు.

అన్ని రంగాల నిపుణులతో..
'డ్రగ్స్ కంట్రోలర్ జనరల్ ఆఫ్ ఇండియా' ఏర్పాటు చేసిన సిఫారసుల కమిటీకి చైర్మన్‌గా – ఢిల్లీలోని రామ్ మనోహర్ లోహియా ఆసుపత్రి డెర్మటాలజీ విభాగం ప్రొఫెసర్ ఎస్.ఎన్. భట్టాచార్య, సభ్యులుగా ఫార్మకాలజీ, టాక్సికాలజీ విభాగాల వైద్య నిపుణులు, బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్, సెంట్రల్ డ్రగ్స్ స్టాండర్డ్ కంట్రోల్ ఆర్గనైజేషన్ అధికారులు, పర్యావరణ మంత్రిత్వ శాఖకు చెందినవారు ఉన్నారు.

'అందానికి' పాదరసం ఎందుకు?
పాదరసాన్ని సాధారణంగా చర్మాన్ని తెల్లగా చేసే ఉత్పత్తుల్లో వాడతారు. చర్మాన్ని కాంతిమంతం చేసే క్రీములు; చర్మంపై చిన్న చిన్న మచ్చలు, నల్ల మచ్చలను పోగొట్టే సౌందర్య సాధనాలు; వయసును కనపడనీయని యాంటీ–ఏజింగ్ సొల్యూషన్‌లు, ఇంకా కొన్ని రకాలైన మేకప్ పదార్థాలు.. పాదరసాన్ని కాస్తయినా కలపకుండా తయారు కావు. చర్మం రంగు నల్లగా ఉండటానికి చర్మంలోని 'మెలనిన్' కారణం. పాదరసం ఆ మెలనిన్ ఉత్పత్తిని తగ్గిస్తుంది. తద్వారా నల్లదనం తగ్గుతుంది. అలాగే పాదరసం కొన్ని రకాల బ్యాక్టీరియా, ఫంగస్‌లను చంపగలదు. కొన్ని సౌందర్య సాధనాలలో సంరక్షణకారిగానూ ఉపయోగపడుతుంది.

చాలా ప్రమాదకరం
ప్రపంచ ఆరోగ్య సంస్థ పాదరసాన్ని అత్యంత ప్రమాదకరమైన టాప్ 10 రసాయనాల జాబితాలో చేర్చింది. పాదరసం కలిసి ఉన్న కాస్మెటిక్స్‌ను దీర్ఘకాలం వాడటం వల్ల మూత్ర పిండాలు దెబ్బతినే ప్రమాదం ఉంది. ముఖ్యంగా గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలు పాదరసం విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలి. పాదరసం వల్ల అనేక అనారోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంటుంది.

- ఒంటిమీద దద్దుర్లు, రంగు పోవడం
- జీర్ణ సంబంధమైనవి
- వ్యాధి నిరోధక శక్తి తగ్గడం
- ఆందోళన, ఒత్తిడి
- నాడీ సంబంధమైనవి
- జ్ఞాపకశక్తి సమస్యలు
- భావోద్వేగాల్లో అనూహ్యమైన మార్పులు



భారీగా పెరిగిన కాలుష్యం



పాదరస ఉద్గారాలు 1960తో పోలిస్తే 2021లో 3.3 రెట్లు పెరిగాయి. మొత్తం ఉద్గారాల్లో చైనా, భారత్, ఇండోనేసియా, పెరు, బ్రెజిల్‌ల వాటా దాదాపు 50 శాతం. - ప్రపంచంలో అత్యధిక పాదరస కాలుష్యానికి కారణమవుతున్న దేశం చైనా. ఆ తరవాతి స్థానంలో మనదేశం ఉంది.



బంగారు ఆభరణాల తయారీలో, బంగారం తవ్వకాలు వంటి వాటిలో పాదరసాన్ని విరివిగా వినియోగిస్తారు.

కొన్ని రకాల పరిశ్రమలు, సిమెంటు తయారీ, ఈ-వేస్ట్ వంటి చెత్తను కాల్చడం, బొగ్గును కాల్చడం.. ఇలా పాదరసం అనేక కారణాల వల్ల వాతావరణంలోకి చేరుతోంది.



ఇలా చూసుకోవచ్చు
మనం కొనే ఉత్పత్తుల్లో మెర్క్యురస్ క్లోరైడ్, క్యాలోమెల్, మెర్క్యురిక్ అయొడైడ్ అనే పేర్లు ఉంటే జాగ్రత్త పడండి. ఎందుకంటే ఇవన్నీ పాదరస సంబంధమైనవే.

క్లుప్తంగా...

ఇన్‌సర్వీస్ పీజీ డాక్టర్లను అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా నియమించాలి

మంత్రి దామోదరకు తెలంగాణ పబ్లిక్ హెల్త్ డాక్టర్స్ అసోసియేషన్ వినతి

సాక్షి, హైదరాబాద్: ప్రజారోగ్య విభాగంలో పనిచేస్తున్న ఇన్–సర్వీస్ వైద్యులను పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సులు పూర్తి చేసిన తర్వాత మెడికల్ కాలేజీల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా నియమించాలని తెలంగాణ పబ్లిక్ హెల్త్ డాక్టర్స్ అసోసియేషన్ కోరింది. పీజీ పూర్తి చేసిన డాక్టర్లను ల్యాటరల్ ఎంట్రీ ద్వారా నేరుగా అబ్జార్బ్ చేయాలని అసోసియేషన్ అధ్యక్షుడు కత్తి జనార్దన్ తదితరులు ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహను కోరారు. ఏటా 150–250 మంది ఇన్–సర్వీస్ పీజీ వైద్యులు వివిధ స్పెషాలిటీల్లో పట్టభద్రు లు అవుతారని, వీరిని డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ పరిధిలోని మెడికల్ కాలేజీల్లో నేరుగా అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా తీసుకుంటే ప్రభుత్వానికి అదనపు ఆర్థిక భారం ఉండదని, విద్యాసంస్థల్లో ఫ్యాకల్టీ కొరత వెంటనే తీరుతుందని వివరించారు. ఈ వినతిపై మంత్రి సానుకూలంగా స్పందించినట్లు జనార్దన్ తెలిపారు. ప్రభుత్వ ఆరోగ్యశాఖ కార్యదర్శి క్రిస్టినా జెడ్ చొంగ్తూ, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్‌తో పాటు, డీఎంఈ నరేంద్ర కుమార్, డీహెచ్ రవీందర్ నాయక్‌లను కలిసి వినతిపత్రం ఇచ్చినట్లు తెలిపారు.

ఎస్‌హెచ్‌జీ సభ్యుల ఇన్సూరెన్స్ 2029 వరకు పొడిగింపు

స్త్రీనిధి ద్వారా బీమా అమలు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ

సాక్షి, హైదరాబాద్: స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ) సభ్యుల ప్రమాద బీమాను 2029 వరకు ప్రభుత్వం పొడిగించింది. ఈమేరకు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.శ్రీధర్ సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. ఈ పథకాన్ని స్త్రీనిధి ద్వారా అమలు చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ఈ పథకం తిరిగి అమల్లోకి వచ్చింది. ప్రమాదవశాత్తు మరణించిన సభ్యులకు రూ.10 లక్షల బీమా కుటుంబ సభ్యులకు అందుతుంది. కష్టకాలంలో స్వయం సహాయక సంఘాల సభ్యుల కుటుంబాలకు ప్రమాద బీమా భరోసా కల్పించినట్లవుతుంది. ఇప్పటి వరకు 409 మందికి ప్రమాద బీమా మంజూరు చేశారు. రాష్ట్రంలో కొత్తగా 1.67 లక్షల మంది సభ్యులు చేరారు.

బీఎడ్ అభ్యర్థులకు డైరెక్ట్ రిక్రూట్‌మెంట్‌ను 70% పెంచాలి

- 10వ తేదీ నుంచి పాదయాత్ర చేస్తాం
- ఎమ్మెల్సీ దాసోజుతో కలిసి పాదయాత్ర పోస్టర్ ఆవిష్కరించిన బీఎడ్ అభ్యర్థులు

సాక్షి, హైదరాబాద్: స్కూల్ అసిస్టెంట్ కేడర్ పోస్టుల్లో బీఎడ్ అభ్యర్థులకు డైరెక్ట్ రిక్రూట్‌మెంట్‌ను 70 శాతానికి పెంచాలని బీఎడ్ అభ్యర్థులు డిమాండ్ చేశారు. ఈమేరకు ఈనెల 10న యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయం నుంచి హైదరాబాద్ ఎస్సీఈఆర్టీ కార్యాలయం వరకు పాదయాత్ర చేయనున్నామని తెలిపారు. సోమవారం తెలంగాణభవన్‌లో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్‌తో కలిసి పాదయాత్ర పోస్టర్‌ను ఆవిష్కరించారు. బీఎడ్ అభ్యర్థులకు జరుగుతున్న అన్యాయాన్ని మాజీ సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. డీఎస్సీ భర్తీలో బీఎడ్ అభ్యర్థులకు జరుగుతున్న అన్యాయాన్ని ఆపాలని కోరారు. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో బీఎడ్ అభ్యర్థులకు ఇకపై ఎస్‌జీటీ (సెకండరీ గ్రేడ్ టీచర్) పోస్టులకు అర్హత లేని కారణంగా, స్కూల్ అసిస్టెంట్ పోస్టులే తమకు ప్రధాన అవకాశంగా మిగిలాయని ఆవేదన వ్యక్తం చేశారు.

అనిల్‌కుమార్‌కు నోటీసులు

- బరాజ్‌లకు గ్రౌటింగ్ నిర్వహణపై సంజాయిషీ ఇవ్వాలన్న జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్
- గ్రౌటింగ్ నిర్వహణపై ఇప్పటికే తప్పుబట్టిన ఎన్డీఎస్ఏ కమిటీ

సాక్షి, హైదరాబాద్: నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్ఏ) నిపుణుల కమిటీ సమర్పించిన మధ్యంతర నివేదికలోని సిఫారసులకు విరుద్ధంగా కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌లకు గ్రౌటింగ్ ఎందుకు నిర్వహించారు అని ప్రశ్నిస్తూ నీటిపారుదల శాఖ ఈఎన్సీ జి.అనిల్‌కుమార్‌కు జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ షోకాజ్ నోటీసులు జారీ చేసింది. గతేడాది వానాకాలానికి ముందు నాటి ఈఎన్సీ (జనరల్) అనిల్‌కుమార్ బరాజ్‌లకు గ్రౌటింగ్ చేయించారు. వానాకాలంలో గోదావరికి ఏటా వచ్చే భారీ వరదలతో బరాజ్‌లకు మరింత నష్టం కలగకుండా అప్పట్లో అనిల్‌కుమార్ ఈ పనులను చేయించారు. అయితే తమ సిఫారసులకు విరుద్ధంగా గ్రౌటింగ్ నిర్వహించడం పట్ల ఎన్డీఎస్ఏ నిపుణుల కమిటీ తీవ్రంగా తప్పుబట్టింది. బరాజ్‌ల పునాదుల కింద ఏర్పడిన బుంగలను గ్రౌటింగ్‌తో పూడ్చివేయడంతో భూగర్భంలోని పరిస్థితులు తారుమారై వాటి వైఫల్యానికి అసలు కారణాలను తెలుసుకునే అవకాశం చేజారిందని తమ తుది నివేదికలో ఆక్షేపణ తెలిపింది. ఈ నేపథ్యంలో అనిల్‌కుమార్ నుంచి వివరణ కోరుతూ తాజాగా జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ ఆయనకు నోటీసులు జారీ చేసింది. ఒకటి రెండు రోజుల్లో ఆయన కమిషన్‌ను కలిసి వివరణ ఇచ్చే అవకాశముంది. ఈఎన్సీ(జనరల్)గా పనిచేసిన అనిల్‌కుమార్‌ను గత నెలలో ప్రభుత్వం తొలగించి తదుపరి పోస్టు ఇవ్వకుండా నిరీక్షణలో ఉంచింది.

నెలాఖరులోగా సర్కారుకు నివేదిక
జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ గడువు ఈ నెలాఖరులోగా ముగియనుండగా, ఆలోపే రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పించనుంది. కాళేశ్వరం ప్రాజెక్టులోని బరాజ్‌లు వైఫల్యం కావడంతో వాటిపై విచారణ కోసం గతేడాది మార్చిలో ఈ కమిషన్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రులు ఈటల రాజేందర్, హరీశ్‌రావుతో పాటు మొత్తం 115 మంది సాక్షులను కమిషన్ విచారించింది. బరాజ్‌ల నిర్మాణానికి సంబంధించిన నిర్ణయాలన్నీ మంత్రివర్గ సమావేశాల్లో జరిగాయని మాజీ సీఎం కేసీఆర్‌తో పాటు హరీశ్, ఈటల కమిషన్‌కు వివరణ ఇచ్చారు. మరోవైపు బరాజ్‌ల నిర్మాణానికి సంబంధించి గత ప్రభుత్వంలో జరిగిన మంత్రివర్గ సమావేశాల్లో ఎలాంటి నిర్ణయాలు జరగలేదని ధ్రువీకరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం కమిషన్‌కు ఇటీవల నివేదిక సమర్పించింది. గత ప్రభుత్వంలో జరిగిన మంత్రివర్గ సమావేశాలకు సంబంధించిన మినట్స్ కాపీలను సైతం కమిషన్‌కు ప్రభుత్వం అందజేసింది. వాటిపై ప్రస్తుతం కమిషన్ అధ్యయనం చేస్తోంది. ఈ నెలాఖరులోగా నివేదికకు తుదిరూపు ఇచ్చి ప్రభుత్వానికి సమర్పించనుంది.

ఎండీఎస్ ప్రవేశాల కోసం వెబ్ ఆప్షన్లు ప్రారంభం



సాక్షి, హైదరాబాద్: కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం (కేఎన్ ఆర్‌యూహెచ్ఎస్) 2025–26 విద్యా సంవత్సరానికి ఎండీఎస్ కోర్సుల్లో ప్రవేశాల కోసం మొదటి దశ వెబ్ ఆధారిత కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. సోమవారం సాయంత్రం నుంచి ప్రారంభమైన ఈ వెబ్ కౌన్సెలింగ్ ద్వారా రాష్ట్రంలోని ప్రభుత్వ, నాన్–మైనారిటీ డెంటల్ కళాశాలల్లోని సీట్లను కేటాయించనున్నారు. మెరిట్ జాబితాలో పేరున్న అర్హులైన అభ్యర్థులు జూలై 7 సాయంత్రం 4 గంటల నుంచి జూలై 9 మధ్యాహ్నం 2 గంటల వరకు https://tsmds.tsche.in వెబ్‌సైట్ ద్వారా తమ వెబ్ ఆప్షన్లు నమోదు చేయవచ్చని వర్సిటీ తెలిపింది. ఈ మేరకు ఫైనల్ మెరిట్ లిస్ట్‌ను యూనివర్సిటీ విడుదల చేసింది. అభ్యర్థులు విశ్వవిద్యాలయ రుసుము కింద రూ.29,600 ఆన్ లైన్ ద్వారా చెల్లించాల్సి ఉంటుంది. కేటాయింపు ఉత్తర్వులను డౌన్‌లోడ్ చేసుకోవాలంటే రుసుము చెల్లింపు తప్పనిసరి. ట్యూషన్ ఫీజు సంబంధిత డెంటల్ కళాశాలలోనే చెల్లించాల్సి ఉంటుంది. వెబ్ ఆప్షన్లకు ముందు అభ్యర్థులు పూర్తిస్థాయి నిబంధనలు చదవాలని, వారు ఎన్ని కావాలంటే అన్ని ఆప్షన్లు నమోదు చేయవచ్చన్నారు. ఒకసారి సీటు కేటాయించిన తర్వాత చేరకుండా ఉంటే, తదుపరి దశల కౌన్సెలింగ్‌కు అర్హత ఉండదని చెప్పారు. వెబ్ ఆప్షన్ల నమోదులో సాంకేతిక సమస్యల కోసం 9059672216, 7842136688 ఫోన్ నంబర్లలో సంప్రదించవచ్చని సూచించారు. మరిన్ని వివరాలకు http://knruhs.telangana.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని చెప్పారు.

కొలువుంది.. కౌశలమేదీ..

▶ మొదటి పేజీ తరువాయి

సెక్యూరిటీ, క్వాంటమ్ టెక్నాలజీ, గ్రీన్ ఎనర్జీ, సెమీకండక్టర్ వంటి రంగాల్లో లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నా నైపుణ్యాల కొరత వల్ల వాటి భర్తీ ఆలస్యమవుతోంది. ఈ సమస్యను అధిగమించేందుకు 2030లోగా 40 కోట్ల మందికి నైపుణ్య శిక్షణ అవసరమని నివేదిక అభిప్రాయపడింది. ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన కింద 2023 వరకు కేవలం 1.38 కోట్ల మంది యువతకే శిక్షణ లభించిందని పేర్కొంది.

రంగాలవారీగా చూస్తే
● ఏఐ–డేటా సైన్స్: 5 లక్షలకుపైగా ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయి. కానీ 51% వరకు నైపుణ్యాలు ఉన్న అభ్యర్థులు దొరకడం కష్టంగా మారింది. ● లైఫ్ సైన్స్: 5 లక్షల ఉద్యోగాల్లో 51% సిబ్బందికి నైపుణ్యం సరిగ్గా లేదు. ● సైబర్ సెక్యూరిటీ: 2.5 లక్షలకుపైగా ఖాళీలు ఉన్న ఈ రంగంలో 63% వరకు నైపుణ్యాల కొరత కనిపిస్తోంది. ● క్లౌడ్ కంప్యూటింగ్: 2 లక్షల ఉద్యోగాలు అందుబాటులో ఉన్నా, 45% వరకు మిడ్‌లెవల్ టాలెంట్ కొరత ఉంది. ● హెచ్ఆర్: 2.5 లక్షల ఉద్యోగాల్లో 63% మందికి నైపుణ్య సమస్య. ● ఐటీ–కంప్యూటర్ సైన్స్: 2 లక్షల ఉద్యోగాల్లో 45% మందికి నైపుణ్యం తక్కువగా ఉంది. ● సెమీకండక్టర్: 90 వేల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయి. 70% వరకు టెక్నికల్ టాలెంట్ అవసరం. ● ఇంజనీర్లు: 90 వేల మందిలో 70% మందికి స్కిల్ గ్యాప్. ● డిజైన్ రంగం: 20 వేల మందిలో 75% మందికి సరైన నైపుణ్యాలు లేవు. ● క్వాంటమ్ టెక్నాలజీ: 20 వేల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయి. వీటిలో 75% వరకు నైపుణ్య లోటు. ● గ్రీన్ హైడ్రోజన్–రిన్యూవబుల్స్: లక్షకుపైగా ఉద్యోగాల్లో 60% వరకు స్కిల్డ్ టెక్నీషియన్ల అవసరం. ● డిఫెన్స్ టెక్–డ్రోన్లు: 75 వేల ఉద్యోగాల్లో 55% వరకు పరిశోధన, డెవలప్‌మెంట్ ఇంజనీర్ల కొరత.

ఐసెట్‌లో 58,985 మందికి అర్హత

- మొదటిస్థానంలో ఆదిలాబాద్.. చివరి స్థానంలో కరీంనగర్
- ఫలితాలు విడుదల చేసిన మండలి చైర్మన్

సాక్షి, హైదరాబాద్ : రాష్ట్రంలోని ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించిన ఉమ్మడి ప్రవేశ పరీక్ష (టీజీ ఐసెట్–2005)లో 58,985 మంది అర్హత సాధించారు. ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డి ఐసెట్ ఫలితాలను సోమవారం విడుదల చేశారు. ఆదిలాబాద్ జిల్లా 96.04 శాతం ఉత్తీర్ణత సాధించి మొదటిస్థానంలో నిలిచింది. కరీంనగర్ జిల్లా 87.04 శాతంతో చివరి స్థానంలో ఉంది. ఐసెట్ మొదటి ర్యాంకు విజయవాడకు చెందిన ఆర్ల క్రాంతికుమార్‌కు వచ్చింది. 71,746 మంది దరఖాస్తు చేసుకోగా, 64,938 మంది పరీక్ష రాశారు. వీరిలో 58,985 (90.83 శాతం) అర్హత సాధించారు. ఫలితాల విడుదల కార్యక్రమంలో మండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ ఇటిక్యాల పురుషోత్తం, ప్రొఫెసర్ ఎస్‌కే.మహమ్మూద్, మండలి కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరాం వెంకటేశ్, సెట్ కన్వీనర్ ప్రొఫెసర్ ఆవుల రవి తదితరులు పాల్గొన్నారు.

టాపర్లు వీరే...

పేరు	జిల్లా	మార్కులు
ఆర్ల క్రాంతి కుమార్	విజయవాడ (ఏపీ)	179
వంగవర్ సాయికృష్ణ	కామారెడ్డి	155
కోటగిరి కౌశిక్	మహబూబాబాద్	154
టీవీఎస్ కృష్ణవర్ధన్	హైదరాబాద్	153
ఇ. వైష్ణవి	హైదరాబాద్	152

టెస్టులకోసం రోగులను బయటకు పంపొద్దు

- పీహెచ్‌సీలలో మందులు, వైద్య పరికరాలకు కొరత ఉండొద్దు
- మంత్రి దామోదర ఉన్నత స్థాయి సమీక్ష



సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులను ఒక్క టెస్టు కోసం కూడా బయటకు పంపించొద్దని మంత్రి దామోదర రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. ప్రతి పీహెచ్‌సీలోనూ టెస్టులు అవసరమైన పేషెంట్ల నుంచి శాంపిల్స్ సేకరించాలని, 24 గంటల్లో రిపోర్టులు అందజేయాలని సూచించారు. తెలంగాణ వైద్య సేవలు, మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ (టీజీఎంఎస్ఐడీసీ) ఆధ్వర్యంలో కొత్త ఆసుపత్రుల నిర్మాణ పనులు, మందులు, సర్జికల్స్, పరికరాల కొనుగోలు తదితర అంశాలపై మంత్రి దామోదర సోమవారం ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో కొత్తగా నిర్మిస్తున్న టిమ్స్, వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల్లో అత్యాధునిక సాంకేతికతతో కూడిన పరికరాలను కొనుగోలు చేయాలని ఆదేశించారు. అలాగే ప్రభుత్వ ఆసుపత్రుల్లో పరికరాల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని సూచించారు. ఇందుకోసం రాష్ట్రస్థాయిలో ఒక ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలని ఆరోగ్య శాఖ కార్యదర్శికి సూచించారు. రాష్ట్రస్థాయిలో టీజీఎంఎస్ఐడీసీ హెడ్ ఆఫీసులో ఐదుగురు బయోమెడికల్ ఇంజనీర్లతో కూడిన సెంట్రల్ మానిటరింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేయాలని దామోదర ఆదేశించారు. ఎక్విప్‌మెంట్ విభాగం జనరల్ మేనేజర్‌గా సీనియర్ బయోమెడికల్ ఇంజనీర్‌ను నియమించాలని, ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో సబ్ యూనిట్లను ఏర్పాటు చేయాలని, అవసరాన్ని బట్టి ప్రతి సబ్ యూనిట్‌లో ఒకరిద్దరు బయోమెడికల్ ఇంజనీర్లను నియమించాలని సూచించారు. ఇందుకోసం నిమ్స్ డైరెక్టర్ బీరప్ప, డీఎంఈ నరేంద్ర కుమార్, వీవీపీ కమిషనర్ అజయ్ కుమార్‌లను సభ్యులుగా కమిటీని నియమించారు.

ఈసారి జలవిద్యుత్ ఉత్పత్తిని పెంచుతాం

జల విద్యుత్ సంస్థ డైరెక్టర్ బాలరాజు



సాక్షి, హైదరాబాద్: ఈసారి వర్షాకాలంలో జల విద్యుత్ ఉత్పత్తిని గణనీయంగా పెంచాలని నిర్ణయించినట్టు జల విద్యుత్ ఉత్పత్తి సంస్థ డైరెక్టర్ బాలరాజు తెలిపారు. ఇందుకు సంబంధించి ఇప్పటికే అన్ని ఏర్పాట్లూ చేశామన్నారు. వర్షాకాలానికి ముందే ప్లాంట్ల మరమ్మతు చేపట్టామని వెల్లడించారు. దీంతో ఉత్పత్తికి అనుకూలంగా ప్లాంట్లు సిద్ధమయ్యాయని ఆయన 'సాక్షి' ప్రతినిధికి తెలిపారు. మే చివరి నాటికి 130.5 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి సామర్థ్యం లక్ష్యంగా పెట్టుకుంటే.. ఇప్పటి వరకూ 557 మిలియన్ యూనిట్ల జల విద్యుత్ ఉత్పత్తి జరిగిందన్నారు. ఇదిలా ఉండగా జల విద్యుత్ ప్లాంట్లలో ఎలాంటి సాంకేతిక సమస్యలు తలెత్తకుండా నిపుణులతో ఓ కమిటీని ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనను పరిశీలిస్తున్నామని ఆయన తెలిపారు. వర్షాకాలం సీజన్‌లో జల విద్యుత్ ఉత్పత్తి కీలకమని, దీనిని పెంచడం వల్ల తక్కువ రేటుకు ప్రజలకు విద్యుత్ లభిస్తుందని చెప్పారు.

ఫిబ్రవరి నాటికి పూర్తి స్థాయి ఉత్పత్తిలోకి యాదాద్రి థర్మల్

- రైల్వే అధికారులతో బొగ్గు డైరెక్టర్ న్యాగ్యా ప్రత్యేక సమావేశం



సాక్షి, హైదరాబాద్: వచ్చే ఏడాది ఫిబ్రవరి నాటికి యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రం పూర్తి స్థాయిలో వాణిజ్య ఉత్పత్తి ప్రారంభిస్తుందని టీజీ జెన్‌కో కోల్ డైరెక్టర్ బి.న్యాగ్యా తెలిపారు. ఇందుకు అవసరమైన బొగ్గును అందుబాటులోకి తెచ్చేందుకు తగిన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రం పురోగతిపై ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క సమీక్షించారు. బొగ్గు సరఫరా చర్యలపై భట్టి, ఇంధన శాఖ ముఖ్యకార్యదర్శి నవీన్ మిత్తల్ కొన్ని సూచనలు చేశారు. ఈ నేపథ్యంలో రైల్వే శాఖ, ఇతర అధికారులతో న్యాగ్యా సోమవారం సమీక్షించారు. ఈ వివరాలను ఆయన మీడియాకు వివరించారు. ఒక్కొక్కటి 800 మెగావాట్ల సామర్థ్యంతో మొత్తం ఐదు ప్లాంట్లు 4 వేల మెగావాట్ల ఉత్పత్తికి సిద్ధమయ్యాయి. ఇప్పటికే రెండు ప్లాంట్లు వాణిజ్య ఉత్పత్తిలోకిరాగా, తాజాగా సోమవారం మరో ప్లాంట్ సీవోడీ పూర్తయింది. ఫిబ్రవరి నాటికి 4 వేల మెగావాట్లు వాణిజ్య ఉత్పత్తిలోకి తేవడానికి అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. దీనికి 50 వేల మెట్రిక్ టన్నుల బొగ్గు అవసరమని అంచనా వేశారు. ప్రస్తుతం యాదాద్రి థర్మల్ ప్లాంట్‌కు 4 రేకుల బొగ్గు మాత్రమే సరఫరా జరుగుతోంది. త్వరలో దీన్ని 14 రేకులకు పెంచాలని నిర్ణయించారు. దీనికి రైల్వే శాఖ కూడా అంగీకారం తెలిపిందని న్యాగ్యా తెలిపారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు ప్రత్యామ్నాయ నిధి

ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి ఎఫ్ఏటీహెచ్ఐ ప్రతినిధుల వినతి

సాక్షి, హైదరాబాద్: ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం అమలుకు ప్రత్యామ్నాయ నిధిని ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలని ఫెడరేషన్ ఆఫ్ అసోసియేషన్స్ ఆఫ్ తెలంగాణ హయ్యర్ ఇన్‌స్టిట్యూషన్స్ (ఎఫ్ఏటీహెచ్ఐ) రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. గత వార్షిక సంవత్సరం వరకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను పరిశీలిస్తే దాదాపు రూ.7,500 కోట్లు ఉన్నాయని, ఈ ఏడాది నిధిని కలిపితే రూ.10 వేల కోట్లకు బకాయిలు పెరుగుతాయని తెలిపింది. ఈ మొత్తాన్ని ఒకేసారి విడుదల చేసేందుకు సాధ్యాసాధ్యాలను పరిశీలించాలంది. ఈమేరకు సోమవారం ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతో ఎఫ్ఏటీహెచ్ఐ ప్రతినిధులు రమేశ్ అరోరా, కేఎస్ రవి, రవీందర్‌రెడ్డి, కె.రాందాస్, పి.రమేశ్‌బాబు, పరమేశ్వర్‌రెడ్డి, సునీతా భూపాల్‌రెడ్డి, సునీల్ కుమార్ సచివాలయంలో భేటీ అయ్యారు. ఈ భేటీలో సీఎస్ కె.రామకృష్ణారావు, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, సీనియర్ అధికారులు యోగితారాణా, దేవసేన, ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీతో 'దోస్త్' అంతంతే

- డిగ్రీ కోర్సుల్లో ఉన్న సీట్లు 4.6 లక్షలు... ఇప్పటి వరకు 1.41 లక్షలే భర్తీ
- మూడు విడతల కౌన్సెలింగ్ పూర్తి
- ఏటా 2.20 లక్షలు దాటని వైనం
- బీకాం, బీఎస్సీ ఓకే.. సంప్రదాయ కోర్సులకు అంతంతే
- దోస్త్ ప్రవేశాల డేటా విడుదల చేసిన ఉన్నత విద్యామండలి


సాక్షి, హైదరాబాద్ : డిగ్రీ కోర్సుల్లో చేరేవారి సంఖ్య అంతంతమాత్రంగానే ఉంటోంది. రాష్ట్రంలో 957 డిగ్రీ కాలేజీల్లో 4,36,947 సీట్లు అందుబాటులో ఉంటే, మూడు విడతల దోస్త్ కౌన్సెలింగ్ తర్వాత కూడా చేరిన వారి సంఖ్య 1,41,590 మాత్రమే. కనీసం సగంమంది కూడా చేరలేదు. ఇప్పటి వరకూ దోస్త్‌లో చేరిన విద్యార్థుల సంఖ్యను ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డి సోమవారం మీడియాకు విడుదల చేశారు. ఏటా ఇదే పరిస్థితి కనిపిస్తోంది. అన్ని దశల కౌన్సెలింగ్ పూర్తయ్యేనాటికి 2.20 లక్షల మంది మాత్రమే చేరుతున్నారు. ప్రైవేట్ కాలేజీల్లో చేరేవారి సంఖ్య 37 శాతం మించడం లేదు. గ్రామీణ ప్రాంతాల కాలేజీల్లో అతి తక్కువ మంది చేరుతున్నారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, మెదక్ జిల్లాల్లో ఉన్న కాలేజీల్లో కొంతమేర సీట్లు భర్తీ అవుతున్నాయి. డిగ్రీ చదివే విద్యార్థులు పార్ట్ టైం పనిచేసుకునేందుకు హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో అవకాశాలుంటున్నాయి. దీంతోపాటు డిగ్రీ తర్వాత ఉపాధి పొందే స్కిల్ కోర్సులు నేర్చుకునేందుకు రాజధాని వేదికగా మారింది.

బీకాం వైపే విద్యార్థుల చూపు
ఇప్పటి వరకూ దోస్త్ ద్వారా ఎక్కువ మంది బీకాం కోర్సులోనే చేరారు. 1,41,590 మంది వివిధ కోర్సుల్లో చేరితే, ఇందులో అత్యధికంగా బీకాంలో 54,771 మంది చేరారు. ఆ తర్వాత బీఎస్సీ ఫిజికల్ సైన్స్‌లో 27,059 మంది చేరారు. బీఏ కోర్సులో 60,414 సీట్లు ఉంటే, చేరిన విద్యార్థులు 19,104 మాత్రమే. ఇటీవల కాలంలో బీబీఏ కోర్సుకు కొంత ఆదరణ పెరిగింది. ఈ కోర్సులో 11,462 మంది చేరారు. సంప్రదాయ డిగ్రీ కోర్సులతోపాటు కంప్యూటర్ కాంబినేషన్ ఉన్న కోర్సులకు మాత్రం విద్యార్థులు ఎక్కువగా ప్రాధాన్యం ఇస్తున్నారు.



ఈ పరిస్థితికి కారణమేంటి?
దశాబ్దాల క్రితం సంప్రదాయ డిగ్రీ కోర్సులే ఎక్కువ. దీనిని దృష్టిలో ఉంచుకొని డిగ్రీ కాలేజీలు, సీట్ల సంఖ్య పెంచుకుంటూ వస్తున్నారు. అయితే, మార్కెట్‌లో వస్తున్న మార్పులను మాత్రం ఉన్నత విద్యామండలి గుర్తించడం లేదు. కోర్సుల ఆడిట్ చేపడితే ఏయే కోర్సులు అవసరమనేది అర్థమవుతుంది. డిగ్రీ తర్వాత ఉపాధి పొందాలన్నా నైపుణ్యం ముఖ్యం. ఆ దిశగా కోర్సుల సిలబస్ తీర్చిదిద్దుతామని మండలి అనేక ప్రయత్నాలు చేసింది. ఇది పెద్దగా ముందుకు పోలేదు. కొన్నేళ్లుగా డిగ్రీలో 2.20 లక్షల మందికి మించి చేరడం లేదు. అలాంటప్పుడు 4.60 లక్షల సీట్లు ఎందుకు? ఏ కోర్సులు అవసరం లేదు? అనే దిశగా ఉన్నతవిద్య విభాగం ఆలోచించడం లేదు.


రీ డిజైన్ చేస్తాం



కాలానుగుణంగా విద్యావ్యవస్థలోనూ మార్పులు వస్తున్నాయి. డిగ్రీ చదివిన ప్రతీ విద్యార్థి నైపుణ్యంతో ఉపాధి పొందాల్సిన అవసరం ఉంది. దురదృష్టవశాత్తు ఇప్పటి వరకూ ఈ దిశగా జరిగిన కసరత్తు తక్కువే. వచ్చే ఏడాది నుంచి డిమాండ్ కోర్సులు, వాటిల్లో అంతర్జాతీయ ప్రమాణాలు తీసుకొచ్చే దిశగా ఉన్నత విద్యామండలి ప్రయత్నించాలనే లక్ష్యంతో ఉంది.

– ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డి,
ఉన్నత విద్యామండలి చైర్మన్

ఆదరణలేని కోర్సులతో ఉపయోగం ఏమిటి?



చాలా కోర్సులకు దశాబ్ద కాలంగా ఆదరణ తగ్గింది. కొన్ని కాలేజీల్లో కొన్ని కోర్సుల్లో ఐదారుగురు కూడా చేరే పరిస్థితి ఏర్పడింది. బీకాం, బీఎస్సీ, లైఫ్‌సైన్స్ కోర్సులకు డిమాండ్ పెరుగుతోంది. దీనిని దృష్టిలో ఉంచుకొని డిగ్రీ కోర్సులపై ఉన్నత స్థాయిలో సమీక్ష జరగాలి. అవసరం లేని కోర్సులు తగ్గించాలి. డిమాండ్ ఉన్నవి పెంచాలి. అప్పుడే సమతుల్యత సాధ్యం.

– వేదుల శాంతి,
కేశవ మెమోరియల్ కాలేజీ ప్రిన్సిపాల్



జాతికి జల సౌభాగ్యం కల్పించిన రోజే
నాకు అసలైన పండుగ రోజు.
– డా॥ వైఎస్ రాజశేఖర రెడ్డి

సాక్షి
మంగళవారం, 8 జూలై 2025

కారుచీకట్లో బ్రిక్స్ కాంతిరేఖ

ఒంటరి ప్రయాణంకన్నా సమష్టిగా ముందడుగు వేయటం ఎప్పుడూ మంచిదే. ఒకప్పుడు అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ (ఐఎంఎఫ్), ప్రపంచ బ్యాంకు వంటి సంస్థల ద్వారా ప్రపంచ దేశాలను శాసించిన సంపన్న రాజ్యాలు ఇప్పుడు నేరుగా ఆ పని చేయాలనుకుంటున్నాయి. తమకు ఇన్నాళ్లూ అన్యాయం జరిగిపోయిందని ఆక్రోశిస్తూ అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ సాగిస్తున్న 'అధిక సుంకాల' బెదిరింపు ఆ కోవ లోనిదే. ఈ విషయంలో ట్రంప్ జయాపజయాలను చూశాక, ఇప్పుడు ఆయన్ను ప్రతిఘటిస్తున్న ఇతర సంపన్న రాజ్యాలు సైతం ఆ దోవకే పోతాయి. ఎవరికి వారు ద్వైపాక్షిక ఒప్పందాల్లో అధిక సుంకాల కోసం ఒత్తిళ్లు తెస్తారు. ఇలాంటి వర్తమాన పరిస్థితుల్లో బ్రిక్స్ వంటి ప్రాంతీయ కూటముల అవసరం, ప్రాముఖ్యత గతం కన్నా ఎంతో పెరిగాయి. ముఖ్యంగా సహజ వనరులు పుష్కలంగా వున్నా పేదరికంలో మగ్గుతున్న దక్షిణ దేశాల స్వరం వినిపించటానికి బ్రిక్స్ తోడ్పడుతోంది. ఆదివారం ప్రారంభమైన రెండు రోజుల బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సుకు ముందు ఈ నెల 2నుంచి ప్రధాని నరేంద్ర మోదీ అయిదు దక్షిణార్ధ గోళ దేశాల పర్యటన ప్రారంభించారు. ఘనా, ట్రినిడాడ్, టుబాగో, అర్జెంటీనా దేశాల్ని ఇప్పటికే సందర్శించగా... ఈ శిఖరాగ్ర సదస్సు నిర్వహించిన బ్రెజిల్‌లో మంగళవారం కూడా పర్యటించి ఆ మరునాడు నమీబియా వెళ్తారు. ఆ దేశాల సమస్యల్ని స్వయంగా అవగాహన చేసుకోవటానికి ఈ పర్యటన దోహదపడింది. అందుకే... బ్రిక్స్ సదస్సులో ఆయన దక్షిణార్ధ గోళ దేశాల తరఫున బలంగా స్వరం వినిపించారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు ఎంతగానో తోడ్పడుతూ కూడా ఆ దేశాలు వివక్షను ఎదుర్కొంటున్న వైనాన్నీ, వనరుల పంపిణీ, అభివృద్ధి, భద్రత వంటి అంశాల్లో వాటిని విస్మరిస్తున్న ధోరణినీ ప్రస్తావించారు. అంతర్జాతీయ వేదికల్లో వాటికి స్థానం లేకపోవటాన్ని ఎత్తి చూపారు. అంతక్రితం మాటెలా ఉన్నా కనీసం బ్రిక్స్ ఆవిర్భావం తర్వాతైనా దక్షిణార్ధ గోళ దేశాల్లో పర్యటించి వాటితో మెరుగైన సంబంధాలు ఏర్పర్చుకోవాలని గత ప్రధానులు అనుకోలేదు. మన ప్రధానొకరు ఘనా పర్యటించటం ఇదే తొలిసారైతే, అర్జెంటీనాకు వెళ్లటం 57 ఏళ్ల తర్వాత మొదటిసారి.

బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనాలతో తొలుత ఏర్పడిన బ్రిక్స్‌లో దక్షిణాఫ్రికా చేరగా, తాజాగా చేరిన ఇండొనేసియాతో కలుపుకొని మొత్తం సభ్యదేశాలు 11 అయ్యాయి. భాగస్వామ్య దేశాలు తొమ్మిది, ఆహ్వానిత దేశాలు ఎనిమిది వుండగా, రియో డీ జెనీరో సదస్సుకు ఏడు అంతర్జాతీయ సంస్థల చీఫ్‌లు హాజరయ్యారు. సంస్థ పరిధి విస్తృతం అయ్యేకొద్దీ దాని బాధ్యతలు పెరుగుతాయి. ఆ మేరకు అంతర్జాతీయ వ్యవహారాల్లో దాని ప్రభావం కూడా ఎక్కువవుతుంది. అయితే అందరిదీ ఒక్క గొంతు అయినప్పుడే, ఉమ్మడి ప్రయోజనాల కోసం సభ్య దేశాలన్నీ అంకిత భావంతో పనిచేసినప్పుడే అది ప్రభావవంతమైన పాత్ర పోషించగలుగుతుంది.

ప్రపంచం శరవేగంగా మారుతోంది. కరోనా మహమ్మారి విరుచుకు పడ్డాక సంపన్న రాజ్యాలు సైతం కుదేలయ్యాయి. జననష్టంతో పాటు లాక్‌డౌన్ కారణంగా చాలా ఆర్థిక వ్యవస్థలు కుప్పకూలాయి. అమెరికాలో డోనాల్డ్ ట్రంప్ రెండోసారి వచ్చాక పాత విధానాలకు పాతరేసి కొత్త కొత్త నిబంధనలతో ప్రపంచ దేశాలను ఊపిరాడకుండా చేస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఆర్థిక, సాంకేతిక, విద్యారంగాల్లో పరస్పరం సహకారం పెంచుకోవటానికీ, ఎదగటానికీ బ్రిక్స్ వంటి సంస్థలు దోహదపడతాయి. ప్రపంచ సంపద పెరగాలన్నా, ఆ సంపద సక్రమంగా పంపిణీ కావాలన్నా ఇటువంటి సంస్థల అవసరం ఎంతో ఉంటుంది.

ఉగ్రవాదం తరచు కోరలు చాస్తున్న తీరుపై బ్రిక్స్ ఆందోళన వ్యక్తం చేయటంతోపాటు ఆ విషయంలో ద్వంద్వ ప్రమాణాలను పాటిస్తున్న దేశాలను తూర్పారబట్టడం చైనా వంటి దేశాల కళ్లు తెరిపించాలి. ఉగ్రదాడులు జరిగిన ప్రాంతాన్ని బట్టి, ఆరోపణలొచ్చిన సంస్థలను బట్టి భిన్న వైఖరుల్ని తీసుకుంటున్న చైనా వంటి దేశాలకు బ్రిక్స్ డిక్లరేషన్ చెంపపెట్టు. పాకిస్తాన్‌లో ఆశ్రయం తీసుకుంటూ ఉగ్ర కార్యకలాపాలు నిర్వహిస్తున్న జైషే మహమ్మద్ చీఫ్ మసూద్ అజర్ వంటివారిపై చర్య తీసుకోవాలని భద్రతామండలిలో వచ్చిన తీర్మానాన్ని వీటో చేసిన ఘనత చైనాది. ఇలాంటి ధోరణి వల్ల ఉగ్రవాదం బలపడుతుందే తప్ప తగ్గదు. తమ వరకూ రాలేదని, తమకు నష్టం జరగలేదని భావించి ఉగ్రవాదంపై ఉదాసీన వైఖరి అవలంబిస్తే అలాంటి దేశాలు సైతం నష్టపోక తప్పదు. పాకిస్తాన్‌లో వివిధ ప్రాజెక్టుల నిర్మాణాల్లో పాలుపంచుకుంటున్న చైనా టెర్రరిస్టుల నుంచి సమస్యల్ని ఎదుర్కొనటం దీన్నే రుజువుచేస్తోంది.

సంపన్న రాజ్యాల కూటమి జీ–7 సదస్సుకు గత నెలలో పరిశీలక హోదాలో హాజరైన మన దేశం ఇప్పుడు బ్రిక్స్‌లో ప్రధాన పాత్ర పోషించింది. సదస్సుకు రష్యా, చైనా అధినేతలు వేర్వేరు కారణాల వల్ల రాలేదు. రష్యా అధినేత పుతిన్‌పై ఉక్రెయిన్ దురాక్రమణకు సంబంధించి అంతర్జాతీయ న్యాయస్థానంలో నేరారోపణలు ఉండటంతో రాలేక, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొనాల్సి వచ్చింది. ఇక షీ జిన్‌పింగ్ తరఫున ప్రతినిధి హాజరయ్యారు. వచ్చే ఏడాది బ్రిక్స్ అధ్యక్ష బాధ్యతలు తీసుకోవాల్సిన భారత్‌కు ఒకరకంగా ఇప్పటినుంచే బాధ్యతలు మొదలైనట్టు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో ఒక రకమైన అనిశ్చితి అలుముకుంది. ఇది మళ్లీ జవసత్వాలు పుంజుకోవాలంటే ఘర్షణ వాతావరణం సమసిపోవాలి. సామరస్య వాతావరణం ఏర్పడాలి. అందుకు బ్రిక్స్ ఆచరణ దోహదపడాలి.

వైతాళికుని జననం

సందర్భం



భూమన కరుణాకర రెడ్డి

మహాత్ముల జననం కూడా మామూలుగానే ఉంటుంది. కానీ వారి జీవన ప్రయాణంలో వారు ఎదుగుతూ మానవాళిని తమ వెంట తీసుకువెళతారు. తెలుగు రాష్ట్రాలు మరువలేని, మరచిపోని మహానాయకులలో డాక్టర్ వై.ఎస్. రాజశేఖర రెడ్డి అతి ముఖ్యులు.

గంభీరమైన రూపం, ఆయన మనసులా తెల్లని దుస్తులు, ముఖం మీద చెరగని చిరునవ్వు, ఆప్యాయమైన పలకరింపు, అందరితో కలసిపోయే తత్త్వం, మృదుభాషణం, నిగర్వం, సహనం, సమయస్ఫూర్తి ఇలా అన్నీ కలిపితే ఆయనే పులివెందుల డాక్టరు, రాష్ట్ర ప్రజల జీవన విధానాన్ని సంస్కరించిన సామాజిక వైద్యుడు, ప్రజల రాజన్న, రైతుల హృదయ మెరిగిన రైతన్న.

1949 జూలై 8న వై.ఎస్. జన్మించాడు. చారిత్రక మలుపునకు ఆరంభం ఆ రోజు. ఆ బాలుడు అజేయుడు, అనితర సాధ్యుడు అవుతాడనీ, 'ఇంతింతై వటుడింతై' అన్నట్లు ఎదుగుతాడనీ, రాష్ట్రాన్ని, ప్రజల మనసులను ఏలుతాడనీ ఎవరు ఊహించారో గానీ రాజులలో శేఖరుడు కావాలని 'రాజశేఖరు'డని నామకరణం చేశారు. సాధనతో సార్థకనామధేయుడే అయ్యాడు.

రూపాయి డాక్టర్

కర్ణాటకలోని గుల్బర్గాలో వైద్య విద్యను పూర్తి చేసుకుని, 1972లో తిరుపతి రుయా ఆసుపత్రిలో హౌస్ సర్జన్‌గా చేరారు. అప్పట్లో 'రుయా' కన్నా పెద్ద ఆసుపత్రి రాయలసీమలో లేదు. అన్ని ప్రాంతాల నుంచి అక్కడికి వచ్చే సీమవాసులందరినీ చూసే అవకాశం ఆయనకు లభించింది. ఆయన నిత్య విద్యార్థి. ఆ గుణం వల్ల ప్రజల సమస్యలు, పేదరికం మరింతగా అర్థమయ్యాయి.

పులివెందులలో ఆసుపత్రి ప్రారంభించాడు. ఉన్న ఊరు, కన్న తల్లి రుణం తీర్చుకోలేమని కేవలం ఒక్క రూపాయికి వైద్యం చేసేవాడు. రూపాయి డాక్టరుగా ఆయన పేరు మారు మోగిపోయింది.

వైద్యుడిగా రాత్రింబవళ్లు సేవ చేస్తున్నా ఆయనలో ఏదో అసంతృప్తి. సమాజానికి వైద్యం చేయాలి, తన పరిధి మరింత పెంచుకోవాలి, అపుడే అందరికీ అన్ని సౌకర్యాలు అందించగలం అని భావించిన రాజశేఖర రెడ్డి రాజకీయాలలోకి అడుగు పెట్టాడు. రాజకీయాలు ఈనాడే కాదు, ఆనాడు కూడా అంత స్వచ్ఛంగా ఏమీ లేవు. అవినీతి, బంధు ప్రీతి, అహంకారం, స్వార్థం– ఇవే రాజ్యమేలుతున్నాయి. కానీ నిజాయితీ గెలుస్తుందనీ, ప్రజల ప్రేమ గెలిపిస్తుందనీ భావించాడు.

రాజీలేని పోరాటం చేయడం, విమర్శలను నవ్వుతూ ఎదుర్కొనడం, అందర్నీ కలుపుకొనిపోవడం, స్థిరంగా నిలబడటం ఆయన నైజం. అందుకే ఆరుసార్లు శాసనసభ్యుడిగా, నాలుగుసార్లు పార్లమెంటు సభ్యునిగా ఎన్నికయ్యారు. ఓటమి ఎరుగని నాయకుడిగా శాసనసభలోనూ, పార్లమెంటులోనూ తన గళం వినిపించారు.

క్షమించడం నేర్చుకున్నాడు!

ముక్కుసూటితనం ఆయన తత్త్వం. బెదరడం, పదవి కోసం తలదించుకుని ఒదిగి ఒదిగి వుండటం ఆయనకు రాదు. అందుకే సొంత పార్టీలో కూడా ఆయనను కొందరు కంటకులు ఇబ్బందులకు గురి చేశారు. వారిపై తిరగబడ్డాడు, వారే తోక ముడిచేలా చేశాడు. అయితే ఆయన శత్రువులను క్షమించడం నేర్చుకున్నాడు.

ముఖ్యమంత్రి అయ్యాక కూడా తన తండ్రి వై.ఎస్. రాజారెడ్డిని చంపిన హంతకులపై ప్రతీకారం తీర్చుకోలేదు. హత్యానంతరం వారికి ఆశ్రయం కల్పించింది చంద్రబాబు అని ఆయనకు స్పష్టంగా తెలుసు. అలాంటిది 2003 అలిపిరి వద్ద చంద్రబాబుపై హత్యాప్రయత్నం జరిగితే వెంటనే హైదరాబాద్ నుంచి తిరుపతికి వచ్చి చంద్రబాబును పరామర్శించాడు. అంతేకాదు, తిరుపతి గాంధీ విగ్రహం వద్ద రోడ్డుపై కూర్చుని నిరసన తెలియచేశాడు.

సహృదయత, సచ్ఛీలత, సంస్కారం, క్షమాగుణం, కార్యదక్షత, పట్టుదల ఇవన్నీ ఆయనలోని అంతర్లీన గుణాలు. విమానం ఎక్కగలడు, అవసరమైతే రిక్షాలోనూ కూర్చోగలడు. అధికార దండాన్నే కాదు, కార్యకర్త చేతిజెండాను కూడా మోయగలడు. అందుకే 33 ఏళ్ల చిన్న వయసులోనే రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అయ్యాడు. 1985 నుంచి కాంగ్రెస్ లెజిస్లేచర్ పార్టీ ఉప నాయకుడుగా ఉన్నాడు. కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్షంలో ఉన్నపుడు ఆయన చేసిన పోరాటాలు అన్నీ ఇన్నీ కావు. ముఖ్యమంత్రిగా ఉన్న ఎన్.టి.రామారావును ఓ సందర్భంలో సెక్రటేరియట్ ముందు నడిరోడ్డులో నిలువరించాడు. ఆ ధైర్యం, ఆ తెగువ చూసి దేశమే ఆశ్చర్యపోయింది.



నేడు డా॥ వైఎస్ రాజశేఖర రెడ్డి జయంతి

◆ ప్రతిక్షణం ప్రజల గురించి ఆలోచన, ఆయనను నమ్మిన ప్రజలకు అన్నీ తాను కావాలన్న అభిలాష. అందుకే ఉచిత కరెంటు, ఆరోగ్యశ్రీ లాంటి పథకాలను రూపకల్పన చేశాడు, జలయజ్ఞం చేశాడు. పేరుకే ప్రారంభమై ఆగిపోయిన ఎన్నో ప్రాజెక్టులను పరుగెత్తించాడు. ఆయన అందలం ఎక్కినందువల్లనేమో వరుణ దేవుడు ఆనందపడి కావాల్సినన్ని వర్షాలు కురిపించాడు. రైతుల్లో ఆనందం, రాష్ట్రంలో ఆనందం.

చంద్రబాబు ప్రపంచ బ్యాంకుకు గుత్తేదారుడనీ, జన క్షేమం కన్నా తన వారి క్షేమం గురించి ఆలోచిస్తాడనీ ఆనాడే గ్రహించాడు. ఆనాడు చంద్రబాబు విద్యుత్ ఛార్జీలు పెంచితే దాన్ని వ్యతిరేకిస్తూ 9 మంది శాసన సభ్యులతో 9 రోజులు నిరాహార దీక్ష చేయించాడు.

రాయలసీమ ప్రజలకు సాగునీరు, తాగునీరు అందాలనీ, కరువునేల సస్యశ్యామలం కావాలనీ ఎంతో తపించాడు. రాయలసీమకు ప్రధానంగా నీరు అందించేది పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటరీ కెనాల్. అప్పట్లో దాని సామర్థ్యం 1,105 క్యూసెక్కులు మాత్రమే. దాన్ని లక్ష క్యూసెక్కులకు పెంచాలని పోరాటం చేసిన ముఖ్యుడు రాజశేఖర రెడ్డి. 1986లో లేపాక్షి నుండి 22 రోజులు పాదయాత్ర చేశాడు. ఈ పోతిరెడ్డిపాడు కోసం ఎం.వి. రమణా రెడ్డి, మైసూరా రెడ్డి, భూమన్, శ్రీధర్ ఇంకా అనేకమంది ఇతర నాయకులు ఆయనను అనుసరించారు. ఆయన ముఖ్యమంత్రి అయిన తరువాతనే పోతిరెడ్డిపాడు సామర్థ్యాన్ని 43 వేల క్యూసెక్కులకు పెంచాడు. నేడు రాయలసీమ మీద కపట ప్రేమ ఒలకబోస్తున్న చంద్రబాబు ఆనాడు ఈ పెంచడాన్ని పూర్తిగా వ్యతిరేకించాడు.

అందరివాడు

నిస్సత్తువతో కుళ్లి కునారిల్లిన కాంగ్రెస్ పార్టీని ఆయన ఒక్కడే భుజం మీదికి ఎత్తుకున్నాడు. తన పోరాట పటిమతో కాంగ్రెస్ పార్టీకి కొత్త ఊపిరి పోశాడు. తాను నాయకుడిననీ, అధికారంలో ఉన్నాననీ ఏనాడూ భావించలేదు. కడప జిల్లాలోని ఓ మారుమూల పంచాయితీ ఎన్నికలలో వార్డు సభ్యుడిగా పోటీ చేస్తున్న తన అనుచరునికి ఇబ్బంది కలిగింది. రిగ్గింగ్ ద్వారా అతడిని ఓడించాలని ప్రత్యర్థులు ప్రయత్నించారు. అది తెలిసిన రాజశేఖర రెడ్డి స్వయంగా వెళ్ళి ఎన్నికల బూత్‌లో ఏజెంటుగా కూర్చున్నాడు. సింహం ఎదురుగా ఉంటే చిట్టెలుకల సమూహాలు ఏం చేస్తాయి! తన వారిని కాపాడుకోవటానికి ఆయన 'సిరికిం జెప్పడు, శంఖ చక్ర యుగముం జేదోయి సంధింప' అన్నట్లు దిగివస్తాడు.

తానే ఎదగాలని ఆయన ఎన్నడూ అనుకోలేదు. తన వారి చేయిని ఎన్నడూ వదలలేదు. తనను నమ్మినవారిని, వెంట ఉన్న వారిని అందరినీ భుజాలమీద ఎత్తుకుని ఉన్నత స్థానాల్లో కూర్చోబెట్టాడు. నాతోపాటు ఉండవల్లి అరుణ్‌కుమార్, బొత్స సత్యనారాయణ, ధర్మాన ప్రసాదరావు, పొన్నాల లక్ష్మయ్య, భట్టి విక్రమార్క, అంబటి రాంబాబు, జక్కంపూడి రామ్మోహనరావు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, దానం నాగేందర్, దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, సునీతా లక్ష్మారెడ్డి, ఉదయభాను, వట్టి వసంతకుమార్, రఘువీరారెడ్డి, బాలినేని శ్రీనివాసరెడ్డి, కొండా సురేఖ, సబితా ఇంద్రారెడ్డి – ఇలా ఇంకా ఎందరినో ఎదిగేలా చేశాడు. ఎదుగుతూ వుంటే మురిసిపోయాడు.

తనకు అపకారం చేసిన వారిని, తాను ఓడిపోవాలి అని కోరుకున్న వారికి కూడా సహాయం చేశాడు. రాజకీయ ప్రత్యర్థులను ఓడించాలనుకున్నాడు తప్ప, వారి నాశనం కోరుకోలేదు. 'పగవారు శరణుజొచ్చిన – మగ తనములు నెరుప, తగునె మగవారలకున్' అని మహాకవి పోతన అన్నట్లు పగవాడిని కూడా ప్రేమించిన మగవాడు వైఎస్. అలాంటి నాయకుడు 'న భూతో న భవిష్యతి'.

2003 – రాష్ట్ర రాజకీయాలలో పెద్ద మలుపు, చరిత్రలో ఓ కుదుపు. ప్రజలను ప్రత్యక్షంగా కలుసుకోవాలని, కష్టసుఖాలు తెలుసుకోవాలని పాదయాత్రకు నడుము కట్టాడు. నిలువునా కాల్చేస్తున్న 50 డిగ్రీల ఎండ, వేడిగాలులు, ఏమాత్రం సహకరించని వాతావరణం. అయినా సరే కదిలాడు, పేదల కన్నీళ్లను చదవటానికి. చేవెళ్ల నుంచి ఇచ్ఛాపురం వరకు 67 రోజులు 1,673 కిలోమీటర్లు అవిశ్రాంతంగా, మధ్యలో ఆరోగ్యం క్షీణించినా పట్టుదలతో నడిచాడు. ఎన్నో అనుభవాలు, ఎన్నో వినతులు, ఎన్నో వేదనలు విన్నాడు. నీళ్లు, కన్నీళ్లు ఎండిన ప్రాంతాలు చూశాడు.

నడిచే చరిత్ర!

2004లో అఖండ మెజారిటీతో ఆయనను గెలిపించుకున్నారు ప్రజలు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. అసలు రహస్యం అందరికీ తెలుసు, జనం గెలిపించింది రాజన్నను అని. ఆ నమ్మకాన్ని ఆయన నిలబెట్టుకున్నాడు. ముఖ్యమంత్రిగా వైఎస్ ప్రమాణం చేసిన క్షణం నేను ఆయన పక్కనే ఉన్నాను. ఆయనలో ఏదో మార్పు గమనించాను. అధికారంలోకి వస్తే అహంకారం తలకెక్కుతుంది చాలా మందికి. కానీ వైఎస్ ముఖంలో అది లేదు. దైవదర్శనం లభించిన మహర్షి ముఖంలోని ప్రశాంతత, పరిపక్వత కనిపించాయి.

ప్రతిక్షణం ప్రజల గురించి ఆలోచన, నమ్మిన ప్రజలకు అన్నీ తాను కావాలన్న అభిలాష. ఉచిత కరెంటు, ఆరోగ్యశ్రీ లాంటి పథకాలను రూపకల్పన చేశాడు, జలయజ్ఞం చేశాడు. పేరుకే ప్రారంభమై ఆగిపోయిన ఎన్నో ప్రాజెక్టులను పరుగెత్తించాడు. ఆయన అందలం ఎక్కినందువల్లనేమో వరుణ దేవుడు ఆనందపడి కావాల్సినన్ని వర్షాలు కురిపించాడు. రైతుల్లో ఆనందం, రాష్ట్రంలో ఆనందం.

ముఖ్యమంత్రిగా ఆయన చేసిన ప్రతి పని ఓ చరిత్ర. ఎన్నో సంవత్సరాలుగా రాష్ట్రాన్ని పీడిస్తున్న సమస్య నక్సలిజం. ఎప్పుడూ ఎక్కడో ఒకచోట కాల్పులు, మరణాలు. మేధావులు, ప్రజాస్వామ్యవాదులు, పౌర హక్కుల నేతలు చేసిన విజ్ఞప్తిని ఆయన విన్నారు. నక్సలైట్లతో శాంతి చర్చలు జరిపారు. ప్రభుత్వం తరఫున ఏర్పాటైన సంఘంలో ఇతర పెద్దలతో పాటు నేనూ ఒక సభ్యుడిని. అధికారంతో కాల్చి చంపడం కాదు, అనురాగంతో నక్సలైట్లను జనజీవన స్రవంతిలోకి తీసుకువద్దాం అని ఆయన కోరుకున్నాడు.

2009 ఎన్నికలలో అధిష్ఠానం భయపడింది ఏమవుతుందోనని. వారికి భరోసా ఇచ్చి ఒంటి చేత్తో తిరిగి అధికారంలోకి వచ్చాడు. ప్రజల పట్ల ఆయన నమ్మకం అది. ప్రజలకు ఆయన చేసిన మేలు పట్ల ఉన్న విశ్వాసం అది. అంత గొప్పవ్యక్తి సాహచర్య, స్నేహం, ఆత్మీయత, అభిమానం నాకు లభించాయి అంటే అది నా అదృష్టం. ఆయన చిరునవ్వు నా ఆస్తి. నా భుజం మీద ఆయన చేయి వేసి 'కర్ణా' అని పిలవడమే నా ధైర్యం. ఆయన గురించి ఎంత చెప్పినా నాకు ఇంకా ఏదో మిగిలే ఉంటుంది. మంచితనం కలకాలం నిలిచి ఉంటుంది అన్న అక్షరాలకు ఆయన మూలధనం. మానవుల కన్నీరు మాన్పగా కదిలిన ఆ మహా మనిషికి నేడు జన్మదినం.

వ్యాసకర్త టీటీడీ మాజీ చైర్మన్

రైతు బాంధవుడు

అభిప్రాయం



ఎం.వి.ఎస్. నాగిరెడ్డి

దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి ఎన్నో విధాలుగా రైతులను ఆదుకున్నారు. 2004 మే నెల రెండవ వారంలో ముఖ్యమంత్రిగా ఆయన ప్రమాణం చేసే నాటికి రాష్ట్రంలో వ్యవసాయ రంగం పరిస్థితి దారుణంగా ఉంది. దిక్కుతోచని రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ఆత్మహత్యలు సమస్యకు పరిష్కారం కాదన్నారు. ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలు అనాథలు కాకూడదనే ఉద్దేశంతో జీఓ నంబర్ 421 విడుదల చేసి, 2 లక్షల రూపాయల పరిహారం ప్రకటించారు.

రైతులు అప్పులు కట్టలేక సహకార సంఘాలు దివాళా తీసే పరిస్థితిలో వైద్యనాథన్ కమిటీ సిఫారసులు అమలు చేసి రూ. 1,800 కోట్లు ప్రభుత్వం నుండి సహకార సంఘాలకు సహాయం అందించారు. పూర్తి నష్టాలలో ఉన్న సంఘాలను పక్క సహకార సంఘాల్లో కలిపి రైతుల కోసం సహకార వ్యవస్థను కాపాడారు. పావలా వడ్డీకే రైతులకు పంట రుణాలు అందించారు.

◆ చిన్నకారు రైతులు, కౌలు రైతులు ఆర్థిక సంక్షోభంలోనికి నెట్టివేయబడటానికి కారణాలు: పిల్లల విద్య, వైద్యం ఖర్చులు. గ్రామీణ ప్రాంతాల్లో ఈ సంక్షోభం ఎక్కువని గ్రహించి ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, 108, 104 పథకాలు తెచ్చారు.

ఆయన ముఖ్యమంత్రి అయ్యే నాటికి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సాగు నీటి వనరులు ఉన్న భూమి సుమారుగా 80 లక్షల ఎకరాలు మాత్రమే. ఇలాంటి పరిస్థితిలో లక్ష కోట్ల రూపాయలతో కోటి ఎకరాలకు సాగునీరందిస్తానని 'జల యజ్ఞం' మొదలు పెట్టారు. పోలవరం ప్రాజెక్టు కోసం గోదావరి జిల్లా వాసులు 'పోలవరం సాధనా సమితి' పేరుతో అనేక ఉద్యమాలు చేసి చివరికి ఈ ప్రాజెక్టు అసాధ్యం అనుకున్న తరుణంలో అన్ని అనుమతులు సాధించి రాష్ట్రానికే వరమైన పోలవరం ప్రాజెక్టును మొదలు పెట్టడమే కాదు, జలయజ్ఞంలో చేపట్టిన అన్ని పనులు ఆయన ముఖ్యమంత్రిగా ఉండగానే 70 శాతం పూర్తి చేశారు.

వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్ ద్వారా ప్రభుత్వానికి రైతు ఆదాయం కల్పిస్తున్నాడనీ, వ్యవసాయానికి ఉచితంగా విద్యుత్ ఇవ్వాలనీ ఆయన సంకల్పిస్తే కొంతమంది ఎగతాళి చేశారు. కానీ దాన్ని అమలు చేసి దేశానికే మార్గదర్శకులు అయ్యారు. అనేక వ్యవసాయ పరిశోధనల సమన్వయానికి 'అగ్రికల్చర్ టెక్నాలజీ మిషన్' ఏర్పాటు చేశారు. 2006 జనవరి 10వ తారీఖున దాన్ని ప్రారంభిస్తూ... 'రెండవ హరిత విప్లవం కేవలం నీటిపారుదల, గిట్టుబాటు వ్యవసాయ మూలంగానే సాధ్యమవుతుంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని భారతదేశానికే అన్నపూర్ణగా తీర్చిదిద్దడం నా లక్ష్యం' అని ప్రకటించారు.

రైతుకు ఆదాయం తాను పండించిన పంటను లాభసాటి ధరకు అమ్ముకుంటేనే వస్తుంది. 1999 నుండి 2004 వరకు రాష్ట్రంలో ఎక్కువగా సాగు జరిగే వరి ధాన్యానికి పెరిగిన మద్దతు ధర కేవలం రూ. 60 మాత్రమే (రూ. 490 నుండి రూ. 550). అదే 2004 నుండి 2009 వరకు వైఎస్సార్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పెరిగిన మద్దతు ధర రూ. 450 (రూ. 550 నుండి రూ. 1000). అన్ని పంటలకూ కనీస మద్దతు ధరలు ఇలానే పెరిగినాయి. ఆ మద్దతు ధరల కంటే ఎక్కువకు రైతులు తమ ఉత్పత్తులు అమ్ముకున్నారు. ఈ సమయంలోనే వైఎస్ ప్రోద్బలంతోనే కేంద్ర ప్రభుత్వం రుణమాఫీ ప్రకటించింది. సన్న, చిన్నకారు రైతులు, కౌలు రైతులు ఆర్థిక సంక్షోభంలోనికి నెట్టివేయబడటానికి మరికొన్ని కారణాలు: పిల్లల విద్య, కుటుంబంలోని వ్యక్తుల వైద్యం ఖర్చులు. గ్రామీణ ప్రాంతాలలో ఈ సంక్షోభం ఎక్కువగా ఉందని గ్రహించి గొప్ప పథకాలైన ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, 108, 104 పథకాలు తెచ్చారు.

అభివృద్ధి – సంక్షేమం తన రెండు కళ్ళుగా పాలన గావించి, రైతుల గుండెలలో చిరంజీవిగా మిగిలిన ఆ మహానాయకుని స్మరించుకోవడం ఆయన జయంతి సందర్భంగా మనం ఇచ్చే గౌరవం.

వ్యాసకర్త వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రైతు విభాగం (ఏపీ) అధ్యక్షుడు

జలయజ్ఞమే తెలుగు రాష్ట్రాలకు శ్రేయస్కరం

విశ్లేషణ



మాకిరెడ్డి పురుషోత్తమ రెడ్డి

వైఎస్సార్ రూపొందించిన విధానాలు, అమలు చేసిన పథకాలు ఆయన్ని జనం గుండెల్లో చిరంజీవిని చేశాయి. ఒక నాయకుడి దూరదృష్టి, ఆయన దార్శనికత సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతుంది. ప్రభుత్వాలు మారినా ఆయన పథకాల పేర్లు మారాయేమో కానీ వాటి కొనసాగింపు మాత్రం ఆగలేదు. అదే వైఎస్ ఘనత. తాజాగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య ఏర్పడిన పోలవరం–బనకచర్ల ప్రాజెక్ట్ వివాదానికి ఆయన రూపొందించిన 'జలయజ్ఞం' కొనసాగింపే అంతిమ పరిష్కారం.

వైఎస్సార్ జలయజ్ఞం ఉభయ తెలుగు రాష్ట్రాల నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం. కారణాలేవైనా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కృష్ణా, గోదావరి జలాలపై ప్రాజెక్టుల నిర్మాణాల్లో పాలకులకు దూరదృష్టి లేని కారణంగా... వెనుకబడిన ప్రాంతాలైన దక్షిణ తెలంగాణ, రాయలసీమ, ప్రకాశం, పల్నాడు తీవ్రంగా నష్టపోయాయి. ఒక రకంగా తెలుగు రాష్ట్రాల విభజనకు ఇలాంటి అంశాలు ప్రధాన కారణమయ్యాయి. వైఎస్సార్ తన రాజకీయ ప్రస్థానంలో వెనుకబడిన రాయలసీమ ఉద్యమంలో క్రియాశీలక పాత్ర పోషించారు. ఒక ప్రాంతీయ ఉద్యమంలో క్రియాశీలకంగా వ్యవహరించిన నాయకుడి ఆలోచనలు సహజంగా సంకుచితంగా ఉంటాయి. కానీ రాయలసీమ ఉద్యమంలో పాల్గొన్న వైఎస్ రాజశేఖరరెడ్డి అందుకు భిన్నంగా విశాల దృక్పథంతో వ్యవహరించడం ఆయన గొప్పతనానికి నిదర్శనం. రాయలసీమకు సాగు, తాగు నీటి కోసం ఉద్యమించినప్పటికీ, అదే క్రమంలో అధికారంలోకి వచ్చిన తర్వాత... తాను ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రాంతంతో పాటు దక్షిణ తెలంగాణ, ప్రకాశం, పల్నాడుతో పాటు... అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని ప్రాంతాలకు జల న్యాయం చేయడం కోసం రూపొందించిందే జలయజ్ఞం. అది పోలవరమైనా, పులిచింతలైనా, పాలమూరు–రంగారెడ్డి అయినా, పోతిరెడ్డిపాడు వెడల్పైనా, వెలుగొండ , దుమ్ముగూడెం టెయిల్ పాండ్ అయినా... వైఎస్సార్ విశాల దృక్పథానికి నిదర్శనం.

జల సమస్యకు శాశ్వత పరిష్కారం

ప్రస్తుత కూటమి ప్రభుత్వం రాయలసీమ నీటి సమస్య పరిష్కారం కోసం గోదావరి నదీ జలాలను ఎత్తిపోతల ద్వారా బనకచర్లకు తరలించాలని ప్రణాళికలు రూపొందించింది. అయితే తాజాగా కేంద్ర ప్రభుత్వం తెలంగాణలో జరుగుతున్న ఆందోళనల్ని దృష్టిలో పెట్టుకుని అనుమతులు నిరాకరించింది. ఈ నేపథ్యంలో సమస్యకు పరిష్కారంపై చర్చోపచర్చలు సాగుతున్నాయి.

గోదావరి నుంచి బనకచర్లకు నీటిని తరలించాలనే ఆలోచన ఎందుకు వచ్చింది? రాయలసీమలో నీళ్లు లేవనే కారణంతో. పుష్కలంగా నీళ్లున్న గోదావరి నుంచి అత్యంత వ్యయప్రయాసలతో నీళ్లను రాయలసీమకు తరలించాలనే ఉద్దేశ్యంతో పోలవరం–బనకచర్ల ప్రాజెక్టు నిర్మాణం చేపట్టింది ప్రభుత్వం. పరిమిత ఖర్చుతో వైఎస్సార్ దుమ్ముగూడెం టెయిల్‌పాండ్ ద్వారా ఈ సమస్యకు పరిష్కారం చూపారు. పోలవరం ప్రాజెక్ట్ పూర్తి చేయడం ద్వారా కృష్ణా డెల్టాకు కుడి కాలువ ద్వారా నీటిని తరలించవచ్చు. అదే విధంగా దుమ్ముగూడెం టెయిల్‌పాండ్ పథకాన్ని అమలు చేసి నాగార్జున సాగర్ ఎడమ కాలువకు నీటిని తరలించడం ద్వారా... తెలంగాణ అవసరాలు తీర్చొచ్చు. అప్పుడు రాయలసీమలోని శ్రీశైలం ప్రాజెక్ట్ నుంచి నాగార్జున సాగర్ కుడి కాలువ ద్వారా కృష్ణా డెల్టాకు, ఎడమ కాలువ ద్వారా తెలంగాణకు నీటిని విడుదల చేయాల్సిన అవసరం ఉండదు.



◆ దివంగత వైఎస్సార్ జలయజ్ఞాన్ని యథాతథంగా అమలు చేస్తే, గోదావరి నీళ్లు బనకచర్లకు భారీ ఖర్చుతో ఎత్తిపోయాల్సిన అవసరం ఉత్పన్నం కాదు. అదే సమయంలో గోదావరి నీటితో తెలంగాణ, కృష్ణా డెల్టా అవసరాలు తీరిపోతాయి. దుమ్ముగూడెం టెయిల్‌పాండ్ పథకం అమలయితేనే ఇవన్నీ నెరవేరుతాయి.

వైఎస్సార్ జలయజ్ఞాన్ని యథాతథంగా అమలు చేస్తే, గోదావరి నీళ్లు బనకచర్లకు భారీ ఖర్చుతో ఎత్తిపోయాల్సిన అవసరం ఉత్పన్నం కాదు. అదే సమయంలో గోదావరి నీటితో తెలంగాణ, కృష్ణా డెల్టా అవసరాలు తీరిపోతాయి. దుమ్ముగూడెం టెయిల్‌పాండ్ పథకం అమలు అయితేనే ఇవన్నీ నెరవేరుతాయి. ఖర్చు కూడా పోలవరం, బనకచర్లతో పోల్చుకుంటే చాలా తక్కువ. శాశ్వత పరిష్కారంతో పాటు ఉభయ తెలుగు రాష్ట్రాల మధ్య వివాదాలకు ఆస్కారం ఉండదు. ఉమ్మడి రాష్ట్రంలో రూపొందించిన ఈ పథకం... విడిపోయిన తర్వాత ఏర్పడిన సంక్లిష్ట పరిస్థితులను అధిగమించగలిగిన సామర్థ్యం కలిగి ఉంది.

రాయలసీమ ఎత్తిపోతలకు స్ఫూర్తి

రాయలసీమ జల సమస్య పరిష్కారానికి ప్రధాన ఆటంకం... ఈ ప్రాంతానికి ఉపయోగపడే నీటి ప్రాజెక్టులు లేకపోవడం. ఇప్పటికే ఉన్న శ్రీశైలం ప్రాజెక్ట్ నుంచి కేవలం బ్యాక్ వాటర్ వాడుకునే దుఃస్థితి నెలకొని ఉంది. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్ ద్వారా తెలంగాణ, కృష్ణా డెల్టాకు నీటిని విడుదల చేయాలి. మరో వైపు శ్రీశైలంలో 854 అడుగులు నీటి మట్టం ఉంటేనే పోతిరెడ్డి పాడుకు నీరు అంది గాలేరు–నగరి, ఎస్ఆర్‌బీసీ, చెన్నైలకు 15 టీఎంసీల నీరు విడుదలకు అవకాశం ఉంటుంది. హంద్రీ నీవాకు మాల్యాల ద్వారా నీరు విడుదల చేయాలంటే, శ్రీశైలంలో 840 అడుగుల నీరు ఉండాలి. ప్రకృతిలో ఏర్పడిన అసమతుల్య పరిస్థితుల వల్ల కృష్ణా, తుంగభద్రలలో నీటి ప్రవాహం పుష్కలంగా ఉన్నా, ప్రవహించే రోజులు గణనీయంగా పడిపోతున్నాయి. శ్రీశైలం నుంచి బ్యాక్ వాటర్ మాత్రమే తీసుకునే పరిస్థితుల్లో వరద ప్రవాహం తక్కువ రోజులు ఉండటం, శ్రీశైలం నుంచి అనివార్యంగా నాగార్జున సాగర్‌కు నీరు విడుదల చేయాల్సి రావడం వల్ల శ్రీశైలంలో రాయలసీమ ప్రాజెక్టులు నీరు అందుకునే కనీస నీటి మట్టం నిర్వహణ కష్టతరంగా మారింది. మరో వైపు అధికారిక నీటి కేటాయింపుల సాంకేతిక సమస్య వల్ల వరద, మిగులు జలాలు వాడుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇటువంటి రోజుల్లో పోతిరెడ్డిపాడు, మాల్యాల నుంచి నీళ్లు తీసుకోవాల్సి ఉంటుంది. కానీ అందుకు తగ్గ ఏర్పాట్లు లేవు.

ఈ సమస్యకు పరిష్కారంగా ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం ద్వారా హంద్రీ నీవాకు నీళ్లు తరలించే ఆలోచన వైఎస్సార్ చేస్తే, ఆయన రాజకీయ వారసుడిగా అధికారంలోకి వచ్చిన జగన్ పరిమితమైన రోజుల్లో శ్రీశైలం ఎగువ నుంచి పోతిరెడ్డిపాడు, బనకచర్ల మధ్యలోకి రాయలసీమ ఎత్తిపోతల పథకం ద్వారా నీటిని తరలించే ప్రాజెక్ట్‌కు రూపకల్పన చేశారు. దురదృష్టవశాత్తు సాంకేతిక అనుమతుల సమస్యతో మధ్యలోనే ఆగిపోయాయి. దీని ఖర్చు దాదాపు రూ. 7 వేల కోట్లు మాత్రమే. ప్రభుత్వం చొరవ చూపితే స్వల్ప కాలంలోనే రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేయవచ్చు. దాదాపు రూ. 10 వేల కోట్లతో 100 టీఎంసీల నీరు తరలించవచ్చు. పోలవరం బనకచర్ల ప్రాజెక్టుకు అయ్యే ఖర్చుతో పోల్చుకుంటే అనేక రెట్లు తక్కువ శ్రమ ఖర్చుతో అదే ప్రయోజనాలు పొందవచ్చు.

వ్యాసకర్త రాయలసీమ మేధావుల ఫోరం సమన్వయ కర్త

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు, ఆషాఢ మాసం, **తిథి:** శు.త్రయోదశి రా.11.56 వరకు, తదుపరి చతుర్దశి, **నక్షత్రం:** జ్యేష్ఠ రా.3.28 వరకు, తదుపరి మూల, **వర్జ్యం:** ఉ.7.21 నుండి 9.06 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.12 నుండి 9.04 వరకు, తదుపరి రా.10.59 నుండి 11.43 వరకు, **అమృతఘడియలు:** సా.5.44 నుండి 7.30 వరకు; **రాహుకాలం:** ప.3.00 నుండి 4.30 వరకు, **యమగండం:** ఉ.9.00 నుండి 10.30 వరకు, **సూర్యోదయం:** 5.35, **సూర్యాస్తమయం:** 6.35.

క్లుప్తంగా...

ఆయిల్‌పామ్‌కు ఎంజీపీ రూ.25 వేలు ఇవ్వాలి

• మంత్రి తుమ్మల



సాక్షి, హైదరాబాద్‌: ఆయిల్‌పామ్ సాగుదా రుల సమస్యలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసు కెళ్లే ఉద్దేశంతో.. దక్షిణాది రాష్ట్రాల వ్యవసాయ మంత్రులతో సంప్రదింపులు జరిపినట్లు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు తెలిపారు. ఆయిల్‌పామ్ దిగుమతులపై ప్రస్తుత కస్టమ్స్ డ్యూటీని పెంచాలన్న అంశంపై ఈ చర్చలు జరిగినట్లు ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్రం క్రూడ్ పామ్‌ఆయిల్‌పై దిగుమతి సుంకాలను తగ్గించడం వల్ల.. విదేశాల నుంచి చౌకగా ఎడిబుల్ క్రూడాయిల్ లభిస్తుందని తెలిపారు. దీనివల్ల ఆయిల్‌పామ్ ఉత్పత్తి చేస్తున్న దేశీయ రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ, కర్ణాటక రాష్ట్రాల వ్యవసాయ మంత్రులు, ఈశాన్య రాష్ట్రాలైన అరుణాచల్ ప్రదేశ్, అస్సాం, మిజోరం, నాగాలాండ్, త్రిపుర వ్యవసాయ మంత్రులకు ఈ మేరకు వ్యక్తిగతంగా లేఖలు పంపినట్లు తెలిపారు. ఆయిల్‌పామ్‌కు మినిమమ్ గ్యారంటీ ప్రైస్ (ఎంజీపీ) రూ. 25,000గా నిర్ణయించాల్సిన అవసరాన్ని కూడా లేఖలో ప్రస్తావించారు.

'మావోయిస్టులపై కాల్పులు వెంటనే ఆపాలి'

• ఇంద్రావతి పార్క్ ప్రాంతంలో 30 వేల మంది బలగాల కూంబింగ్
• గణపతి, హిడ్మా వంటి నాయకులున్నారంటూ ప్రచారం



హరగోపాల్

సాక్షి, హైదరాబాద్‌: మావోయిస్టులపై కాల్పులను కేంద్ర ప్రభుత్వం వెంటనే ఆపేయాలని ప్రొఫెసర్.జి.హరగోపాల్ డిమాండ్ చేశారు. ఇంద్రావతి నేషనల్ పార్క్ అటవీ ప్రాంతంలో సోమవారం రాత్రి 7 గంటలకు 30 వేల మంది కేంద్ర పోలీసు బలగాలు, ఛత్తీస్‌గఢ్ పోలీసులు మావోయిస్టులను ఆదివాసీలను చుట్టుముట్టి ఫైరింగ్ చేస్తున్నారని తనకు సమాచారం అందినట్టు పేర్కొన్నారు. 'బస్తర్ ఐజీ సుందర్ రాజ్ మావోయిస్టులను లొంగిపొమ్మని హెచ్చరికలు చేస్తున్నాడు లేదా చావుకు సిద్ధం కండి అని మాట్లాడుతున్నాడు. గణపతి, హిడ్మా వంటి నాయకులు ఉన్నారని ప్రచారం చేస్తున్నారు. ప్రజలు, ప్రజాస్వామిక వాదులు, హక్కుల సంఘాలు, వామపక్ష పార్టీ లు, మేధావులు ఈ మారణహోమంపై వెంటనే స్పందించాలి. పోలీసులు చట్టం, రాజ్యాంగం ప్రకారం మెదలకుండా హత్యలు చేయడం, హత్య చేస్తామని హెచ్చరించడం ప్రజాస్వామ్య వ్యతిరేకం. రాజ్యాంగ విరుద్ధం. వెంటనే కేంద్ర ప్రభుత్వం ఈ కాల్పులు ఆపివేయడానికి అన్ని వర్గాల వారు స్పందించాలని విజ్ఞప్తి చేస్తున్నా' అని హరగోపాల్ పేర్కొన్నారు.

'పుట్టపాక'కు రెండు జాతీయ అవార్డులు



నర్మద

సంస్థాన్ నారాయణపురం: చేనేత కళాకారులను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చే చేనేత జాతీయ అవార్డులకు సంబంధించి.. 19 విభాగాలలో మార్కెటింగ్, యువ చేనేత కళాకారుడి విభాగాలలో తెలంగాణ నుంచి యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్‌నారాయణపురం మండలం పుట్టపాక గ్రామానికే దక్కాయి. చేనేత యువ కళాకారుడి విభాగంలో గూడ పవన్ ఎంపికయ్యారు. గూడ పవన్ డబుల్ ఇక్కత్ సిల్క్ చీర, సహజ రంగులతో తెలియాడే వస్త్రంతో చీర రూపొందించారు. మార్కెటింగ్ విభాగంలో పుట్టపాకకు చెందిన గజం నర్మద నరేందర్ ఎంపికయ్యారు మార్కెటింగ్ విభాగంలో మొట్టమొదటి అవార్డు అందుకోనున్న మహిళ ఈమే కావడం విశేషం.



మగ్గం నేస్తున్న గూడ పవన్

9న సమ్మెకు జర్నలిస్ట్ ఫెడరేషన్ సంఘీభావం

సాక్షి, హైదరాబాద్‌: దేశవ్యాప్తంగా ఈనెల 9న కేంద్ర కార్మిక సంఘాలు ఇచ్చిన సమ్మె పిలుపునకు తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర కమిటీ సంపూర్ణ సంఘీభావం ప్రకటించింది. వర్కింగ్ జర్నలిస్టుల చట్టం, వేతన చెల్లింపుల చట్టాలతో పాటు 44 చట్టాలను రద్దు చేసిన కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా కార్మిక సంఘాలు చేస్తున్న ఆందోళనకు మద్దతిస్తున్నట్లు తెలిపింది. సమ్మెలో జర్నలిస్టులంతా భాగస్వాములు కావాలని కోరింది. కేంద్ర కార్మిక సంఘాలు నిర్వహించే ధర్నాలు, ప్రదర్శనలు ఇతర ఆందోళన కార్యక్రమాల్లో భాగస్వాములం కావడం ద్వారా కార్మికుల ఐక్యతను ప్రదర్శించాలని సూచించింది. జర్నలిస్టులకున్న వర్కింగ్ జర్నలిస్టుల చట్టం, వేతన చెల్లింపు చట్టాల పునరుద్ధరణతో పాటు జర్నలిస్టు వృత్తి ప్రమాణాలను కాపాడుకునేందుకు అందరూ ఐక్యంగా నిరసన చెప్పాలని టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య, ప్రధాన కార్యదర్శి బి.బసవపున్నయ్య సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

టాయిలెట్‌కు కూడా సర్కార్ జాగా ఉండదేమో!

ఓ కేసులో ప్రభుత్వాల తీరుపై హైకోర్టు అసహనం

• సంపన్నులకు ఎకరాలకు ఎకరాలు కేటాయిస్తారు
• పేదలకు మాత్రం ఇళ్ల స్థలాలకు భూమి కరువు
• మీ సొంత హేచరీతో ప్రజలకు ఏం లాభం?
• ప్రభుత్వ భూమిని అడిగిన పిటిషనర్‌కు కోర్టు ప్రశ్న



సాక్షి, హైదరాబాద్‌: 'ఒకప్పుడు రాష్ట్ర ప్రభుత్వం పరిధిలో లక్షలాది ఎకరాల భూమి ఉండేది. రానురాను సర్కార్ టాయిలెట్ నిర్మించాలన్నా స్థలం ఉండని పరిస్థితి వస్తోంది'అని హైకోర్టు అసహనం వ్యక్తం చేసింది. భవిష్యత్ గురించి ఎలాంటి ఆలోచన లేకుండా ప్రభుత్వ స్థలాలను ఇష్టారాజ్యంగా కేటాయించడంతో పాటు ఇప్పటికే ఆక్రమణలు చేపట్టిన వారికి క్రమబద్ధీకరణ చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. ఎకరాలకు ఎకరాలు పొందుతున్నవారు అంతా సంపన్న వర్గాలేనని అభిప్రాయపడింది. ఒకప్పుడు సర్కార్ అధీనంలో పలు రకాల భూములు ఉండేవని కోర్టు పేర్కొంది. పేదలకు ఇళ్ల స్థలం కేటాయించడానికి భూమి లేదంటున్న సర్కార్.. పెద్దలకు వడ్డించేందుకు ఎలాంటి అభ్యంతరం తెలపడం లేదని ఓ పిటిషన్‌పై విచారణ సందర్భంగా వ్యాఖ్యానించింది. వికారాబాద్ జిల్లా ధరూర్ మండలం అంతరం సర్వే నంబర్ 32, 82లో హేచరీ నిర్మాణం కోసం 6 ఎకరాలు కేటాయించాలని వినతి పత్రం సమర్పించినా అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడాన్ని సవాల్ చేస్తూ ఖలీల్ అనే వ్యక్తి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి సోమవారం విచారణ చేపట్టారు.

హేచరీతో ప్రజలకు ఏం లాభం..

పిటిషనర్ తరఫున న్యాయవాది శ్రీనివాసరావు వాదనలు వినిపించారు. 'ఎండీ ఖలీల్ ఫామ్స్ పేరుతో హేచరీ నిర్మాణానికి స్థలం కేటాయించాలని 2022లో కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించాం. ఇప్పటివరకు దానిని ప్రభుత్వానికి పంపలేదు. హేచరీకి భూమి కేటాయించాలి. ఆ మేరకు ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేయాలి'అని కోరారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. మన ప్రభుత్వాల తీరు కారణంగా ఇప్పుడు సర్కార్ భూమి అన్నదే లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. అర్హులైన పేదలకు భూమి, స్థలాలను కేటాయించాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందని, దీనికి విరుద్ధంగా సంపన్నులకు ఎకరాలకు ఎకరాలు భూ కేటాయింపులు జరిగాయని అన్నారు. అలాగే ఇష్టారాజ్యంగా కొందరు చేసిన ఆక్రమణలను ఎప్పటికప్పుడు క్రమబద్ధీకరిస్తూ పోతున్నారన్నారు. దీంతో సర్కార్ భూమి అన్నదే మాయమైపోయిందని చెప్పారు. ఈ కేసులో ఏ ప్రాతిపదికన పిటిషనర్‌కు భూమిని కేటాయించాలని ప్రశ్నించారు. మీ సొంతానికి ఏర్పాటు చేసుకునే హేచరీతో ప్రజలకు ఒనగూరే ప్రయోజనం ఏంటని అడిగారు. ప్రభుత్వ వివరణ లేకుండా ఇప్పుడే ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేమని చెబుతూ.. విచారణను ఈనెల 22కు వాయిదా వేశారు.

యూట్యూబ్‌లో చూసి చిన్నారి హత్య

• పథకం ప్రకారం చంపి.. కప్పిపుచ్చే యత్నం
• చున్నీని గుర్తించిన డాగ్‌స్క్వాడ్
• నిందితురాలు మమతను రిమాండ్‌కు తరలించిన పోలీసులు

కోరుట్ల: యూట్యూబ్‌లో వీడియోలు చూసే చిన్నారి హితాక్షిని ఆమె చిన్నమ్మ హత్య చేసినట్లు తేలింది. తోటికోడలు పెత్తనాన్ని సహించలేక.. తనకు ప్రాధాన్యం ఇవ్వడం లేదన్న అక్కసుతో పథకం ప్రకారమే చిన్నారిని హత్య చేసిన మమత.. నేరాన్ని కప్పిపుచ్చుకునేందుకు చివరివరకూ ప్రయత్నించింది. చిన్నారిని హత్య చేసిన అనంతరం దుస్తులు మార్చుకునే క్రమంలో బెడ్‌రూంలో మర్చిపోయిన చున్నీనే నిందితురాలిని పట్టించింది. అతి కిరాతకానికి ఒడిగట్టిన ఆమెను పోలీసులు సోమవారం రిమాండ్‌కు తరలించారు. కోరుట్ల సీఐ సురేశ్‌బాబు కథనం ప్రకారం.. పట్టణానికి చెందిన ఆకుల మదన్‌మోహన్ తన ఇద్దరు కుమారులు రాము, లక్ష్మణ్‌తో కలిసి దుబాయ్‌కి ఉపాధి కోసం వెళ్లారు. ఇక్కడ మోహన్ భార్యతోపాటు కోడళ్లు నవీన, మమత ఒకే ఇంట్లో ఉంటున్నారు. అత్తతో కలిసి నవీన దుబాయ్ వెళ్లేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఈ క్రమంలో రెండురోజులుగా కరీంనగర్ వెళ్లి షాపింగ్ చేస్తున్నారు. ఈ సమయాన్ని హితాక్షి హత్యకు మమత అనువైందిగా ఎంచుకుంది. శనివారం సాయంత్రం ఇంట్లో అత్త ఒక్కతే ఉండటంతో అదేరోజు హితాక్షిని హత్య చేయాలని నిర్ణయించుకుంది. అంతకుముందే యూట్యూబ్‌లో హత్యలు ఎలా చేయాలో వీడియోలు పరిశీలించినట్లు సమాచారం. శనివారం మధ్యాహ్నమే ఓ కవర్‌లో కత్తి, కట్టర్, చీరను తీసుకెళ్లి సమీపంలో ఉన్న వివాదాస్పద వ్యక్తి ఇంటి బాత్‌రూంలో దాచి ఉంచింది. చీకటి పడగానే హితాక్షిని ఆ ఇంట్లోకి తీసుకెళ్లి బాత్‌రూంలో గొంతు కోసి హతమార్చింది.

కప్పిపుచ్చుకునేందుకు విఫలయత్నం

హితాక్షిని కర్కశంగా హతమార్చిన మమత ముందుగా ఏమీ ఎరగనట్లు వ్యవహరించింది. హత్య చేసిన వెంటనే అదే ఇంట్లో బాత్‌రూంలో దుస్తులు మార్చుకుని, కత్తి, కట్టర్‌ను కవర్‌లో వేసుకుని వేరే దుస్తులు వేసుకుని బయటకు వచ్చింది. ఆటోలో పట్టణ శివారు ఎస్‌ఎఫ్‌ఎస్ స్కూల్ సమీపంలో కత్తి, కట్టర్, డ్రెస్‌లను పడేసింది. మరో ఆటోలో ఇంటికి చేరి బంధువులతో కలిసి హితాక్షి కోసం వెతుకుతున్నట్లు నటించింది. కత్తి, కట్టర్, రక్తపు మరకలు ఉన్న దుస్తులను స్కూల్ సమీపంలో పడేసిన మమత.. హడావుడిలో చున్నీని మాత్రం తన ఇంటి బెడ్‌రూంలో వదిలేసింది. ఆ చున్నీని డాగ్‌స్క్వాడ్ గుర్తించడంతో మమతనే హత్యకు పాల్పడి ఉంటుందని పోలీసులు అనుమానించారు. ఆమెను అదుపులోకి తీసుకుని విచారించగా నిజం ఒప్పుకుంది. చివరికి రిమాండ్‌కు తరలించే క్రమంలో తాను తప్పు చేశానని, తనను చంపేయమని తన బంధువులతో మమత చెప్పడం గమనార్హం.

ఫ్యాన్‌కు టవల్ కట్టి.. మెడకు చుట్టి..

• చిన్నారి ప్రాణం తీసిన సరదా ఆట



సహస్ర

పటాన్‌చెరు టౌన్ (హైదరాబాద్): విద్యు త్ లేని సమయంలో ఇంట్లో ఫ్యాన్‌కు టవల్ కట్టి.. మెడకు చుట్టుకొని ఆడుకుంటుండగా.. విద్యుత్ సరఫరా కావ డంతో.. బిగిసి ఒక బాలిక మృతి చెందింది. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ఘటన జరిగింది. ఎస్ఐ మహేశ్వర్ రెడ్డి కథనం ప్రకారం.. చిట్కుల్ గ్రామానికి చెందిన నరసింహాచారి ఎలక్ట్రీషి యన్. ఆదివారం పెద్ద కూతురు పావనిని జిన్నారంలోని కస్తూర్బా బాలికల పాఠశాలలో దిగబెట్టేందుకు భార్య లతతో కలిసి వెళ్లాడు. ఇంటి వద్ద కుమారుడు గణేష్ ఈశ్వర్ (6) సహస్ర (9)ను వదిలి వెళ్లారు. ఈ నేపథ్యంలో.. ఇంట్లో ఇద్దరూ ఆడుకుంటున్న క్రమంలో సహస్ర.. చెక్క స్టూల్ పైకి ఎక్కి ఫ్యాన్‌కు టవల్ వేసి, మెడకు చుట్టి ఆడుకుంటోంది. అదే సమ యంలో విద్యుత్ రావడంతో ఫ్యాన్ తిరిగింది. దీంతో టవల్ సహస్ర మెడకు చుట్టుకుని ఊపిరాడక మృతి చెందింది. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

రక్తపు మడుగులో ప్రేమికులు..

• యువతి మృతి.. యువకుడి పరిస్థితి విషమం
• ఘటనపై పోలీసుల అనుమానాలు

రామచంద్రాపురం (పటాన్‌చెరు): వాళ్లిద్దరూ ప్రేమించుకున్నారు. ఏమైందో ఏమోకానీ సోమవారం రక్తపు మడుగులో కనిపించారు. మెడపై కత్తి గాయాలతో యువతి మృతిచెందగా, గొంతుపై గాయాలతో యువకుడు ఆస్పత్రిలో చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నాడు. ఈ ఘటన సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని బండ్లగూడలో సోమవారం చోటుచేసుకుంది. మియాపూర్ ఏసీపీ సీహెచ్ శ్రీనివాస్ కుమార్, స్థానికుల కథనం ప్రకారం.. విజయనగరం జిల్లా రామభద్రపురం మండలానికి చెందిన బొత్స శ్రీనివాస్, ఈశ్వరమ్మ దంపతులు 25 ఏళ్ల క్రితం జీవనోపాధి కోసం బండ్లగూడకు వలసవచ్చి స్థానికంగా ప్రైవేట్ పరిశ్రమల్లో కార్మికులుగా పనిచేస్తున్నారు. వీరి ఏకైక కుమార్తె రమ్య చందానగర్‌లోని ప్రగతి డిగ్రీ కళాశాలలో ఫైనల్ ఇయర్ చదువుతోంది. మెదక్ జిల్లా వెల్దుర్తి మండలం మానేపల్లికి చెందిన ప్రవీణ్ కుమార్ ఇంజనీరింగ్ చదివి పటాన్‌చెరు ఆల్విన్ కాలనీలో నివసించే అక్క ఇంట్లో ఉంటూ ట్యూషన్లు చెబుతున్నాడు. ఈ క్రమంలో రమ్య, ప్రవీణ్ కుమార్‌లు మూడేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. రమ్యకు పెళ్లి సంబంధాలు చూస్తుండటంతో ప్రవీణ్ ఆమె ఇంటికెళ్లి తాము ప్రేమించుకుంటున్నామని పెళ్లి చేసుకుంటామని తెలిపాడు. అయితే రమ్య తల్లిదండ్రులు ఇప్పుడే వద్దని చెప్పారు. కాగా రమ్య మూడు రోజులుగా అనారోగ్యం కారణంగా కళాశాలకు వెళ్లడం లేదు. సోమవారం ఉదయం రమ్య తల్లిదండ్రులు డ్యూటీకి వెళ్లారు. రమ్య తల్లి ఈశ్వరమ్మ మధ్యాహ్నం ఒంటి గంటకు ఇంటికి వచ్చింది. గేటు లోపలి నుంచి గడియ పెట్టివుండటంతో భర్తకు ఫోన్ చేసి పిలిచింది. శ్రీనివాస్ వచ్చి కిటికీలో నుంచి చూడగా రమ్య, ప్రవీణ్ కుమార్‌లు మంచంపై రక్తం మడుగులో ఉన్నారు. రమ్య అప్పటికే మృతి చెందగా, ప్రవీణ్ కొన ఊపిరితో ఉండటంతో వెంటనే రామచంద్రాపురంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ప్రవీణ్ పరిస్థితి విషమంగా ఉందని పోలీసులు తెలిపారు. ఇద్దరూ కలసి ఆత్మహత్య చేసుకున్నారా? లేక ప్రవీణ్ రమ్య గొంతుకోసి అతను ఆత్మహత్య చేసుకున్నాడా? అనే విషయం తెలియాల్సి ఉందని పోలీసులు తెలిపారు. ఘటనా స్థలంలోని కత్తిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.



రమ్య



ప్రవీణ్ కుమార్

కరీంనగర్‌లో మరో క్రిప్టో కుంభకోణం

దాదాపు రూ.100 కోట్ల వరకు వసూళ్లు

• ఏడాదిన్నరగా నిలిచిపోయిన 'మెటా'లావాదేవీలు
• బాధితులు అంతా మధ్యతరగతి ఉద్యోగులే
• ఇరువర్గాల తరఫున ఓ దళిత నేత మధ్యవర్తిత్వం
• దేశందాటి థాయ్‌లాండ్ పారిపోయిన సూత్రధారి?

సాక్షిప్రతినిధి,కరీంనగర్: ఇటీవల కరీంనగర్‌లో వెలుగుచూసిన రూ.95 కోట్ల క్రిప్టో కరెన్సీ కుంభకోణం మరువకముందే...మరో రూ.100 కోట్లకుపైగా స్కామ్ జరిగింది. వాస్తవానికి ఇది కూడా జీబీఆర్ క్రిప్టోతోపాటే కస్టమర్లకు డబ్బులు ఎగ్గొట్టినా, బాధితులు పోలీసులను ఆశ్రయించకుండా సెటిల్‌మెంట్ కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ పెట్టుబడుల వ్యవహారంలో కరీంనగర్‌కు చెందిన ఓ మాజీ కార్పొరేటర్ ముఖ్య సూత్రధారిగా ఉండగా.. ఇతర చోటామోటా లీడర్లు తమ వంతు పాత్ర పోషిస్తున్నారు. వీరి చేతిలో మోసపోయినవారంతా, వారి ఇళ్ల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

ఏంటి కథ?

ఆంధ్రప్రదేశ్‌కి చెందిన లోకేశ్ 2023లో మెటా పేరిట క్రిప్టో కరెన్సీని ఏర్పాటు చేస్తున్నానని ప్రకటించాడు. వాస్తవానికి ఈ మెటాకు అసలు యజమాని ఎవరన్నది ఇప్పటికీ తెలియదు. లోకేశ్‌కు కరీంనగర్‌లో ఓ మాజీ కార్పొరేటర్ తోడయ్యాడు. గతంలో పలువురు మంత్రులకు ప్రధాన అనుచరుడిగా ఆయనకు గుర్తింపు ఉంది. ఇతనికి తన బంధుగణం, సామాజికవర్గంలోనూ మంచి పేరు ఉంది. ఈయనకు మరో ముగ్గురు నలుగురు చోటా నేతలు జత కలిశారు. అంతా ఒకే సామాజికవర్గం కావడంతో పలుమార్లు సమావేశాలు ఏర్పాటు చేశారు. ముందే పెట్టుబడులు పెడితే.. తక్కువ రోజుల్లో డబ్బులు రెట్టింపు అవుతాయని నమ్మబలికారు. వీరిమాటలు నమ్మి.. మెటా క్రిప్టోలో భారీగా పెట్టుబడులు పెట్టారు. ఇందుకోసం చాలామంది బ్యాంకుల్లో వ్యక్తిగత రుణాలు తీసుకొని మరీ డబ్బులు ముట్టజెప్పారు. వీరందరికీ యాప్ డౌన్‌లోడ్ చేసి ఇచ్చారు. మూడు నెలలపాటు వారి ఖాతాల్లో డబ్బులు పడినట్టే ఈ యాప్ చూపించింది. దీంతో ఈ విషయం ఆ నోటా ఈ నోటా తెలిసి ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని వారి సామాజికవర్గంలోని వారంతా అప్పులు చేసి మరీ పెట్టుబడులు పెట్టారు. ఒక్క కరీంనగర్ నుంచే దాదాపు రూ.10 కోట్లకు పైగా పెట్టుబడులు పెట్టారు, ఇక జగిత్యాల జిల్లాలో ఏకంగా రూ.30 కోట్లపైమాటే. రాష్ట్రవ్యాప్తంగా ఈ యాప్ ద్వారా దాదాపు రూ.100 కోట్లకుపైగా వసూలు చేశారని సమాచారం. ఈ క్రమంలోనే మూడు నెలల తర్వాత యాప్ మొరాయించడం మొదలైంది. ఆరంభంలో సాంకేతిక సమస్యలు అని సర్దిచెప్పారు. ఆ తర్వాత యాప్‌లో డబ్బు పడటం నిలిచిపోయింది.

ష్యూరిటీగా అపార్ట్‌మెంట్లు, ప్లాట్లు..

కొందరు మరీ ఒత్తిడి చేసే సరికి ష్యూరిటీగా అపార్ట్‌మెంట్లు, ప్లాట్లు జీపీఏ రాసిచ్చినట్టు తెలిసింది. మరికొందరు బాధితులు కరీంనగర్‌కు చెందిన ఓ దళిత నేతను ఆశ్రయించారు. హైదరాబాద్‌లో ఉంటున్న ఆయన వద్దకు రెండుసార్లు వచ్చారు. బాధితుల్లో కొందరు ఈ వ్యవహారాన్ని డీజీపీ కార్యాలయానికి చేరవేశారు. బాధితులకు డీజీపీ అపాయింట్‌మెంట్ కూడా ఖరారైంది. అయితే, పోలీసుల వరకు వెళితే తాము కట్టిన ఆస్తులు వెనక్కి రావన్న ఆందోళనతో బాధితులు డీజీపీ అపాయింట్‌మెంట్ ఇచ్చినా వెళ్లేందుకు వెనకాడుతున్నారు. ఇక సూత్రధారి లోకేశ్ ఇప్పుడు దేశంలోనే లేడని.. యాప్ పేరిట కలెక్ట్ చేసిన దాదాపు రూ.100 కోట్లతో థాయ్‌లాండ్ వెళ్లాడని బాధితులంతా నెత్తీనోరు కొట్టుకుంటున్నారు.

'సిగాచి' పరిశ్రమకు ఎన్‌డీఎంఏ బృందం

• నేడు ప్రమాద స్థల సందర్శన
• తమవారి ఆచూకీ కోసం ఎనిమిది కుటుంబాల నిరీక్షణ

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: సంగారెడ్డి జిల్లా పాశమైలారంలోని సిగాచి పరిశ్రమను మంగళవారం ఎన్‌డీఎంఏ (నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ) బృందం సందర్శించనుంది. ఆరుగురు సభ్యుల బృందం ఘటన స్థలాన్ని పరిశీలించనుంది. ఈ అథారిటీలోని మిటిగేషన్, ఆపరేషన్స్ అండ్ కమ్యూనికేషన్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగాలకు సంబంధించిన సభ్యులు ఘటన స్థలాన్ని పరిశీలించనున్నారు. సిగాచి పరిశ్రమలో జూన్ 30న జరిగిన పేలుడు విధ్వంసం సృష్టించడం తెలిసిందే. ఇప్పటికే 42 మంది మృత్యువాత పడ్డారు. ఘటన జరిగి ఎనిమిది రోజులు గడుస్తున్నప్పటికీ.. ఇంకా ఎనిమిది మంది ఆచూకీ లభించలేదు. మరోవైపు 18 మంది వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. వీరిలో కాలిన గాయాలైన వారు పదిమంది వరకు ఉంటారు. భారీ స్థాయిలో ప్రమాదం జరగడానికి గల కారణాలు, ఇలాంటి ఘటనలు జరగకుండా తీసుకోవాల్సిన చర్యలపై కమిటీ అధ్యయనం చేయనుంది. ఇలాంటి విపత్తు ఎదురైతే.. ఎలా స్పందించాలనే దానిపై ఎన్‌డీఎంఏ బృందం పరిశీలన చేపట్టనుంది.

ఎనిమిది మంది కోసం నిరీక్షణ

దుర్ఘటనలో ఎనిమిది మంది ఆచూకీ ఇప్పటికీ తెలియలేదు. శిథిలాల తొలగింపు దాదాపు పూర్తయింది. అయినా వీరి ఆచూకీ లేకపోవడంతో బాధిత కుటుంబసభ్యులు ఎనిమిది రోజులుగా నిరీక్షిస్తున్నారు. శిథిలాల్లో లభిస్తున్న మానవ అవశేషాలను డీఎన్ఏ పరీక్షల నిమిత్తం ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపుతున్నారు. సుమారు 70కి పైగా అవశేషాల రిపోర్టులు రావలసి ఉంది.

ఎన్‌కౌంటర్ మృతుడు హిడ్మా ప్రధాన అనుచరుడు

• 4న జరిగిన ఎన్‌కౌంటర్ వివరాలు వెల్లడించిన బీజాపూర్ ఎస్పీ

చర్ల: ఈ నెల 4న బీజాపూర్ జిల్లాలో జరిగిన ఎదురుకాల్పుల్లో మృతిచెందిన మావోయిస్టును గుర్తించినట్లు బీజాపూర్ ఎస్పీ డాక్టర్ జితేంద్ర కుమార్‌యాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు. బీజాపూర్ జిల్లాలోని నేషనల్ పార్క్ అటవీ ప్రాంతంలో చేపట్టిన కూంబింగ్‌లో ఒక మావోయిస్టు మృతి చెందాడు. ఆయనను పీఎల్‌జీఏ 1వ నంబర్ కంపెనీ సెకండ్ డిప్యూటీ కమాండర్ సోడి కన్నాగా గుర్తించామని ఎస్పీ తెలిపారు. మృతుడు మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు, మోస్ట్ వాంటెడ్ మడివి హిడ్మాకు ప్రధాన అనుచరుడని.. పలు ఘటనల్లో పాల్గొన్నాడని వివరించారు. కన్నాపై రూ.8 లక్షల రివార్డు ఉందని తెలిపారు. ఎన్‌కౌంటర్ జరిగిన ప్రాంతం దట్టమైన అడవి కావడం, భారీగా వర్షాలు కురుస్తుండడంతో సమాచారం ఇవ్వడంలో జాప్యం జరిగిందని ఎస్పీ వివరించారు.

ఇన్‌ఫార్మర్ నెపంతో మాజీ సర్పంచ్ హతం

పోలీసు ఇన్‌ఫార్మర్‌గా వ్యవహరిస్తున్నాడని ఒక మాజీ సర్పంచ్‌ను మావోయిస్టులు హతమార్చారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా చిన్నకోడేపాల్ గ్రామ మాజీ సర్పంచ్ విజయ్ జువ్వాను ఆదివారం కిడ్నాప్ చేసిన మావోయిస్టులు ఆయనను హతమార్చి.. మృతదేహాన్ని సోమవారం తెల్లవారుజామున గ్రామ సమీపంలో పడవేశారు. పోలీసు ఇన్‌ఫార్మర్‌గా వ్యవహరిస్తున్నందువల్లే హతమార్చామంటూ అక్కడ లేఖ వదిలిపెట్టారు.

మేం ఆదేశించినా వేతనాలు చెల్లించరా?

• సీఎస్, ఇద్దరు ఐఏఎస్‌లకు కోర్టు ధిక్కరణ నోటీసులు

సాక్షి, హైదరాబాద్‌: తాము ఆదేశాలు జారీ చేసినా గ్రంథాలయ శాఖలో స్వీపర్లకు పెంచిన వేతనాలు ఇవ్వకపోడంపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తంచేసింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావుతో పాటు ఇద్దరు ఐఏఎస్‌లకు ధిక్కరణ నోటీసులు జారీ చేసింది. ఈనెల 24న వ్యక్తిగతంగా హాజరుకావాలని ఆదేశాలు జారీచేసింది. జీవో నంబర్ 841, 33 ప్రకారం గ్రంథాలయ గ్రేడ్-3 ఉద్యోగులతో సమానంగా పార్ట్‌టైం స్వీపర్లకు వేతనాలు అందించాలని 2024, డిసెంబర్ 19న హైకోర్టు ఆదేశించింది. అయినా ఈ ఉత్తర్వులను అమలు చేయకపోవడంతో స్వీపర్లు హేమలత, మరికొందరు హైకోర్టులో ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ నగేశ్ భీమపాక విచారణ చేపట్టారు. గత విచారణ సందర్భంగా వారి న్యాయవాదులు హాజరుకావాలని చెప్పినా.. రాకపోవడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. వ్యక్తిగతంగా హాజరుకావాలని సీఎస్ సహా విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్.శ్రీధర్, పబ్లిక్ లైబరీస్ డైరెక్టర్ ఎస్.శ్రీనివాసాచారిని ఆదేశించారు. కోర్టు ధిక్కరణ కింద ఎందుకు చర్యలు తీసుకోకూడదో చెప్పాలని నోటీసులిస్తూ విచారణ వాయిదా వేశారు.

వ్యవసాయ వర్సిటీలో కలకలం

• ప్రొఫెసర్ బి.నీరజపై క్రమశిక్షణ చర్యలకు రంగం సిద్ధం

సాక్షి, హైదరాబాద్‌: ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వ విద్యాలయం (పీజేటీఎస్ఏయూ)లో హార్టికల్చర్ విభాగాధిపతి, ప్రొఫెసర్ బి.నీరజ ప్రభాకర్‌ను ప్రభుత్వం జగిత్యాల వ్యవసాయ కళాశాలకు అసోసియేట్ డీన్‌గా నియమించింది. అయితే మూడు నెలలు దాటినా విధుల్లో చేరకపోవడం పట్ల యూనివర్సిటీ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ తుది మెమో జారీ చేసింది. విధుల్లో చేరకపోవడంపై జూలై 11లోగా సంతృప్తికరమైన వివరణ ఇవ్వాలని, లేనిపక్షంలో క్రమశిక్షణ చర్యలు తప్పవని వర్సిటీ రిజిస్ట్రార్ ఈనెల 4న పంపిన సుదీర్ఘ మెమోలో స్పష్టం చేశారు. దీంతో నీరజ వ్యవహారం వర్సిటీలో ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. తెలంగాణ ఏర్పాటైన తరువాత డాక్టర్ నీరజను ఉద్యాన వర్సిటీ వీసీగా ప్రభుత్వం నియమించింది. నాలుగు న్నరేళ్లు వీసీగా పనిచేసిన డాక్టర్ నీరజను తరువాత మాతృ సంస్థ పీజే ఎస్టీయూకు బదిలీ చేశారు. అయితే అక్కడ హార్టికల్చర్‌కు సంబంధించిన బోధనలేవీ లేకపోవడంతో పనేమీ లేకుండా పోయింది. ఈ నేపథ్యంలో మార్చి 24న ఆమెను జగిత్యాల వ్యవసాయ కళాశాలకు అసోసియేట్ డీన్ హోదాలో ప్రిన్సిపాల్‌గా నియమిస్తూ రాజేంద్రనగర్ యూనివర్సిటీ బాధ్యతల నుంచి రిలీవ్ చేశారు. అయితే బదిలీ అనంతరం జగిత్యాలలో ఆమె విధుల్లో చేరకపోగా, మార్చి 25, 26, 28 తేదీల్లో ఆమె మళ్లీ రాజేంద్రనగర్‌లోని హార్టికల్చర్ విభాగానికి వెళ్లి హెచ్‌ఓడీ గదిని ఆక్రమించారని, హాజరు పత్రాల్లో సంతకాలు చేశారని అక్కడి అసోసియేట్ డీన్ ఫిర్యాదు చేసినట్లు రిజిస్ట్రార్ పేర్కొన్నారు. దీనిని క్రమశిక్షణా రాహిత్య చర్యగా భావించి, వివరణ కోరినట్లు వర్సిటీ రిజిస్ట్రార్ విద్యాసాగర్ జారీ చేసిన మెమోలో వెల్లడించారు.

బ్రహ్మపుత్రలో కొత్త చేప

తోక సమీపంలో పెద్ద నల్ల మచ్చ

దిబ్రుగఢ్: జీవవైవిధ్యానికి నెలవైన బ్రహ్మపుత్ర నదీజలాల్లో మరో కొత్త జాతి చేపను శాస్త్రవేత్తలు కనుగొన్నారు. తోక సమీపంలో పెద్ద నల్ల మచ్చతో ఉన్న ఈ చిన్న చేపకు శాస్త్రవేత్తలు వెంటనే పేథియా దిబ్రూఘర్నేసిస్ అనే పేరుపెట్టేశారు. ఈశాన్య భారతంలోని అస్సాంలో బ్రహ్మపుత్ర నదీజలాల్లో ఈ నూతన మత్స్యజాతిని గుర్తించారు. దిబ్రూగఢ్ సమీప జలాల్లో ఈ మంచినీటి చేపను కనుగొన్నారు. అందుకే దిబ్రూగఢ్ పేరు ధ్వనించేలా పేథియా దిబ్రూఘర్నేసిస్ అని పేరుపెట్టారు. ఈ మత్స్యం నెత్తల్లు వంటి చిన్నచేపలుండే సైప్రినిడ్ జాతికి చెందినదిగా వర్గీకరించారు. బ్రహ్మపుత్ర నదీ ప్రవాహం వెంట ఉన్న భిన్నజాతుల చేపలు, వాటి సంతతి, వృద్ధి, ఇతర రకాల జలచరాల వివరాలను తెల్సుకునేందుకు సర్వే చేపట్టగా ఆ క్రమంలో అధ్యయనకారులకు ఈ చేప కంటబడింది. మిగతా చేపలతో పోలిస్తే కొత్తరకం చేప కాస్తంత భిన్నమైందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.



ఎన్నెన్నో ప్రత్యేకతలు

తాను ఈదుతున్న నీటిలో ఏదైనా షార్క్, డాల్ఫిన్, ఆక్టోపస్ వంటి శత్రుజలచరాలు కదిలితే నీటి తరంగాలతో వాటి కదలికలను కనిపెట్టి అప్రమత్తం చేసే జ్ఞానేంద్రియ రేఖ(లేటరల్ లైన్) ఈ చేపలో అసంపూర్ణంగా అభివృద్ధి చెందింది. ఈ కారణంగా దీనిని ఇతర జీవులు వేటాడటం సులభం అవుతుంది. ఇది పెద్దగా కష్టపడకుండానే వాటి నోటికి చిక్కుతుంది. తోక సమీపంలో పెద్ద నల్ల మచ్చ దీని ప్రత్యేకత. తోక చుట్టూతా 10 పొలుసులు భిన్నంగా ఉన్నాయి. అదీకాకుండా పై భాగంలోని రెక్కకు, లేటరల్ లైన్‌కు మధ్యలో నాలుగు పొలుసుల వరసలు, అదే విధంగా కింది రెక్కకు, లేటరల్ లైన్‌కు మధ్యలో మరో నాలుగు పొలుసుల వరసలు ఒక క్రమపద్ధతిలో ఉన్నాయి. ''పిల్లి మీసాల్లాగా చేప నోటి వద్ద ఉండే నిర్మాణం ఈ జాతి చేపకు లేదు. చేప కన్ను తర్వాత వెనక్కివెళ్లే కొద్దీ తొలుత కనిపించే ప్రాంతంలో దీనికంటూ ప్రత్యేకంగా ఎలాంటి మచ్చలు, రంగులు లేవు. కానీ తోక సమీపంలో విచిత్రంగా నల్లని, పొడవాటి మచ్చ ఉంది. ఈ జాతిచేపలన్నింటిలో ఈ మచ్చ ఉంది. బ్రహ్మపుత్ర జలాలు జీవవైవిధ్యానికి పట్టుగొమ్మలని ఈ చేప మరోసారి నిరూపించింది'' అని శాస్త్రవేత్తలు వ్యాఖ్యానించారు. ''నదీ ప్రవాహం వెంట చిత్తడి నేలల పరిరక్షణ, మితిమీరిన చేపల వేటను తగ్గించడం వంటి చర్యలతో ఇలాంటి అరుదైన చిన్న కొత్త చేపలను పరిరక్షించవచ్చు. ఆ దిశగా ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలి'' అని అధ్యయనకారులు సూచించారు.

రీల్ కోసం పాకులాట

బిడ్డ ప్రాణాలను పణంగా పెట్టిన ప్రబుద్ధులు

జైపూర్: రాజస్తాన్‌కు చెందిన ఓ వ్యక్తి తన కుమార్తె ప్రాణాలను పణంగా పెట్టి రీల్ సృష్టించడానికి ప్రయత్నిస్తున్న వీడియో ఒకటి సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. నిండుగా తొణికిసలాడుతున్న భరత్‌పూర్ జిల్లాలోని బంధ్ బరైతా రిజర్వాయర్‌పై ఉన్న ఇనుప ఫ్రేమ్‌పై భయపడుతున్న తన కూతురిని బలవంతంగా అతడు కూర్చోబెడుతున్నట్లుగా ఆ వీడియోలో ఉంది. ఈ నెల 4న ఉమా శంకర్ తన భార్య, కుమార్తెతో జలాశయం వద్దకు వెళ్లాడు. వీడియో చిత్రీకరించేందుకు గాను ప్రమాదకరంగా ఉన్న ఇనుప ఫ్రేమ్‌పై తీవ్రంగా భయపడుతున్న తన కుమార్తెను గద్దించి కూర్చోబెట్టాడు. అక్కడ ఆమె కిందపడకుండా పట్టుకునేందుకు సైతం ఎలాంటి రక్షణ ఏర్పాటూ లేకపోవడం గమనార్హం. ఆ రిజర్వాయర్ ఎప్పుడూ నీటితో నిండి ఉంటుంది. ఇటీవల వర్షాలకు జలకళ సంతరించుకుంది. ఇలాంటి పరిస్థితులు ఉమా శంకర్ తీసి, సోషల్ మీడియాలో పెట్టిన వీడియోపై నెటిజన్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సోషల్ మీడియాలో లైకులు, షేర్ల కోసం కూతురు పట్ల ఇంత బాధ్యత లేకుండా వ్యవహరించే తల్లిదండ్రులు కూడా ఉంటారా అని నిలదీశారు. దీంతో, ఉమా శంకర్ తన ఇన్‌స్టా అకౌంట్ నుంచి ఆ వీడియోను డిలీట్ చేశాడు. పోలీసులు దీనిపై ఇంకా స్పందించలేదు.



ప్రపంచానికి బ్రిక్స్ ఆశాదీపం

భిన్నత్వమే కూటమి బలం: మోదీ

- గ్లోబల్ సౌత్‌కు బ్రిక్స్‌పై ఎన్నో ఆశలు
- వాటిని నెరవేర్చి చూపిద్దామని పిలుపు
- పరిశోధన సంస్థ ఏర్పాటుకు ప్రతిపాదన

రియో డి జనిరో: ''అంతర్జాతీయ సహకారానికి, ఆదర్శ బహుళ ధ్రువ ప్రపంచానికి బ్రిక్స్ కూటమి చక్కని ఉదాహరణగా, విశ్వసనీయతకు మారుపేరుగా నిలవాలి. రానున్న రోజుల్లో ఇతర ప్రపంచ దేశాలకు అన్ని విషయాల్లోనూ దిశానిర్దేశం చేసే దారిదీపం కావాలి'' అని ప్రధాని నరేంద్ర మోదీ ఆకాంక్షించారు. ''బ్రిక్స్‌పై దక్షిణార్ధ గోళ దేశాలు (గ్లోబల్ సౌత్) ఎన్నో ఆశలు పెట్టుకున్నాయి. వాటిని నెరవేర్చి నమ్మకాన్ని నిలబెట్టుకుందాం. పాలన, అభివృద్ధి, పరస్పర సహకారం తదితరాల్లో అత్యున్నత ప్రమాణాలు నెలకొల్పుదాం'' అని సభ్య దేశాల అధినేతలకు పిలుపునిచ్చారు. ఈ విషయంలో సభ్య దేశాలన్నింటితోనూ భుజం భుజం కలిపి ముందుకు సాగేందుకు భారత్ పూర్తిగా కట్టుబడి ఉందని వక్కాణించారు. బ్రెజిల్‌లోని రియో డి జనిరోలో బ్రిక్స్ 17వ శిఖరాగ్ర సదస్సులో సోమవారం రెండో రోజు 'భిన్నత్వానికి దన్ను, ఆర్థిక వ్యవహారాలు, ఏఐ', 'పర్యావరణం, కాప్–30, ప్రపంచ ఆరోగ్యం' వంటి అంశాలపై జరిగిన సెషన్లలో మోదీ ప్రసంగించారు. బ్రిక్స్ కూటమి బలం దాని భిన్నత్వంలోనే దాగుందని నొక్కి చెప్పారు. కృత్రిమ మేధకు నానాటికీ అపారంగా పెరిగిపోతున్న ప్రాధాన్యాన్ని ప్రస్తావించారు.

'ఏఐ' ఆందోళనలకు అలా చెక్

''విద్య నుంచి వ్యవసాయం దాకా అన్ని రంగాల్లోనూ ఏఐని భారత్ చురుగ్గా, విస్తృతంగా ఉపయోగిస్తోంది. ఏఐపై నెలకొన్న ఆందోళనలకు సమర్థంగా చెక్ పెట్టాలంటే ఇటు పాలనకు, అటు ఇన్నొవేషన్లకు సమ ప్రాధాన్యమివ్వడమే మార్గం. బాధ్యతాయుతమైన ఏఐ మనందరి లక్ష్యం కావాలి'' అని మోదీ సూచించారు. ఏఐ ప్రభావంపై వచ్చే ఏడాది భారత్ నిర్వహించనున్న శిఖరాగ్ర భేటీలో పాల్గొనాల్సిందిగా బ్రిక్స్ సభ్య దేశాలన్నింటినీ ఈ సందర్భంగా ఆహ్వానించారు. కీలక రంగాల్లో పరస్పర సహకారాన్ని మరింతగా పెంపొందించుకునేందుకు వీలుగా బ్రిక్స్ సైన్స్ అండ్ రీసెర్చ్ రిపోజిటరీ (బీఎస్ఆర్ఆర్) ఏర్పాటును ప్రతిపాదించారు. అంతర్జాతీయ స్థాయిలో కీలక ఖనిజాలు సరఫరాకు ఆటంకం లేకుండా చూడటంలో కూటమి కీలకపాత్ర పోషించాలని అభిలషించారు. ఆ వనరులను ఏ దేశమూ స్వీయ స్వార్థ ప్రయోజనాలను నెరవేర్చుకోవడానికి, ఇతర దేశాలపై ఆయుధంగా వాడకుండా చూడాలన్నారు. 18 రకాల కీలక ఖనిజ వనరులకు నిలయమైన చైనా ఇటీవల వాటి ఎగుమతులను బాగా తగ్గించడం తెలిసిందే. పరోక్షంగా దాన్ని ఉద్దేశించి మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు. చైనా ప్రధాని లీ కియాంగ్ మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయిలో కీలక పాలన సంస్కరణలకు బ్రిక్స్ బాటలు పరవాలని సూచించారు. ప్రపంచ శాంతిని కాపాడటంలో, విభేదాలను శాంతియుతంగా పరిష్కరించడంలో కీలక పాత్ర పోషించాలన్నారు.



అధినేతలతో భేటీలు

బ్రిక్స్ సదస్సు సందర్భంగా సోమవారం పలువురు దేశాధినేతలతో ప్రధాని మోదీ సమావేశమయ్యారు. 10 దేశాలతో కూడిన ఆసియాన్ కూటమితో భారత స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై మలేసియా ప్రధాని అన్వర్ బిన్ ఇబ్రహీంతో చర్చించారు. వర్తకం, పెట్టుబడులు, రక్షణ, విద్య, ఆరోగ్యం, పర్యాటకం తదితరాలపై లోతైన సమీక్ష జరిపారు. బొలీవియా అధ్యక్షుడు లూయిస్ అల్బర్టో ఆర్స్ కాటకొరా, ఉరుగ్వే అధ్యక్షుడు యమండ్ ఒర్సీతో ద్వైపాక్షిక అంశాలను గురించి మోదీ చర్చలు జరిపారు. యోగాకు ఉరుగ్వేలో నానాటికీ ఆదరణ పెరుగుతుండటంపై హర్షం వెలిబుచ్చారు.

పర్యావరణ న్యాయం...
మాకు పవిత్ర నైతిక విధి

పర్యావరణ న్యాయం భారత్ దృష్టిలో పవిత్రమైన నైతిక విధి అని మోదీ ఉద్ఘాటించారు. పారిస్ పర్యావరణ ఒప్పంద ప్రతిజ్ఞలను గడువుకు ముందే నెరవేర్చిన తొలి దేశం భారతేనని గుర్తు చేశారు. ''భూమి ఆరోగ్యంపైనే ప్రజారోగ్యం ఆధారపడి ఉంది. ఈ విషయంలో సంపన్న దేశాలపై గురుతర బాధ్యత ఉంది''అన్నారు. ''బ్రిక్స్ సారథిగా మానవత్వం, పర్యావరణ న్యాయం తదితరాలకు భారత్ పెద్దపీట వేస్తుంది. సమర్థ కూటమిగా బ్రిక్స్‌పనితీరుకే సరికొత్త నిర్వచనమిస్తుంది'' అని మోదీ స్పష్టం చేశారు. వచ్చే ఏడాది భారత్ బ్రిక్స్ సారథ్య పగ్గాలు చేపట్టనున్న విషయం తెలిసిందే. ఎలాంటి విపత్తులనైనా సమర్థంగా ఎదుర్కొనేందుకు అన్నివేళలా సిద్ధంగా ఉండాల్సిన అవసరం చాలా ఉందంటూ కరోనా మహమ్మారిని ప్రధాని ఉటంకించారు. ''వైరస్‌లు వీసాలు తీసుకుని రావని కరోనా నిరూపించింది. వాటి పరిష్కారాలు కూడా పాస్‌పోర్టులను చూసి ఎంపిక చేసుకునేవి కావు'' అంటూ చమత్కరించారు. వర్ధమాన దేశాలు ఆత్మవిశ్వాసం విషయంలో సంపన్న దేశాలకు ఏ మాత్రమూ తీసిపోవద్దని సూచించారు.

బ్రిక్స్‌కు మద్దతిచ్చే దేశాలపై 10% అదనపు సుంకాలు: ట్రంప్

తీవ్రంగా తప్పుబట్టిన చైనా



వాషింగ్టన్/బీజింగ్: బ్రిక్స్ కూటమివి అమెరికా వ్యతిరేక విధానాలని ఆ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆరోపించారు. ఆ కూటమికి మద్దతిచ్చే ఏ దేశమైనా తమనుంచి 10 శాతం అదనపు సుంకాన్ని ఎదుర్కోవాల్సి ఉంటుందని సోమవారం హెచ్చరించారు. ''బ్రిక్స్ అమెరికా వ్యతిరేక విధానాలతో జతకట్టే ఏ దేశం మీదైనా అదనంగా 10% సుంకం విధిస్తాం. ఈ విషయంలో ఎలాంటి మినహాయింపులూ ఉండవు'' అని ట్రూత్ సోషల్‌లో పేర్కొన్నారు. కొత్త టారిఫ్ నియమాలు, సవరించిన వాణిజ్య ఒప్పంద నిబంధనలను వివరిస్తూ ఆయా దేశాలకు తక్షణం అధికారిక లేఖలు పంపుతున్నట్టు ప్రత్యేక పోస్టులో తెలిపారు. ట్రంప్ ప్రకటనను చైనా తీవ్రంగా ఖండించింది. ఇతర దేశాలపై ఒత్తిడి తెచ్చేందుకు ఇలా సుంకాలను ఆయుధంగా వాడటం దారుణమని మండిపడింది. ఇది ఎవరికీ లాభం చేయబోదని చైనా విదేశాంగ శాఖ ప్రతినిధి మావో నింగ్ అన్నారు. ''అభివృద్ధి చెందుతున్న దేశాల మధ్య సహకారానికి బ్రిక్స్ ఒక వేదిక. అది ఏ దేశానికీ వ్యతిరేకంగానో, లక్ష్యంగానో లేదు'' అని స్పష్టం చేశారు.

ఖండించిన రియో డిక్లరేషన్

బ్రెజిల్‌లోని రియోడి జనీరోలో జరిగిన బ్రిక్స్ తాజా శిఖరాగ్ర సమావేశం అంతర్జాతీయ వాణిజ్య ఉద్రిక్తతలకు కేంద్ర బిందువుగా మారింది. ట్రంప్ సుంకాల విధానాలను బ్రిక్స్ దేశాధినేతలు తీవ్రంగా విమర్శించారు. 'రియో డి జనీరో డిక్లరేషన్'లో ఈ మేరకు స్పష్టంగా పేర్కొన్నారు. ''సుంకాలను విచక్షణారహితంగా పెంచడం ప్రపంచ వాణిజ్యాన్ని దెబ్బతీసి మరింత తగ్గించే ప్రమాదముంది. ప్రపంచ సరఫరా గొలుసులను దెబ్బతీస్తుంది. అంతర్జాతీయ ఆర్థిక, వాణిజ్య కార్యకలాపాల్లో అనిశ్చితికి కారణమవుతుంది'' అని పేర్కొన్నారు. ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీవో) నియమాల ఆధారిత, బహిరంగ, పారదర్శక, న్యాయమైన, సమానమైన బహుపాక్షిక వాణిజ్య వ్యవస్థకు తమ మద్దతును పునరుద్ఘాటించారు. అనంతరం దీనిపై ట్రంప్ మరోసారి తీవ్రంగా ప్రతిస్పందించారు. అమెరికా వ్యతిరేక విధానాలను అనుసరిస్తున్న దేశాలపై 10% అదనపు సుంకాలు తప్పవని పునరుద్ఘాటించారు. భారత్‌తో సహా అనేక దేశాల దిగుమతులపై అదనపు సుంకాలను ప్రకటించిన ట్రంప్ తర్వాత వాటి అమలును 90 రోజుల పాటు నిలిపేయడం తెలిసిందే. ఆ గడువు జూలై 9తో ముగుస్తుంది. తదనంతరం అమెరికా మార్కెట్లోకి ప్రవేశించే భారత వస్తువులపై అదనంగా 26 శాతం దిగుమతి సుంకం పడుతుంది. ప్రస్తుత సుంకాల బెదిరింపులతో ఆ భారాన్ని మరింత పెంచనుంది.

బంగ్లాను ఖాళీ చేయడానికి సిద్ధంగా ఉన్నాం

మాజీ సీజేఐ చంద్రచూడ్ వెల్లడి

న్యూఢిల్లీ: అధికారిక నివాసాన్ని ఖాళీ చేసేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయని సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ సోమవారం తెలిపారు. ప్రభుత్వం కేటాయించిన అద్దె బంగ్లాకు ఇప్పటికే కొంత సామాను కూడా పంపించామన్నారు. మిగతాది కూడా ప్యాకింగ్ పూర్తి చేసి స్టోర్ రూంలో ఉంచామని చెప్పారు. దేశ రాజధాని ఢిల్లీ కృష్ణ మీనన్ మార్గ్‌లోని ఐదో నంబర్ బంగ్లాలో చంద్రచూడ్ దంపతులు దివ్యాంగులైన ఇద్దరు కుమార్తెలతో ఉంటున్నారు. అయితే, అనుమతించిన సమయానికి మించి ఉంటున్న వారిని వెంటనే ఖాళీ చేయించాలంటూ సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వానికి ఇటీవల లేఖ రాయడం కలకలం రేపింది. ఈ అంశం వివాదాస్పదం కావడం తనకెంతో విచారం కలిగించిందన్నారు. 'నా కుమార్తెలు ప్రియాంక, మహిలు నెమాలిన్ మయోపతి అనే అత్యంత అరుదైన వ్యాధితో బాధపడుతున్నారు. ఇంట్లో కూడా వారిని అత్యంత పరిశుభ్రతతో కూడిన వాతావరణంలో ఉంచాల్సి ఉంది. వారికోసం ప్రత్యేకంగా నర్సును ఏర్పాటు చేశాం. వారిని వీల్‌ఛైర్‌లో తిప్పేందుకు అనువుగా ఉండే ఇల్లు ఎంతో అవసరం. పెయిన్, స్పీచ్ థెరపీతోపాటు వారికి నిత్యం చెస్ట్, రెస్పిరేటరీ, న్యూరలాజికల్ థెరపీనీ చేయించాల్సి ఉంటుంది. కొత్త ఇల్లు సిద్ధమైందని చెప్పిన వెంటనే ఖాళీ చేస్తాం ..అందుకు రెండు రోజులు, రెండు వారాలు కూడా పట్టొచ్చు..'అని చంద్రచూడ్ చెప్పారు.

ముంబై ఉగ్ర దాడులను ప్రత్యక్షంగా పర్యవేక్షించా

- పాక్ సైన్యానికి నమ్మినబంటును: రాణా
- ముంబై దాడుల్లో ఐఎస్ఐ హస్తముంది
- హెడ్లీతో కలిసి లష్కరే శిక్షణ పొందా
- దర్యాప్తులో సంచలన విషయాలు వెల్లడి

ముంబై: పదహారేళ్ల క్రితం ముంబైలో పాక్ ప్రేరేపిత లష్కరే తొయిబా ఉగ్రవాదులు సృష్టించిన మారణహోమం వెనక తన పాత్ర ఉందని ఆ దేశానికి చెందిన ఉగ్రవాది తహవ్వుర్ హుస్సేన్ రాణా అంగీకరించాడు. ఆ క్రమంలో పలు సంచలన విషయాలు వెల్లడించాడు. ''ముంబై దాడుల వెనక పాక్ గూఢచారి సంస్థ ఐఎస్ఐ హస్తముంది. నేను ముంబైలోనే ఉండి దాడులను పర్యవేక్షించా. పథకం ప్రకారమే ఆనాడు ముంబైలో ఉన్నా. భారత్‌లో ఉంటూ పాక్‌కు, ఆ దేశ సైన్యానికి నమ్మకమైన ఏజెంట్‌గా పనిచేశా''అని విచారణలో వెల్లడించాడు. కెనడా పౌరసత్వం, పాక్ మూలాలున్న రాణాను అమెరికా అరెస్టు చేసి విచారణ నిమిత్తం భారత్‌కు అప్పగించడం తెలిసిందే. తిహార్ జైలులో జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) కస్టడీలో ఉన్న రాణాను తాజాగా ముంబై క్రైం బ్రాంచ్ దర్యాప్తు నిపుణులు ప్రశ్నిస్తున్నారు. ఈ క్రమంలో అతను పలు సంచలన విషయాలను వెల్లడించినట్టు జాతీయ మీడియా పేర్కొంది.



పక్కాగా లక్ష్యాల ఎంపిక

తన చిన్ననాటి స్నేహితుడు, ముంబై ఉగ్ర దాడి సూత్రధారుల్లో ఒకడైన డేవిడ్ కోల్‌మన్ హెడ్లీతో కలిసి పాక్‌లో లష్కరే ఉగ్ర శిక్షణ శిబిరాలకు పలుమార్లు హాజరైనట్టు రాణా వెల్లడించాడు. ''మేమిద్దరం అక్కడ శిక్షణ తీసుకున్నాం. ముంబైలో పాగా వేసేందుకు అక్కడ ఇమిగ్రేషన్ కార్యాలయం పెట్టే ఆలోచన నాదే. దాని ముసుగులో పలు ఆర్థిక లావాదేవీలు జరిపా. 2008 నవంబర్ 26న మొదలైన ముంబై దాడుల వేళ నగరంలోనే ఉండి, మా ప్లాన్ సక్రమంగా అమలవుతోందో లేదో ఎప్పటికప్పుడు పర్యవేక్షించా. ఎక్కడెక్కడ దాడులు చేయాలి, అందుకు ఏ ప్రాంతాలు అనువైనవి, ఎక్కడైతే ప్రాణనష్టం భారీగా ఉంటుందని అన్నీ బేరీజు వేసుకున్నా. ఛత్రపతి శివాజీ టెర్మినస్ రైల్వేస్టేషన్ తదితరాలను దాడులకు ఎంపిక చేసుకున్నాం. అందుకు ఐఎస్ఐ సాయపడింది. పాక్ సైన్యానికి నమ్మినబంటును గనకే ఖలీజ్ యుద్ధం వేళ నన్ను సౌదీ అరేబియాకు పంపారు''అని చెప్పాడు.

హెడ్లీతో సహవాసం

''హెడ్లీ, నేను 1974–79 మధ్య హసన్ అబ్దల్ క్యాడెట్ కాలేజీలో కలిసి చదువుకున్నాం. హెడ్లీ తండ్రి పాకిస్తానీ, తల్లి అమెరికన్. సవతి తల్లి పోరు పడలేక తను అమెరికా పారిపోయి కన్నతల్లితో ఉండేవాడు. 2003–04 మధ్య హెడ్లీ, నేను లష్కరే ఉగ్రశిక్షణ తీసుకున్నాం. ఉగ్ర దాడుల కంటే నిఘా కార్యకలాపాల్లో లష్కరేది క్రియాశీల పాత్ర అని హెడ్లీ చెప్పాడు. ముంబైలో నేను తెరిచిన ఇమిగ్రేషన్ ఆఫీసు మా ఉగ్ర నిఘా కార్యకలాపాలకు అడ్డాగా ఉండేది. దాన్ని ఓ మహిళ నడిపేది. 2008లో దాడులకు వారం ముందు భారత్ వచ్చా. నవంబర్ 20, 21 తేదీల్లో ముంబైలోని పోవాయ్ ప్రాంతంలో హోటల్లో దిగా. దాడులకు ముందే ముంబై వీడా. దుబాయ్ మీదుగా బీజింగ్ చేరుకున్నా. పాకిస్తాన్ అధికారులు సాజిద్ మిర్, అబ్దుల్ రహ్మాన్ పాషా, మేజర్ ఇక్బాల్ నాకు తెలుసు''అని రాణా చెప్పాడు. హెడ్లీ తప్పుడు డాక్యుమెంట్ల సాయంతో భారత్ రావడానికి రాణా సాయపడ్డట్టు దర్యాప్తులో తేలింది.

తొలిసారిగా స్వీయ జనగణన

ఇందుకోసం ప్రత్యేక వెబ్ పోర్టల్

న్యూఢిల్లీ: దేశంలో మరికొద్ది నెలల్లో ప్రారంభం కానున్న జనగణన కార్యక్రమం అనేక ప్రత్యేకతలను సంతరించుకోనుంది. మొట్టమొదటిసారిగా, ఈసారి పౌరులే స్వయంగా తమ స్వీయ గణనకు చేసుకునే అవకాశం అందుబాటులోకి రానుంది. ఇందుకోసం ప్రభుత్వం ప్రత్యేక వెబ్ పోర్టల్‌ను తీసుకురానుంది. దీంతోపాటు, ఎన్యూమరేటర్లు తమ మొబైల్ ఫోన్లలోనే పౌరుల డేటాను సేకరించనున్నారు. దేశవ్యాప్తంగా రెండు దశల్లో హౌస్ లిస్టింగ్, హౌసింగ్ సెన్సెస్‌తోపాటు పాపులేషన్ ఎన్యూమరేషన్ చేపట్టనున్నారు. మొదటి దశ ఏప్రిల్ ఒకటిన, రెండోది 2027 మార్చి ఒకటిన ప్రారంభం కానుంది. ఇందుకు సంబంధించిన గజెట్ నోటిఫికేషన్ జూన్ 16వ తేదీన విడుదలైంది.

దలైలామాకు మోదీ శుభాకాంక్షలపై చైనా అభ్యంతరం

బీజింగ్: టిబెటన్ బౌద్ధ గురువు దలైలామాకు 90వ జన్మదినం సందర్భంగా భారత ప్రధాని నరేంద్ర మోదీ శుభాకాంక్షలు తెలపడంపై చైనా అభ్యంతరం తెలిపింది. టిబెట్‌కు సంబంధించిన విషయాల్లో చైనా మనోభావాలను పరిగణనలోకి తీసుకోవాలని నొక్కిచెప్పింది. టిబెట్‌కు సంబంధించిన విషయాల్లో తమ వైఖరి సుస్పష్టమని పేర్కొంది. దలైలామా పుట్టిన రోజు వేడుకల్లో భారత్ మంత్రులు, అధికారులు పాల్గొనడంపైనా చైనా స్పందించింది. '14వ దలైలామా ఒక రాజకీయ బహిష్కృతుడు. ఆయన చాలా కాలంగా చైనా వ్యతిరేక వేర్పాటు వాద కార్యకలాపాల్లో నిమగ్నమై ఉన్నారు. మతం ముసుగులో జిజాంగ్(టిబెట్)ను చైనా నుంచి వేరు చేసేందుకు ప్రయత్నిస్తున్నారు' అని చైనా తెలిపింది.

జపాన్, దక్షిణకొరియాపై 25 శాతం సుంకాలు

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తాజా బాంబు

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి టారిఫ్ రగడకు తెర తీశారు. జపాన్, దక్షిణ కొరియా ఉత్పత్తులపై 25 శాతం సుంకాలు విధించనున్నట్టు ప్రకటించారు. ఈ నిర్ణయం ఆగస్టు 1 నుంచి అమల్లోకి వస్తుందని ట్రూత్ సోషల్ మీడియా పోస్టులో పేర్కొన్నారు. అంతేగాక జపాన్ ప్రధాని షిగెరు ఇషిబా, దక్షిణ కొరియా అధ్యక్షుడు లీ జే మ్యుంగ్‌కు ఈ మేరకు స్వయంగా లేఖలు కూడా రాశారు. ప్రతీకార సుంకాలకు దిగితే ఆ దేశాలపై టారిఫ్‌లు ఆ మేరకు పెరుగుతాయని అందులో ట్రంప్ హెచ్చరించారు! ఆ లేఖల స్క్రీన్‌షాట్లను ట్రూత్ సోషల్‌లో షేర్ చేశారు. జపాన్, దక్షిణకొరియాపై 25 శాతం టారిఫ్ నిజానికి చాలా తక్కువేనంటూ వాపోయారు. ''ఇవి తుది టారిఫ్‌లు కావు. మీ దేశంతో మా సంబంధాలను బట్టి అంతిమంగా పెరగవచ్చు, తగ్గనూ వచ్చు'' అన్నారు. టారిఫ్ పెంపుపై భారత్‌తో పాటు పలు ఇతర దేశాలకు కూడా ట్రంప్ లేఖాస్త్రాలు సంధిస్తున్నట్టు సమాచారం.

మస్క్ కొత్త పార్టీ ప్రకటనపై ట్రంప్ ఎద్దేవా

న్యూయార్క్: 'అమెరికన్ పార్టీ' పేరిట కొత్త పార్టీ పెడతానన్న ఎలాన్ మస్క్ ప్రకటనను హాస్యాస్పదంగా ట్రంప్ సోమవారం అభివర్ణించారు. ''అమెరికాలో ఎన్నో ఏళ్లుగా రెండు పార్టీలతోనే రాజకీయ వ్యవస్థ నడుస్తోంది. ఇప్పుడు మూడో పార్టీని తీసుకురావడమంటే గందరగోళాన్ని సృష్టించడమే'' అని అన్నారు. తర్వాత తన సొంత సామాజిక మాధ్యమం 'ట్రూత్ సోషల్'లోనూ మస్క్‌ను విమర్శిస్తూ ట్రంప్ పోస్ట్‌లు పెట్టారు. ''కొన్ని వారాల క్రితం మా స్నేహ రైలుబండ్లు ఢీకొన్నాయి. ఇప్పుడు మస్క్ పూర్తిగా పట్టాలు తప్పారు. అమెరికాలో మూడో పార్టీ ఏదీ అద్భుతాలు చేయలేదన్న చేదు నిజం తెల్సికూడా మస్క్ కొత్త పార్టీ పెడతానంటున్నాడు. సక్రమంగా ఉన్న రాజకీయ వ్యవస్థను చిన్నాభిన్నం చేయడానికి తప్ప మూడోపార్టీ ఎందుకూ పనికిరాదు'' అని వ్యాఖ్యానించారు.



ఐఎస్ఎస్ నుంచి ఫొటోలు తీస్తున్న శుభాంశు

ఇస్రో చీఫ్‌కు శుభాంశు ఫోన్

న్యూఢిల్లీ: యాక్జియం–4 మిషన్‌లో భాగంగా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం(ఐఎస్ఎస్)కు చేరుకున్న భారతీయ వ్యోమగామి శుభాంశు శుక్లా సోమవారం ఇస్రో చైర్మన్ డాక్టర్ వి.నారాయణన్‌తో ఫోన్‌లో మాట్లాడారు. శుభాంశు యోగ క్షేమాలను, నిర్వహిస్తున్న ప్రయోగాలను ఇస్రో చైర్మన్ అడిగి తెల్సుకున్నారు. ప్రయోగాలు, కార్యకలాపాలను పూర్తి స్థాయిలో రికార్డు చేయడం ఎంతో అవసరమని చెప్పారు. భవిష్యత్తులో ఇస్రో చేపట్టే మానవ సహిత అంతరిక్ష యాత్రకు, గగన్‌యాన్ కార్యక్రమానికి ఇవెంతో కీలకమని ఇస్రో చైర్మన్ నారాయణన్ అన్నారు. ఈ సందర్భంగా ఇస్రోలోని వివిధ విభాగాల చీఫ్‌లు కూడా శుభాంశుతో మాట్లాడారు.

డెలివరీ డేట్‌ను ప్లాన్ చేసుకుంటే పుట్టే పిల్లలకు లుకేమియా ముప్పు

కొత్త అధ్యయనంలో వెల్లడి

న్యూఢిల్లీ: తల్లీబిడ్డను కాపాడేందుకు అప్పటికప్పుడు చేసే సీ–సెక్షన్(కోత) ఆపరేషన్‌తో పోలిస్తే ముందస్తుగా ఒక తేదీ అనుకుని ప్లాన్‌చేసి ఆపరేషన్ చేయించిన సందర్భాల్లో పుట్టిన చిన్నారులకు రక్త క్యాన్సర్ (లుకేమియా) ముప్పు అధికంగా ఉంటుందని తాజా అధ్యయనంలో తేలింది. బిడ్డ డెలివరీ సాధ్యంకాక ప్రసవవేదనతో ఇబ్బందిపడుతున్న గర్భిణికి మాత్రమే గతంలో సీ–సెక్షన్ విధానంలో కోతపెట్టి ఆపరేషన్ చేసేవారు. తదనంతరకాలంలో మంచిరోజు చూసుకుని, మరికొందరు తమకు వీలున్నప్పుడు, మరికొందరు సెలవుతేదీ ఇలా వేర్వేరు కారణాలతో డెలివరీ తేదీని ప్లాన్‌చేసుకునే ధోరణి ఎక్కువైంది. ఇలా ప్లాన్డ్ సిజేరియన్ సెక్షన్ ఆపరేషన్ ద్వారా పుట్టిన చిన్నారులు భవిష్యత్తులో లుకేమియా వ్యాధి బారిన పడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని కరోలిన్‌స్కా ఇన్‌స్టిట్యూట్ పరిశోధకులు చెప్పారు. సంబంధిత పరిశోధన తాలూకు వివరాలు 'ది ఇంటర్నేషనల్ జర్నల్ ఆఫ్ క్యాన్సర్'లో ప్రచురితమయ్యాయి. స్వీడన్‌లో మెడికల్ బర్త్ రిజిస్టర్ గణాంకాల ద్వారా సేకరించిన 1982–89, 1999–2015 కాలాల్లో జన్మించిన 25 లక్షల మంది చిన్నారుల ఆరోగ్య రికార్డులను విశ్లేషించి ఈ అధ్యయన నివేదికను రూపొందించారు. వీరిలో 3.75 లక్షల మంది అంటే 15.5 శాతం మంది సీ–సెక్షన్ ద్వారా జన్మించారు. వీరిలో 1,495 మందికి లుకేమియా వ్యాధి సోకింది. సహజ ప్రసవం ద్వారా పుట్టిన చిన్నారులతో పోలిస్తే సీ–సెక్షన్ ద్వారా జన్మించిన పిల్లల్లో అత్యత తీవ్రమైన లింఫోబ్లాస్టిక్ లుకేమియా వ్యాధి బారిన పడే అవకాశాలు ఎక్కువ అని కరోలిన్‌స్కా ఇన్‌స్టిట్యూట్‌లో పరిశోధకురాలు, ఈ పరిశోధనలో కీలక రచయిత క్రిస్టినా ఇమోర్ఫియా క్యాంపిస్టీ చెప్పారు. సహజ ప్రసవ సమయంలో ఒక్కోసారి ఉమ్మనీరు సంచి పగలిపోయి శిశువు బయటికొచ్చే వేళ యోని బ్యాక్టీరియా అంటుకుంటుంది. ఈ బ్యాక్టీరియా సోకడం పుట్టినబిడ్డకు ఎంతో మంచిదని సైన్స్ చెబుతోంది. తొలినాళ్లలోనే బ్యాక్టీరియా సోకడంతో భవిష్యత్తులో మంచి, చెడు బ్యాక్టీరియాల మధ్య తేడాలను గుర్తించడం, భవిష్యత్తులో అలర్జీలు, ఆటోఇమ్యూన్ వంటి సమస్యలు రావని, చిన్నారుల పేగుల్లో మంచి బ్యాక్టీరియా పెరుగుదల బాగుంటుందని ఇప్పటికే పలు పరిశోధనలు చెబుతున్నాయి.

రష్యా మంత్రి ఆత్మహత్య

సస్పెన్షన్‌కు గురైన గంటల్లోనే ఘటన

మాస్కో: ఉక్రెయిన్ డ్రోన్ దాడుల కారణంగా గత వారం రాజధాని మాస్కోతోపాటు, సెయింట్ పీటర్స్‌బర్గ్ తదితర ప్రాంతాల్లోని విమానాశ్రయాల్లో వందలాది విమానాలు రద్దయ్యాయి. కొన్ని ఆలస్యంగా నడిచాయి. వేలాదిగా ప్రయాణికులు గంటలపాటు విమానాశ్రయాల్లో వేచి ఉండాల్సి వచ్చింది. ఈ నేపథ్యంలో అధ్యక్షుడు పుతిన్ సోమవారం రవాణా శాఖ మంత్రి రొమాన్ స్టరొవోయ్(53)ను సస్పెండ్ చేశారు. డిప్యూటీ మంత్రి ఆంద్రీ నికిటిన్‌కు రవాణా శాఖ బాధ్యతలను తాత్కాలికంగా అప్పగిస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఇందుకు కారణాలను మాత్రం వెల్లడించలేదు. ఇది జరిగిన కొద్ది గంటల్లోనే స్టరొవోయ్ తన నివాసంలో తుపాకీ గాయాలతో విగతజీవిగా కనిపించారు. ఆయన ఆత్మహత్యకు పాల్పడి ఉండొచ్చని భావిస్తున్నారు. 2024 మేలో రవాణా శాఖ మంత్రిగా స్టరొవోయ్ బాధ్యతలు చేపట్టారు.

సాక్షి హైదరాబాద్

మంగళవారం ॥ 8 ॥ జూలై ॥ 2025



వీసా ముగిసినా సిటీలోనే తిష్ట!

వివిధ రకాల వీసాలపై వచ్చి, వాటి గడువు ముగిసినా ఇక్కడే తిష్టవేసి.. డ్రగ్స్ దందా చేస్తున్న నలుగురు విదేశీయులను హెచ్–న్యూ అధికారులు తిప్పి పంపించారు.

-8లో



అందమైన 'ప్లాస్టిక్ సిటీ'..

హైదరాబాద్ అందమైన సిటీ.. ప్రపంచ ఖ్యాతి గడించిన భాగ్యనగరం.. ఇదంతా నగరానికి ఒకవైపు మాత్రమే.. మరోవైపు ప్లాస్టిక్ భూతం గుప్పిట్లో చిక్కుకుపోతోంది.

- సిటీప్లస్‌లో

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 32.0/23.0

నగరంలో మంగళవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. చిరుజల్లులు కురిసే అవకాశముంది. గరిష్ఠంగా 32, కనిష్ఠంగా 23 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయని అంచనా.



అది మస్లింజంగ్ పూల్.. వెనకవైపు సిటీ కాలేజీ.. గుంపులు గుంపులుగా రివ్వురివ్వుమంటూ ఎగిరే పావురాలు. ఇంకేం.. పలు ప్రాంతాలకు చెందినవారు కుటుంబ సభ్యులతో ఇక్కడికి వచ్చి కపోతాల మధ్య ఫొటోలు, వీడియోలు తీసుకుంటూ ఉంటారు. ఆ జ్ఞాపకాలను మదిలో పదిలంగా దాచుకుంటారు. సోమవారం ఓ యువతి పావురాల మధ్య మురిసిపోతూ.. మైమరిచిపోతూ ఫొటోకు ఇలా పోజులిస్తూ కనిపించింది.

ఎగిరే పావురమా.. ఎదలో జ్ఞాపకమా!

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరిచందన



గాంధీ, ఉస్మానియా ఆస్పత్రుల్లో మౌలిక సదుపాయాలు కల్పించండి

కలెక్టర్ హరిచందన

సాక్షి, సిటీబ్యూరో: గాంధీ, ఉస్మానియా ఆస్పత్రుల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రణాళికలు సిద్ధం చేయాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందన అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉస్మానియా, గాంధీ ఆస్పత్రుల్లో కల్పిస్తున్న వసతులు, సదుపాయాలపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయా ఆస్పత్రుల్లో మౌలిక సదుపాయాలు, సమస్యలు, వైద్య సిబ్బంది కొరత తదితర అంశాలపై చర్చించారు. వైద్యులు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, బోధన, బోధనేతర సిబ్బంది, ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ సిబ్బంది నియామకాలపై చర్చించారు. ఈ సందర్భంగా హరిచందన మాట్లాడుతూ.. మెడికల్ కాలేజీ మానిటరింగ్ కమిటీని ఏర్పాటు చేయాలని సూచించారు. గాంధీ ఆస్పత్రిలో నీటి సమస్యను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన టీచింగ్ స్టాఫ్ పోస్టులు భర్తీ చేయాలన్నారు. సమాశంలో అదనపు కలెక్టర్ ముకుంద రెడ్డి, ఇన్‌చార్జి డీఆర్‌ఓ శ్రీధర్, ఆర్‌డీఓలు రామకృష్ణ, సాయిరాం, డీఎంహెచ్‌ఓ వెంకటి, ఉస్మానియా ఆస్పత్రి అదనపు డీఎంఈ డా.వాణి, గాంధీ ఆస్పత్రి పర్యవేక్షకులు రాకేష్, డా. కె.ఇందిర, డా.రాజారావు, డా.రాజ్‌కుమార్, శేషాద్రి, బి.సునీతాబాయి, జయకృష్ణ పాల్గొన్నారు.

పలు మార్గాల్లో ప్రత్యేక రైళ్లు

సాక్షి, సిటీబ్యూరో: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా పలు మార్గాల్లో ప్రత్యేక రైళ్లను నడుపనున్నట్లు దక్షిణమధ్య రైల్వే సీపీఆర్వో శ్రీధర్ తెలిపారు. ఈ మేరకు సికింద్రాబాద్–అర్సికేరే (07079/ 07080) ప్రత్యేక రైలు ఈ నెల 13 నుంచి ఆగస్టు 31 వరకు ప్రతి ఆదివారం సాయంత్రం 6.05 గంటలకు బయలుదేరి మరుసటి రోజు మధ్యాహ్నం 12.45 గంటలకు చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో ఈ నెల 14 నుంచి సెప్టెంబర్ 1 వరకు ప్రతి సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు అర్సికేరేలో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 7.45 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది. హైదరాబాద్–అర్సికేరే (07069/ 07070) స్పెషల్ ట్రైన్ ఈ నెల 8 నుంచి ఆగస్టు 26 వరకు ప్రతి మంగళవారం సాయంత్రం 7.20 గంటలకు బయలుదేరి మరుసటి రోజు మధ్యాహ్నం 12.45కు చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో ఈ నెల 9వ తేదీ నుంచి ఆగస్టు 27 వరకు ప్రతి బుధవారం మధ్యాహ్నం 2గంటలకు అర్సికేరే నుంచి బయలుదేరి మరుసటి రోజు ఉదయం 7.50 గంటలకు హైదరాబాద్ చేరుకుంటుంది. కాచిగూడ–తిరుపతి (07676) స్పెషల్ ట్రైన్ ఈ నెల 8వ తేదీ రాత్రి 11.30 గంటలకు బయలుదేరి మరుసటి రోజు మధ్యాహ్నం 12.30 గంటలకు తిరుపతికి చేరుకుంటుంది.

హకీంపేట్ స్పోర్ట్స్ స్కూల్‌కు సిటీ బస్సు పునరుద్ధరణ

సాక్షి, సిటీబ్యూరో: హకీంపేట్‌లోని తెలంగాణ క్రీడల పాఠశాలకు సిటీబస్సును పునరుద్ధరించారు. ప్రయాణికుల ఆదరణ లేకపోవడంతో ఆర్టీసీ అధికారులు ఈ రూట్‌లో సిటీబస్ సర్వీసులను గతంలో నిలిపివేశారు. దీంతో స్పోర్ట్స్ స్కూల్ రోయింగ్ విద్యార్థి క్రీడాకారులు ప్రతిరోజు హుస్సేన్‌సాగర్‌కు వచ్చి ప్రాక్టీస్ చేసుకోవడం కష్టంగా మారింది. దీన్ని దృష్టిలో ఉంచుకొని క్రీడాశాఖ మంత్రి వాకిటి శ్రీహరి సిటీ బస్సును పునరుద్ధరించాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. దీంతో బస్సును తిరిగి అందుబాటులోకి తెచ్చారు. ఈ బస్సు ప్రతిరోజూ ఉదయం 5 గంటలకు స్పోర్ట్స్ స్కూల్ నుంచి ప్రారంభమై హుస్సేన్ సాగర్ వాటర్ స్పోర్ట్స్ ట్రైనింగ్ సెంటర్ రోయింగ్ వద్దకు చేరుకొంటుంది. శిక్షణ అనంతరం తిరిగి ఉదయం 9:30 గంటలకు పాఠశాలకు వెళ్తుంది. అయిదేళ్ల క్రితం స్పోర్ట్స్ స్కూల్‌కు చెందిన బస్సు పాడైపోయింది. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఇటీవల క్రీడా శాఖ మంత్రి హకీంపేట్ స్పోర్ట్స్ స్కూల్ ను సందర్శించారు. పలువురు విద్యార్థులతో పాటు స్పోర్ట్స్ స్కూల్ అధికారులు ఈ సమస్యను మంత్రి దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. ఈ మేరకు ఆర్టీసీ బస్సు సర్వీసులను పునరుద్ధరించింది.

వ్యసనాలకు యువత దూరంగా ఉండాలి

హైదరాబాద్ కలెక్టర్

కవాడిగూడ: యువత డ్రగ్స్, గంజాయి వంటి వ్యసనాలకు దూరంగా ఉండాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందన సూచించారు. సోమవారం దోమలగూడ గగన్ మహల్ ఏవీ కళాశాలలో నిర్వహించిన 'స్టూడెంట్ సేఫ్టీ క్లబ్ ఇన్షియేటివ్ స్ట్రాంగ్ మైండ్స్ సేఫ్ చాయిస్' అనే సదస్సులో హరిచందన మాట్లాడారు. విద్యార్థులు లక్ష్య సాధనలో దృఢ సంకల్పాన్ని కలిగి ఉండాలని సూచించారు. జీవితంలో ఎదిగే అవకాశాలను అందిపుచ్చుకోవడంలో అనుక్షణం అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో సెంట్రల్ జోన్ డీసీపీ శిల్పవల్లి, ఏవీ కళాశాల పీజీ డైరెక్టర్ డాక్టర్ గోపికృష్ణ, ప్రిన్సిపాల్ సీహెచ్ రాజలింగం, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి. పద్మ, యాంటీ డ్రగ్స్ కమిటీ కో- కన్వీనర్ రిషితారెడి, నార్కోటిక్ సెంట్రల్ బ్యూరో అధికారి ఆశిష్ చక్రవర్తి, గాంధీనగర్ ఏసీపీ యాదగిరి, దోమలగూడ, సీఐ శ్రీనివాస్ రెడ్డి, ఎస్ఐలు శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

కొత్త మెట్రో రైళ్లకు గ్రీన్ సిగ్నల్

త్వరలో బీఈఎంఎల్‌తో ఎల్‌అండ్‌టీ ఒప్పందం

- 18 నెలల వ్యవధిలో కొత్త రైళ్లు పట్టాలెక్కేలా చర్యలు
- 3 రూట్లలో 10 మెట్రోలను ప్రవేశపెట్టేందుకు ప్రతిపాదనలు
- ప్రస్తుతం 5 లక్షలు దాటిన ప్రయాణికుల సంఖ్య



రూ.650 కోట్లకు పైగా వ్యయం..

సాక్షి, సిటీబ్యూరో: కొత్త మెట్రో రైళ్లకు ఎల్‌అండ్‌టీ కసరత్తు చేపట్టింది. ఈ మేరకు మెట్రోరైళ్ల తయారీ సంస్థ భారత్ ఎర్త్‌మూవర్స్ లిమిటెడ్ (బీఈఎంఎల్)తో త్వరలో ఒప్పందం కుదుర్చుకోనుంది. బీఈఎంఎల్ సంస్థ ఇప్పటికే మెట్రోలను తయారు చేసి పలు నగరాలకు అందజేస్తున్న దృష్ట్యా ఆ సంస్థతోనే ఒప్పందం చేసుకొనే అవకాశం ఉంది. గతంలో మొదటి దశ రైళ్లను కొరియా నుంచి తెప్పించిన సంగతి తెలిసిందే. బెంగళూరు కేంద్రంగా నెలకొలిన బీఈఎంఎల్‌తో పాటు మరికొన్ని తయారీ సంస్థలు కూడా ఈ రంగంలో పని చేస్తున్నాయి. ఈ మేరకు వివిధ సంస్థల సాంకేతిక సామర్థ్యం, నైపుణ్యం, అనుభవం తదితర అంశాలను దృష్టిలో ఉంచుకొని ఎల్‌అండ్‌టీ ఒప్పందం కుదుర్చుకోనుంది. ఈ క్రమంలో బీఈఎంఎల్‌తోనే ఒప్పందానికి ఎక్కువ అవకాశాలు ఉన్నట్లు అధికారులు తెలిపారు. 18 నెలల కాలవ్యవధిలో మెట్రోలను తయారు చేసి అందజేసేలా ఈ సంస్థతో ఒప్పందం ఏర్పాటు చేసుకోనున్నారు. ప్రస్తుతం 3 రూట్లలో 57 మెట్రోలు తిరుగుతున్నాయి. ప్రయాణికుల రద్దీ మేరకు కొత్తగా మరో 10 రైళ్లను కొనుగోలు చేసేందుకు ఎల్‌అండ్‌టీ మెట్రో రైల్ దృష్టి సారించింది.

చార్జీల పెంపుతో సదుపాయాలపై దృష్టి..

ప్రయాణికుల రద్దీ మేరకు నాగ్‌పూర్ మెట్రో రైళ్లను లీజుకు తీసుకోవాలని మొదట్లో ప్రతిపాదించారు. కానీ సాంకేతిక కారణాలతో అది సాధ్యం కాలేదు. ఆ తర్వాత సొంతంగానే కొనుగోలు చేసేందుకు ఎల్‌అండ్‌టీ కార్యాచరణ చేట్టింది. 2023లోనే ఈ మేరకు ప్రణాళికలను సిద్ధం చేశారు. భారత్ ఎర్త్‌మూవర్స్ లిమిటెడ్ సంస్థతో గతంలో సంప్రదింపులు కూడా జరిగాయి. భారీ నష్టాల కారణంగా వెనుకంజ వేశారు. నష్టాలను భర్తీ చేసుకొనేందుకు ప్రభుత్వ ఆమోదంతో ఇటీవల మెట్రో చార్జీలను పెంచిన సంగతి తెలిసిందే. ఇందుకనుగుణంగా సదుపాయాలపై తాజాగా దృష్టి సారించినట్లు అధికారులు తెలిపారు. ఇందులో భాగంగానే కొత్త రైళ్ల కొనుగోళ్ల కోసం కసరత్తు చేపట్టారు.

రూ.650 కోట్లకు పైగా వ్యయం..

ప్రస్తుతం నాగోల్ నుంచి రాయదుర్గం, ఎల్‌బీనగర్ నుంచి మియాపూర్, జేబీఎస్ నుంచి ఎంజీబీఎస్ కారిడార్‌లలో ప్రతిరోజూ 57 రైళ్లు సుమారు 1,050 ట్రిప్పులు తిరుగుతున్నాయి. ప్రతి 3 నిమిషాలకు ఒకటి చొప్పున రాకపోకలు సాగిస్తున్నాయి. రోజుకు 5 లక్షల మందికి పైగా ప్రయాణం చేస్తున్నారు. ఈ క్రమంలో ప్రయాణికులకు మెరుగైన సదుపాయాలను కల్పించేందుకు అదనపు ప్లాట్‌ఫాంలను ఏర్పాటు చేయడం, డిజిటల్ సేవల విస్తరణ, లాస్ట్ మైల్ కనెక్టివిటీ పెంపు తదితర సేవలపై ఎల్‌అండ్‌టీ దృష్టి సారించింది. ఇందులో భాగంగానే కొత్త రైళ్లను కొనుగోలు చేయాలని భావిస్తోంది. ఇందుకోసం రూ.650 కోట్లకు పైగా ఖర్చు కానున్నట్లు అంచనా. ఒక్కో ట్రైన్‌కు రూ.60 కోట్ల నుంచి రూ.70 కోట్ల వరకు ఖర్చవుతుందని అధికారులు పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రతి 3 నిమిషాలకు ఒక ట్రైన్ నడుస్తోంది. కోచ్‌ల సంఖ్యను పెంచడంతో స్టేషన్‌ల మధ్య రైళ్లు నిలిచిపోయే అవకాశం ఉంటుంది. ఈ సాంకేతిక ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొనే అదనపు కోచ్‌లకు బదులు కొత్త రైళ్లనే కొనుగోలు చేయాలని నిర్ణయించారు.

తప్పనిసరి కావడంతో..

మరోవైపు రెండో దశ మెట్రో విస్తరణ దృష్ట్యా కూడా ప్రస్తుతం ఉన్న రూట్లలో రైళ్ల సంఖ్యను పెంచడం అనివార్యం. రెండో దశలో ప్రతిపాదించిన ఐదు కారిడార్‌లలో మెట్రో సేవలు అందుబాటులోకి వస్తే ప్రయాణికుల సంఖ్య 15 లక్షలకు చేరుకొనే అవకాశం ఉంది. నగరంలోని వివిధ మార్గాల్లో మెట్రో మొదటిదశ మార్గాల్లోనే ప్రయాణికులు రెండో దశ కారిడార్‌లలో రాకపోకలు సాగిస్తారు. ఆ రకంగా కూడా కొత్త రైళ్లు తప్పనిసరి. మొదటి,రెండో దశ మెట్రోల నిర్వహణపై, ప్రయాణికుల సంఖ్య, చార్జీల పంపకాలు, విద్యుత్ వినియోగ వ్యయం వంటి అంశాలపైనా ఎల్‌అండ్‌టీ, హైదరాబాద్ మెట్రో రైల్ మధ్య తప్పనిసరిగా ఒప్పందం ఉంటుందని అధికారులు తెలిపారు.


కుర్రకారు.. తగ్గాలి జోరు!

ర్యాష్ డ్రైవింగ్ ప్రమాదాలకు నో ఇన్సూరెన్స్

- 'కర్ణాటక కేసు'లో స్పష్టం చేసిన సుప్రీం కోర్టు
- ఇలాంటి ఉల్లంఘనలకు పాల్పడేది యువకులే
- అవగాహన కల్పించేందుకు పోలీసుల నిర్ణయం

నగరంలో నమోదైన లైఫ్ ఎన్‌డేంజరింగ్ వైలేషన్స్

ఉల్లంఘన	2023	2024
డ్రంక్ డ్రైవింగ్	43,940	52,080
డేంజరస్ డ్రైవింగ్	88,348	52,917
రాంగ్ సైడ్ డ్రైవింగ్	54,6115	4,05,756
ట్రిపుల్ రైడింగ్	1,28,254	1,38,313
మైనర్ డ్రైవింగ్	1,878	2,976
ఎక్స్‌ట్రా ప్యాసింజర్స్	5,741	10,364
విథౌట్ హెల్మెట్	19,29,698	22,74,662
విథౌట్ సీట్‌బెల్ట్	21,943	19,254
సిగ్నల్ జంపింగ్	76,140	95,433
సెల్‌ఫోన్ డ్రైవింగ్	58,056	78,108



సాక్షి, సిటీబ్యూరో:

ట్రాఫిక్ ఉల్లంఘనలకు పాల్పడితే చలాన్ జారీ అవుతుంది.. తీవ్రమైన వాటికి డ్రైవింగ్ లైసెన్స్ సస్పెండ్ చేస్తారు... ఉల్లంఘనతో పాటు సాధారణ నేరానికి పాల్పడితే లైసెన్స్ రద్దు అవుతుంది... ఇప్పటి వరకు జరిగింది ఇదే. అయితే.. గత వారం సుప్రీం కోర్టు ఇచ్చిన ఆదేశాల ప్రకారం నిర్లక్ష్యంగా వాహనం నడుపుతూ ప్రమాదానికి గురైతే ఇన్సూరెన్స్ పొందడానికి అర్హత ఉండదు. దీన్ని దృష్టిలో పెట్టుకుని వాహన చోదకులు ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటించాలని హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు సూచిస్తున్నారు. ఇలాంటి ఉల్లంఘనలకు పాల్పడే వారిలో యువకులే ఎక్కువగా ఉంటున్నారని స్పష్టం చేస్తున్నారు.

కర్ణాటక కేసులో ఇలాంటి తీర్పు..

కర్ణాటకలోని చిక్కబల్లాపూర్ జిల్లాకు చెందిన ఎన్ఎస్ రవీశ 2014 జూన్ 18న తన భార్య, పిల్లలు, తండ్రి, సోదరుడితో కలిసి మల్లసంద్ర గ్రామం నుంచి అరిసకేరి పట్టణానికి వెళ్తున్నప్పుడు రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ దుర్ఘటనలో రవీశ చనిపోగా.. పోలీసుల దర్యాప్తులో కారును మితిమీరిన వేగంతో, నిర్లక్ష్యంగా నడిపినట్లు వెలుగులోకి వచ్చింది. పోలీసుల నివేదికను పరిగణనలోకి తీసుకున్న ఇన్సూరెన్స్ కంపెనీ.. రవీశకు సంబంధించిన బీమా మొత్తం చెల్లించడానికి నిరాకరించింది. తమకు రావాల్సిన రూ.80 లక్షలు ఇన్సూరెన్స్ మొత్తాన్ని ఇప్పించాలంటూ మృతుడి భార్య తదితరులు దాఖలు చేసిన పిటిషన్‌ను కర్ణాటక హైకోర్టు కొట్టేసింది. దీంతో సుప్రీం కోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేశారు. ర్యాష్ డ్రైవింగ్ చేసినందున బీమా మొత్తం చెల్లించాలని కంపెనీని ఆదేశించలేమని ధర్మాసనం స్పష్టం చేసింది.

యువతలోనే ఈ ధోరణి ఎక్కువ..

ట్రాఫిక్ విభాగం అధికారులు ఉల్లంఘనలను మూడు రకాలుగా విభజిస్తారు. వాహన చోదకుడి ప్రాణాల మీదికి తెచ్చేవి, ఎదుటి వ్యక్తి ప్రాణాల మీదికి తెచ్చేవి, వాహనచోదకుడితో పాటు ఎదుటి వ్యక్తి ప్రాణాల మీదికి తెచ్చేవి. మొదటి రెండింటి కంటే మూడో కోవకు చెందిన ఉల్లంఘనల్ని కట్టడి చేయడం పైనే అధికారులు ఎక్కువగా దృష్టి పెడుతుంటారు. 'లైఫ్ ఎన్‌డేంజరింగ్ వైలేషన్స్'గా పిలిచే ఈ ఉల్లంఘనలకు పాల్పడుతూ ప్రమాదాలకు గురై... ఆ విషయం పోలీసు దర్యాప్తులో వెలుగులోకి వస్తే ఇన్సూరెన్స్ సొమ్ము మొత్తం పొందడానికి అవకాశం ఉందని పోలీసులు స్పష్టం చేస్తున్నారు. ఇలాంటి ఉల్లంఘనలకు పాల్పడే వారిలో యువతే ఎక్కువగా ఉంటున్నారని వివరిస్తున్నారు. బీమా కంపెనీలు కేవలం అప్పటి వరకు చెల్లించిన ప్రీమియమ్స్ మొత్తాన్ని వడ్డీతో సహా ఇస్తాయని, ఎంత మొత్తానికి బీమా చేయించుకున్నారో అంతా ఇవ్వరనే విషయం దృష్టిలో పెట్టుకోవాలన్నారు.

మారిన పరిస్థితులు..

- రోడ్డు ప్రమాదాల విషయంలో పోలీసులు సైతం మానవతా దృక్పథంతో వ్యవహరిస్తుంటారు. కొన్ని రకాల ఉల్లంఘనలకు పాల్పడుతూ వాహన చోదకుడు మరణించినా... రికార్డుల్లో పొందుపర్చరు. మనిషి ఎలాగూ చనిపోయారని, కనీసం బీమా సొమ్ము అయినా వస్తే ఆ కుటుంబానికి కొంత చేదోడుగా ఉంటుందనే ఉద్దేశంతో ఇలా వ్యవహరిస్తుంటారు. ఒకప్పుడు కేవలం పోలీసు రికార్డుల ఆధారంగానే ఇన్సూరెన్స్ కంపెనీలు ముందుకు వెళ్లేవి.
- ప్రస్తుతం పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. భారీ మొత్తాలు చెల్లించాల్సి వచ్చినప్పుడు, కొన్ని సందేహాత్మక కేసుల్లో ఇన్సూరెన్స్ కంపెనీలు సైతం ప్రైవేట్ డిటెక్టివ్స్ సహాయం తీసుకుంటున్నాయి. దాదాపు ప్రతి చోటా అందుబాటులో ఉంటున్న సీసీ కెమెరాలు సైతం ఆయా కంపెనీలకు ఉపకరిస్తాయి. వీటిలో రికార్డు అయిన దృశ్యాలను ఆధారంగా చూపి ఇన్సూరెన్స్‌ను తిరస్కరించే అవకాశం ఉందని నిపుణులు చెప్తున్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని వీలున్నంతర వరకు ఉల్లంఘనలకు పాల్పడకపోవడమే ఉత్తమమని సూచిస్తున్నారు.

వరదలకు ముందే పూడికతీత

పనులు పూర్తి చేశామంటున్న జీహెచ్ఎంసీ



బంజారాహిల్స్ అహ్మద్‌నగర్ వద్ద

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో వానొస్తే రోడ్లు చెరువులు, కాలనీలు సరస్సులుగా కనిపించే దృశ్యాలు షరామామూలే. అందుకు ప్రధాన కారణం నాలాల్లో పేరుకుపోయిన పూడిక (వ్యర్థాలు) తొలగించకపోవడం. వర్షాకాలం వచ్చేదాకా నాలాల్లో పూడికతీత పనులు పూర్తికాకపోవడం వల్లే ముంపు సమస్యల ముప్పు పెరగడంతో ఈసారి పూడికతీత పనులు త్వరితగతిన పూర్తి చేసినట్లు జీహెచ్ఎంసీ అధికారులు చెబుతున్నారు. జూన్ ఆఖరు నాటికే నాలాల్లో పూడికతీత పనులు దాదాపు పూర్తయ్యాయని పేర్కొన్నారు. జూన్ 25వ తేదీ వరకే వివిధ జోన్లలో 90 శాతానికి పైగా పూడికతీత పనులు పూర్తయ్యాయని తెలిపారు. పూడికతీత పనుల కోసం టెండర్లు ఆలస్యంగా పిలిచినప్పటికీ, ఎప్పటికప్పుడు పర్యవేక్షణతో పనులు త్వరగా పూర్తయ్యేలా చర్యలు చేపట్టినట్లు జీహెచ్ఎంసీ చీఫ్‌ఇంజినీర్ (మెయింటెనెన్స్) సహదేవ్ రత్నాకర్ తెలిపారు.




చింతల్‌బస్తీ వద్ద

ప్రజల ఫిర్యాదులు

అధికార యంత్రాంగం పనులు పూర్తిచేశామంటున్నా.. ప్రజలు మాత్రం చాలా ప్రాంతాల్లో పూడికతీత పనులు ఇంకా పూర్తి కాలేదంటున్నారు. ఇదే విషయాన్ని అధికారుల దృష్టికి తేగా, పూడికతీత జరిగాక సైతం నాలాల్లో వ్యర్థాలు వేస్తుంటారని, ప్రజలు అవగాహనతో నాలాల్లో వ్యర్థాలు వేయకుండా ఉండేంత వరకు ఇలాంటి సమస్యలు తప్పవన్నారు. ఓవైపు పూడిక తీస్తుంటే, మరోవైపు వ్యర్థాలు వేస్తుంటే నాలాలు పూర్తి క్లీన్‌గా ఉండటం సాధ్యమయ్యే పని కాదన్నారు.



కామాటిపురాలో పూడిక తీయకముందు



పూడిక తీశాక

జూన్ 25నాటికి జోన్లవారీగా పూడికతీత ఇలా..

జోన్	పనులు	టార్గెట్ (కి.మీ.)	పనులు పూర్తి (కి.మీ.)	శాతం
ఎల్‌బీనగర్	5	104.394	100.242	96.02
చార్మినార్	85	387.755	355.310	91.63
ఖైరతాబాద్	61	181.11	163.23	90.13
శేరిలింగంపల్లి	7	70.161	62.147	88.58
కూకట్‌పల్లి	6	103.287	99.271	96.11
సికింద్రాబాద్	39	100.203	93.252	93.06
మొత్తం	203	946.91	873.452	92.24

పనులకు రూ.54 కోట్లు

ఈసారి పూడికతీత పనుల అంచనా వ్యయం రూ. 55.04 కోట్లు. ప్రతి యేటా జీహెచ్ఎంసీ దాదాపు రూ. 50కోట్లతో ఈ పనులు చేస్తోంది.



ఓల్డ్ మలక్‌పేట్ వద్ద..

లైంగిక దాడి కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు


అఖిల్

చాదర్‌ఘాట్: లైంగిక దాడి కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు, రూ. 5వేలు జరిమానా విధిస్తూ న్యాయస్థానం సోమవారం తీర్పు ఇచ్చింది. చాదర్‌ఘాట్ పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఓల్డ్‌మలక్‌పేటలో నివసించే జనపాల అఖిల్ కార్ వాషర్‌గా పని చేసేవాడు. ప్రేమ పేరుతో ఓ బాలికను నమ్మించి పలుమార్లు లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాలిక గర్భం దాల్చడంతో ఆమె తల్లి చాదర్‌ఘాట్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. కేసు పూర్వాపరాలు విచారించిన 12వ అదనపు సెషన్స్ జడ్జి టి.అనిత నిందితుడి పై విధంగా శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

IFCI VENTURE
IFCI వెంచర్ క్యాపిటల్ ఫండ్స్ లిమిటెడ్

నమోదిత కార్యాలయం : IFCI టవర్, 61, నెహ్రూ ప్లేస్, న్యూఢిల్లీ-110019
ఫోన్: డైరెక్ట్ (+91)(11) 41732693/23/90
ఫ్యాక్స్: (+91)(11) 2645 33481
ఇ మెయిల్ : legal@ifciventure.com
CIN: U65993DL1988GOI030284

అనుబంధం-IV-A
[రూల్ 8(6) నిబంధన చూడండి]

స్థిరాస్తుల అమ్మకం కొరకు అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్(ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8(6) నిబంధనతో చదువబడే సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం అమ్మకం ప్రకటన.

సెక్యూర్డ్ క్రెడిటార్‌కి తనఖాపెట్టిన/చార్జ్‌చేసిన, IFCI వెంచర్ క్యాపిటల్ ఫండ్స్ లిమిటెడ్ అధీకృత అధికారి, సెక్యూర్డ్ క్రెడిటార్ 25.11.2019న భౌతికపరమైన స్వాధీనం చేసుకోబడిన దిగువ వివరించిన స్థిరాస్తి, సునీల్ హైటెక్ ఇంజినీర్స్ లిమిటెడ్ (మూసివేతలో ఉన్నది), రుణగ్రహీత మరియు తనఖాదారుల నుండి IFCI వెంచర్ క్యాపిటల్ ఫండ్స్ లిమిటెడ్, సెక్యూర్డ్ క్రెడిటార్‌కు చెల్లించాల్సిన బకాయి మొత్తం **20 ఫిబ్రవరి, 2019 నాటికి రూ. 22,44,68,507/-** (ఇరవై రెండు కోట్ల నలభై నాలుగు లక్షల అరవై ఎనిమిది వేల ఐదు వందల ఏడు రూపాయలు మాత్రమే) తోపాటు పూర్తిగా రాబట్టుకొనేంత వరకు కాంట్రాక్చువల్ రేట్ల వంతున వడ్డీ మరియు తదుపరి వడ్డీ & ఇతర ఖర్చులు రాబట్టుకొనుట కొరకు 25.07.2025న "ఎక్కడ ఎలా ఉన్నది అలా", "ఏది ఉంటే అది" మరియు "అక్కడ ఏమున్నదో అది" ప్రాతిపదికపై విక్రయించబడునని సాధారణ ప్రజలకు మరియు ముఖ్యంగా రుణగ్రహీతలు, తనఖాదారు(లు) మరియు గ్యారంటార్(లు)కు ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమైనది. రిజర్వు ధర మరియు బయానా (EMD) తోపాటు ఆస్తి వివరాలు దిగువ తెలుపబడినవి :

ఆస్తి : తనఖాదారులకు చెందిన, తెలంగాణా, జిల్లా-రంగారెడ్డి, మండలం-శంషాబాద్, గ్రామం-శంషాబాద్ లోగల భూమి యొక్క వివరాలు దిగువ విధంగా ఉన్నవి :

సర్వే నం.	విస్తీర్ణం	రిజర్వు ధర (రూపాయల్లో)	బయానా (రూపాయల్లో)	వేలం తేదీ & సమయం
260/28, 260/50/1, 260/28/AA	15 ఎకరాలు 22 గుంటలు	6,22,00,000/-	62,20,000/-	25.07.2025న మ.2.00 గం. నుండి మ. 3.00 గం.

ఆస్తి కొరకు బిడ్ మొత్తం దాఖలు చేయుటకు చివరి తేదీ 23.07.2025న సా. 4.00 గం.వరకు. తదుపరి, పైన తెలిపిన ఆస్తి (ఆస్తులు) వివరాలు మరియు అమ్మకం యొక్క నియమ, నిబంధనలు IFCI వెంచర్ వెబ్‌సైట్ అనగా www.ifciventure.comలో లభించే బిడ్డరు డాక్యుమెంటులో తెలుపబడినవి. ఇ-వేలం పైన తెలిపిన తేదీ మరియు సమయానికి ఆక్షన్ టైగర్ ప్లాట్‌ఫారం అనగా https://ifciventure.auctiontiger.netలో నిర్వహించబడును. ఈ అమ్మకం ప్రకటనకు ఏదైనా అనుబంధం లేదా బయానా(EMD), డాక్యుమెంట్లు దాఖలు మరియు ఇ-వేలం కొరకు తేదీ పొడిగింపు IFCI వెంచర్ వెబ్‌సైట్‌లో Sale of assets సెక్షన్ క్రింద మాత్రమే ప్రచురించబడుతుంది మరియు తెలియజేయబడుతుందని గమనించగలరు. ఆసక్తిగల బిడ్డరు ముందస్తు అపాయింట్‌మెంట్‌తో ఆస్తిని సందర్శించవచ్చు. ఏదైనా విచారణ కొరకు, ఆసక్తిగల పార్టీలు అధీకృత అధికారి Ms. సీమా గోయల్, AGM గారిని 011-41732693, 41732623 మరియు 41732690పై సంప్రదించవచ్చు మరియు seema.goel@ifciventure.com & legal@ifciventure.com కు వ్రాయవచ్చు.

తేదీ : 08.07.2025
ప్రదేశం : న్యూఢిల్లీ

సం/- సీమా గోయల్
అధీకృత అధికారి,
IFCI వెంచర్ క్యాపిటల్ ఫండ్స్ లిమిటెడ్

అడుగుకో కబ్జా!



- రహదారులతో పాటు పార్కుల ఆక్రమణ
- ప్రజావాణి ద్వారా హైడ్రాకు 49 ఫిర్యాదులు

సాక్షి, సిటీబ్యూరో: ఇంటి ఎదురుగా రోడ్డు ఉంటే కలిపేసుకోవడం... పార్కు కనిపిస్తే ఆక్రమించేయడం... నాలాలు, కాలువ పైనే నిర్మాణాలు చేపట్టడం... చెరువులను పూడ్చేయడం ... ఇలా అనేక అంశాలపై హైడ్రాకు వరుస ఫిర్యాదులు అందుతున్నాయి. కమిషనర్ ఏవీ రంగనాథ్ సోమవారం నిర్వహించిన హైడ్రా ప్రజావాణిలో మొత్తం 49 ఫిర్యాదులు అందాయి. గాజులరామారం సిద్ధివినాయకనగర్‌లో 30 అడుగుల విస్తీర్ణంలో ఉన్న రహదారిని ఎదురుగా ఉన్న ప్లాట్ యజమానులు కబ్జా చేశారంటూ స్థానికులు ఫిర్యాదు చేశారు. ఏడు ఎకరాల మేర వేసిన ఈ లేఔట్‌లో 102 ప్లాట్లు ఉన్నాయని, అక్కడి రోడ్డునూ కబ్జా చేశారన్నారు. బోడుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని చెంగిచెర్లకు చెందిన చిన్న క్రాంతి కాలనీలో పార్కును కబ్జా చేశారని స్థానికులు ఫిర్యాదు చేశారు. సర్వే నం. 114, 118, 120, 121ల్లో దాదాపు 1800 గజాల పార్కు స్థలాన్ని అనధికారికంగా నకిలీ ప్లాట్ నంబర్లు వేసి ఆక్రమించారని ఆరోపించారు. తూముకుంట మున్సిపాలిటీ పరిధిలోని పోథాయపల్లి గ్రామంలో కొందరు వ్యక్తులు తమ ఇంటికి వెళ్లే రహదారిని కబ్జా చేశారంటూ బాధితులు హైడ్రాను ఆశ్రయించారు. అదే గ్రామానికి చెందిన కొందరు రహదారిపై అక్రమంగా గోడ నిర్మించారని పేర్కొన్నారు. శేరిలింగంపల్లి మండలం, కొండాపూర్ జూబ్లీ గార్డెన్ కాలనీలో ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాల కబ్జాలను వెంటనే ఆపాలని కాలనీవాసులు ఫిర్యాదు చేశారు. కొత్తగూడ సర్వే నెం.30లో 14 గుంటలు, సర్వే నెం. 29లో ఎకరం 2 గుంటల భూమి ప్రభుత్వానికి చెందినదిగా రికార్డుల్లో ఉంది. దీనికి కాంపౌండ్ వాల్‌ను గతంలో శేరిలింగంపల్లి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కూల్చేశారు. ఈ భూమిని రక్షించే చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరారు. పీర్జాదిగూడలోని 30 అడుగుల రహదారిని కబ్జా చేశారంటూ శ్రీ సాయి కాలనీ వాసులు ఫిర్యాదు చేశారు. అదే ప్రాంతంలోని పంచవటి కాలనీకి చెందిన కొందరు దానిని ఆక్రమిస్తూ రాకపోకలకు అంతరాయం కలిగిస్తున్నారని పేర్కొన్నారు.

సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో చోరీకి విఫలయత్నం

మియాపూర్: గుర్తుతెలియని వ్యక్తి బ్యాంక్‌లో చోరీకి యత్నించిన ఘటన మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. హాఫీజ్‌పేట్ ఇండస్ట్రీయల్ ఏరియాలో సెంట్రల్ బ్యాంకు ఆఫ్ ఇండియా మియాపూర్ బ్రాంచ్ ఉంది. సోమవారం తెల్లవారుజామున ఓ వ్యక్తి బ్యాంక్ గ్రౌండ్ ఫ్లోర్‌లోని గ్రిల్ గేట్ తాళాలు పగులగొట్టి లోపలికి వెళ్లాడు. మొదటి అంతస్తుకు చేరుకుని అక్కడ ఉన్న స్ట్రాంగ్ రూమ్ డోర్ ఓపెన్ చేసేందుకు ప్రయత్నించాడు. అంతలోనే బ్యాంక్ మానిటరింగ్ స్టేషన్ అలర్ట్ కావడంతో అతను అక్కడి నుంచి పరారయ్యాడు. దీంతో అప్రమత్తమైన బ్రాంచ్ హెడ్ విష్ణుప్రియ సమీపంలో ఉంటున్న బ్యాంకు ఉద్యోగి స్వర్ణకుమారికి సమాచారం అందించింది. దీంతో ఆమె మరో వ్యక్తితో కలిసి బ్రాంచ్ వద్దకు వెళ్లి చూడగా అప్పటికే బ్యాంకు మొదటి అంతస్తు, రెండో అంతస్తులో ఉన్న గ్రిల్ గేట్ తాళాలు పగులగొట్టి ఉండడం చూసి ఉన్నతాధికారులకు సమాచారం అందించింది. బ్రాంచ్ హెడ్ విష్ణుప్రియ ఫిర్యాదు మేరకు మియాపూర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

వీసా ముగిసినా సిటీలోనే తిష్ట!


వివరాలు వెల్లడిస్తున్న టాస్క్‌ఫోర్స్ డీసీపీ వైవీఎస్ సుధీంద్ర

- విలాసంగా బతకడానికి డ్రగ్స్ క్రయవిక్రయాలు
- నలుగురు విదేశీయులను పట్టుకున్న హెచ్-న్యూ
- వీరిలో నైజీరియా, టాంజానియా, సూడానీలు
- ఎఫ్ఆర్ఆర్ఓ సహకారంతో డిపోర్టేషన్ ప్రక్రియ

సాక్షి, సిటీబ్యూరో: వివిధ రకాలైన వీసాలపై వచ్చి, వాటి గడువు ముగిసినా ఇక్కడే తిష్టవేసి, అక్రమంగా నివసిస్తూ డ్రగ్స్ దందా చేస్తున్న నలుగురు విదేశీయులను హైదరాబాద్ నార్కొటిక్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ (హెచ్-న్యూ) అధికారులు డిపోర్టేషన్ విధానంలో బలవంతంగా తిప్పి పంపారు. ఈ నలుగురిలో ఇద్దరి పాస్‌పోర్ట్స్ కూడా కాలం చెల్లిపోయాయని, వీరిలో ఓ నైజీరియన్‌తో పాటు టాంజానియా, సూడాన్, సియెర్రా లియోన్ జాతీయులు ఉన్నట్లు టాస్క్‌ఫోర్స్ డీసీపీ వైవీఎస్ సుధీంద్ర పేర్కొన్నారు. ఇన్‌స్పెక్టర్ జీఎస్ డానియేల్, ఎస్సై సి.వెంకట రాములుతో కలిసి సోమవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు.

సియోర్రా లియాన్ పాస్‌పోర్టుతో...

నైజీరియాకు చెందిన వారు ఏ రకమైన వీసాపై వచ్చినా వారిపై నిఘా ఉంటుంది. మరోపక్క ఇక్కడ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతూ డిపోర్టేషన్ అయితే మళ్లీ తిరిగి రావడానికి ఆస్కారం ఉండదు. ఈ పరిణామాలను దృష్టిలో పెట్టుకున్న నైజీరియన్ మహిళ చైనాజీ నన్న వినియన్ కొత్త ఎత్తువేసింది. సియెర్రా లియోన్ దేశం నుంచి ఇబ్రహీం నియాషా యాస్మిన్ పేరుతో పాస్‌పోర్టు తీసుకుంది. దీని ఆధారంగా టూరిస్ట్ వీసా తీసుకుని 2020 ఫిబ్రవరి 12న ముంబై వచ్చింది. ఈ వీసా 2021 జనవరి 20, ఆమె పాస్‌పోర్టు 2023లో ఎక్స్‌పైర్ అయిపోయాయి. ప్రస్తుతం బెంగళూరులో ఉంటున్న ఆమె అక్కడి పెడ్లర్స్ నుంచి ఎండీఎంఏ డ్రగ్ ఖరీదు చేసి బంజారాహిల్స్‌లో నివసిస్తున్న టాంజానియన్ మ్వాజుమా అల్మాసీ మసిసిలాకు సరఫరా చేస్తోంది.

సూడానియన్‌తో కలిసి నగరంలో విక్రయం...

అల్మాసీ టూరిస్ట్ వీసాపై తొలిసారిగా 2017 నవంబర్ 21న ఢిల్లీ వచ్చి... 2018 అక్టోబర్ 18న తిరిగి వెళ్లింది. 2019 జనవరి 8న మరోసారి ఇలానే వచ్చి బంజారాహిల్స్‌లో తిష్టవేసింది. అదే ఏడాది నవంబర్ 5తో వీసా గడువు ముగిసినా ఇక్కడే ఉంటోంది. చైనాజీ నన్న వినియన్ నుంచి అందే ఎండీఎంఏను తన అనుచరుడైన అహ్మద్ హమీద్ అబు జబర్ హమీద్‌తో కలిసి విక్రయిస్తోంది. సూడాన్‌కు చెందిన హమీద్ 2022 ఫిబ్రవరి 28న స్టూడెంట్ వీసాపై వచ్చాడు. రాజస్థాన్‌లో మేవాట్ యూనివర్సిటీలో బీ-ఫార్మసీ కోర్సులో చేరినా... బంజారాహిల్స్‌లోనే ఉంటూ డ్రగ్స్ దందా చేస్తున్నాడు. వీరికి మాక్స్‌వెల్ ఆంథోనీ ఇజుచుక్వు జట్టు కట్టాడు. నైజీరియాకు చెందిన ఇతగాడు కిడ్నీ రోగిగా మెడికల్ వీసాపై 2014 సెప్టెంబర్ 24న ఢిల్లీ వచ్చాడు. పాస్‌పోర్టు, వీసా పదేళ్ల క్రితమే ఎక్స్‌పైర్ అయినా... బెంగళూరులో ఉంటూ బంజారాహిల్స్‌కు వచ్చిపోతున్నాడు.

ఫ్లాట్ అద్దె తెలిసి అనుమానిస్తే..

మ్వాజుమా అల్మాసీ మసిసిలా నగరంలో అక్రమంగా నివసిస్తున్నట్లు హెచ్-న్యూకు సమాచారం అందింది. దీంతో ఆమె ఫ్లాట్‌పై దాడి చేసిన పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ప్రాథమిక విచారణ నేపథ్యంలో ఆమె ఫ్లాట్ అద్దె నెలకు రూ.30 వేలని తెలిసింది. అంత డబ్బు ఎక్కడి నుంచి వస్తోందనే అనుమానంతో లోతుగా ఆరా తీసిన పోలీసులు డ్రగ్ దందా విషయం గుర్తించారు. మరో మూడు రోజులకు ఆమెను కలవడానికి వచ్చిన మిగిలిన ముగ్గురినీ పట్టుకుని అక్రమంగా నివసిస్తున్నట్లు గుర్తించారు. వీరివద్ద ఎలాంటి డ్రగ్స్ లభించకపోవడంతో డిపోర్టేషన్ చేయాలని నిర్ణయించారు. ఎఫ్ఆర్ఆర్ఓ సాయంతో 25 రోజుల్లో అవసరమైన ప్రక్రియ పూర్తి చేసి ఈ నలుగురిపై ఎమర్జెన్సీ ట్రావెల్ డాక్యుమెంట్ పొందారు. దీని సాయంతో మంగళవారం తెల్లవారుజామున వారి వారి దేశాలకు పంపించారు. ఈ నలుగురూ మళ్లీ ఇక్కడికి వచ్చే అవకాశం లేకుండా బ్లాక్ లిస్ట్‌లో పెట్టాలని ఎఫ్ఆర్ఆర్ఓను కోరారు.

సర్కార్ భూమి రక్షణకు చర్యలు ఎందుకు తీసుకోవడం లేదు?

ఉప్పర్‌పల్లి స్థలంపై రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు

సాక్షి, హైదరాబాద్: రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ మండలం, ఉప్పర్‌పల్లిలోని 2 ఎకరాల భూమి పరిరక్షణకు ఎందుకు చర్యలు చేపట్టడం లేదని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ప్రశ్నించింది. నాలుగు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని అధికారులను ఆదేశించింది. అక్కడి నుంచి రెండు వారాల్లో రిజాయిండర్ సమర్పించాలని పిటిషనర్‌కు స్పష్టం చేసింది. ఉప్పర్‌పల్లిలోని 2 ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమణలు, అనధికార నిర్మాణాల నుంచి రక్షించాలని కోరుతూ ఎర్రబోడ వీకర్ సెక్షన్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు పి. శ్రీధర్‌రెడ్డి ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేశారు. భూ రక్షణకు చర్యలు తీసుకోవాలని కోరుతూ అసోసియేషన్ వినతిపత్రాలు సమర్పించినా అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ రేణుక యారా ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫున న్యాయవాది జి.వసంత రాయుడు, ప్రభుత్వ తరఫున స్పెషల్ జీపీ పొట్టిగారి శ్రీధర్‌రెడ్డి వాదనలు వినిపించారు. వాదనలు విన్న ధర్మాసనం.. రెవెన్యూ ముఖ్య కార్యదర్శి, రంగారెడ్డి జిల్లా కలెక్టర్, రాజేంద్రనగర్ ఆర్డీవో, తహసీల్దార్, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్(జీహెచ్ఎంసీ) కమిషనర్‌కు నోటీసులు జారీ చేసింది.

మహిళ ఆత్మహత్య

రాజేంద్రనగర్: భర్తతో గొడవ జరగడంతో మనస్తాపానికి లోనైన ఓ మహిళ ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. హైదర్‌గూడ ప్రాంతానికి చెందిన రూబీనా (24) ప్రేమించి పెళ్లి చేసుకుంది. వారికి ముగ్గురు సంతానం. ఆదివారం రాత్రి భర్తతో గొడవ జరగడంతో మనస్తాపానికి లోనైన రుబీనా చీరతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

యజమాని ఇంటికే కన్నం

రూ.3.5 లక్షల నగదు చోరీ

జీడిమెట్ల: బెట్టింగ్‌లకు అలవాటు పడి తన స్నేహితులతో కలిసి తన యజమాని ఇంట్లోనే చోరీకి పాల్పడిన యువకుడితో పాటు అతడికి సహకరించిన మరో ఇద్దరిని జీడిమెట్ల పోలీసులు అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. సోమవారం జీడిమెట్ల పీఎస్‌లో బాలానగర్ ఏసీపీ నరేష్‌రెడ్డి, జీడిమెట్ల ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేష్‌తో కలిసి వివరాలు వెల్లడించారు. ఐడీఏ జీడిమెట్ల ఎస్.ఆర్.నాయక్‌నగర్‌కు చెందిన సంగమేశ్వర్ అదే ప్రాంతంలో పాల వ్యాపారం చేస్తున్నాడు. ఈనెల 2న అతను ఓ ఫంక్షన్‌కు వెళ్లాడు. తాను ఇంటికి రావడం ఆలస్యం అవుతుందని, ఇంటి తలుపులు మూయవద్దని తన కుమార్తెకు ఫోన్ చేసి చెప్పాడు. సంగమేశ్వర్ ఫోన్‌లో మాట్లాడటాన్ని అతని దుకాణంలో పనిచేసే మహ్మద్ ఆసీఫ్ విన్నాడు. బెట్టింగ్‌లకు అలవాటు పడిన ఆసీఫ్ తన స్నేహితులు మహ్మద్ ఆసీఫ్, ఆమీర్‌లకు ఈ విషయాన్ని చెప్పాడు. పథకం ప్రకారం అదేరోజు ముగ్గురూ కలిసి యజమాని ఇంట్లోకి వెళ్లారు. ఇంట్లో దాచిన రూ.3.5లక్షల నగదు తీసుకుని అక్కడి నుంచి పరారయ్యారు. మర్నాడు ఉదయం ఇంట్లో డబ్బులు పోయినట్లు గుర్తించిన సంగమేశ్వర్ జీడిమెట్ల పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. విచారణలో భాగంగా 5 కిలోమీటర్ల పరిధిలోని 130సీసీ కెమెరాలను పరిశీలించి ముగ్గురు యువకులు చోరీకి పాల్పడినట్లు నిర్ధారణకు వచ్చారు. సంగమేశ్వర్ ఇచ్చిన సమాచారం ఆధారంగా నిందితుల్లో ఒకరైన ఆసీఫ్‌ను గుర్తించిన పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని విచారించగా తన స్నేహితులతో కలిసి చోరీ చేసినట్లు తెలిపాడు. దీంతో అతడికి ఆసీఫ్, అమీర్‌లను సోమవారం ఉదయం అదుపులోకి తీసుకున్నారు. చోరీ సొత్తులో రూ.3.5లక్షలు ముగ్గురు పంచుకోగా అందులో రూ.1.35 లక్షలు బెట్టింగ్‌లో పెట్టినట్లు గుర్తించారు. వారి నుంచి రూ.2.15 లక్షల నగదు, 4 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని నిందితులను రిమాండ్‌కు తరలించారు.

అత్తింటి వేధింపులు తాళలేక..

హుస్సేన్‌సాగర్‌లో దూకి యువకుడి ఆత్మహత్య

ముషీరాబాద్: భార్య, ఆమె తరఫు బంధువుల వేధింపులు భరించలేక హుస్సేన్‌సాగర్‌లో దూకి ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన రాంనగర్‌లోని బహదూర్‌నగర్‌లో సోమవారం చోటు చేసుకుంది. మృతుడి బంధువుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. బహదూర్‌నగర్‌కు చెందిన సంతోష్(36)కు రామాంతపూర్‌కు చెందిన శారదతో గత మే 9న వివాహం జరిగింది. సంతోష్ హబ్సిగూడలోని ఐఐసీటీలో కాంట్రాక్ట్ ఉద్యోగిగా పని చేస్తూ రాత్రి వేళల్లో బౌన్సర్‌గా కూడా విధులు నిర్వహిస్తున్నాడు. పెళ్లైన తర్వాత అనారోగ్యం పేరుతో అతడి శారద సంతోష్‌తో సంసార జీవితం గడిపేందుకు సహకరించడం లేదు. దీంతో సంతోష్ ఆమెను ప్రశ్నించగా తనకు గైనిక్‌తో పాటు ఇతర ఆరోగ్య సమస్యలు ఉన్నట్లు చెప్పింది. దీంతో తనకు పెళ్లికి ముందుకు ఈ విషయం చెప్పకుండా మోసం చేసి పెళ్లి చేశారని ఆరోపిస్తూ సంతోష్ విడాకులు కోరుతూ లీగల్ నోటీసు పంపించాడు. అయితే అందుకు అంగీకరించని అత్తింటి వారు శారద ఆరోగ్య సమస్యలతో పాటు బాగోగులు నువ్వే చూడాలని సంతోష్‌పై ఒత్తిడి చేశారు. అందుకు అతను నిరాకరించడంతో ఆమె కుటుంబ సభ్యులు కేసులు పెడతామని బెదిరించడంతో ఆందోళనకు గురైన సంతోష్ ఆదివారం హుస్సేన్‌సాగర్‌లో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అతడి మృతికి భార్య శారదతో పాటు ఆమె బంధువులే కారణమని ఆరోపిస్తూ నల్లకుంట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

కెనరా బ్యాంక్ (భారత ప్రభుత్వ రంగ సంస్థ) Syndicate
జూబ్లీహిల్స్-II బ్రాంచ్
రోడ్ నం.70, జర్నలిస్ట్ కాలనీ, జూబ్లీహిల్స్, హైదరాబాద్, తెలంగాణ-500033

మూవబుల్స్ వేలం అమ్మకం ప్రకటన

కెనరా బ్యాంక్ ద్వారా వేలం వేయబడే దిగువ పేర్కొన్న మూవబుల్స్ యొక్క కొనుగోలు కొరకు ప్రజల నుండి ఆఫర్లు కోరబడుచున్నవి.

సెక్యూర్డ్ క్రెడిటార్‌కు ... కెనరా బ్యాంక్ యొక్క హైదరాబాద్ జూబ్లీహిల్స్-II (13050) బ్రాంచ్ ... M/s ... రుణగ్రహీత ... నుండి కెనరా బ్యాంక్ యొక్క హైదరాబాద్ జూబ్లీహిల్స్-II బ్రాంచ్ వారికి చెల్లించాల్సిన బకాయి మొత్తం రూ.1,16,50,445.48 ... 19-07-2025న "ఎక్కడ ఎలా ఉన్నది అలా", "ఏది ఉంటే అది" మరియు "అక్కడ ఏమున్నదో అది" ప్రాతిపదికపై విక్రయించబడునని ...

రిజర్వు ధర రూ.35,00,000/- మరియు బయానా రూ.3,50,000/-.
బయానా: 18-07-2025న లేదా అంతకు ముందు సా.5.00 గం. వరకు డిపాజిట్ చేయాలి.

మూవబుల్ ఆస్తుల యొక్క వివరాలు మరియు పూర్తి వివరణ

క్ర.సం.	మూవబుల్స్ (ఆస్తుల వివరణ)	రిజర్వు ధర	బయానా మొత్తం
1	BMW 730LD DPE ... [illegible] ... 01-08-2017 ... WBA7G47040G358701 ...	రూ.35,00,000/-	రూ.3,50,000/-

వేలం తేదీ మరియు సమయం: 19 జూలై 2025న ఉ.11.30 గం. నుండి మ.12.30 గం. వరకు

... అమ్మకం యొక్క వివరణాత్మక నియమ నిబంధనల కొరకు, కెనరా బ్యాంక్ వెబ్‌సైట్ (www.canarabank.com) లో ... "Online Auction" ... జూబ్లీహిల్స్-II బ్రాంచ్ ... సంప్రదించవచ్చు.

తేదీ: 01-07-2025, ప్రదేశం: హైదరాబాద్ అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

కెనరా బ్యాంక్ (భారత ప్రభుత్వ రంగ సంస్థ) Syndicate
రికవరీ ఆఫీస్: హైదరాబాద్ నార్త్
బ్రాంచ్ ఆఫీస్: అమీర్‌పేట్ I (0648)
చిరునామా: ఇం.నం.6-3-788/32-35, 1వ అంతస్తు, వంశీ ఎస్టేట్, అమీర్‌పేట్, హైదరాబాద్ - 500016.

డిమాండ్ నోటీసు [సెక్షన్ 13(2)]

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002లోని సెక్షన్ 13(2) క్రింద డిమాండ్ నోటీసు ... M/s. SUSAAH ... NPA తేదీ: 29.04.2025, డిమాండ్ నోటీసు తేదీ: 26.05.2025 ... CERSAI ASSET ID: 200007023364 ... 400007032455 ... 200007024679 ... 400007033771 ... 200023781992 ... 400023832413 ... 200020685789 ... 400020730720 ...

ప్రదేశం: హైదరాబాద్, తేదీ: 26.05.2025 సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

క్లుప్తంగా...

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్

శ్రీనగర్‌కాలనీ: కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమవుతుందని సోమాజిగూడ కార్పొరేటర్ వనం సంగీత శ్రీనివాస్ యాదవ్ అన్నారు. సోమాజిగూడ డివిజన్ పరిధిలోని సుభాష్‌నగర్‌లో రూ.30 లక్షలతో నీటి కాల్వ పైప్‌లైన్లు, సీసీరోడ్ల పనులను సోమవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా స్థానికులు పడుతున్న ఇబ్బందులకు త్వరలోనే శాశ్వత పరిష్కారం లభిస్తుందని అన్నారు. త్వరితగతిన పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక వార్డు మెంబర్ నాగరాజు, కాంగ్రెస్ సీనియర్ నేతలు మనోజ్ యాదవ్, గణేష్, బాబు, విజయ్ యాదవ్, హరికృష్ణ, బాషా తదితరులు పాల్గొన్నారు.

సందడిగా పీర్ల ఊరేగింపు



పీర్లకు స్వాగతం పలుకుతున్న బంజారాహిల్స్ మాజీ కార్పొరేటర్ భారతీనాయక్

బంజారాహిల్స్: మొహర్రం పర్వదినాన్ని పురస్కరించుకుని బంజారాహిల్స్‌లో పీర్ల ఊరేగింపు నిర్వహించారు. కుల, మతాలకతీతంగా స్థానికులు ఈ ఊరేగింపులో పాల్గొన్నారు. బంజారాహిల్స్ మాజీ కార్పొరేటర్ భారతీనాయక్ రోడ్డు నంబర్–14లో పీర్లకు స్వాగతం పలకడమే కాకుండా దట్టీలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఊరేగింపులో పాల్గొన్నారు. ఆదివారం అర్ధరాత్రి వరకు నిర్వహించిన మొహర్రం సందర్భంగా ఆధ్యాత్మిక సందడి నెలకొంది.

మాగంటి గోపీనాథ్ ఆశయ సాధనకు కృషి చేయాలి



బీఆర్ఎస్ నేతలతో మాగంటి వజ్రనాథ్

శ్రీనగర్‌కాలనీ: దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ ఆశయ సాధనకు అంతా కలిసి కృషి చేయాలని బీఆర్ఎస్ నేత, మాగంటి గోపీనాథ్ సోదరుడు మాగంటి వజ్రనాథ్ అన్నారు. శ్రీనగర్‌కాలనీ, ఎల్లారెడ్డిగూడలో సోమవారం పర్యటించిన ఆయన అక్కడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్థానిక నేతలతో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. నియోజకవర్గంలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని, సమస్యల పరిష్కారికి కృషి చేయాలని కోరారు. మాగంటి ఆశయాలను ముందుకు తీసుకువెళ్లేందుకు తనవంతు బాధ్యత నిర్వర్తిస్తానని చెప్పారు. నేతలు అనిత, బసవరాజు, పెరుక రవి, అరుణ పాల్గొన్నారు.

ముదిరాజ్‌లకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి



మాట్లాడుతున్న మహేష్ ముదిరాజ్

పంజగుట్ట: రాష్ట్రంలో అత్యధిక జనాభా ఉన్న ముదిరాజ్‌లకు ఎన్నికలకు ముందు ఎన్నో హామీలు ఇచ్చి ఒక్క హామీ అమలు చేయకుండా మోసం చేస్తున్నారని తెలంగాణ ముదిరాజ్ పోరాట సమితి ఆగ్రహం వ్యక్తం చేసింది. ముదిరాజ్ కులస్తులను బీసీ డీ నుంచి బీసీ ఏలోకి మార్చిన తర్వాతే ప్రభుత్వ ఉద్యోగాలకు నోటిఫికేషన్లు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సమితి రాష్ట్ర నాయకులు సుంకరబోయిన మహేష్, అశోక్ ముదిరాజ్, రాంచందర్, పులి దేవేందర్, రంజిత్ ముదిరాజ్ మాట్లాడుతూ.. ముదిరాజ్ జాతి బిడ్డకు మంత్రివర్గంలో స్థానం కల్పించిన ముఖ్యమంత్రికి ధన్యవాదాలని, అదే తరహాలో ఎన్నికలకు ముందు ముదిరాజ్‌లకు ఎన్నో హామీలు ఇచ్చారని, వాటిని అమలు చేయాలని కోరారు. 40 లక్షల జనాభా ఉన్న ముదిరాజ్‌లకు ఇటీవల ప్రకటించిన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి, ఉపాధ్యక్షుల పదవుల్లో కేవలం రెండు పదవులు కేటాయించడం దారుణమన్నారు. సమావేశంలో రవి, శేఖర్, చందు, రవి ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.



పచ్చని పరవశం

ఇక పండగలా.. వన మహోత్సవం

సర్కిల్ | నాటే మొక్కల లక్ష్యం..

- మెహిదీపట్నం సర్కిల్–12: 62,500
- కార్వాన్ సర్కిల్–13: 31,250
- గోషామహల్ సర్కిల్–14: 31,250
- ఖైరతాబాద్ సర్కిల్–17: 62,500
- జూబ్లీహిల్స్ సర్కిల్–18: 62,500

ఖైరతాబాద్ జోన్‌లో 2.50 లక్షలు నాటడమే లక్ష్యం

20 వేలకు పైగా ఉచితంగా మొక్కల పంపిణీ

బంజారాహిల్స్: పచ్చదనం పెరిగి సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురవాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఏటా జూలైలో వన మహోత్సవ కార్యక్రమం నిర్వహిస్తూ ఖాళీ స్థలాలు, పార్కులు, రోడ్ల పక్కన మొక్కలు నాటుతోంది. వన మహోత్సవ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో సోమవారం ప్రారంభించారు. జీహెచ్‌ఎంసీ ఖైరతాబాద్ జోన్ కిందికి వచ్చే ఖైరతాబాద్ నియోజకవర్గ పరిధిలో వన మహోత్సవ కార్యక్రమానికి జీహెచ్‌ఎంసీ అర్బన్ బయో డైవర్సిటీస్(యూబీడీ) అధికారులు సిద్ధమయ్యారు. ఇందుకోసం మొక్కలు నాటే ప్రాంతాలను ఎంపిక చేసి ఆయా ప్రాంతాల్లో వన మహోత్సవ కార్యక్రమాన్ని పండగ వాతావరణంలో నిర్వహించాలని తలపెట్టారు. 2025 ఏడాదికి సంబంధించి సోమవారం నుంచి మొక్కలు నాటాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో ఇప్పటికే ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ సర్కిళ్ల యూబీడీ అధికారులు నర్సరీల్లో మొక్కలు సిద్ధంగా పెట్టుకున్నారు. రహదారుల పక్కన, చెరువులు, కుంటలను ఆనుకుని ప్రభుత్వ ఖాళీ స్థలాలు, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో మొక్కలు నాటేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు, బస్తీ, కాలనీ సంఘాల సభ్యులను భాగస్వాములను చేయనున్నారు. మొక్కలు నాటిన వెంటనే చుట్టూ కంచెలు ఏర్పాటు చేయనున్నారు. అలాగే నివాసాలకు కూడా పండ్లు, పూల మొక్కలను పంపిణీ చేయాలని నిర్ణయించారు.



జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్–10లోని ఎంపీ, ఎమ్మెల్యే కాలనీ విజయ నర్సరీలో సిద్ధంగా ఉన్న మొక్కలు

2.50 లక్షల మొక్కలు నాటడమే లక్ష్యం..

వన మహోత్సవం 2025లో భాగంగా ఖైరతాబాద్ జోన్‌లో భాగంగా జీహెచ్‌ఎంసీ ఖైరతాబాద్ జోనల్ పరిధిలో ఐదు సర్కిళ్లు ఉండగా మొత్తం 2.50 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందులో పెద్దవి, చిన్నవి కలిపి ఆయా ప్రాంతాల విస్తీర్ణానికి అనుగుణంగా నాటాలని నిర్ణయించారు.

4.29 లక్షల మొక్కలు సిద్ధం

వన మహోత్సవం–2025కు నర్సరీల్లో మొక్కలు సిద్ధం చేశారు. చాచానెహ్రూ పార్కు, విజయ నర్సరీ, ఇందిరాపార్కుతో పాటు వివిధ ప్రాంతాల్లో మొత్తం 4.29 లక్షల పెద్ద మొక్కలు, 2 లక్షల ఆర్నమెంటల్ ప్లాంట్స్ సిద్ధంగా ఉన్నాయి. ప్రణాళిక ప్రకారం గుర్తించిన ప్రాంతాల్లో వీటిని నాటుతాం. అలాగే నివాసితులకు తమ ఇళ్ల ఆవరణలో పెంచుకోవడానికి 20 వేలకు పైగా మొక్కలను ఉచితంగా పంపిణీ చేస్తాం. నర్సరీల్లో మొక్కలను సిద్ధంగా ఉంచాం.

– బాలయ్య, యూబీడీ అధికారి, జీహెచ్‌ఎంసీ సర్కిల్–18

సాత్విక గుణంతో ముందుకు సాగాలి



శ్రీసీతారామచంద్రస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో త్రిదండి దేవనాథ రామానుజ జీయర్ స్వామి

బంజారాహిల్స్: ప్రతిఒక్కరూ శ్రీరామచంద్రస్వామి వలే సాత్విక గుణంతో ఉండాలని సాత్వికతతో జీవించాలని త్రిదండి దేవనాథ రామానుజ జీయర్ స్వామి అన్నారు. బంజారాహిల్స్ రోడ్ నెం.10లోని గౌరీశంకర్ కాలనీలోని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయ 25వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆయన స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పక్కవారు ఎదుగుతుంటే ఈర్ష్య పడకూడదని మంచిని మాత్రమే చూడాలని, చెడుకు దూరంగా ఉండాలని సూచించారు. మంచిని కోరేవారికి ఎల్లప్పుడూ మంచే జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా జరిగిన పూజల్లో ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, టీపీసీసీ కార్యదర్శి, ఖైరతాబాద్ కార్పొరేటర్ పి.విజయారెడ్డి పాల్గొన్నారు. సోమవారం భగవతారాధన, పూర్ణాహుతి, బలిహరణ, చక్రస్నానం, సాయంత్రం పుష్పయాగం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. ఆలయ చైర్మన్ సూర్యనారాయణ, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, కోశాధికారి ప్రవీణ్‌కుమార్, లింగారెడ్డి, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

వడ్డీ లేని రుణాలను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న డీపీవో ఆశా విరానిక

బంజారాహిల్స్: వడ్డీ లేని రుణాలను సద్వినియోగం చేసుకొని మహిళలు ఆర్థికంగా ఎదగాలని జూబ్లీహిల్స్ సర్కిల్–18 డీపీవో ఆశా విరానిక సూచించారు. బంజారాహిల్స్ రోడ్ నెం.12లోని ఎన్బీటీనగర్‌లో టౌన్ లెవల్ ఫెడరేషన్(టీఎల్ఎఫ్) సమావేశం సోమవారం నిర్వహించారు. ప్రతి మహిళ కోటీశ్వరురాలు కావాలనే సంకల్పంతో ప్రభుత్వం మహిళల కోసం ఎన్నో పథకాలు తీసుకొస్తుందని మహిళా సమాఖ్యల అధ్యక్షులు వీటిని క్షేత్రస్థాయికి తీసుకెళ్లి ఆసక్తి ఉన్నవారికి అవకాశాలు కల్పించేలా చూడాలని సూచించారు. 2024–25 సంవత్సరానికి 251 సెల్ఫ్ హెల్ప్ గ్రూపులకు రూ.33,29,300 లక్షలు మంజూరైనట్లు ఆమె వెల్లడించారు. త్వరలోనే ఆర్పీలో ఆయా బ్యాంకులకు వెళ్లి వెరిఫికేషన్ చేసి పోర్టల్‌లో అప్‌లోడ్ చేస్తారని, అర్హత ఉన్న ప్రతి మహిళకు రుణం ఇప్పిస్తామని తెలిపారు. వెరిఫికేషన్ పూర్తయిన తర్వాత అర్హత కలిగిన మహిళలందరికీ నియోజకవర్గ స్థాయిలో సమావేశం నిర్వహించి ఇన్‌చార్జి మంత్రి, ఎమ్మెల్యేల చేతులమీదుగా రుణాల పంపిణీ ఉంటుందని వెల్లడించారు.

నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

వెంగళరావునగర్: కుందన్‌బాగ్, సీఎం రెసిడెన్సీ, సీఎం సెక్యూరిటీ, ఎర్రగడ్డ, శంకర్‌లాల్‌నగర్, ప్రేమ్‌నగర్ 11కేవీ ఫీడర్లు కుందన్‌బాగ్, సీఎం క్యాంప్ ఆఫీస్, జనప్రియ సబ్‌స్టేషన్ల పరిధిలో కొనసాగుతున్న మరమ్మతుల కారణంగా మంగళవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఐఏఎస్, ఐపీఎస్, మినిస్టర్ క్వార్టర్స్, ఓల్డ్ క్యాంప్ ఆఫీస్, సీఎం బిల్డింగ్, రెసిడెన్సీ, మంజీరా గెస్ట్‌హౌస్, చీఫ్ జస్టిస్ హౌస్, బీఎస్‌పురి కాలనీ, సుల్తాన్‌నగర్, శంకర్‌లాల్‌నగర్, నటరాజ్‌నగర్, నేతాజీనగర్, ఎర్రగడ్డ మెయిన్‌రోడ్డు, వెంకటేశ్వర కాలనీ, నేతాజీకాలనీ, నాబార్డ్ నగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని గ్రీన్‌లాండ్స్ సీబీడీ ఏడీఈ చరణ్‌సింగ్ సోమవారం తెలిపారు. అదేవిధంగా మినిస్టర్ రోడ్డు, సప్తగిరి టవర్స్, టోపాజ్ బిల్డింగ్స్, జయశంకర్‌నగర్ 11కేవీ ఫీడర్లు, ఎస్.పార్క్, హెచ్‌పీఎస్, కుందన్‌బాగ్, బోరబండ సబ్‌స్టేషన్ల పరిధిల్లో మరమ్మతుల కారణంగా మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జి.ఇ.బిల్డింగ్, తాజ్‌వివెంట, టోపాజ్ బిల్డింగ్, నవదుర్గ జ్యువెలరీ, సౌత్‌ఇండియా షాపింగ్ మాల్, పద్మావతినగర్, ఎన్‌ఆర్‌ఆర్‌పురం సైట్–3 తదితర ప్రాంతాల్లో కరెంటు ఉండదన్నారు.

పలు ఫీడర్ల పరిధిలో..

ఖైరతాబాద్: సైఫాబాద్ డివిజన్ పరిధిలో ట్రీ కట్టింగ్, సబ్‌స్టేషన్ల మెయింటెనెన్స్ పనుల్లో భాగంగా మంగళవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు సైఫాబాద్ డివిజన్ అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ తెలిపారు. హుస్సేన్‌సాగర్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఆదర్శ్‌నగర్, ఎస్‌బీఐ బ్యాంక్ ఏరియా, బిర్లామందిర్, ఆదర్శ్‌నగర్, మ్యాక్స్‌క్యూర్ హాస్పిటల్, సంజయ్ గాంధీనగర్, బిర్లాప్లానిటోరియం ఏరియా, లేక్ వ్యూ సబ్‌స్టేషన్ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు కేసీపీ గెస్ట్‌హౌస్, మోర్ సూపర్ మార్కెట్, హిల్టాప్ కాలనీ, సోమాజిగూడ కేఎఫ్‌సీ, గణేష్ టెంపుల్, లేక్ షవర్ అపార్ట్‌మెంట్, లుంబినీ పార్క్ సబ్‌స్టేషన్ పరిధిలో స్కైలైన్ అపార్ట్‌మెంట్, తిరుమల అపార్ట్‌మెంట్ పరిధిలో కరెంటు సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

త్వరగా రోడ్డు పనులు పూర్తిచేయాలి



జోనల్ కమిషనర్ అనురాగ్‌జయంతికి వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్‌లోని దుర్గాభవానీనగర్, దీన్‌దయాళ్‌నగర్ బస్తీల్లో సీసీ రోడ్లు వేయాలని కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ కోరారు. ఈ మేరకు సోమవారం జీహెచ్‌ఎంసీ ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్‌జయంతిని ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. బస్తీల్లో మంజూరైన రోడ్ల నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలన్నారు. జ్ఞానీజైల్‌సింగ్ నగర్‌లో తవ్వి వదిలేసిన రోడ్లను త్వరగా పూర్తి చేయాలన్నారు. బోనాల మాసం కావడంతో ఆడబిడ్డలు ఇబ్బందులు కలగకుండా రోడ్డు పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు.

వైన్‌షాపుల సిబ్బందిపై దాడులు చేస్తే ఊరుకోం



మాట్లాడుతున్న అధ్యక్షుడు తడకంటి లింగాగౌడ్, కాశీ తదితరులు

బంజారాహిల్స్: వైన్‌షాపుల్లో పనిచేస్తున్న సిబ్బందిపై దాడులు చేస్తే సహించేది లేదని తెలంగాణ వైన్‌షాప్స్ అండ్ బార్స్ వర్కర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు తడకండి లింగాగౌడ్(శ్యాంగౌడ్) హెచ్చరించారు. బంజారాహిల్స్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాళ్ల భాస్కర్, కే.కాశీ, ప్రభు తదితరులతో కలిసి ఆయన మాట్లాడారు. మద్యం మత్తులో కొందరు మందుబాబులు అకారణంగా వైన్‌షాపుల్లో పనిచేస్తున్న సిబ్బందిపై దాడులు చేస్తున్నారని, ఇది మంచి పద్ధతి కాదన్నారు. సిబ్బందిపై దాడులు చేస్తే వారిపై హత్యాయత్నం కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఇటీవల సిబ్బందిపై దాడులు పెరిగిపోతున్నాయని, తమ అసోసియేషన్ వారికి అండగా నిలబడుతుందని పేర్కొన్నారు. ఎక్కడైనా దాడులు జరిగితే అసోసియేషన్ దృష్టికి తీసుకురావాలని, బాధితులకు అండగా నిలబడతామన్నారు. వైన్‌షాపుల పక్కన పర్మిట్ రూముల్లో మందుబాబులు గొడవలకు దిగితే వైన్‌షాపు సిబ్బంది చూసుకోవాలంటూ కొందరు పోలీసులు పేర్కొంటున్నారని, అయితే పర్మిట్ రూముల్లోకి అలా వెళ్లడం పద్ధతికాదన్నారు. గొడవలు జరిగితే తామే పోలీసుల దృష్టికి తీసుకువస్తామని వెల్లడించారు.


ఆత్మీయ సమ్మేళనంలో రిటైర్డ్ గ్రేహౌండ్స్ కమాండోలు



జూబ్లీహిల్స్‌లో ఆత్మీయ సమ్మేళనంలో రిటైర్డ్ గ్రే హౌండ్స్ కమాండోలు

బంజారాహిల్స్: రిటైర్డ్ గ్రేహౌండ్స్ అధికారులంతా ఒక్కచోట కలిశారు.. ఆనాటి ఉద్యోగ పరిస్థితులు, నాటి ముచ్చట్లను నెమరువేసుకున్నారు. జూబ్లీహిల్స్ రోడ్ నెం.10లో సోమవారం 1989 5బీ యూనిట్‌కు చెందిన గ్రేహౌండ్స్ ఉద్యోగులు రిటైర్డ్ డీఐజీ గోపినాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం తమ 1989 5బీ యూనిట్‌లో ఉన్న ఉద్యోగులంతా ఇలా ఎక్కడో కలుసుకొని ఆనందంగా గడుపుతామని తెలిపారు. కార్యక్రమంలో రిటైర్డ్ కమాండెంట్లు అప్పల్‌రెడ్డి, సురేందర్, డీఎస్పీ రాజగోపాల్, అడిషనల్ ఎస్పీ కేఆర్‌కే.ప్రసాద్, కమాండెంట్ మనోహర్, అసిస్టెంట్ కమాండెంట్ పాండురంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీనియర్ రిటైర్డ్ కమాండెంట్లకు సన్మానం చేశారు.

లక్ష్యం కోసం విద్యార్థులు కృషి చేయాలి



ఖైరతాబాద్: పీజేఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఖైరతాబాద్ డివిజన్‌లోని నిషుల్క్ ప్రభాత్ హైస్కూల్‌లో విద్యార్థులకు ఉచితంగా ఫౌండేషన్ చైర్మన్, కార్పొరేటర్ విజయారెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం స్కూలు బ్యాగులు, నోట్‌బుక్స్ అందజేశారు. విద్యార్థులు వారు ఎంచుకున్న లక్ష్యాలను సాధించేందుకు పట్టుదలతో కృషి చేయాలని సూచించారు. స్కూల్ ప్రిన్సిపాల్ కరుణాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యంగా 28న ధర్నా

ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మేడి పాపయ్య

హిమాయత్‌నగర్: మాదిగ, మాదిగ ఉపకులాల సమస్యల పరిష్కార సాధనే లక్ష్యంగా ఈనెల 28న ఇందిరా పార్క్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి(ఎమ్మార్పీఎస్) వ్యవస్థాపక అధ్యక్షుడు మేడి పాపయ్య వెల్లడించారు. బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో తెలంగాణ రాష్ట్ర ఎస్సీ బేడ(బుడగ) జంగాల జేఏసీ ఐక్య వేదిక ఆధ్వర్యంలో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఆవిర్భావ సదస్సును సోమవారం ఘనంగా నిర్వహించారు. ఎస్సీ వర్గీకరణ కోసం అసువులు బాసిన అమరవీరుల చిత్రపటాలకు నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మాదిగ, మాదిగ ఉపకులాలకు నామినేటెడ్ పదవులు కేటాయించడం లేదని, ఎస్సీ కార్పొరేషన్ నుంచి లోన్స్ తీసుకున్న నిరుద్యోగులకు సబ్సిడీ నిధుల విడుదలలో జాప్యం జరుగుతుందన్నారు. కానీ మెఘా కృష్ణారెడ్డికి మాత్రం కాంట్రాక్ట్ బిల్లులు చెల్లిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తూర్పాటి హనుమంతు, నర్సింహ, మేడి రమణ, మల్లేష్, జ్యోతి, వెంకటేష్, దాసరి సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

వైన్‌షాపు క్యాషియర్ మెడపై బీరు సీసాతో దాడి

బంజారాహిల్స్: మద్యం బాటిల్‌ను ఎంఆర్‌పీ రేటు కంటే అదనపు డబ్బులు తీసుకుని విక్రయించారనే కోపంతో వైన్ షాపు క్యాషియర్ మెడపై బీరు సీసాతో దాడి చేసిన ఘటనలో ఇద్దరు మందుబాబులను జూబ్లీహిల్స్ పోలీసులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే.. జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్–36లోని ఎస్వీ వైన్స్‌కు ఫిలింనగర్‌లో నివసించే డ్రైవర్ జగదీష్‌తో పాటు స్నేహితుడు సత్యనారాయణ మద్యం కోసం వచ్చాడు. సిగ్నేచర్ విస్కీ బాటిల్‌ను కొనుగోలు చేసి రూ.1360 చెల్లించాడు. అయితే బాటిల్‌పై మాత్రం దీని ధర రూ.1320 మాత్రమే ఉంది. ఇద్దరూ కలిసి ఫుల్‌బాటిల్ తాగిన అనంతరం మద్యం మత్తులో వైన్‌షాపుకు వచ్చి తమ వద్ద అదనంగా రూ.40లు ఎందుకు తీసుకున్నావంటూ క్యాషియర్ భరత్‌ను అడిగారు. ధరలు పెరిగాయని భరత్ చెప్పగా అప్పటికే మద్యం మత్తులో ఉన్న జగదీష్ అక్కడ ఉన్న బీరు సీసాను పగులగొట్టి భరత్ తలపై పొడిచాడు. తీవ్ర రక్తస్రావంతో బాధితుడిని ఆస్పత్రిలో చేర్పగా మెడపై 24 కుట్లు పడ్డాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు దాడి చేసిన జగదీష్‌తో పాటు సహకరించిన సత్యనారాయణను అరెస్టు చేశారు. జూబ్లీహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆరోగ్యనగర్‌లో ఉచిత వైద్య శిబిరం

రహమత్‌నగర్: అపోలో ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ ఆధ్వర్యంలో సోమవారం ఎస్పీఆర్‌హిల్స్ ఆరోగ్యనగర్‌లో ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి రోగులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వైద్య సిబ్బంది వివరించారు. బస్తీ వ్యవస్థాపక సభ్యుడు మార్నేని విజయ్‌కుమార్, వైద్య సిబ్బంది మల్లికార్జున్, నారాయణమ్మ పాల్గొన్నారు.

రోడ్డు పనులు ప్రారంభించాలని వినతి

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్‌లోని జ్ఞానీజైల్‌సింగ్‌నగర్ బస్తీలో సీసీ రోడ్డు పనులను వెంటనే ప్రారంభించాలని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ జూబ్లీహిల్స్ సర్కిల్ డీసీ సమ్మయ్యను ఆదేశించారు. బస్తీలో రూ.19.50 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు కాగా, గతంలో ఈ రోడ్డు పనులకు స్థానిక కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ శంకుస్థాపన చేశారు. అయితే ఎమ్మెల్యే లేకుండా కార్పొరేటర్ పనులు ఎలా ప్రారంభిస్తారని కొంతమంది ఈ పనులను నిలిపివేశారు. దీంతో తవ్విన రోడ్డుపై స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సోమవారం బస్తీ నేతలు దండు లక్ష్మణ్, అశోక్ ఎమ్మెల్యే దానంను కలిసి సీసీ రోడ్డు పనులు ప్రారంభించాలని కోరారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే డిప్యూటీ కమిషనర్‌తో మాట్లాడుతూ బోనాల పండుగలోగా రోడ్డు పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. స్థానికుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని త్వరితగతిన పనులు పూర్తి చేయాలన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత తప్పనిసరి



రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ దేదీప్య

వెంగళరావునగర్: అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజల పర్యవేక్షణ ఉండాలని స్థానిక కార్పొరేటర్ దేదీప్య విజయ్ అన్నారు. వెంగళరావునగర్ డివిజన్ పరిధిలోని సిద్ధార్థనగర్‌కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న రోడ్డు నిర్మాణ పనులను సోమవారం కార్పొరేటర్ ప్రారంభించారు. అనంతరం కాలనీవాసులతో ఆమె మాట్లాడారు. పనుల్లో నాణ్యత కొరవడకుండా కాలనీవాసులు పర్యవేక్షించాలన్నారు. పనులు తప్పనిసరిగా వేగవంతం చేయాలన్నారు. కాంట్రాక్టర్ సకాలంలో రోడ్డు పనులను పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని చెప్పారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు పి.విజయ్‌కుమార్, నేతలు అవినాష్, వర్క్ ఇన్‌స్పెక్టర్ శేఖర్, బీఆర్ఎస్ సీనియర్ నేతలు విజయ్‌కుమార్, శ్యాంరావు, వేణు, పూజారి బాల్‌రాజ్, పవన్, సత్యనారాయణ, రాజు, రాజేందర్, శారద, విజయగౌడ్, వాణి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యలను తక్షణమే పరిష్కరించాలి

- కలెక్టర్ హరిచందన దాసరి



సాక్షి, సిటీబ్యూరో: ప్రజావాణిలో వచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని హైదరాబాద్ కలెక్టర్ హరిచందన దాసరి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్లు ముకుందరెడ్డి, కదిరవన్ పలనితో కలసి ఆమె దరఖాస్తులను స్వీకరించారు. గ్రీవెన్స్ సెల్‌లో వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. పెండింగ్ లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆమె స్పష్టం చేశారు. ప్రజాభవన్, కలెక్టరేట్ ప్రజావాణి పెండింగ్ దరఖాస్తుల పురోగతిపై శాఖల వారీగా సమీక్షించి, సమస్యల ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. ప్రజావాణి నిర్వహణ ప్రధాన ఉద్దేశం ప్రజాసమస్యలను త్వరితగతిన పరిష్కరించడమేనని కలెక్టర్ గుర్తుచేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డీఆర్‌ఓ డి.శ్రీధర్, ఆర్డీఓలు రామకృష్ణ, సాయిరాం, అన్ని శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణికి 102 ఫిర్యాదులు



సాక్షి, సిటీబ్యూరో: ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులను సత్వరమే పరిశీలించి పరిష్కరించాలని మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ రాధికాగుప్త అధికారులను ఆదేశించారు. సోమవారం మేడ్చల్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల అర్జీదారుల నుంచి అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, డీఆర్‌ఓ హరిప్రియతో కలిసి రాధికా గుప్త 102 దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా రాధికాగుప్త మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఎంతో వ్యయ, ప్రయాసలకోర్చుకొని వచ్చిన ప్రజల నమ్మకాన్ని నిలబెట్టాల్సిన బాధ్యత అధికారులందరిపై ఉందని పేర్కొన్నారు. తిరస్కరించే దరఖాస్తులపై కారణాలు తప్పనిసరిగా తెలియజేయాలని సూచించారు. స్వీకరించిన దరఖాస్తులపై తీసుకున్న చర్యల వివరాలను ఆన్‌లైన్‌లో వెంటనే నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో కీసర ఆర్డీఓ ఉపేందర్‌రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సందేశాత్మక చిత్రాలు రావాలి



గన్‌ఫౌండ్రీ: సమాజంలో సందేశాత్మక చిత్రాలు, సీరియల్స్ రావాల్సిన అవసరం ఉందని రాష్ట్ర పూర్వ ఎన్నికల కమిషనర్ సి.పార్థసారథి అన్నారు. సోమవారం రవీంద్రభారతిలో రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో తెలంగాణ టెలివిజన్ డెవలప్‌మెంట్ ఫోరం, ఓం సాయితేజ ఆర్ట్స్ సంయుక్త ఆధ్వర్యంలో సినీ, టీవీ నటీనటుల శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సినిమాలు, సీరియళ్లు సమాజంపై ఎంతో ప్రభావాన్ని చూపుతాయని, ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని చిత్రాలు రావాల్సిన అవసరం ఉందన్నారు. అంతకుముందు సహస్ర (1000) లఘు చిత్రాల దర్శకుడు నాగబాల డి.సురేష్‌కుమార్‌కు వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ఇంటర్నేషనల్ అవార్డు అందజేశారు. 1000 లఘు చిత్రాలు తీయడం అభినందనీయమని, నేటి యువదర్శకులకు స్ఫూర్తిదాయకమని దర్శక నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ కొనియాడారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ పురాణం సతీష్‌కుమార్, సమాచార శాఖ ప్రత్యేక కమిషనర్ సీహెచ్ ప్రియాంక, సినీనటులు రోజారమణి, లోహిత్‌కుమార్, డెవలప్‌మెంట్ ఫోరం అధ్యక్షుడు మానస్ దండ నాయక్, బీసీ ఎ.అధ్యక్షులు వెనిగల్ల రాంబాబు, చిత్తరంజన్‌దాస్ తదితరులు పాల్గొన్నారు.

జీఎంఆర్, ఆకాసా బేస్ మెయిన్‌టెనెన్స్ ఒప్పందం



శంషాబాద్: జీఎంఆర్ ఏరోటెక్నిక్ ఎంఆర్‌ఓ(మెయిన్‌టెన్స్ రిపేరింగ్ అండ్ ఓవర్ హాల్) సంస్థతో ప్రముఖ ఆకాసా ఎయిర్‌లైన్స్ సంస్థ మూడేళ్ల బేస్ మెయింటినెన్స్ ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు సంస్థ నిర్వాహకులు వెల్లడించారు. ఈ ఒప్పందం ప్రకారం ఆకాసా ఎయిర్‌లైన్స్‌కు చెందిన బోయింగ్ 737 షెడ్యూల్ బేస్ మెయిన్‌టెనెన్స్ తనిఖీలు, నిర్వహణను జీఎంఆర్ ఏరో టెక్నిక్ ఎంఆర్‌లో నిర్వహిస్తారు. ఈ సందర్భంగా జీఎంఆర్ ఏరో టెక్నిక్ ప్రెసిడెంట్ అశోక్ గోపినాథ్ మాట్లాడుతూ ఆకాసా ఎయిర్‌లైన్స్ తమ సంస్థతో చేపట్టిన ఒప్పందం ఎంతో సంతోషంగా ఉందన్నారు. సమర్థవంతమైన ఆధునిక, సాంకేతిక పరిజ్ఞానంతో తమ సంస్థ పనితీరు కొనసాగుతుందని పేర్కొన్నారు. అత్యుత్తమ సాంకేతిక ప్రమాణాలతో కూడిన ఎంఆర్‌ఓతో తమ ఒప్పందం కుదుర్చుకోవడం గర్వంగా ఉందని ఆకాసా ఎయిర్‌లైన్స్ సంస్థ సీఈఓ బెల్సన్ కౌటినో అన్నారు.

అందరి చూపు సర్కారు బడి వైపు

కొత్త అడ్మిషన్లలో రాష్ట్రంలోనే హైదరాబాద్ టాప్



- ఈ ఏడాది చేరిన విద్యార్థులు 21,874 మంది
- పలు పాఠశాలల దగ్గర నో అడ్మిషన్ బోర్డులు

ఇప్పటివరకు సర్కార్ బడి అంటే అందరికీ చిన్నచూపు.. ఇప్పుడు ప్రభుత్వ పాఠశాల వైపే అందరి చూపు.. నాడు వెలవెల పోయిన బడులు.. నేడు పిల్లలతో కళకళలాడుతున్నాయి. పలు స్కూల్స్ వద్ద నో అడ్మిషన్ బోర్డులు దర్శనమిస్తున్నాయంటే ఎంతలా మార్పు వచ్చిందో అర్థం చేసుకోవచ్చు. అప్పు చేసైనా సరే ప్రైవేటు పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలని భావించిన తల్లిదండ్రులు సర్కారు బడుల్లో మౌలిక సదుపాయాల కల్పన, ఇంగ్లిష్ విద్యాబోధన తీరుతో ఇటువైపు మొగ్గు చూపుతున్నారు.

గ్రేటర్ పరిధిలోని సర్కారు బడుల్లో అడ్మిషన్లు ఇలా...

జిల్లా	మొదటి తరగతి	2 నుంచి పదో తరగతి		మొత్తం
		ప్రయివేటు	ప్రభుత్వ	
హైదరాబాద్	6,359	5,841	9,674	21,874
మేడ్చల్-మల్కాజిగిరి	2,962	2,064	5,262	10,018
రంగారెడ్డి జిల్లా	2,127	429	3,642	6,198

హైదరాబాద్ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటో తరగతిలో ఇలా...

మండలం	2024-25	2025-26
అంబర్‌పేట	146	265
అమీర్‌పేట	46	83
ఆసిఫ్‌నగర్-1	242	439
ఆసిఫ్‌నగర్-2	196	357
బహద్దూర్‌పురా -1	145	263
బహద్దూర్‌పురా-2	215	394
బండ్లగూడ-1	204	368
బండ్లగూడ-2	299	543
చార్మినార్-1	109	197
చార్మినార్-2	102	184
గోల్కొండ	158	286
హిమాయత్‌నగర్	68	124
ఖైరతాబాద్-1	92	166
ఖైరతాబాద్-2	173	313
మారేడుపల్లి	105	190
ముషీరాబాద్-1	74	134
ముషీరాబాద్-2	105	190
నాంపల్లి	200	359
సైదాబాద్-1	153	280
సైదాబాద్-2	81	146
సికింద్రాబాద్-1	116	215
సికింద్రాబాద్-2	134	241
షేక్‌పేట	194	351
తిరుమలగిరి	153	276

సాక్షి,సిటీబ్యూరో:

సర్కారు బడుల్లో కొత్త అడ్మిషన్ల సంఖ్య పెరుగుతోంది. ప్రభుత్వ విద్య బలోపేతానికి అత్యాధునిక సాంకేతి పరిజ్ఞానంతో కూడిన ఆంగ్ల విద్యాబోధన జరుగుతోంది. దీంతో పేద, మధ్యతరగతి వర్గాలు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. ప్రైవేటు పాఠశాలలను వదిలి సర్కారు 'బడిబాట'పడుతున్నారు. దీంతో పలు సర్కారు బడుల ముందు ఏకంగా నో అడ్మిషన్లు అంటూ బోర్డులు దర్శనమిస్తున్నాయి. ప్రాథమిక విద్యాస్థాయిలోనే విద్యార్థులు కృత్రిమ మేధ (ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్) సహాయంతో విద్యార్థుల అభ్యాస సామర్థ్యాలు పెంపొందించేందుకు ఉపాధ్యాయులు చర్యలు చేపడుతున్నారు. విజివల్ విద్యాబోధన విద్యార్థుల తల్లిదండ్రులను ఆకర్షిస్తోంది. పాఠశాల మౌలిక సదుపాయాలు కల్పన కూడా మెరుగుపడినట్లయింది.

ప్రథమ స్థానంలో హైదరాబాద్..

రాష్ట్రంలోనే హైదరాబాద్ జిల్లా కొత్త అడ్మిషన్ల ప్రక్రియలో అగ్రస్థానంలో కొనసాగుతోంది. గత విద్యాసంవత్సరంతో పోల్చుకుంటే ఈసారి రెట్టింపునకు చేరువవుతోంది. ఒకటి నుంచి పదో తరగతి వరకు సుమారు 21,874 కొత్త అడ్మిషన్లు వచ్చాయి. అందులో ప్రైవేటు పాఠశాలల నుంచి 5,841 మంది విద్యార్థులు సర్కారు బడుల్లో చేరినట్లు విద్యాశాఖ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. గ్రేటర్ పరిధిలోని హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో కలిపి మొత్తం మీద 38,090 కొత్త ప్రవేశాలు జరిగినట్లు తెలుస్తోంది. ఒకటో తరగతిలో 11,448, రెండు నుంచి పదో తరగతి వరకు సుమారు 26,912 విద్యార్థులు ప్రవేశాలు పొందినట్లు విద్యాశాఖ రికార్డులు స్పష్టం చేస్తున్నాయి.

బడిబాట సక్సెస్..

బడిబాటలో ప్రభుత్వ పాఠశాలలో సకల సదుపాయాల కల్పన, ఉచిత పాఠ్య, రాత పుస్తకాలు యూనిఫాం పోషకాలతో కూడిన మధ్యాహ్న భోజనం లాంటి వాటి గురించిన ప్రచారం మరింత కలిసి వచ్చింది. 'మీ పిల్లలకు చదువు రాకుంటే నిలదీయండి'అని టీచర్లు చేసిన ప్రచారం విద్యార్థుల తల్లిదండ్రులను బాగా ఆకట్టుకున్నది. ప్రైవేట్ పాఠశాలల్లో అర్హతలు లేని టీచర్లు, స్తోమతకు మించి ఫీజులు ప్రభుత్వ పాఠశాలల్లో కొత్త ప్రవేశాలకు అవకాశం కల్పించింది. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులకు భవిష్యత్తులో ఉన్నత చదువు ప్రవేశాల్లో రిజర్వేషన్ వర్తించడం వంటి విషయాలను తల్లిదండ్రులకు బాగా వివరించడంలో విజయవంతమయ్యారు.

కార్పొరేట్‌కు దీటుగా సదుపాయాలు



ప్రభుత్వ పాఠశాలల్లో అర్హతతోపాటు వివిధ సబ్జెక్టుల్లో నిష్ణాతులైన, అనుభవం కలిగిన టీచర్లు ఉన్నారు. కార్పొరేట్‌కు దీటుగా మౌలిక సదుపాయాల కల్పన, సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన విద్యాబోధనపై ప్రత్యేక దృష్టి సారించాం. ప్రాథమిక విద్యాస్థాయిలోనే చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి కృత్రిమ మేధ సహాయంతో అభ్యాస సామర్థ్యాలు పెంపొందిస్తున్నాం. ఉన్నత తరగతులకు డిజిటల్ బోర్డు ద్వారా విజువలైజేషన్స్ ఆడియో సౌండ్ ద్వారా విద్యార్థులకు బాగా అర్థమయ్యే విధంగా బోధన అందిస్తున్నాం. దీంతో అడ్మిషన్లు మరింత పెరిగే అవకాశం ఉంది.

- రోహిణి, జిల్లా విద్యాశాఖాధికారి, హైదరాబాద్

హీరో మహేశ్‌బాబు కౌంటర్ దాఖలు చేయాలి

- న్యాయవాదికి సూచించిన వినియోగదారుల ఫోరం
- తదుపరి విచారణ ఆగష్టు 7కు వాయిదా

సిటీ కోర్టులు: సినీనటుడు మహేశ్‌బాబుపై దాఖలు అయిన కేసులో వచ్చే విచారణలోపు కౌంటర్ దాఖలు చేయాలని రంగారెడ్డి జిల్లా వినియోగదారుల ఫోరం మహేశ్‌బాబు తరపు న్యాయవాదికి సూచించింది. దీంతో తదుపరి విచారణను ఆగష్టు 7వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు ఫోరం అధ్యక్షురాలు సీహెచ్ లతాకుమారి, సభ్యులు పారుపల్లి జవహర్‌బాబు, ఎస్.మాధవిలతో కూడిన బెంచ్ సూచించింది. ఒక రియల్ ఎస్టేట్ సంస్థకు బ్రాండ్ ప్రచారకర్తగా వ్యవహరిస్తున్న సినీనటుడు మహేశ్‌బాబుపై రంగారెడ్డి జిల్లా వినియోగదారుల ఫోరంలో కేసు నమోదైన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా మహేశ్‌బాబుకు వినియోగదారుల ఫోరం నోటీసులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో సోమవారం కమిషన్ విచారణ చేపట్టగా 3వ ప్రతివాదిగా ఉన్న మహేశ్‌బాబు తరపు న్యాయవాది రుబియా ఖాటూన్ హాజరై వకాలత్ దాఖలు చేశారు.

కేసు వివరాలు..

సాయిసూర్య డెవలపర్స్ బాలాపూర్ గ్రామంలో లేఅవుట్ వేయగా ఆకర్షితులైన ఓ మహిళా డాక్టర్, మరో వ్యక్తి కలిసి చెరో ప్లాటు కొనడానికి రూ.34.80 లక్షలు చెల్లించారు. అయితే ప్రతిపాదిత ప్రాంతంలో లేఅవుట్ లేదని తెలుసుకొని తాము చెల్లించిన డబ్బులను తిరిగి ఇవ్వాలని కోరారు. దీంతో సంస్థ యజమాని అయిన కంచర్ల సతీశ్‌చంద్ర గుప్త రూ.15 లక్షలు మాత్రమే తిరిగి ఇచ్చారని, మిగతా డబ్బులు చెల్లించకుండా ఇబ్బందులు పెడుతున్నారని వారు ఫోరంలో కేసు దాఖలు చేశారు. ఈ కేసులో సంస్థతోపాటు ప్రచారకర్తగా ఉన్న హీరో మహేశ్‌బాబును సైతం వారు ప్రతివాదిగా పేర్కొన్నారు. దీనిపై విచారణ చేపట్టిన రంగారెడ్డి జిల్లా వినియోగదారుల ఫోరం ముగ్గురు ప్రతివాదులకు నోటీసులు జారీ చేయగా మహేశ్‌బాబు తరపు న్యాయవాది కోర్టుకు హాజరుకాగా మిగతా ఇద్దరు ప్రతివాదులు నోటీసులు తీసుకోలేదు. దీంతో విచారణ వచ్చే నెలకు వాయిదా పడింది.

హిరోషియా వర్సిటీతో 'మహీంద్రా' ఎంఓయూ



సుభాష్‌నగర్: దుండిగల్ మున్సిపల్ పరిధిలోని బహదూర్‌పల్లికి చెందిన మహీంద్రా యూనివర్సిటీ జపాన్‌కు చెందిన హిరోషిమా యూనివర్సిటీతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. సోమవారం జపాన్‌లోని హిరోషిమాలో జరిగిన ఒక కార్యక్రమంలో మహీంద్రా యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ యాజులు మెదురి, హిరోషిమా వర్సిటీ అధ్యక్షుడు డాక్టర్ మిత్సుఓ ఓచిలు ఒప్పందపత్రాలపై సంతకాలు చేశారు. ఈ ఒప్పందం ద్వారా ప్రపంచ స్థాయి విద్యానైపుణ్యం, పరిశోధన ఆవిష్కరణ, 3+1 ఇంజనీరింగ్ అండర్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్ ఉందని యాజులు తెలిపారు. ఇందులో విద్యార్థులు మొదటి మూడేళ్లు హైదరాబాద్‌లో, చివరి ఏడాది హిరోషిమా యూనివర్సిటీలో విద్యను అభ్యసించే అవకాశం కలుగుతుందని, జపాన్‌లో గడిపే సమయంలో కోర్సు పూర్తి చేయడమే కాకుండా గ్రాడ్యుయేషన్ థీసిస్‌ను కూడా రూపొందించాల్సి ఉంటుందన్నారు. కోర్స్ పూర్తి చేసిన విద్యార్థులకు హిరోషిమా వర్సిటీ నుంచి ఒక సర్టిఫికెట్, మహీంద్రా వర్సిటీ నుంచి తుది డిగ్రీ లభిస్తుందన్నారు. మహీంద్రా యూనివర్సిటీకి చెందిన తొలి బ్యాచ్ విద్యార్థులు 2026 విద్యా సంవత్సరంలో హిరోషిమాలో తుది సంవత్సరం చదువును ప్రారంభించనున్నారని పేర్కొన్నారు. విద్యార్థులు హిరోషిమా వర్సిటీలో ట్యూషన్ ఫీజు చెల్లించాలి. పరీక్షా ఫీజు, ప్రవేశ ఫీజును వర్సిటీ మాఫీ చేయనుందని తెలిపారు. ఈ ఒప్పందం కార్యక్రమంలో మహీంద్రా యూనివర్సిటీకి చెందిన అసిస్టెంట్ డీన్ డాక్టర్ విశాలాక్షి, సెంటర్ ఫర్ లైఫ్ సైన్సెస్ డీన్ డాక్టర్ రాజిందర్ చౌహాన్ తదితరులు పాల్గొన్నారు.

ఇబ్బందులు అధిగమించడానికి బృందంగా పనిచేయాలి



ఇక్రిశాట్ డైరెక్టర్ జనరల్

ఏజీ వర్సిటీ: యువ శాస్త్రవేత్తలు తమ ఇబ్బందులను అధిగమించడానికి ఒక బృందంగా ఏర్పడి పని చేయాలని, అప్పుడే అనుకున్న విజయాలు సాధిస్తారని ఇక్రిశాట్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ హిమన్షు పాఠక్ అన్నారు. సోమవారం నేషనల్ అకాడమి ఆఫ్ అగ్రికల్చర్ రీసెర్చ్ మేనేజ్‌మెంట్(నార్మ్స్)లో కొత్తగా నియమించిన ప్రొబేషనరీ శాస్త్రవేత్తలకు ఫౌండేషన్ శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న హిమాన్షు పాఠక్ మాట్లాడుతూ వ్యవసాయ రంగ డిమాండ్‌లకు అనుగుణంగా వ్యవసాయ వృద్ధికి తోడ్పడటం శాస్త్రవేత్తల తక్షణ కర్తవ్యమని అన్నారు. ఈ రంగంలో ఉన్న అనేక సవాళ్లకు సరైన సమాధానాలు, పద్ధతులను అభివృద్ధి చేయాలని వర్ధమాన శాస్త్రవేత్తలకు దిశానిర్దేశం చేశారు. నూతన వ్యవసాయ శాస్త్రవేత్తలు తమ కెరీర్‌లోని మైలురాళ్లను దాటడానికి కృషి చేయాలన్నారు. ఐసీఏఆర్ మాజీ డిప్యూటీ డైరెక్టర జనరల్ డాక్టర్ హెచ్‌పీ సింగ్ మాట్లాడుతూ పెరుగుతున్న జనాభాకు ఆహారం అందించాల్సిన అవసరం ఉందని, అత్యాధునిక పరిశోధనల ద్వారా వ్యవసాయంలో స్థితిస్థాపకతను సులభతరం చేయాలన్నారు. దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన 105 మంది ప్రొబేషనరీ సైంటిస్టులకు 3 నెలల వ్యవధిలో శిక్షణ ఇవ్వనున్నారు. కార్యక్రమంలో వివిధ రాష్ట్రాల యువ శాస్త్రవేత్తలు నార్మ్స్ సిబ్బంది పాల్గొన్నారు.

టీజీఓ భవనానికి స్థలం కేటాయించండి




కలెక్టర్‌కు వినతి పత్రం అందిస్తున్న టీజీఓ ప్రతినిధులు

సాక్షి, సిటీబ్యూరో: తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్(టీజీఓ) హైదరాబాద్ జిల్లా శాఖ భవన సముదాయానికి స్థలం కేటాయించాలని హైదరాబాద్ కలెక్టర్ హరిచందన దాసరికి టీజీఓ విజ్ఞప్తి చేసింది. సోమవారం టీజీఓ ప్రతినిధుల బృందం కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. కలెక్టర్‌ను కలిసిన ప్రతినిధి బృందంలో అధ్యక్షుడు ఎం.బి.కృష్ణయాదవ్, ఉపాధ్యక్షురాలు మంజులారెడ్డి, కార్యదర్శి మహమ్మద్ అబ్దుల్ ఖాదర్, కోశాధికారి ఎంవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు అన్ని వర్గాలు అండగా నిలిచాయి

మంద కృష్ణమాదిగ



ఎమ్మార్పీఎస్ 31వ ఆవిర్భావ దినోత్సవాల్లో మంద కృష్ణమాదిగ

సనత్‌నగర్: మూడు దశాబ్దాలపాటు ఎస్సీ వర్గీకరణ పోరాటం చేసి సాధించుకున్నామని, తమ పోరాటానికి ప్రజలు, ప్రజాస్వామికవాదులు, అన్ని వర్గాల శ్రేయోభిలాషులు అండగా నిలిచారని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పద్మశ్రీ మంద కృష్ణమాదిగ స్పష్టం చేశారు. బేగంపేట డివిజన్ శ్యాంలాల్ బిల్డింగ్స్‌లో ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు గ్యార రమేష్ మాదిగ ఆధ్వర్యంలో సోమవారం ఎమ్మార్పీఎస్ 31వ ఆవిర్భావ దినోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు హాజరైన మంద కృష్ణ మాదిగ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు అండగా నిలబడిన ప్రతిఒక్క వర్గానికి కృతజ్ఞతలు తెలుపుకుంటున్నట్లు చెప్పారు. భవిష్యత్తులో అన్నివర్గాల సమస్యల పరిష్కారం దిశగా దేశవ్యాప్త ఉద్యమ కార్యాచరణ తీసుకుని ప్రజాసమస్యలపై పోరాటం కొనసాగించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గున్నగౌడ్, కాంగ్రెస్ నాయకులు తిరుమలేష్ నాయుడు, గౌరపల్లి రమేష్, కరుణాకర్, ఎరుకల సంఘం నాయకులు సురేష్, మేకల మోహన్, గంగాధర్‌గౌడ్, పల్లెర్ల శ్రీనివాస్, లక్ష్మణ్, మేకల శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

కర్మాగారాల్లో లోపాలపై కార్మికులు గళం విప్పాలి

రాష్ట్ర ఫ్యాక్టరీస్ డైరెక్టర్ రాజగోపాలరావు వ్యాఖ్య



సాక్షి, సిటీబ్యూరో: కర్మాగారాల్లో ఉన్న భద్రతా లోపాలపై ప్రతి కార్మికుడు గళం విప్పాలని, భద్రతా కమిటీ సమావేశాల్లో కచ్చితంగా చర్చించాలని రాష్ట్ర ఫ్యాక్టరీస్ డైరెక్టర్, నేషనల్ సేఫ్టీ కౌన్సిల్ తెలంగాణ చాప్టర్ చైర్మన్ బి.రాజగోపాలరావు అన్నారు. 'బిహేవియర్ బేస్డ్ సేఫ్టీ మేనేజ్‌మెంట్ అండ్ సేఫ్టీ కల్చర్'అనే అంశంపై రెడ్‌హిల్స్‌లోని ఫిక్కీలో రెండు రోజులపాటు జరగనున్న సదస్సును ఆయన సోమవారం ప్రారంభించారు. నవీ ముంబైలోని నేషనల్ సేఫ్టీ కౌన్సిల్ ప్రధాన కార్యాలయం, తెలంగాణ చాప్టర్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఈ సదస్సులో రాష్ట్రంలోని వివిధ కర్మాగారాలకు చెందిన 150 మంది ప్రతినిధులు పాల్గొంటున్నారు. గత నెల 30న పాశమైలారం లోని సిగాచీ పరిశ్రమలో జరిగిన ఘోర ప్రమాదంలో అసువులు బాసిన కార్మికులకు ఈ సదస్సు ప్రగాఢ సానుభూతి తెలిపింది. నేషనల్ సేఫ్టీ కౌన్సిల్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ లలిత్ ఆర్. గభానే మాట్లాడుతూ బిహేవియర్ బేస్డ్ సేఫ్టీ అనేది కొత్త టెక్నాలజీనో, కొత్త సైన్సో కాదని అన్నారు. ప్రతి ఉద్యోగి భద్రతకు ప్రాధాన్యమిస్తూ పరిశ్రమను సురక్షితంగా మార్చాలని పేర్కొన్నారు. కొందరు భద్రతా ప్రమాణాలను ఉల్లంఘిస్తున్నారని, సేఫ్టీ ప్రొటోకాల్ తెలిసినా పట్టించుకోకపోవడం వల్లే ప్రమాదాలు జరుగుతున్నాయని అభిప్రాయపడ్డారు.

సీఎం సవాల్‌ను స్వీకరించే స్థాయి కేటీఆర్‌కు లేదు

టీపీసీసీ మీడియా కమ్యూనికేషన్స్ చైర్మన్ రామ్మోహన్ రెడ్డి

నాంపల్లి: రాష్ట్రంలో రైతులను రాజులను చేసిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విస్మరించే అర్హత, నైతికత బీఆర్‌ఎస్ నేతలకు లేదని టీపీసీసీ మీడియా కమ్యూనికేషన్స్ చైర్మన్ సామ రామ్మోహన్ రెడ్డి ధ్వజమెత్తారు. గత పదేళ్లలో రాష్ట్రంలో విధ్వంసం జరిగిందే తప్ప వ్యవసాయానికి ఒరిగిందేమి లేదని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోనే రుణమాఫీ, ఉచిత విద్యుత్ వంటి పథకాలు రైతులకు సకాలంలో అందాయని పేర్కొన్నారు. ఈ పథకాలనే పేర్లు మార్చి బీఆర్‌ఎస్ కొనసాగించిందని ఎద్దేవా చేశారు. వ్యవసాయంపై బీఆర్‌ఎస్ నేతలు చేస్తున్న వ్యాఖ్యలను ఖండిస్తూ సోమవారం గన్‌పార్కు వద్ద కాంగ్రెస్ నేతలు సామ రామ్మోహన్ రెడ్డి, చంద్ర కౌశిక్ యాదవ్, మానవతా రాయ్, యోగీశ్వర్ రెడ్డి, రవళి నిరసన తెలిపారు. రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ రైతాంగం సమస్యలపై కాలయాపన చేస్తున్న బీఆర్‌ఎస్, బీజేపీలను సీఎం రేవంత్ రెడ్డి చర్చకు ఆహ్వానిస్తూ మాజీ సీఎం కేసీఆర్‌కు, ప్రధాని నరేంద్ర మోదీకి సవాలు విసిరితే మాజీమంత్రి కేటీఆర్ స్పందించారని పేర్కొన్నారు. తమ లాంటి చిన్నస్థాయి నేతలే కేటీఆర్ స్థాయికి సరిపోతారని, గత పదేళ్లలో మీరు చేసిన ద్రోహాన్ని వివరిస్తామని అన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని కకావికలం చేసి, కల్వకుంట్ల కుటుంబానికి ఐశ్వర్యంగా మార్చుకున్న కాళేశ్వరం ప్రాజెక్టుపైనా, ఇవ్వకున్నా ఇచ్చినామంటూ చెప్పుకునే కొలువులైనా, ఆత్మహత్యల తెలంగాణగా మార్చిన వైనంపైనైనా బహిరంగ చర్చకు సిద్ధమని చెప్పారు. ఈ నెల 8న సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో నాలుగు గోడల మధ్య కాకుండా ఆత్మబలిదానాలు చేసుకున్న గన్‌పార్కు వద్దకు తాము 7వ తేదీనే చర్చకు వచ్చి కూర్చున్నామని పేర్కొన్నారు.

సీఎం ఇంటి ముట్టడికి పీడీఎస్‌యూ యత్నం



సీఎం ఇంటి ముట్టడికి యత్నించిన వారిని అరెస్టు చేస్తున్న పోలీసులు

బంజారాహిల్స్: పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లకు సంబంధించిన రూ.7,200 కోట్ల బకాయిలను విడుదల చేయాలని, రాష్ట్రంలో అధిక డొనేషన్లు వసూలు చేస్తున్న ఇంజనీరింగ్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇంటి ముట్టడికి యత్నించారు. విద్యార్థి నాయకులు సీఎం ఇంటి వైపు దూసుకెళ్లడంతో ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఈ సందర్భంగా విద్యార్థి నాయకులకు, పోలీసులకు మధ్య తీవ్ర తోపులాట జరిగింది. అనంతరం వారిని జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ జులై 2, 3, 4 తేదీల్లో రాష్ట్ర వ్యాప్తంగా డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్, ప్రొఫెషనల్ కళాశాలల్లో 72 గంటలు బంద్ చేపట్టినప్పటికీ స్పందించకపోవడంతో సీఎం ఇంటి ముట్టడికి పిలుపునిచ్చినట్లు పీడీఎస్‌యూ జాతీయ నాయకుడు పి.మహేష్, రాష్ట్ర అధ్యక్షుడు ఎస్‌వీ శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి పొడపంగి నాగరాజు తెలిపారు. పాలీసెట్ కౌన్సెలింగ్ పూర్తయినప్పటికీ ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఉండటం వల్ల సీటు అలాట్‌మెంట్ ప్రక్రియ ఆగిపోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు బోనగిరి మధు, జన్నారపు రాజేశ్వర్, పోలేకపోయిన కిరణ్, మంద నవీన్, సంతోష్, గోకనపల్లి మస్తాన్, జగజెంపుల తిరుపతి, గుర్రం అజయ్, దుర్గం ప్రణయ్, రానా ప్రతాప్, దీపా లక్ష్మీ ఝాన్సీ, గౌతమ్, సింహాద్రి, గణేష్, మాదారపు నాగరాజు, పవన్, రాజేష్, రెడ్డి చరణ్ పాల్గొన్నారు.

అరుదైన వైరల్ మయోకార్డిటిస్‌తో బాధపడుతున్న శిశువు

విజయవంతంగా చికిత్స చేసిన అంకుర ఆసుపత్రి వైద్యులు

కూకట్‌పల్లి: అరుదైన వైరల్ మయోకార్డిటిస్‌తో బాధపడుతున్న శిశువును ఎక్మో టెక్నాలజీ అందించిన అంకుర ఆసుపత్రి వైద్యులు రక్షించారు. 11 నెలల మాస్టర్ గాజర్ల మోక్షిత్ ప్రాణాంతకమైన, తీవ్రమైన ఫుల్మినెంట్ వైరల్ మయోకార్డిటిస్ అనే గుండెవాపుతో బాధపడుతూ అంకుర ఆసుపత్రి వైద్యులను సంప్రదించారు. దగ్గు, జలుబు శ్వాస తీసుకోవడానికి ఇబ్బంది పడుతున్న మోక్షిత్‌ను ఆసుపత్రిలో చేర్పించారు. వైద్యనిపుణులు అతడికి చికిత్స మొదలు పెట్టగా వెంటనే స్పందించాడని సీనియర్ పీడియాట్రిక్ ఇంటెన్సివిస్ట్ డాక్టర్ తంజిలా అన్నారు. గుండె పనితీరు క్రమంగా మెరుగుపడిందని, ఎక్మో, మెకానికల్ వెంటిలేషన్ నుంచి విజయవంతంగా కాపాడామని తెలిపారు. వైద్య



అరుదైన వ్యాధితో బాధపడిన చిన్నారిని కాపాడిన అంకుర ఆసుపత్రి వైద్యులు

చికిత్స అందించిన వైద్యుల్లో డాక్టర్ సుజిత్, డాక్టర్ నవీద్ ఉన్నారు. అతడు చికిత్స, మందులతో కోలుకున్న తరువాత సోమవారం డిశ్చార్జ్ చేశారు.

సత్వరం నిర్మాణ పనులు ఆపండి

- నెట్‌నెట్ వెంచర్స్‌ను ఆదేశించిన న్యాయస్థానం
- జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆదేశాల్లో జోక్యం చేసుకోలేం

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్‌లోని నందగిరి హిల్స్‌లో నెట్‌నెట్ వెంచర్స్ చేపట్టిన భవన నిర్మాణ పనులను సత్వరం ఆపాలని సిటీ స్మాల్ కాజెస్ కోర్టు ఆదేశించింది. భవన నిర్మాణంలో తీవ్ర ఉల్లంఘనలు ఉన్నాయని అభిప్రాయపడిన న్యాయస్థానం జీహెచ్‌ఎంసీ కమిషనర్ జారీ చేసిన స్టీకింగ్ ఆర్డర్‌ను కొట్టివేయడానికి నిరాకరించింది. పర్యావరణ సమతుల్యత దెబ్బతినేలా నిబంధనలు పట్టించుకోకుండా నిర్మించడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. 'నెట్‌నెట్'పై ఎలాంటి చర్యలు తీసుకోకుండా అధికారులను నిలువరించలేమని తేల్చిచెప్పింది. జీహెచ్‌ఎంసీ అధికారుల చర్యల్లో జోక్యం చేసుకోలేమని, నిబంధనల మేరకు వారు ముందుకు వెళ్లవచ్చని స్పష్టం చేసింది. గతేడాది జూన్ 18న సమర్పించిన విజిలెన్స్ నివేదిక కూడా పిటిషనర్‌కు విరుద్ధంగా ఉందని చెప్పింది. 'నెట్ నెట్'దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేసింది.


నిర్మాణాలను తొలగించాలని జనవరిలో ఆదేశం..


జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 45లోని నందగిరి హిల్స్‌లో జి. అమరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలోని నెట్ నెట్ వెంచర్స్ ప్రైవేట్ లిమిటెడ్ భారీ భవనాన్ని నిర్మిస్తోంది. ఈ స్థలంలో 12 అంతస్తుల నిర్మాణం చేపట్టేందుకు 2013లో జీహెచ్‌ఎంసీ నుంచి అనుమతి పొందింది. ఆ తర్వాత పలు రకాల చర్యలతో జీ ప్లస్ 13 నిర్మాణం 2,09,620 చదరపు అడుగుల్లో చేసుకునేలా అనుమతి పొందింది. ఈ స్థలంలో సెవన్ స్టార్ హోటల్, మల్టీప్లెక్స్, షాపింగ్ మాల్ నిర్మించాలనేది నెట్ నెట్ వెంచర్ ప్రతిపాదన. అలా నిర్మించడం హెచ్‌ఎండీఏ, జీహెచ్‌ఎంసీ పర్యావరణ నిబంధనలకు విరుద్ధం. ఈ నిర్మాణం, తవ్వకాలపై నందగిరి కోఆపరేటివ్ హౌస్సింగ్ సొసైటీ సభ్యులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేయడంతో జీహెచ్‌ఎంసీ కమిషనర్ స్పందించారు. అనుమతించిన ప్లాన్ ప్రకారం కాకుండా చేపట్టిన నిర్మాణాలను తొలగించాలని ఈ ఏడాది జనవరిలో జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆదేశించారు.

కమిషనర్ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ..

జీహెచ్‌ఎంసీ కమిషనర్ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ 'నెట్‌నెట్'కోర్టును ఆశ్రయించింది. ఈ పిటిషన్‌పై చీఫ్ జడ్జి కె.ఖుషా విచారణ చేపట్టారు. వాదనలు విన్న న్యాయమూర్తి బిల్డర్ దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేస్తూ తీర్పునిచ్చారు. జీహెచ్‌ఎంసీ చట్టం-1955 ప్రకారం, కమిషనర్ కోరుకున్నప్పుడు ప్రాంగణాన్ని తనిఖీ చేసి, లోపాలను ఎత్తి చూపే హక్కు ఉంటుందన్నారు. కమిషనర్ లేదా ఇతర అధీకృత అధికారి తీసుకున్న చర్యలపై ఈ కేసులో ఎలాంటి ఇంజక్షన్ ఉత్తర్వులు జారీ చేయలేమన్నారు. ప్రతివాదులు పిటిషనర్ ప్రణాళికకు విరుద్ధంగా నిర్మాణం చేస్తున్నట్లు నిరూపించారని వ్యాఖ్యానించారు.

సాక్షి
11
సిటీ ప్లస్
హైదరాబాద్, మంగళవారం, 8, జూలై, 2025





హైదరాబాద్ ఒక అందమైన నగరం.. ఆధునిక జీవనశైలి, అంతర్జాతీయ కంపెనీలు, గ్లోబల్ సంస్థలు, సినిమాలు మొదలు క్రీడల వరకూ ప్రపంచవ్యాప్తంగా ఖ్యాతి గడించింది భాగ్యనగరం.. వెరసి టాప్ వరల్డ్ సిటీస్‌లో స్థానం సంపాదించుకుంది. ఐతే ఇదంతా నగరానికి ఒక వైపు మాత్రమే.. మరోవైపు నగరం ప్రస్తుతం ప్లాస్టిక్ భూతం గుప్పిట్లో చిక్కుకుపోతోంది. ఆధునిక జీవనశైలిపై వ్యామోహంతో పాటు సౌలభ్యం కోసం ప్లాస్టిక్‌పై అతిగా ఆధారపడే మోడ్రన్ కల్చర్ నగరాన్ని ప్లాస్టిక్ వ్యర్థాల సుడిగుండంలోకి తోసేస్తుంది. ఇది కేవలం నగర పరిశుభ్రత సమస్య మాత్రమే కాదు.. నగరవాసుల ఆరోగ్యం, జీవవైవిధ్యం, జల వనరుల భద్రత పై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తుందని ఇటీవలి పలు పరిశోధనల అత్యవసర హెచ్చరిక. ప్లాస్టిక్ నియంత్రించకపోతే మనం మన నగరంలోనే శ్వాస తీసుకోడానికి ప్రాణం ఫణంగా పెట్టాల్సిన పరిస్థితి. ఇది కేవలం భవిష్యత్తు హెచ్చరిక కాదు.. ఇప్పటికే మొదలైన సంక్షోభం.

- సాక్షి, సిటీబ్యూరో

అందమైన ప్లాస్టిక్ సిటీ..

నగరంలో ప్రతి రోజూ **8,000** టన్నుల వ్యర్థాలు

> ఇందులో 14 శాతం పైగా ప్లాస్టిక్ వ్యర్థాలే
> నగరవాసుల దేహాల్లోకి నానో ప్లాస్టిక్
> జీవన శైలి మార్చడమే ఏకైక మార్గం
> హెచ్చరిస్తున్న పలు అధ్యయనాలు, పరిశోధనలు

ప్రతిరోజూ హైదరాబాద్ నగరం సుమారు 8,000 టన్నుల వ్యర్థాలను ఉత్పత్తి చేస్తోందని అంచనా. ఈ వ్యర్థాల్లో 14 శాతం పైగా ప్లాస్టిక్ ఉండటం శోచనీయం. అంటే రోజుకు సుమారు 1,120 టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు. ఈ ఏడాది ముగింపునాటికి ఇది 9,000 టన్నులకు చేరనుందని అంచనా. ఇదే పరిస్థితి కొనసాగితే రెసిడెన్షియల్ ప్రాంతాల్లో మాత్రమే రోజుకు 495 టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు వచ్చే ప్రమాదం ఉందని ఐసీఎల్ఈఐ- దక్షిణాసియా సూచించింది. ప్రతి ఇంట్లోనూ ప్లాస్టిక్ అంతర్భాగమవుతుండగా, దాని ప్రభావాలు బయటి ప్రపంచాన్ని దిగ్భ్రాంతికి గురిచేస్తున్నాయి.

జీవరాశులకు పెనుముప్పు..

హుసేన్ సాగర్, దుర్గం చెరువు వంటి నగర సరస్సులు ఇప్పుడు సింగిల్-యూజ్ ప్లాస్టిక్‌తో నిండిపోయాయి. ఇందులో సుమారు 70 శాతం వ్యర్థాలు ప్లాస్టిక్ ఉండటం విషాదకర పరిణామం. దీంతో సరస్సుల ఇన్‌లెట్లు, అవుట్‌లెట్లు పూర్తిగా ప్లాస్టిక్‌తో నిండిపోతున్నాయి. నీటి ప్రవాహం ఆగిపోవడం, ఆక్సిజన్ స్థాయిలు పడిపోవడం, చేపల మరణం, గాలి, నీరు రసాయనాలతో కలుషితమవ్వడం వంటి పరిణామాలు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా చేపలు, తాబేళ్లు, సరీసృపాలు, క్షీరదాలతో పాటు ఇతర చిన్న కీటకాల వినాశనానికి దారితీస్తోంది.





జీవవైవిధ్యంపై పెను ప్రభావం..

వానాకాలం వచ్చిందంటే సరస్సుల దగ్గర ఎగ్రెట్లు, హెరాన్లు, కార్మోరెంట్లు వంటి పక్షులు కనిపించేవి. కానీ ఇప్పుడు ఈ ప్లాస్టిక్ వ్యర్థాలు, కవర్లు ఆ జీవుల మనుగడకు పెను ప్రమాదంగా మారాయి. ఆహారంతో పాటు జీర్ణాశయంలోకి చేరి అరగించలేక మృత్యువాత పడుతున్నాయి. కొన్ని పక్షులు గూళ్లు నిర్మించేందుకు ప్లాస్టిక్ వినియోగించడంతో ఆ గూటిలోని పిల్ల పక్షులు ఈ వ్యర్థాలను తిని ప్రాణాలు కోల్పోతున్నాయి. మరోవైపు నగరంలోని కేబీఆర్ పార్కు, నెక్లెస్ రోడ్, మాదాపూర్ వాకింగ్ ట్రాక్‌ల వద్ద ప్లాస్టిక్ మింగిన పెంపుడు కుక్కలు, పిల్లుల గ్యాస్ట్రో బ్లాకేజ్, ఊపిరితిత్తుల ఇబ్బందులతో పాటు ఇతర ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నాయని వెటర్నరీ డాక్టర్లు చెబుతున్నారు. ఈ పరిస్థితుల్లో కొంతమంది నివాసితులు స్వయంగా క్లీనప్ డ్రైవ్స్ నిర్వహించాల్సి వస్తోంది.



మానవ దేహాల్లో నానో ప్లాస్టిక్..

నగరవాసులకు పెట్ బాటిళ్లు, ప్లాస్టిక్ ప్యాకేజింగ్ 'సేఫ్' అనిపించవచ్చు. కానీ, వాటి నుంచి వెలువడే పాలీకార్బొనేట్స్, బిస్ఫినాల్ ఏ, యాంటిమోనీ వంటి రసాయనాలు మన హార్మోన్లను దెబ్బతీస్తాయి. పిల్లల ఎదుగుదలకు అడ్డుపడతాయని ఐఐటీఆర్, సీడీఎస్‌సీఓ, ఎన్‌టీహెచ్ వంటి పరిశోధనలు ఇప్పటికే వెల్లడించాయి. అంతేకాకుండా నగరవాసుల శవ పరీక్షల్లో నానోప్లాస్టిక్.. మెదడు, కాలేయం, మూత్రపిండాల్లో కనిపించడం మరింత ఆందోళనకు గురిచేస్తుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. మరీ ముఖ్యంగా నానోప్లాస్టిక్ పరిమాణం మెదడులో సగటున 171 నానోమీటర్ల వరకూ ఉండడం పరిశోధకులను సైతం దిగ్భ్రాంతికి గురిచేస్తోంది. పాలిథిలిన్, పాలీప్రొపైలిన్ వంటివి మానవ కణజాలాలను దాటి మన శరీర వ్యవస్థను దెబ్బతీసే ప్రమాదం ఉంది.

- హైదరాబాద్ నగరవాసులు ప్లాస్టిక్‌ను తిరస్కరించడం ఒక ప్యాషన్‌గా, బాధ్యతగా మార్చుకోవాలి.
- మట్టితో, కర్రతో, దారంతో చేసిన సహజ ఉత్పత్తులను ప్రోత్సహించాలి.
- జీహెచ్ఎంసీ విధించే సింగిల్-యూజ్ ప్లాస్టిక్ నిషేధాన్ని కఠినంగా అమలు చేయాలి.
- ప్లాస్టిక్ బహిష్కరణ కార్యక్రమాలను పాఠశాలలు, కళాశాలల స్థాయిలో పెంపొందించాలి.
- ప్రతి ప్రాంతంలో స్థానికులు వారం వారం లేక్ క్లీనప్ డ్రైవ్స్ చేపట్టాలి.
- దైనందిన జీవితంలో ప్యాకేజింగ్ ఉత్పత్తులను నివారించాలి. ప్లాస్టిక్ సంచులను, బాటిళ్ల వినియోగాన్ని తగ్గించాలి.

సారా సిటీ మాల్లో జైపూర్ స్టోర్..



సాక్షి, సిటీబ్యూరో : విభిన్న కళలతో పాటు వైవిధ్యమైన జైపూర్ హస్తకళల వారసత్వానికి హైదరాబాద్ వేదికగా నిలుస్తోంది. నగరంలోని సారా సిటీ మాల్ వేదికగా ఆదిత్య బిర్లాకు చెందిన దేశవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన హస్తకళల బ్రాండ్ జైపూర్ స్టోర్ ప్రారంభమైంది. ఇందులో చేతివృత్తులవారు రూపొందించిన వస్తువులు వినియోగదారులను ఆకట్టుకుంటున్నాయి. చందేరి పట్టు నుంచి ఎంబ్రాయిడరీ బోల్డ్ కుట్టు వరకూ ప్రతి వస్తువు ఎంతో కళాత్మకంగా ఉన్నాయి. ఈ సందర్భంగా జైపూర్ వైస్ ప్రెసిడెంట్, బ్రాండ్ హెడ్ మను గుప్తా మాట్లాడారు. ఇలాంటి విశిష్టమైన కళలను ఆదరించడంలో హైదరాబాద్ ముందుంటుందని తెలిపారు. ఈ ప్రాంతంలో క్రాఫ్ట్-లీడ్ డిజైన్ పట్ల పెరుగుతున్న అనుబంధాన్ని ప్రతిబింబిస్తుందని పేర్కొన్నారు.



టాయ్‌కారుకు పేటెంట్

> 14వ పేటెంట్ సాధించిన ఎఫ్‌డీడీఐ
> హైదరాబాద్ ఫ్యాకల్టీ డాక్టర్ రాంబాబు ఘనత



రాయదుర్గం : వినూత్న, సృజనాత్మకతతో కూడిన డిజైన్‌కు పేటెంట్ లభించింది. రాయదుర్గంలోని ఎఫ్‌డీడీఐ-హైదరాబాద్ ఫ్యాకల్టీ డాక్టర్ ముప్పిడి రాంబాబు రూపొందించిన డిజైన్‌ను యార్లగడ్డ ఆంజనేయులు, డాక్టర్ అలోక్ కుమార్‌తో కలిసి రూపకల్పన చేశారు. కోల్‌కతాలోని ఇండియన్ పేటెంట్ మేధోసంపత్తి భవనం ద్వారా ఈ పేటెంట్ ప్రకటించినట్లు రాంబాబు బృందం మంగళవారం వివరించింది. ఈ డిజైన్‌కు నెంబర్ 450244-001, సీబీఆర్ నంబర్ 204566, క్లాస్ 11-02 ను మంజూరు చేసింది. కాగా గైడ్, లీగల్ అండ్ ఐపీఆర్ హెడ్ వ్యవస్థాపకుడు రిసాల్యూట్ 41పీ శుభజిత్‌సాహ సహకారంతో పేటెంట్ కోసం దరఖాస్తు చేశామని రాంబాబు తెలిపారు. దీంతో ఇప్పటి వరకూ 14 పేటెంట్లు పొందినట్లు తెలిపారు. మరో 12 పేటెంట్ల మంజూరుకు డిజైన్‌లను రూపొందించినట్లు వివరించారు.

ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తేజ్‌లోహిత్‌రెడ్డి అభినందన..

పేటెంట్ పొందడం గర్వంగా ఉందని ఎఫ్‌డీడీఐ-హైదరాబాద్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ ఎన్ తేజ్‌లోహిత్‌రెడ్డి తెలిపారు. రాంబాబు బృందం కష్టానికి ప్రతిఫలం దక్కిందన్నారు. ఈ స్ఫూర్తితో మరిన్ని డిజైన్లు రూపొందించి కళాకారులను ప్రోత్సహించాలన్నారు.

ప్రముఖులకు శాంత ట్రస్ట్ పురస్కారాలు

సుల్తాన్‌బజార్ : శాంత బయోటెక్ వ్యవస్థాపకులు పద్మభూషణ్ డాక్టర్ కేఐ.వరప్రసాద రెడ్డి ఆధ్వర్యంలో కొనసాగుతున్న శాంత వసంత ట్రస్ట్-2025 సంవత్సరానికి రెండో విడత సాహితీ పురస్కారాలను సోమవారం ప్రకటించింది. ప్రముఖ వయోలిన్ విద్వాంసులు పద్మశ్రీ డాక్టర్ అన్నవరపు రామస్వామికి వసంత వరప్రసాదరెడ్డి సంగీతరత్న పురస్కారం, ప్రముఖ సాహితీవేత్త ఓలేటి పార్వతీశానికి ఉత్తమ సాహితీవేత్త పురస్కారం ఎమెస్కో ప్రచురణల అధినేత విజయ్‌కుమార్‌కు కోడూరు వెంకటరమణారెడ్డి సాహితీ సేవా రత్న పురస్కారానికి ఎంపికైనట్లు ట్రస్ట్ కార్యవర్గం వెల్లడించింది. ఈ నెల 20న తెలంగాణ సారస్వత పరిషత్‌లో ఈ పురస్కారాలు ప్రదానం చేయనున్నట్లు వెల్లడించారు.


విజయ్‌కుమార్


అన్నవరపు రామస్వామి


ఓలేటి పార్వతీశం



జిమ్‌క్విన్ జిమ్నాస్టిక్స్..

- నగరంలో జాతీయ స్థాయి జిమ్నాస్టిక్స్ ఈవెంట్

సాక్షి, సిటీబ్యూరో: జాతీయ స్థాయి జిమ్నాస్టిక్స్ ఈవెంట్ 'జిమ్‌క్విన్ 2025' రెండో ఎడిషన్ నగరంలోని ది గాడియం స్కూల్లో ఉత్కంఠగా ముగిసింది. దేశంలోని 15 రాష్ట్రాలకు చెందిన వివిధ అకాడమీలు, స్కూల్స్ నుంచి వచ్చిన దాదాపు 850 మంది యువ జిమ్నాస్ట్‌లు రిథమిక్ జిమ్నాస్టిక్స్, డ్యాన్స్ జిమ్నాస్టిక్స్, ఆర్టిస్టిక్ జిమ్నాస్టిక్స్, ఫ్లోర్ రొటీన్స్ గ్రూప్ అక్రోబాటిక్స్ ఈవెంట్లలో తమ ప్రతిభను, అంకితభావాన్ని ప్రదర్శించారు. ఈ పోటీల్లో ఆతిథ్య ది గాడియం స్కూల్ అద్భుత ప్రదర్శనతో అత్యధిక పతకాలను సాధించి అగ్రస్థానంలో నిలిచింది. రెండు రోజుల ఈవెంట్‌లో గాడియం స్కూల్ ఏకంగా 113 స్వర్ణాలు, 150 వెండి, 168 కాంస్యాలతో కలిపి మొత్తం 431 పతకాలను గెలుచుకుంది. తమిళనాడులోని సేలం నుంచి వచ్చిన హై ఫ్లైయర్స్ 231 పతకాలతో (102 స్వర్ణం, 101 వెండి, 28 కాంస్యం) రన్నరప్‌గా నిలిచింది. చెన్నైకి చెందిన జిమ్నోరా 91 స్వర్ణాలు సహా 348 పతకాలతో మూడో స్థానాన్ని దక్కించుకుంది. సోమవారం జరిగిన ముగింపు వేడుకలో ది గాడియం స్కూల్ వ్యవస్థాపకురాలు, డైరెక్టర్ కె. కీర్తి రెడ్డి విజేతలకు మెడల్స్ అందజేశారు.




నృత్యం నయనానందకరం

గన్‌ఫౌండ్రీ : భారతదేశం కళలకు పుట్టినిల్లు అని శాసనమండలి ప్రతిపక్ష నేత ఎస్.మదుసూధనా చారి అన్నారు. రవీంద్రభారతిలో ప్రముఖ నాట్య శిక్షణాలయం కనకదుర్గ నృత్య విభావరి సంస్థ 42వ వార్షికోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాట్య గురువు నిర్మల ప్రభాకర్ శిష్య బృందం వివిధ అంశాలపై చేసిన నృత్య ప్రదర్శనలు అహూతులను ఆకట్టుకున్నాయి. అనంతరం మాట్లాడుతూ.. ప్రాచీన వారసత్వ సంపద అయిన నృత్య కళలను భవిష్యత్తు తరాలకు అందించడంలో సాంస్కృతిక సంస్థల పాత్ర కీలకమన్నారు. కార్యక్రమంలో అక్కినేని నాటక కళాపరిషత్ అధ్యక్షుడు సారిపల్లి కొండల్‌రావు, కథక్ కళాక్షేత్ర డైరెక్టర్ అంజుబాబు, తెలుగు యూనివర్శిటీ ప్రొఫెసర్ వనజ ఉదయ్, యువ కళావాహిణి అధ్యక్షుడు లంకా లక్ష్మీనారాయణ, తెలుగు విశ్వ విద్యాలయం పాలక మండలి సభ్యురాలు నిర్మల ప్రభాకర్ పాల్గొన్నారు.

చిన్ననాటి అభిరుచి సినిమాలవైపు నడిపించింది.. ఆర్కిటెక్చర్ స్టూడెంట్ నుంచి ఆర్ట్ అసిస్టెంట్ డైరెక్టర్‌గా ఎదిగి వెండి తెరపై తన పేరును లిఖించుకుంటోంది.. ఓ వైపు తోట తరణి.. మరోవైపు శేఖర్ కమ్ముల దిశానిర్దేశంలో తన భవితకు బాటలు వేసుకున్నారు ఇంద్రాణి. ప్రస్తుతం ఫిలింనగర్‌లో ఉంటూ అనేక ప్రాజెక్టుల్లో భాగస్వామ్యమవుతున్నారు. - బంజారాహిల్స్

ఆర్కిటెక్చర్ టు అసిస్టెంట్ ఆర్ట్ డైరెక్టర్

> అన్న ప్రసాద్ స్ఫూర్తితో ఆర్ట్ రంగంలోకి
> అమ్మా, నాన్నల సహకారంతోనే
> 'కుబేర'కు వర్క్ చేయడం మర్చిపోలేను..
> సాక్షితో అసిస్టెంట్ ఆర్ట్ డైరెక్టర్ ఇంద్రాణి





ఇంద్రాణి పూర్తి పేరు అక్కరాజు వెంకట నాగ ఇంద్రాణి. పుట్టింది గుంటూరు సిటీ మధ్యతరగతి కుటుంబం. నాన్న శ్రీనివాస్ అమ్మా పద్మావతి. తండ్రి హిందీ టీచర్‌గా పనిచేస్తుండేవారు. కన్నా కాన్సెప్ట్ స్కూల్లో విద్యాభ్యాసం పూర్తి చేశారు. అక్కడే ఇంటర్ కూడా పూర్తి చేశారు. తల్లికి కర్ణాటక సంగీతం, కూచిపూడి పట్ల ఆసక్తి ఉన్నా.. కలగా మిగిలిపోయింది. ఆ కలను కూతురుగా తను నేర్చుకుని పాఠశాల స్థాయి నుండి జిల్లాస్థాయి వరకూ ప్రదర్శనలిచ్చారు. అన్న ప్రసాద్‌తోపాటు బొమ్మలు గీయటం అలవర్చుకుంది.

సినిమాల పట్ల ఆసక్తి..

ఇంట్లో మామయ్య నాటకాలకు దర్శకత్వం వహించడం, మరోవైపు నటిస్తుండడంతో ఎప్పుడూ సందడిగా వుండేది. తండ్రి సాయంతో హిందీ నేర్చుకుంటూ బాలీవుడ్ కథల పట్ల, సంగీతం పట్ల మక్కువ పెరిగింది. షూటింగ్ సమయాల్లో కెమెరా వెనుక జరిగే విషయాల పట్ల ఆసక్తి పెరిగేలా చేశాయి. అనంతరం మసూద సినిమాకు ఆర్ట్ డిపార్ట్‌మెంట్‌లో చేరడం.. ఆర్ట్ డైరెక్టర్ ప్రియం క్రాంతి ప్రోత్సాహంతో డైరెక్షన్ పట్ల ఇష్టంతో కన్యాకులం వెబ్ సిరీస్‌లో, హరిహర వీర మల్లు సినిమాలో డైరెక్షన్ టీంలో ఆర్ట్ పనులను సమన్వయం చేసే బాధ్యతను నిర్వహించింది. డైరెక్టర్ క్రిష్ కుటుంబ సభ్యులు సుహాసిని, రాజు మద్దతుతో, ఆర్ట్ అసిస్టెంట్ అక్బర్ సహకారంతో మెంబర్‌గా అయ్యారు. ఈ క్రమంలో స్నేహితురాలు భార్గవి, ప్రమీల, కష్ణ శశాంక్ అండగా నిలిచారు.

సగానికి ప్రయాణం..

బ్యాచిలర్ ఆఫ్ ఆర్కిటెక్చర్ కోసం జెఎన్ఎఫ్‌యులో చేరడం.. సినిమా సెట్స్ డిజైనింగ్ పట్ల ప్రత్యేక శ్రద్ధతో వాటిని స్టడీ చేయడం.. నెమ్మదిగా స్క్రిప్ట్ రైటింగ్ పట్ల వీకెండ్ కోర్స్ చేయడం.. చకచకా జరిగిపోయాయి. మొదట్లో సినిమాల్లోకి కుటుంబ సభ్యులు నిరాకరించినా తర్వాత ఒప్పించారు. 'కుబేర'లో లాస్ట్ ఆర్ట్ అసిస్టెంట్‌గా జాయిన్ అయ్యారు. బిల్స్, రిఫరెన్సులు, ఫొటోషాప్ డిజైనింగ్‌లు చేశారు. చీఫ్ అసోసియేట్ డైరెక్టర్ అరవింద్ ఏవి, ఈ.పి నాగేశ్వరరావు వల్ల తోట తరణి, శేఖర్ కమ్ముల మరల చేర్చుకున్నారు. అనేక సవాళ్లను అధిగమిస్తూ హైదరాబాద్, ముంబయి వంటి నగరాల్లో లైవ్ లొకేషన్స్‌లో పని నేర్చుకుంటూ పోయారు.





లెజెండరీ మనుషులతో..

చిన్నప్పుడు విడుదలైన అంజలి నుంచి పొన్నియన్ సెల్వన్ వరకూ పద్మశ్రీ తోట తరణి వర్క్ ఎంతగానో ఇష్టపడడం, ఆయన నీడలో నిలబడటం ఎప్పుడూ ఆశ్చర్యపరిచే విషయమే. ఆయన స్కెచ్ వేస్తుంటే ప్రతిసారీ విస్మయానికి గురవ్వడం.. ఆర్డినరీ వస్తువులతో అద్భుతాలు సృష్టిస్తుండడం నేర్చుకున్నా.. ఆనంద్, గోదావరి సినిమాలు చూస్తూ పెరిగా. కట్‌చేస్తే శేఖర్ కమ్ముల సెట్‌లో ప్రతిరోజు పేరు పెట్టి పలకరించడం ఆనందం అనిపించింది. కుబేర గొప్ప అవకాశం కల్పించింది.

- ఇంద్రాణి, అసిస్టెంట్ ఆర్ట్ డైరెక్టర్





క్లుప్తంగా...

కుంగిన బ్యారేజీ నుంచి ఎత్తిపోయాలంటారా?

- మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: మోటార్లు ఆన్ చేసి పొలాలకు నీళ్లు ఇవ్వాలని అడుగుతుంటే.. కుంగిన బ్యారేజీ నుంచి ఎత్తిపోయాలని అంటున్న ఇరిగేషన్‌శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తీరు బోడిగుండుకు, మోకాలికి ముడిపెట్టినట్లు ఉందని మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ఎద్దేవాచేశారు. కన్నెపల్లి పంప్ హౌస్ మినిమం డ్రా లెవెల్ 93.5 మీటర్లు అయితే 96 మీటర్ల ఎత్తున నీళ్లు ప్రవహిస్తున్నాయని, కన్నెపల్లి పంప్‌హౌస్ మోటార్లు ఆన్ చేసి నీటిని ఎత్తిపోయాలని డిమాండ్ చేస్తుంటే బురద రాజకీయాలు మాట్లాడటం ఏంటని మండిపడ్డారు. అసలు బ్యారేజీకి, మోటార్లు ఆన్ చేయడానికి ఏమైనా సంబంధం ఉందా అని ప్రశ్నించారు. 19 నెలల పాలనలో ఒక్క ప్రాజెక్టు కట్టారా? ఒక్క చెక్ డ్యాం నిర్మించారా? ఒక్క చెరువు పూడిక తీశారా? కొత్తగా ఒక్క ఎకరాకు నీళ్లిచ్చారా? అని ప్రశ్నించారు. మే 30న శ్రీశైలానికి వరద వస్తే ఇప్పటివరకు కల్వకుర్తి మోటార్లు ఎందుకు ఆన్ చేయలేదని నిలదీశారు. కాంగ్రెస్ నిర్లక్ష్యం వల్ల వచ్చే కృత్రిమ కరువుకు మొత్తం కాంగ్రెస్ ప్రభుత్వం బాధ్యత వహించాల్సి ఉంటుందని వేముల హెచ్చరించారు.

రాష్ట్రాభివృద్ధికి కేంద్రం రూ.12 లక్షల కోట్లు ఇచ్చింది

- పొన్నం విమర్శలను ఖండిస్తున్నాం: బీజేపీ ఎమ్మెల్సీ అంజిరెడ్డి



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ అభివృద్ధి కోసం కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ఇప్పటివరకు రూ.12 లక్షల కోట్ల నిధులు ఇచ్చిందని బీజేపీ ఎమ్మెల్సీ అంజిరెడ్డి తెలిపారు. సోమవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం పైసా కూడా ఇవ్వలేదని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. 2014 నుంచి ఇప్పటివరకు కేంద్ర ప్రభుత్వం తెలంగాణ అభివృద్ధికి రూ.12 లక్షల కోట్లు మంజూరు చేసిందని, ఈ నిధులతో చేసిన పనులు, చేపట్టిన కార్యక్రమాలకు సంబంధించి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పూర్తి వివరాలతో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారని గుర్తు చేశారు. కేంద్రం నిధులు మంజూరు చేసినా, రాష్ట్ర ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంట్ ఇవ్వకపోవడంతోనే పలు పనులు ఆగిపోయాయన్నారు. మోదీ ప్రభుత్వం 2,600 కిలోమీటర్ల జాతీయ రహదారులు నిర్మించిందని, 40 రైల్వే స్టేషన్ల ఆధునీకరణ తదితర ఎన్నో ప్రాజెక్టులు ఇప్పటికే పూర్తయ్యాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి ప్రధానంగా కేంద్రం నిధులతో సాధ్యమైందని అంజిరెడ్డి వివరించారు.

9న కాళేశ్వరంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్

సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌ల వైఫల్యానికి కారణాలు, వాటి పునరుద్ధరణకు తీసుకోవలసిన చర్యలపై నీటిపారుదల శాఖ మంత్రి ఎస్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఈ నెల 9న మధ్యాహ్నం 3 గంటలకు ప్రజాభవన్‌లో పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇవ్వనున్నారు. బరాజ్‌లు ఇంకా ప్రమాదకరంగానే ఉండటంతో.. వాటిలో నీళ్లు నింపరాదని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్‌ఏ) నిపుణుల కమిటీ స్పష్టం చేసింది. మరోవైపు మేడిగడ్డ బరాజ్ నుంచి నీళ్లను కన్నెపల్లి పంప్‌హౌజ్ ద్వారా ఎత్తిపోయాలని బీఆర్‌ఎస్ పార్టీ పదేపదే డిమాండ్ చేస్తోంది. ఈ నేపథ్యంలో ప్రజాప్రతినిధులకు వాస్తవాలను వివరించడానికి పవర్ పాయింట్ ప్రజంటేషన్‌ను ఇవ్వాలని మంత్రి ఉత్తమ్ నిర్ణయించారు. కార్యక్రమంలో సీఎం రేవంత్, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు పాల్గొంటారు.

తెలంగాణలో ఖేలో ఇండియా

గేమ్స్ నిర్వహించండి

- క్రీడాభివృద్ధికి రూ.100 కోట్లు కేటాయించండి
- ఒలింపిక్స్ ఈవెంట్లను రాష్ట్రంలో నిర్వహించండి
- కేంద్రమంత్రి మన్‌సుఖ్ మాండవీయకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వినతి
- రేవంత్‌ను కలిసిన బాలీవుడ్ నటుడు అజయ్ దేవగణ్, భారత జట్టు మాజీ కెప్టెన్ కపిల్‌దేవ్
- నేడు కేంద్రమంత్రులు రాజ్‌నాథ్, అశ్వినీవైష్ణవ్‌ను కలవనున్న సీఎం




కేంద్ర మంత్రి మన్‌సుఖ్ మాండవీయతో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ: ఖేలో ఇండియా గేమ్స్–2026ను తెలంగాణలో నిర్వహించాలని కేంద్ర క్రీడలు, యువజన వ్యవహారాల శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఖేలో ఇండియాతోపాటు జాతీయ, అంతర్జాతీయ క్రీడలకు ఆతిథ్యమిచ్చే అవకాశాన్ని పరిశీలించాలని కేంద్రమంత్రిని సీఎం కోరారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా సోమవారం మాండవీయను ఆయన అధికారిక నివాసంలో సీఎం రేవంత్‌రెడ్డి కలిశారు. ఖేలో ఇండియా కింద రాష్ట్రంలో క్రీడా మౌలిక వసతుల అభివృద్ధి, క్రీడాకారుల శిక్షణ, క్రీడా నిపుణుల ఎంపిక ఇతర కార్యక్రమాలకు నిధులు కేటాయించాలని కోరారు.

రూ.100 కోట్లు కేటాయించండి

రాష్ట్రంలోని పలు జిల్లాల్లో క్రీడాభివృద్ధి, మౌలిక సదుపాయాల కోసం రూ.100 కోట్లు కేటాయించాలని మాండవీయను రేవంత్ కోరారు. భువనగిరిలో సింథటిక్ అథ్లెటిక్ ట్రాక్, మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం, రాయగిరిలో స్విమ్మింగ్ పూల్, పాలమూరు యూనివర్సిటీలో సింథటిక్ అథ్లెటిక్ ట్రాక్, శాతవాహన వర్సిటీలో మల్టీపర్పస్ హాల్, హైదరాబాద్ హకీంపేట్‌లో అర్చరీ రేంజ్, సింథటిక్ హాకీ ఫీల్డ్, ఎల్బీ స్టేడియంలో స్క్వాష్ కోర్టు, నేచురల్ ఫుట్‌బాల్ ఫీల్డ్ అభివృద్ధి, సింథటిక్ ట్రాక్, గచ్చిబౌలిలో హాకీ గ్రౌండ్ నవీకరణ, మహాత్మాగాంధీ వర్సిటీలో సింథటిక్ అథ్లెటిక్ ట్రాక్ నిర్మాణాలకు నిధులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. 2036లో దేశంలో నిర్వహించే ఒలింపిక్స్‌లో కనీసం రెండు ఈవెంట్లనైనా తెలంగాణలో నిర్వహించాలని కోరారు. జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు గతంలో మాదిరిగానే రైలు ప్రయాణ చార్జీల్లో రాయితీ ఇవ్వాలన్నారు. కేంద్రమంత్రులు రాజ్‌నాథ్‌సింగ్, అశ్వినీ వైష్ణవ్‌ను మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి కలవనున్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (క్రీడలు) ఏపీ.జితేందర్ రెడ్డి, ఎంపీలు మల్లు రవి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

క్రీడారంగాభివృద్ధికి తీసుకుంటున్న చర్యలు భేష్: కపిల్‌దేవ్



తెలంగాణలో సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజాప్రభుత్వం క్రీడారంగ అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలను భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ కపిల్‌దేవ్ ప్రశంసించారు. ఢిల్లీలో రేవంత్‌ను కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు, క్రీడాభివృద్ధికి తమ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను రేవంత్ కపిల్‌దేవ్‌కు వివరించారు. తాను ఈ విషయాల్లో భాగస్వామినవుతానని కపిల్‌దేవ్ ముఖ్యమంత్రికి తెలియజేశారు. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి అజిత్‌రెడ్డి, కేంద్ర పథకాల సమన్వయ కార్యదర్శి డాక్టర్ గౌరవ్‌ఉప్పల్ పాల్గొన్నారు.

ఫిల్మ్ స్టూడియో ఏర్పాటుకు అవకాశం ఇవ్వండి: అజయ్ దేవగణ్

తెలంగాణలో అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో కూడిన ఫిల్మ్ స్టూడియో ఏర్పాటుకు అవకాశం కల్పించాలని సీఎం రేవంత్‌రెడ్డికి బాలీవుడ్ నటుడు, నిర్మాత అజయ్ దేవగణ్ విజ్ఞప్తి చేశారు. సీఎంను ఢిల్లీలో కలిశారు. తెలంగాణ సహా వివిధ రంగాల అభివృద్ధికి తాము తీసుకుంటున్న చర్యలను సీఎం రేవంత్.. అజయ్ దేవగణ్‌కు వివరించారు. తెలంగాణ రైజింగ్‌కు సంబంధించి మీడియా, సినిమా రంగాలకు ప్రచారకర్తగా ఉంటానని అజయ్ దేవగణ్ ముఖ్యమంత్రికి తెలియజేశారు.

మహిళలకు 60 ఎమ్మెల్యే సీట్లు

▶ మొదటి పేజీ తరువాయి

కలిసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రుద్రాక్ష మొక్కను నాటడం ద్వారా వనమహోత్సవం–2025 కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

ఇంటింటా రెండేసి మొక్కలు..

తల్లి పేరుతో ఒక మొక్కను నాటాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చారని.. దీన్ని స్వాగతిస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారు. ఈ కోవలోనే రాష్ట్రంలోని తల్లులంతా వారి పిల్లల పేరుతో ఇళ్ల ఆవరణలో రెండేసి మొక్కలు నాటాలని ఆయన పిలుపునిచ్చారు. మొక్కలను పిల్లల్లాగే సంరక్షిస్తే తెలంగాణ రాష్ట్రమంతా పచ్చదనంతో నిండిపోతుందన్నారు. రాష్ట్రంలో ఈ ఏడాది అటవీ శాఖ ఆధ్వర్యంలో 18 కోట్ల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. ప్రకృతిని మనం కాపాడితే ప్రకృతి మనల్ని కాపాడుతుందని.. వర్షాలు సమృద్ధిగా కురుస్తాయన్నారు.

ఆడబిడ్డల ఆత్మగౌరవం కోసం..

ఇందిరమ్మ రాజ్యంలో ఆడబిడ్డలు ఆత్మగౌరవంతో జీవించేలా చర్యలు తీసుకుంటున్నామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ఒకప్పుడు సోలార్ పవర్ ప్రాజెక్టులను అదానీ, అంబానీలు మాత్రమే ఏర్పాటు చేసేవారని.. కానీ తాము మూడేసి మెగావాట్ల సౌరవిద్యుత్ ప్రాజెక్టులను మహిళా స్వయం సేవా సంఘాలకు అప్పగిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ బాధ్యతను ఆడబిడ్డలకు అప్పగించామని.. ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడమే కాకుండా ఆర్టీసీకి వెయ్యి బస్సులను అద్దెకు ఇచ్చేలా ప్రోత్సహించి వారిని బస్సులకు యజమానులను చేశామని సీఎం వివరించారు. హైటెక్ సిటీలో విప్రో, మైక్రోసాఫ్ట్ లాంటి సంస్థలు ఉండేచోట 3.5 ఎకరాల స్థలాన్ని మహిళా స్వయం సేవా సంఘాలకు కేటాయించి వారు తయారుచేసిన ఉత్పత్తులను విక్రయించడానికి వీలు కల్పించామని చెప్పారు. ఈ ఏడాది మహిళా సంఘాలకు బ్యాంకుల ద్వారా రూ. 21 వేల కోట్ల మేర రుణాలు అందించామని తెలిపారు.

చెట్లు పెంచితేనే సకాలంలో వర్షాలు: మంత్రి కొండా సురేఖ

చెట్లను కాపాడితే అవి మనల్ని కాలుష్యం నుంచి కాపాడతాయని, జీవవైవిధ్యాన్ని రక్షించుకోవడంలో దోహదపడతాయని అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. చెట్లను పెంచడం ద్వారానే వర్షాలు సకాలంలో కురుస్తాయని చెప్పారు. వనమహోత్సవం కార్యక్రమంలో 100 శాతం మొక్కలు నాటి వాటిని కాపాడేందుకు రాష్ట్రంలోని ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా అటవీశాఖ, వ్యవసాయ విశ్వవిద్యాలయం సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి ముఖ్య మంత్రి రేవంత్, మంత్రి కొండా సురేఖ తిలకించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యేలు ప్రకాశ్‌గౌడ్, కాలె యాదయ్య, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు, జీహెచ్‌ఎంసీ డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్, కమిషనర్ కర్ణన్, జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్, వీసీలు జానయ్య, రాజిరెడ్డి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో సంస్థాగత సందడి

- త్వరలోనే గ్రామస్థాయి నుంచి జిల్లా పార్టీ అధ్యక్షుల వరకు అన్ని నియామకాలు పూర్తి
- ఉమ్మడి జిల్లాల వారీగా ఇన్‌చార్జ్‌లను నియమించిన టీపీసీసీ చీఫ్
- పార్టీ పదవుల భర్తీకి వెంటనే రంగంలోకి దిగాలని ఆదేశించిన మీనాక్షి

సాక్షి, హైదరాబాద్: సంస్థాగత నిర్మాణంపై కాంగ్రెస్ పార్టీ పూర్తిస్థాయిలో దృష్టి సారించింది. గ్రామస్థాయి నుంచి మండల, బ్లాక్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుల నియామకాలను త్వరలోనే పూర్తి చేసే పనిలో పడింది. ఈ మేరకు ఏఐసీసీ నుంచి స్పష్టమైన ఆదేశాలు రావడంతో వీలున్నంత త్వరగా ఈ పదవులను భర్తీ చేసే కార్యాచరణను టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్‌గౌడ్ రూపొందించారు. ఇప్పటికే లోక్‌సభ నియోజకవర్గాల వారీగా టీపీసీసీ ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులను ఇన్‌చార్జులుగా నియమించిన ఆయన తాజాగా మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, సీనియర్ నేతలకు ఉమ్మడి జిల్లాల వారీగా బాధ్యతలు అప్పగించారు. పార్టీ సంస్థాగత నిర్మాణమే ఎజెండాగా వీరు పనిచేయాల్సి ఉంటుందని సోమవారం జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

మీనాక్షి.. జూమ్ మీటింగ్: సంస్థాగత పదవుల భర్తీ విషయమై ఉమ్మడి జిల్లాల ఇన్‌చార్జులతో రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ సోమవారం జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా సమావేశమయ్యారు. ఈ పదవుల నియామకానికి అవసరమైన విధివిధానాలను ఈ కాన్ఫరెన్స్‌లో ప్రకటించిన ఆమె.. వెంటనే ఉమ్మడి జిల్లాల ఇన్‌చార్జులు రంగంలోకి దిగాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు మంగళవారం నుంచే ఉమ్మడి జిల్లాల ఇన్‌చార్జుల కార్యాచరణ మొదలవుతుందని, మండల, బ్లాక్, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుల నియామకం కోసం జిల్లా పార్టీ పరిశీలకులు ఇచ్చిన జాబితాలను పరిశీలించి ఫైనల్ చేసే పనిలో పడతారని గాంధీభవన్ వర్గాలు వెల్లడించాయి.

ఉమ్మడి జిల్లాల ఇన్‌చార్జులు వీరే

జిల్లా	ఇన్‌చార్జ్
ఖమ్మం	చల్లా వంశీచంద్‌రెడ్డి
నల్లగొండ	ఎస్.సంపత్‌కుమార్
వరంగల్	అడ్లూరి లక్ష్మణ్‌కుమార్
మెదక్	పొన్నం ప్రభాకర్
హైదరాబాద్	టి.జగ్గారెడ్డి
మహబూబ్‌నగర్	జెట్టి కుసుమకుమార్
ఆదిలాబాద్	ఎం.అనిల్‌కుమార్‌యాదవ్
కరీంనగర్	అద్దంకి దయాకర్
నిజామాబాద్	అజ్మతుల్లా హుస్సేనీ
రంగారెడ్డి	కె. శివసేనారెడ్డి

సత్వరం ఇరిగేషన్ ఇంజనీర్లకు పదోన్నతులు

మంత్రి ఉత్తమ్ ఆదేశం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర నీటిపారుదల శాఖలో సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న పదోన్నతుల సమస్యను సత్వరంగా పరిష్కరించి ఇంజనీర్లకు పదోన్నతులు జారీ చేయాలని ఆ శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఆదేశించారు. ఏఈ నుంచి ఈఎన్సీ స్థాయి వరకు అన్ని స్థాయిల్లో పదోన్నతులు కల్పించాలని సూచించారు. పదోన్నతుల సమస్యపై సోమవారం ఆయన ఇక్కడ సమీక్ష నిర్వహించారు. విజిలెన్స్ కేసుల్లో విచారణ ఎదుర్కొంటున్న ఇంజనీర్లు మినహా.. మిగిలిన వారికి పదోన్నతులు కల్పించడానికి సత్వరంగా శాఖాపరమైన పదోన్నతులు కమిటీ (డీపీసీ) సమావేశాలు నిర్వహించాలని ఆదేశించారు. ఇటీవల కాలంలో పెద్ద సంఖ్యలో ఇంజనీర్లు ఉద్యోగ విరమణ చేయడంతో.. ఖాళీ అయిన పోస్టులను సత్వరం పూర్తి స్థాయి ఇంజనీర్లతో భర్తీ చేయాలని ఆదేశించారు.


వరద నీరు వాడుకొమ్మంటే విమర్శలా?

- కాంగ్రెస్‌పై ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా మాజీ ఎమ్మెల్యేల ధ్వజం

సాక్షి, హైదరాబాద్: శ్రీశైలం జలాశయానికి వరద వచ్చి 35 రోజులు కావస్తున్నా.. నీటిని వాడుకోవడం లేదని, వెంటనే ఎత్తిపోతల ప్రాజెక్టుల మోటార్లు ఆన్ చేయాలని మాజీ మంత్రి హరీశ్‌రావు చేసిన సూచనను కాంగ్రెస్ తప్పుపడుతోందని బీఆర్‌ఎస్ మాజీ మంత్రి సి.లక్ష్మారెడ్డి విమర్శించారు. హరీశ్‌రావు గతంలో నీటిపారుదల శాఖ మంత్రిగా పెండింగు ప్రాజెక్టులను రన్నింగ్ ప్రాజెక్టులుగా మార్చడంతో పాటు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో పది లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించడంలో కీలకపాత్ర పోషించారని అన్నారు. బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, మర్రి జనార్దన్‌రెడ్డి, అంజయ్యయాదవ్, జైపాల్‌యాదవ్ తదితరులతో కలసి మాజీ మంత్రి లక్ష్మారెడ్డి సోమవారం తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ నేతలు కట్టుకథలతో ప్రజలను ఎక్కువ కాలం నమ్మించలేరని, స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు వారికి బుద్ధి చెప్తారని లక్ష్మారెడ్డి హెచ్చరించారు. హరీశ్‌రావుపై కాంగ్రెస్ ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని ఆల వెంకటేశ్వర్‌రెడ్డి మండిపడ్డారు. మోటార్లు ఆన్ చేయమని సూచించిన హరీశ్‌రావుపై, సీఎం రేవంత్ మెప్పు కోసం మధుసూదన్‌రెడ్డి బూతులు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో కాంగ్రెస్ ప్రభుత్వం తట్టెడు మట్టి కూడా తీయలేదని జైపాల్‌యాదవ్ విమర్శించారు. సీఎం రేవంత్, కాంగ్రెస్ నేతలకు కేసీఆర్‌ను దూషించడం మినహా మరో పనిలేదని మర్రి జనార్దర్‌రెడ్డి ఎద్దేవా చేశారు. అబద్ధాలు ఆడటంలో సీఎం రేవంత్‌తో కాంగ్రెస్ నేతలు పోటీ పడుతున్నారని అంజయ్యయాదవ్ మండిపడ్డారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇలాంటి అసమర్థ సీఎంను ఇప్పటి వరకు చూడలేదు

- కేసీఆర్ వల్లే రేవంత్‌కు సీఎం కుర్చీలో కూర్చునే భాగ్యం దక్కింది : కేటీఆర్
- బీఆర్‌ఎస్‌లో చేరిన మెదక్ నియోజకవర్గ కాంగ్రెస్ నేతలు



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న హరీశ్‌రావు. చిత్రంలో కేటీఆర్, పద్మాదేవేందర్‌రెడ్డి తదితరులు

సాక్షి, హైదరాబాద్: ఉమ్మడి ఏపీతోపాటు తెలంగాణలో రేవంత్‌రెడ్డి లాంటి అసమర్థ ముఖ్యమంత్రిని చూడలేదని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. ఆయనకు కర్రు కాల్చి వాత పెట్టాల్సిన సమయం వచ్చిందని వ్యాఖ్యానించారు. ఎన్టీఆర్, వైఎస్.రాజశేఖరరెడ్డి, రోశయ్య లాంటి ముఖ్యమంత్రుల పాలనను చూసిన ప్రజలు.. రేవంత్ పాలన తీరును ఛీ కొడుతున్నారన్నారు. చరిత్రలో ఎన్నడూలేని రీతిలో సీఎం స్థాయిలో ఉన్న రేవంత్‌ను ప్రజలు దూషిస్తున్నారని చెప్పారు. పరువు కలిగిన నాయకుడైతే రేవంత్ ఇప్పటికే ఆత్మహత్య చేసుకొనేవాడని కేటీఆర్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో మెదక్‌కు చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు, మాజీ కౌన్సిలర్లు సోమవారం బీఆర్‌ఎస్‌లో చేరారు. తెలంగాణభవన్‌లో జరిగిన ఈ చేరికల కార్యక్రమానికి కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. 'రూ. 2 లక్షల రుణమాఫీ అని హామీ ఇచ్చి అధికారంలోకి రాగానే ప్లేటు ఫిరాయించి రూ.12 వేల కోట్లకు పరిమితం చేశాడు. రైతుభరోసా ఎకరాకు రూ.15 వేలు ఇస్తానని రూ.12 వేలకు కుదించాడు. హామీలు నెరవేర్చకుండా వంద సీట్లు గెలుస్తామని బీరాలు పలుకుతున్నాడు. కేసీఆర్ తెలంగాణ తీసుకురావడం వల్లే రేవంత్‌కు ముఖ్యమంత్రి కుర్చీలో కూర్చునే అవకాశం దక్కింది. సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్న వారిపై కేసులు పెట్టి హింసించడమే ఇందిరమ్మ రాజ్యమా. తెలంగాణ రక్తంలోనే తిరుగుబాటు స్వభావం ఉంటుంది. స్థానిక ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అన్ని చోట్లా విజయం సాధిస్తుంది'అని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు.

ఉత్తమ్‌కు నిజం మాట్లాడే ధైర్యం లేదు: హరీశ్‌రావు

కాళేశ్వరం ప్రాజెక్టు మోటార్లు ఆన్ చేయాలని కోరితే నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అబద్ధాలు మాట్లాడుతున్నారని మాజీ మంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు. ఆయనకు నిజం మాట్లాడే ధైర్యం లేదని, శ్రీశైలం ప్రాజెక్టుకు వరద వచ్చి 36 రోజులు అవుతున్నా మోటార్లు ఆన్ చేయడం లేదన్నారు. పోతిరెడ్డిపాడు కాల్వ ద్వారా ఏపీ ప్రభుత్వం నీళ్లు తీసుకుపోతున్నా కల్వకుర్తి ప్రాజెక్టు మోటార్లను తెలంగాణ ప్రభుత్వం ఆన్ చేయడం లేదని చెప్పారు. లక్షలాది క్యూసెక్కుల నీరు గోదావరిలో దిగువకు ప్రవహిస్తున్నా ప్రభుత్వం చేతకానితనాన్ని బయట పెట్టుకుంటోందన్నారు. నీళ్లు ఆంధ్రాకు నిధులు ఢిల్లీకి అన్నట్టుగా రేవంత్ పాలన సాగుతోందని చెప్పారు. కాగా, కాంగ్రెస్ పార్టీ నుంచి జీవన్, గంగా నరేందర్, మైనంపల్లి రంగారావు బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు పి.శశిధర్‌రెడ్డి, మర్రి జనార్దన్‌రెడ్డి, రావుల చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి, పార్టీ నాయకులు బట్టి జగపతి, మల్లికార్జున్‌గౌడ్ పాల్గొన్నారు.

పుట్టిన రోజున వినూత్న కానుకలిస్తా: కేటీఆర్

సిరిసిల్ల: తన పుట్టిన రోజు సందర్భంగా రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఈ ఏడాది వినూత్న కానుకలను అందించనున్నట్లు బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కె.తారక రామారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూలై 24న తన జన్మదినం సందర్భంగా మానవీయ కార్యక్రమాలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. పద్దెనిమిది నెలలుగా.. రాజన్న సిరిసిల్ల జిల్లావ్యాప్తంగా 4,910 మంది బాలింతలకు కేసీఆర్ కిట్లను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. 2020లో కరోనా సమయంలో 'గిఫ్ట్ ఏ స్మైల్' ద్వారా.. ప్రభుత్వ ఆస్పత్రులకు తన అనుచరులు, కార్యకర్తలు 108 అంబులెన్స్ వాహనాలను అందించారని కేటీఆర్ గుర్తు చేశారు.

కిరికిరి శాఖలన్నీ నాకే ఇచ్చిర్రు..

- ఇది అదృష్టమో.. దురదృష్టమో పొన్నమన్నే చెప్పాలె
- పదేళ్లు కిందా మీదా చేసినంక నా చేతిలో పెట్టి పోయిర్రు
- కరీంనగర్‌లో మంత్రి వాకిటి శ్రీహరి వ్యాఖ్యలు
- మంత్రి వ్యాఖ్యలపై కాంగ్రెస్ నేతల్లో మిశ్రమ స్పందన



మాట్లాడుతున్న మంత్రి శ్రీహరి. చిత్రంలో మంత్రి పొన్నం తదితరులు

సాక్షిప్రతినిధి, కరీంనగర్: 'రాష్ట్రంలో కిరికిరి శాఖలన్నీ నాకే ఇచ్చిర్రు.. ఇది అదృష్టమో.. దురదృష్టమో మంత్రి పొన్నమన్నే చెప్పాలి. గత ప్రభుత్వం పదేళ్లలో అవినీతి, గడబిడ చేసి చేతిలో పెట్టి పోయిర్రు. ఇపుడు నేను దాంట్ల కిరికిరి కనుక్కోవాల్నా. లేక కొత్తగ పనిచేయాల్నా?'అంటూ మంత్రి వాకిటి శ్రీహరి ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం కరీంనగర్ జిల్లా కేంద్రంలో మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలసి పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న శ్రీహరి.. అనంతరం మత్స్యకారుల సమావేశంలో చిత్రవిచిత్ర వ్యాఖ్యలు చేశారు. 'గత ప్రభుత్వం మత్స్యశాఖను కేవలం డబ్బులు సంపాదించే ఏటీఎం కార్డులా వాడుకుంది. మత్స్యశాఖ ఈ రోజు ఇబ్బంది పడటానికి గతంలో జరిగిన అవినీతే కారణం. 1952లో ఈ వ్యవస్థ పుట్టినప్పటి నుంచీ అదే కులానికి మంత్రిగా బాధ్యతలు ఇచ్చిన సందర్భం ఎప్పుడూ లేదు. మన ప్రభుత్వంలో సీఎం రేవంత్.. ఈ శాఖను ముదిరాజ్ బిడ్డకు ఇచ్చారు. ఆయన నాపై ఉంచిన నమ్మకాన్ని పూర్తిస్థాయి బాధ్యతతో నెరవేరుస్తా..! బాధ్యతలు చేపట్టాక ఇప్పటివరకూ.. మత్స్యశాఖపై నాలుగు లేదా ఐదు సమీక్షలు చేశాను. మత్స్యశాఖను ఆదర్శంగా తీర్చిదిద్దే ప్రయత్నం చేస్తానని మాట ఇస్తున్నా. నాకిచ్చిన శాఖలన్నీ ఎట్లున్నయంటే.. అదృష్టమో.. దురదృష్టమో కానీ.. మన పొన్నం అన్న చెప్పాలె. గడబిడ అయినంక నాకు ఇచ్చిర్రు. 10 ఏళ్లు కిందామీదా చేసినంక నా చేతిలో పెట్టి పోయిర్రు. ఇదొక్కటే కాకుండా యానిమల్ హస్బెండరీ (పశుసంవర్ధక శాఖ) కూడా నాకే ఇచ్చారు. దాంట్ల గొర్లు, బర్లు.. అన్నీ కిరికిరి అయినంక నా చేతిలో పెట్టిర్రు. నేను దాంట్ల కిరికిరి కనుక్కోవాల్నా.. కొత్తగ పనిచేయాల్నా. అర్థం కాని పరిస్థితి. కాబట్టి ఎంత క్లిష్టమైన పరిస్థితుల్లో నాకిచ్చారో.. అంతే అద్భుతంగా పనిచేస్తా'అని పేర్కొన్నారు. అదే సమయంలో వేదికపై కొందరు స్పోర్ట్స్ శాఖ గురించి లేవనెత్తారు. వెంటనే మంత్రి అందుకుంటూ.. 'స్పోర్ట్స్ ఒక్కటే కాదు నాకిచ్చిన ఐదు (శాఖలు) అట్లనే ఇచ్చిర్రు.. అంతేనా కాదా?'అంటూ సభికులను ప్రశ్నించారు.

అదే గొర్రె బయటికి.. అదే గొర్రె లోపలికి..

'తెలంగాణ వచ్చిందే నీళ్లు, నిధులు, నియామకాల మీద. దాంట్ల గతంలో నియామకాలు ఎవరికీ ఇయ్యలేదు. కానీ, యూత్ సర్వీసెస్ పెట్టి.. నన్ను ఎంప్లాయ్‌మెంట్ జనరేట్ చేయమని ఆదొకశాఖ ఇచ్చిర్రు. గొర్ల విషయంలో ఈ రాష్ట్రంలో ఏం జరిగిందో అందరికీ తెలుసు. అదే గొర్రె బయటికి వస్తే..అదే గొర్రె లోపలికి పోతది. ఆ శాఖ కూడా నాకే ఇచ్చిర్రు'అంటూ మంత్రి శ్రీహరి వ్యాఖ్యానించారు. మంత్రి వ్యాఖ్యలపై ఇపుడు సొంత పార్టీ కాంగ్రెస్‌లోనే మిశ్రమ స్పందన వ్యక్తమవుతోంది. మంత్రి శ్రీహరి చేసిన వ్యాఖ్యలు తప్పుడు సంకేతాలు ఇచ్చేలా ఉన్నాయని ఒక వర్గం విమర్శిస్తుంటే.. అలాంటిదేమీ లేదని ఆయన భావ వ్యక్తీకరణలో లోపం ఉండొచ్చు గానీ, ఆయన గత ప్రభుత్వం అవినీతినే ఎండగట్టారని మరోవర్గం సమర్థిస్తోంది. మొత్తానికి మంత్రి వ్యాఖ్యల వీడియో ఇపుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

మన హక్కులు పక్క రాష్ట్రానికి తాకట్టు

- బీఆర్‌ఎస్‌పై మంత్రి పొంగులేటి ఫైర్



మన్ననూర్: రాష్ట్రంలో పేదల కష్టాలు తీర్చడం కోసమే సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో ఇందిరమ్మ ప్రభుత్వం ఏర్పడిందని రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖమంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం నాగర్‌కర్నూల్ జిల్లా మన్ననూర్‌లోని గిరిజన భవనంలో మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యేలు వంశీకృష్ణ, రాజేశ్‌రెడ్డితో కలసి ఆయన చెంచులనుద్దేశించి మాట్లాడారు. ఉమ్మడి ఏపీలో వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో గోదావరి జలాలను కృష్ణా పరీవాహక ప్రాంతమైన చేవెళ్ల, కొడంగల్ వరకు తీసుకొచ్చే ప్రాజెక్టును మంజూరు చేస్తే.. రాష్ట్ర విభజన తర్వాత వారి స్వార్థం కోసం పేరు మార్పు చేసి రూ.కోట్ల ముడుపుల కోసం కాళేశ్వరం ప్రాజెక్టును కట్టి ప్రజల సొమ్మును దుర్వినియోగం చేశారని మండిపడ్డారు. మన హక్కులను పక్క రాష్ట్రానికి తాకట్టు పెట్టారని బీఆర్‌ఎస్‌పై మండిపడ్డారు. గత ప్రభుత్వం వారి ఆనందం కోసం ప్రగతి భవన్ నిర్మించుకుంటే ఇందిరమ్మ ప్రభుత్వం పేదల కోసం రాష్ట్రంలో 5 లక్షల ఇళ్లతోపాటు ప్రత్యేకంగా చెంచులకు 2,000 ఇళ్లు మంజూరు చేసిందని పొంగులేటి తెలిపారు. ఇందులో నల్లమలలోని చెంచుల కోసం 836 ఇళ్లు కేటాయించామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 12 వేల చెంచు కుటుంబాలకు ఇల్లు లేని ప్రతి కుటుంబానికి పక్కా ఇల్లు కట్టించే బాధ్యత ఇందిరమ్మ ప్రభుత్వం తీసుకుంటుందని పొంగులేటి వెల్లడించారు. మొదటి విడతగా మంజూరైన ఇందిరమ్మ ఇళ్లకు సోమవారం మొదటి బిల్లు రూ.లక్ష అందజేస్తున్నామన్నారు.

అక్రమ కట్టడాల కూల్చివేతలో పక్షపాత ధోరణి


- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు
- అక్బరుద్దీన్ కాలేజీని ఎందుకు కూల్చడం లేదు?



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం అక్రమ కట్టడాల కూల్చివేతలో పక్షపాత ధోరణి అనుసరిస్తోందని, ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్‌కు ఒక న్యాయం, పేద ప్రజలకు మరో న్యాయం పాటిస్తోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు సోమవారం ఒక ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆక్రమణల కూల్చివేతలో హైడ్రా యంత్రాంగం సామాన్యులపై దూకుడును ప్రదర్శిస్తోందని, కానీ ఎమ్మెల్యే అక్బరుద్దీన్ అక్రమంగా నిర్మించిన కాలేజీని మాత్రం కూల్చకపోవడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. తక్షణమే ఆ కాలేజీ నిర్మాణాలను కూల్చివేయాలని, లేకుంటే ప్రజల పక్షాన తమ కార్యకర్తలే ఆ పని చేస్తారని ఆయన పేర్కొన్నారు. పాతబస్తీ సల్కం చెరువు భూమిలో అక్బరుద్దీన్ ఒవైసీ కాలేజీ కట్టిన మాట వాస్తవమేనని, అందులో 10 వేల మంది విద్యార్థులు చదువుకుంటున్నందున వారి జీవితాలను నాశనం చేయలేమని కాంగ్రెస్ ప్రభుత్వం చెబుతోందని, మరి మూసీ పరీవాహక ప్రాంతంలో వేలాది మంది పేదలు, చెరువు శిఖం భూములని తెలియక లక్షలు ఖర్చు చేసి కొనుగోలు చేసిన ఇళ్లను ఎందుకు కూల్చివేస్తున్నారని అన్నారు. వాళ్లు మనుషులు కాదా? వాళ్లవి జీవితాలు కావా? అని ప్రశ్నించారు. రాష్ట్రంలో మీడియా సంస్థలపై దాడులు జరగడం దుర్మార్గమని, మీడియా సంస్థలకు రక్షణ కల్పించాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఒకవేళ మీడియా సంస్థలు ఏదైనా తప్పుగా రాస్తే చట్టపరంగా చర్యలు తీసుకోవాలన్నారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని దాడులు చేస్తామంటే చూస్తూ ఊరుకునే ప్రసక్తే లేదని, అవసరమైతే మీడియా సంస్థలకు బీజేపీ రక్షణ కవచంగా నిలుస్తుందని అన్నారు.

ఒవైసీ కళాశాలలో తీవ్రవాదులు ఉద్యోగం చేస్తున్నారు

- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్



మేడిపల్లి: ఒవైసీ కళాశాల తీవ్రవాదులకు స్థావరంగా మారిందని, అక్కడ తీవ్రవాదులే ఉద్యోగం చేస్తున్నారని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ వ్యాఖ్యానించారు. 'హైదరాబాద్‌లోని అక్బరుద్దీన్ ఒవైసీ కళాశాలల జోలికి తాము వెళ్లబోం. అలా వెళ్తే వారికి అన్యాయం జరుగుతుంది. అందుకే వారి విద్యాసంస్థలను ముట్టుకోబోం' అని హైడ్రా కమిషనర్ రంగనాథ్ ట్వీట్ చేయడం ఆయన సొంత నిర్ణయమా? లేదా రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయమా? చెప్పాలని డిమాండ్ చేశారు. జగిత్యాల జిల్లా మేడిపల్లి మండలంలోని కట్లకుంట, భీమారం, కమ్మరిపేట, వెంకట్రావుపేట గ్రామాల్లో సోమవారం ఆయన పర్యటించారు. రూ.10 కోట్లతో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం వెంకట్రావుపేటలో విలేకరులతో మాట్లాడారు. ఓ హైడ్రా అధికారి రాష్ట్ర ప్రభుత్వానికి వత్తాసు పలకడమేంటని సంజయ్ ప్రశ్నించారు.

సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
మంగళవారం ॥ 8-7-2025

ట్రాన్స్‌జెండర్



అనీ

చౌరస్తా నుంచి జిమ్ వరకు...

'మాట్లాడితే నవ్వు. నడిస్తే నవ్వు.
నా జీవితం నవ్వుల పాలైంది' అంటూ నిరాశ చీకట్లో అనీ మంగుళూరు మగ్గిపోయి ఉంటే... ఎంతో మందికి ధైర్యాన్ని, స్ఫూర్తిని ఇచ్చేది కాదు.

భిక్షాటన స్థాయి నుంచి అయిదు ఆటోల యజమాని స్థాయికి ఎదిగిన అనీ ఇతరులకు ఉపాధి ఇవ్వడంతో పాటు ట్రాన్స్‌జెండర్ వృద్ధులకు అండగా ఉంది.

కర్నాటకలోని రాయచూర్‌లో పేదింట్లో పుట్టిన అజిబాబు మాటతీరు, నడక అమ్మాయిలను పోలి ఉండేవి. దాంతో స్కూల్ రోజుల నుంచి వెక్కిరింపులు, అవమానాలు కొత్త కాకపోయినా మంగుళూరులో డిగ్రీ చేయడానికి వెళ్లినప్పుడు ఎదురైన చేదు అనుభవాలు తనకు చదువును దూరం చేశాయి. చదువును మధ్యలోనే వదిలేసిన అజిబాబు బెంగళూరులోని ట్రాన్స్‌జెండర్ కమ్యూనిటీలో చేరాడు.

జెండర్ చేంజ్ సర్జరీ తరువాత అనిబాబు అనీ మంగుళూరుగా మారింది. సిటీలో ఇల్లు అద్దెకు దొరకడం కష్టం అయింది. ఉద్యోగం దొరకడం గగనం అయింది. గత్యంతరం లేక భిక్షాటన చేయాల్సి వచ్చింది. ఆ తరువాత అమ్మ ఇచ్చిన కొద్దిమొత్తంతో ఆటో కొనుగోలు చేసి నడపడం మొదలుపెట్టింది అనీ. ఆటో కొనడం తన జీవితానికి టర్నింగ్ పాయింట్‌గా మారింది. మరో మూడు ఆటోలు కొనేస్థాయికి, ఇతరులకు ఉపాధిని ఇచ్చే స్థాయికి ఎదిగింది.

అయినప్పటికీ 'ఇక నాకు ఎలాంటి కష్టాల్లేవు' అనుకోలేదు అనీ. కష్టాల్లో ఉన్న ట్రాన్స్‌జెండర్‌లకు సహాయం చేయాలని నిర్ణయించుకుంది.

అనీ నటి కూడా. 'శివలీల' అనే కన్నడ సినిమాలో నటించింది. ఈ సినిమాకు లైన్ ప్రొడ్యూసర్‌గా పనిచేసింది. ఫిట్‌నెస్‌పై శ్రద్ధ చూపే అనీ ఇప్పుడు జిమ్ ట్రైనర్‌గా మారింది.

ట్రాన్స్ జెండర్ వృద్ధుల కోసం భవిష్యత్తులో ఆశ్రమం నిర్మించాలనేది అనీ లక్ష్యం.

బంధం

ఒకరికి ఒకరై... బహుదూరపు బాటసారులై...





సైకిల్ తొక్కుతూ ఎంత దూరమైనా వెళుతుంటాడు సోనూ రాజ్. అది అతడి హాబీ. ఒకరోజు దిల్లీ హైవేకు సమీపంలో గాయపడిన కుక్కకు సపర్యలు చేశాడు. కృతజ్ఞత నిండిన కళ్లతో ఆ శునకం నీడలా సోను రాజ్ వెనకాలే వెళ్లేది. 'సరే, ఇక నుంచి నువ్వు నా ఫ్రెండ్. ఇప్పటి నుంచి నీ పేరు చార్లీ' అని తాను ఎక్కడికి వెళ్లినా చార్లీని తీసుకువెళ్లేవాడు సోనూరాజ్.

దేశమంతా తిరగాలనేది సోను కల. 'ప్రయాణానికి చాలా డబ్బులు కావాలి అంటారు. అయితే సంకల్పం గట్టిగా ఉంటే ఎక్కడో ఎవరో మన ప్రయాణానికి సహకరిస్తూనే ఉంటారు' అనే చాప్లీ తన సెకండ్ హ్యాండ్ సైకిల్‌నే నమ్ముకున్నాడు.

చార్లీతో కలిసి పదిహేను రాష్ట్రాలు చుట్టివచ్చాడు. బిహార్‌కు చెంది పేదింటి యువకుడు సోనూ రాజ్ కశ్మీర్ నుంచి అయోధ్య వరకు ఎన్నో విశేషాలను నాన్‌స్టాప్‌గా చెబుతూనే ఉంటాడు. లద్ధాఖ్‌లో ఉన్నప్పుడు పర్యావరణవేత్త సోనమ్ వాంగుచూక్‌ను కలుసుకునే అవకాశం వచ్చింది. అమీర్‌ఖాన్ 'త్రీ ఇడియట్స్'కు సోనూ స్ఫూర్తి. సోనూరాజ్ సైకిల్‌యాత్ర గురించి విని శభాష్ అనడంతో పాటు కొత్త సైకిల్‌ను బహుమానంగా ఇచ్చాడు సోనమ్ వాంగుచూక్.

తన ప్రయాణాలలో కొన్నిసార్లు సోనూ రాజ్‌కు ప్రమాదాలు జరిగాయి. తృటిలో తప్పిన ప్రమాదాలు ఎన్నో ఉన్నాయి. మహారాష్ట్రలోని ఒక ప్రాంతంలో జీప్ ఢీ కొట్టడంతో గాలిలోకి ఇంతెత్తున ఎగిరి అంతదూరంలో స్పృహ తప్పి పడిపోయాడు సోను. తన ఫ్రెండ్‌ను కాపాడుకోవాలని దగ్గరలో ఉన్న దాబాకు పరుగెత్తుకు వెళ్లింది చార్లీ. అక్కడ ఉన్న వాళ్లను తీసుకురావడంతో, వారు సోనును హాస్పిటల్‌లో చేర్పించారు. అలా సోనూ రాజ్‌ను కాపాడి రుణం తీర్చుకుంది చార్లీ.

బ్యూటిప్స్

పాలతో సౌందర్యం



రెండు టేబుల్ స్పూన్ల పాల మీగడలో ఒక టీస్పూను ఆల్మండ్ ఆయిల్, నాలుగైదు చుక్కల రోజ్ ఎసెన్స్ కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి, మెడకు పట్టించి ఆరిన తర్వాత చన్నీటితో కడగాలి. ఇది పొడిబారి, గరుకుగా ఉన్న చర్మాన్ని మృదువుగా మారుస్తుంది.

- చర్మం తెల్లగా మారాలంటే... చిన్న చందనం ముక్కను పాలతో పేస్టు చేసి అందులో చిటికెడు స్వచ్ఛమైన పసుపు కలిపి ఆ మిశ్రమాన్ని ముఖానికి, మెడకు అప్లయ్ చేయాలి. ఇరవై నిమిషాల తర్వాత చన్నీటితో కడగాలి. ఇలా వారానికి మూడు సార్లు ప్యాక్ వేస్తుంటే ఫలితం ఉంటుంది.
- ఒక టీ స్పూన్ ఆలివ్ ఆయిల్‌లో ఒక టీ స్పూన్ పెసలను ఎర్రగా వేయించాలి. వీటిలో పాలను కలుపుతూ పేస్టు చేయాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి అప్లయ్ చేసి ఆరాక వలయాకారంగా రుద్దుతూ ప్యాక్‌ను వదిలించాలి. ఇలా చేయడం వల్ల ప్యాక్‌లోని సుగుణాలు చర్మానికి పట్టడంతోపాటు మృతకణాలు రాలిపోతాయి. తరవాత చన్నీటితో కడిగితే సరిపోతుంది.

ట్రెండ్

షేరెంటింగ్!



కొందరు పేరెంట్స్ తమ పిల్లల ఫోటోలు, వీడియోలు, వారికి సంబంధించిన విషయాలను తరచుగా సోషల్ మీడియాలో షేర్ చేస్తుంటారు. ఈ నేపథ్యం నుంచి వచ్చిందే... షేరెంటింగ్(షేరింగ్ + పేరెంటింగ్)

'చిన్న పిల్లల వీడియోలే కదా... షేర్ చేస్తే ఏమిటి అనుకుంటారుగానీ దీని వల్ల ప్రైవసీ, సేఫ్టీ కోణంలో ప్రతికూల ప్రభావాలు కూడా ఉన్నాయి' అంటున్నారు నిపుణులు.

ఇక మరో ట్రెండ్... పాపింగ్ ఇమోజీ

ఈ ట్రెండ్ ప్రత్యేకత ఏమిటంటే పిల్లల ఫోటోలు, వీడియోలు సోషల్ మీడియాలో షేర్ చేసి నప్పటికీ వారి ముఖాలను ఇమోజీలతో కవర్ చేయడం. మొదట్లో ఈ ఫేస్ ఇమోజీ ట్రెండ్ సెలబ్రిటీలకు మాత్రమే పరిమితం అయ్యేది. ఇప్పుడు సామాన్యుల వరకు వచ్చింది.

'ముఖాలను ఇమోజీలతో కవర్ చేసినంత మాత్రాన ఎలాంటి సమస్యలు ఉండవు అనుకోవడం భ్రమ మాత్రమే' అంటున్నారు ఆన్‌లైన్ సేఫ్టీ ఎక్స్‌పర్ట్‌లు.

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ)తో ఇమోజీ-కవర్డ్ ఫోటోల ఫేస్‌లను రీకన్‌స్ట్రక్షన్ చేయవచ్చు అని హెచ్చరిస్తున్నారు సైబర్ సెక్యూరిటీ స్పెషలిస్ట్‌లు.

పిల్లలు ఫోటోలు, వీడియోలు, వివరాలను సోషల్ మీడియాలో పోస్ట్ చేయడం సరియైనదా? కాదా? అనే చర్చ మాట ఎలా ఉన్నా అతిగా షేర్ చేయడం తప్పు అంటున్నారు నిపుణులు.

బులియన్

జూలై 7న ముగింపు (బంగారం 10 గ్రా.: వెండి కిలో) రూ.లలో

హైదరాబాద్	
బంగారం (24 క్యారెట్లు)	97,410
బంగారం (22 క్యారెట్లు)	90,235
వెండి	1,09,000
విజయవాడ	
బంగారం (24 క్యారెట్లు)	99,630
బంగారం (22 క్యారెట్లు)	90,100
వెండి	1,10,900
విశాఖపట్నం	
బంగారం (24 క్యారెట్లు)	98,290
బంగారం (22 క్యారెట్లు)	90,100
వెండి	1,20,000
రాజమండ్రి	
బంగారం (24 క్యారెట్లు)	99,630
బంగారం (22 క్యారెట్లు)	92,800
వెండి	1,10,900
ప్రొద్దుటూరు	
బంగారం (24 క్యారెట్లు)	96,900
బంగారం (22 క్యారెట్లు)	89,150
వెండి	1,08,500
చెన్నై	
బంగారం (24 క్యారెట్లు)	98,290
బంగారం (22 క్యారెట్లు)	90,100
వెండి	1,20,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

హరిత యూరియా వస్తోంది!





'హరిత యూరియా'ను ఆవిష్కరించి 'ఫుడ్ ప్లానెట్ ప్రైజ్ 2025'ను గెల్చుకున్న స్వీడన్ స్టార్టప్ 'నైట్రోక్యాప్ట్'

ప్లాస్మా టెక్నాలజీ ద్వారా పునరుత్పాదక ఇంధనం వాడుతూ గాలిలోని నత్రజనిని విచ్ఛిన్నం చేయటం ద్వారా విజయవంతంగా హరిత యూరియా ఉత్పత్తి

శిలాజ ఇంధనాలు అవసరం లేదు.. నీరు, గాలి, నేల కాలుష్యం ఉండదు

చిన్న పరిశ్రమల ద్వారా యూరియా ఉత్పత్తి చేసుకునే అవకాశం

పర్యావరణాన్ని, ప్రకృతిని కలుషితం చేస్తున్న రసాయనిక యూరియా వాడకానికి నూకలు చెల్లే రోజులు దగ్గరపడ్డాయి. శిలాజ ఇంధనాలు వాడకుండా తయారు చేసే 'హరిత యూరియా' సాంకేతికత త్వరలోనే అందుబాటులోకి రానుంది. స్వీడన్‌లోని 'నైట్రోక్యాప్ట్' అనే స్టార్టప్ పూర్తిగా కాలుష్య రహిత పద్ధతిలో నత్రజని ఎరువును తయారు చేస్తోంది. అది కూడా స్వల్ప ఖర్చుతోనే. కేవలం వాతావరణంలోని నీరు, గాలితో పాటు ఒక యూనిట్ సోలార్ వంటి పునరుత్పాదక ఇంధనంతో ఏకంగా 40 వేల హెక్టార్లకు సరిపడా హరిత యూరియాను ఉత్పత్తి చేసే అద్భుత సామర్థ్యం తమ వినూత్న సాంకేతికత సొంతమని నైట్రోక్యాప్ట్ వ్యవస్థాపకుడు గస్టాఫ్ ఫోర్స్‌బెర్గ్ ప్రకటించారు.

ఏమిటీ సాంకేతికత విశిష్టత?

వాతావరణంలో మెరుపులు సహజంగా నత్రజనిని స్థిరీకరించే విధానాన్ని అనుకరిస్తూ ఈ స్టార్టప్ సరికొత్త సాంకేతికతను రూపొందించింది. గాలిలోని నత్రజని అణువులను విచ్ఛిన్నం చేయడానికి ప్లాస్మా టెక్నాలజీని ఉపయోగించటం ద్వారా ఎరువులలో కీలకమైన భాగమైన నైట్రేట్‌ను ఉత్పత్తి చేయటం ఈ సాంకేతికత విశిష్టత. ఈ సాంకేతికత గాలి నుంచి గ్రహించి నేరుగా నత్రజని ఎరువును తయారు చేయటానికి ఆక్సిజన్, నీరు, పునరుత్పాదక శక్తిని మాత్రమే ఉపయోగిస్తుంది. వందేళ్లుగా సంప్రదాయ రసాయనిక ఎరువుల ఉత్పత్తి ప్రక్రియలో మాదిరిగా ఖరీదైన, కాలుష్యకారక ఇంధనాన్ని ఉపయోగించి హైడ్రోజన్ తయారు చేసే అవసరం ఈ టెక్నాలజీతో తీరిపోనుంది. నైట్రోక్యాప్ట్ రూపొందించిన పద్ధతిలో హరిత యూరియా ఉత్పత్తికి పది రెట్లు తక్కువ శక్తి సరిపోతుంది. దీన్ని సౌర, పవన తదితర పునరుత్పాదక ఇంధన వనరుల ద్వారా సమకూర్చుకోవచ్చు. ఈ సాంకేతిక పురోగతి ఎరువుల తయారీ ప్రక్రియను పర్యావరణహితంగా మారుస్తుంది.

'సనిఫిక్స్' పేరిట పేటెంట్

స్వీడన్‌కు చెందిన భౌతికశాస్త్ర శాస్త్రవేత్త గస్టాఫ్ ఫోర్స్‌బెర్గ్ తన మిత్రుడు పీటర్ బేలింగ్‌తో కలసి 2016లో నైట్రోక్యాప్ట్ స్టార్టప్‌ను నెలకొల్పారు. 'సనిఫిక్స్' పేరిట పేటెంట్ పొందిన గ్రీన్ యూరియా టెక్నాలజీని 20 మంది శాస్త్రవేత్తలతో కూడిన నైట్రోక్యాప్ బృందం ఆవిష్కరించింది. ఇందులో శ్రీలంకలో పుట్టిన యువ శాస్త్రవేత్త శంఖ ననయక్కర కూడా ఉన్నారు. స్వీడన్‌లోని ఉప్సల పట్టణంలోని గ్రీన్ ఇన్నోవేషన్ పార్క్‌లో ఏర్పాటైన చిన్న ఎలక్ట్రోమాగ్నెటిక్ రియాక్టర్ ద్వారా హరిత యూరియా ఉత్పత్తి ఈ ఏడాది ఫిబ్రవరిలో ప్రారంభమైంది. హరిత యూరియాను వాణిజ్యపరంగా ఉత్పత్తి చేసే 33 పరిశ్రమలను ఏర్పాటు చేయడానికి 9 సంస్థలు ఆసక్తి చూపాయి. స్వీడన్‌లోని 'విడెసియ' సహకార సంఘం వాణిజ్యపరమైన తొలి పరిశ్రమను ఏర్పాటు చేసుకుంటోంది. ఇందులో 9 వేల మంది రైతులు సభ్యులు. హరిత నత్రజని ఎరువుతో 7.5 లక్షల ఎకరాల్లో పంటలు సాగు చేయటానికి సన్నాహాలు జరుగుతున్నాయి.

స్టాక్‌హోమ్‌లో పురస్కార ప్రదానం

స్వీడన్‌కు చెందిన కర్ట్ బెర్గ్‌ఫోర్స్ ఫౌండేషన్ ప్రపంచ ప్రసిద్ధి గాంచిన పర్యావరణ పురస్కారం 'ఫుడ్ ప్లానెట్ ప్రైజ్'ను ప్రదానం చేస్తోంది. పర్యావరణహితమైన ఆహారోత్పత్తికి దోహదపడే ఆవిష్కరణలకు ఈ పురస్కారం ఇస్తారు. ఈ ఏడాది ఈ ప్రతిష్టాత్మక పురస్కారాన్ని నైట్రోక్యాప్ట్ గెల్చుకుంది. జ్ఞాపికతో పాటు 20 లక్షల డాలర్ల నగదు బహుమతిని జూన్ 13న స్వీడన్ రాజధాని స్టాక్‌హోమ్‌లో నైట్రోక్యాప్ట్ వ్యవస్థాపకుడు గస్టాఫ్ ఫోర్స్‌బెర్గ్ అందుకున్నారు. ఫుడ్ ప్లానెట్ ప్రైజ్ పొందటంతో ఈ ఆవిష్కరణ ప్రపంచం దృష్టికి వచ్చింది.

వికేంద్రీకరణకు అవకాశం



యూరియా ఉత్పత్తికి భారీ పరిశ్రమను స్థాపించాల్సిన అవసరం లేదు. కాబట్టి, అభివృద్ధి చెందుతున్న, పేద దేశాల రైతులకు ఈ సాంకేతికత వరప్రసాదంగా మారుతుందని చెబుతున్నారు. అంతేకాక, రసాయనిక ఎరువుల ఉత్పత్తికి అవసరమైన ఉత్పాదకాలను విదేశాల నుంచి దిగుమతి చేసుకోవాల్సిన అనివార్యత నుంచి ఈ సాంకేతికత విముక్తి కలిగిస్తుందని ఆశిస్తున్నారు. యూరియాను ఎక్కడో ఉత్పత్తి చేసి ఎక్కడికో తరలించాల్సిన అవసరం ఉండదు. దీని ఉత్పత్తిని వికేంద్రీకరించటానికి తగిన మాడ్యులర్ వ్యవస్థ ద్వారా నెలకొల్పే రియాక్టర్ల ద్వారా హరిత నత్రజనిని ఎక్కడికక్కడ తయారు చేసుకునేందుకు ఈ ఆవిష్కరణ దోహదపడుతుందట. అదే జరిగితే, అంతర్జాతీయ జియోపొలిటికల్ ఉద్రిక్తతల ప్రభావం వ్యవసాయంపై పడకుండా జాగ్రత్తపడగలుగుతాం. శిలాజ ఇంధనాలపై ఆధారపడే ఇప్పటి రసాయనిక ఎరువుల ఉత్పత్తి పరిశ్రమలో ఇది విప్లవాత్మక మార్పులను తీసుకురాగలదని నిపుణులు అంచనా వేస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా ప్రతి ఏటా వాతావరణంలోకి విడుదలవుతూ భూగోళాన్ని అమితంగా వేడెక్కిస్తున్న కార్బన్ డయాక్సైడ్ ఉద్గారాలలో దాదాపు 2.7 శాతం రసాయనిక ఎరువుల పరిశ్రమ నుంచి వస్తున్నాయి. ఇందులో 50% వాటా యూరియాదే. ఎటువంటి ముడిసరుకును దిగుమతి చేసుకోనవసరం లేనందున యూరియా ఉత్పత్తిలో ఇక ఏ చిన్న దేశమైనా సంపూర్ణ స్వావలంబన సాధించడానికి ఈ ఆవిష్కరణ దోహదం చేయనుంది.

– పంతంగి రాంబాబు


ప్రపంచ దేశాల రైతులకు వరం

ప్రపంచ నత్రజని ఎరువుల పరిశ్రమను అతలాకుతలం చేసే సామర్థ్యం నైట్రోక్యాప్ట్ ఆవిష్కరణకు ఉందని ప్రపంచంలోనే అతిపెద్ద పర్యావరణ అవార్డు ఫుడ్ ప్లానెట్ ప్రైజ్ జ్యూరీ పేర్కొంది.

'భూమి, నీరు, ఎరువులను పర్యావరణానికి హాని కలిగించని రీతిలో ఉపయోగించడం ద్వారా మాత్రమే ప్రపంచంలోని ప్రజలందరికీ తగినంత మొత్తంలో పోషకాహారాన్ని అందించగలం. నత్రజని, భాస్వరం ఎరువులను అధిక మొత్తంలో వినియోగిస్తున్నాం. పెద్ద మొత్తంలో హరితగృహ వాయువులను విడుదల చేసే ప్రక్రియల ద్వారా నత్రజని ఎరువులు ఉత్పత్తి అవుతున్నాయి.

నైట్రోక్యాప్ట్ స్టార్టప్ ఆవిష్కరణ ఈ చరిత్రను తిరగరాస్తోంది. హరిత విద్యుత్తు ఆధారిత ప్లాస్మా టెక్నాలజీతో గాలిలోని నత్రజని మూలకాలను విభజించడం ద్వారా నత్రజని ఎరువులను ఉత్పత్తి చేయవచ్చు. ఈ ప్రక్రియలో ఇంధన వినియోగాన్ని ఈ సాంకేతికత పది రెట్లు తగ్గిస్తుంది.

స్థానికంగా చిన్న యూనిట్లలో హరిత ఎరువులను ఉత్పత్తి చేయవచ్చు. శిలాజ ఇంధనాలను పూర్తిగా నివారిస్తుంది. నేల ఆరోగ్యాన్ని మెరుగుపరచగల, నిశ్చింతగా ఉపయోగించగల నైట్రేట్ ఎరువులను ఈ సాంకేతికత అందిస్తుంది. ప్రపంచవ్యాప్తంగా రైతులకు ఇది వరం..' అని జ్యూరీ పేర్కొంది.



ఒక యూనిట్ గ్రీన్ ఎనర్జీతో ఏకంగా 40 వేల హెక్టార్లకు సరిపడా యూరియాను ఉత్పత్తి చేయొచ్చని నైట్రోక్యాప్ట్ చెబుతోంది. పైలట్ యూనిట్‌లో ఉత్పత్తి చేసిన యూరియాను స్వీడిష్ యూనివర్సిటీ ఆఫ్ అగ్రికల్చరల్ సైన్సెస్ ప్రయోగాత్మకంగా వాడుతోంది.

ఉద్గారాల్లేని యూరియాతో విప్లవాత్మక మార్పు



నత్రజని ఎరువుల పరిశ్రమను కర్బన ఉద్గార రహితంగా మార్చటం నైట్రోక్యాప్ట్ లక్ష్యం. ప్రస్తుతం నత్రజని ఎరువు ఉత్పత్తి చేస్తున్న శిలాజ ఇంధన ఆధారిత ప్రక్రియ కథ ముగింపు దశకు చేరుకుంది. యూరియా దొరక్క ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రాంతాల్లో ఆహారోత్పత్తిని పెంచటానికి కూడా హరిత యూరియాతో మనం దోహదపడవచ్చు. పైలట్ ప్రాజెక్టు ద్వారా హరిత యూరియాను ఇప్పటికే ఉత్పత్తి చేస్తూ పంటలకు వాడుతున్నాం. పారిశ్రామిక స్థాయిలో ఉత్పత్తిని ప్రారంభించే తొలి యూనిట్‌కు తుది మెరుగులు దిద్దే పనిలో ఉన్నాం. నత్రజని పరిశ్రమలో విప్లవాత్మక మార్పునకు శ్రీకారం చుట్టే దశకు మా సాంకేతికతను తీసుకురావడానికి ఫుడ్ ప్లానెట్ ప్రైజ్ మాకు చాలా ఉపయోగపడుతుంది.

– గస్టాఫ్ ఫోర్స్‌బెర్గ్, సీఈవో, వ్యవస్థాపకుడు, నైట్రోక్యాప్ట్, స్వీడన్

సాగుబడి

పునర్వసు కార్తె: జూలై 6 నుంచి

బెడ్స్‌పై వరి సాగు

వరి పంటను ఎత్తుమడులపై ఆరుతడి పద్ధతిలో సాగు చెయ్యటం ద్వారా ఎన్నో ప్రయోజనాలున్నాయని పంజాబ్ లుధియానాకు చెందిన వ్యవసాయం చేస్తున్న మాజీ ఐఏఎస్ అధికారి కహాన్ సింగ్ పన్ను ఆచరించిన అనుభవంతో చెబుతున్నారు. కిలో వరి ధాన్యం పండించడానికి 4 వేల లీటర్ల నీరు ఖర్చవుతోంది. భూగర్భ జలాలతో వరి సాగు చేస్తూ పోతే 2039 నాటికి పంజాబ్ భూగర్భంలో నీరు పూర్తిగా అడుగంటుతుంది. అందుకే, నీటిని నిల్వ గట్టే పద్ధతిలో పోల్చితే 20–25% నీటితోనే వరి సాగు చేసే బెడ్స్ పద్ధతిని గత ఏడాది నుంచి ఆచరిస్తున్నానని అన్నారాయన. మొక్కజొన్న, కూరగాయలు, బంగాళదుంప పంటల మాదిరిగా వరిని కూడా బెడ్స్‌పై ఆరుతడి సాగు చెయ్యవచ్చు. బెడ్ వెడల్పు 18–22 అంగుళాలు ఉండాలి. బెడ్‌పై 7–8 అంగుళాల దూరంలో రెండు వరుసలుగా విత్తుకోవాలి. మొక్కల మధ్య 4–6 అంగుళాల దూరం ఉండాలి. బెడ్ తయారు చేస్తూనే స్వల్పకాలిక వరి విత్తనాలు విత్తేందుకు వీలుగా ప్రత్యేకంగా రెండు యంత్రాలు తయారు చేయించాను అన్నారు పన్ను. రాండ్గ్లాస్ ఫౌండేషన్ తరఫున రీజనరేటివ్ అగ్రికల్చర్‌పై రైతులకు ఆయన శిక్షణ ఇస్తున్నారు. ఈ ఏడాది పంజాబ్‌లో వంద చోట్ల రైతులకు తోడ్పడేందుకు 12 పాడీ బెడ్ మేకర్ కమ్ సీడర్ యంత్రాలను సిద్ధం చేశామని ఆయన తెలిపారు.





13న సుందర్ రామన్ శిక్షణ



తమిళనాడుకు చెందిన సీనియర్ సేంద్రియ రైతు శాస్త్రవేత్త సుందర్ రామన్ అయ్యర్‌కు కచ్చితమైన ఆదాయం తీసే పద్ధతిలో సంపూర్ణ సేంద్రియ సేద్యం చేయటంలో 40 ఏళ్ల అనుభవం ఉంది. జూలై 13 (ఆదివారం)న నాగర్‌కర్నూలు జిల్లా కల్వకుర్తి మండలం జూపల్లి గ్రామంలో గల ఐఫామ్స్‌లో ఆయన రైతులకు శిక్షణ ఇవ్వనున్నారు. సేంద్రియ వ్యవసాయం ప్రారంభించాలనుకునే/ విస్తరింపజేయాలనుకునే రైతులకు ఈ శిక్షణ ఉపయోగపడుతుందని ఐఫామ్స్ వ్యవస్థాపకుడు రంగప్రసాద్ తెలిపారు. రిజిస్ట్రేషన్ వివరాలకు.. 85006 60012.

ఐసీసీ సీఈఓగా సంజోగ్ గుప్తా



దుబాయ్: భారత మీడియా మొఘల్ సంజోగ్ గుప్తా అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) చీఫ్ ఎగ్జిక్యూటీవ్ ఆఫీసర్ (సీఈఓ)గా నియమితులయ్యారు. ఈ ఏడాది పాకిస్తాన్ ఆతిథ్యమిచ్చిన ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీకి ముందు ఆస్ట్రేలియాకు చెందిన జెఫ్ అలర్డైస్ సీఈఓ పదవి నుంచి తప్పుకున్నారు. అప్పటి నుంచి ఈ పదవి ఖాళీగానే ఉండటంతో సంజోగ్ గుప్తాతో భర్తీ చేశారు. జియోస్టార్ నెట్‌వర్క్‌కు సీఈఓగా వ్యవహరించిన సంజోగ్‌కు మీడియా రంగంలో విశేషానుభవం ఉంది. దీంతో పాటు భారత్‌కే చెందిన జై షా ఐసీసీ చైర్మన్‌గా ఉండటం కూడా అంతర్జాతీయ క్రికెట్ వ్యవహారాలు చక్కబెట్టే పదవిని చేపట్టేందుకు కలిసొచ్చింది. అంతమాత్రాన పూర్తిగా జై షా చలవే అనలేం. ఎందుకంటే ఏళ్ల తరబడి మీడియా రంగంలో ఆయన విశేష కృషి చేశారు. అందువల్లేనేమో 2500 పైచిలుకు దరఖాస్తు చేసుకుంటే సంజోగ్‌నే సీఈఓ పదవి వరించింది. ఐసీసీలోని శాశ్వత, అనుబంధ సభ్యులైన 25 దేశాల నుంచి వేల సంఖ్యలో ఈ పదవి కోసం పోటీపడ్డారు. అనుభవం, పనితీరు ఆధారంగా ఒక్కో దేశం నుంచి 12 మంది చొప్పున తుది జాబితాకు ఖరారు చేయగా ఇందులో సంజోగ్ గుప్తా అర్హుడని ఐసీసీ కమిటీ భావించింది. ఈ నామినేషన్ల కమిటీలో ఐసీసీ డిప్యూటీ చైర్మన్ ఇమ్రాన్ ఖాజా, ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు చైర్మన్ రిచర్డ్ థాంప్సన్, లంక క్రికెట్ అధ్యక్షుడు షమ్మీ సిల్వా, భారత బోర్డు కార్యదర్శి దేవజిత్ సైకియా సభ్యులుగా ఉన్నారు. ఈ కమిటీ సిఫార్సు మేరకే ఐసీసీ చైర్మన్ జై షా... సంజోగ్‌ను కొత్త సీఈఓగా నియమించారు.

స్పోర్ట్స్ జర్నలిస్ట్‌గా వచ్చి...

ఈ జనవరిలో పదవి నుంచి వైదొలిగిన అలర్డైస్ వారసుడిగా సంజోగ్ గుప్తా త్వరలోనే పదవీ బాధ్యతలు చేపడతారు. ఐసీసీ చైర్మన్ తర్వాత రెండో ప్రాధాన్య పదవి సీఈఓ. దీంతో ఈ రెండు కీలకమైన పదవుల్లో భారతీయులే కొలువుదీరడం విశేషం. జై షా భారత హోం మంత్రి అమిత్ షా తనయుడు. కానీ గుప్తా మాత్రం ఢిల్లీలోని ద ట్రిబ్యూన్ పత్రికలో ఓ సాధారణ స్పోర్ట్స్ జర్నలిస్టుగా కెరీర్‌ను ప్రారంభించి మీడియా మొఘల్‌గా ఎదిగాడు. 2010లో స్టార్ ఇండియా (ప్రస్తుత జియో స్టార్)లో సహాయ ఉపాధ్యక్షుడిగా చేరిన సంజోగ్ తన నేర్పు, నైపుణ్యం, అంకితభావం, నిబద్ధతతో అంచెలంచెలుగా ఎదిగారు. కంటెంట్, ప్రొగ్రామింగ్, వ్యూహరచనతో ఓ చానెల్ నెట్‌వర్క్‌ను విస్తరించారు. మొదటి పదేళ్లు ఐపీఎల్ 'సోనీ' నెట్‌వర్క్‌లో ప్రసారమైంది. తర్వాత కోట్లు గుమ్మరించి ఐపీఎల్ సహా, ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్), ఇండియన్ సూపర్ లీగ్ ఫుట్‌బాల్ (ఐఎస్‌ఎల్) సహా ఎన్నో ప్రీమియర్ లీగ్‌ను, గ్రాండ్‌స్లామ్ టోర్నీల ప్రసార హక్కుల్ని స్టార్ హస్తగతమయ్యేలా చేశారు. రిలయన్స్‌కు చెందిన వయాకామ్ 18 నెట్‌వర్క్ డిస్నీ స్టార్‌ను సొంతం చేసుకోవడంతో రిలయన్స్ యాజమాన్యం గతేడాది సంజోగ్ గుప్తాను సీఈఓగా నియమించింది. ఇప్పుడైతే ఏకంగా ఐసీసీలో ఏడో సీఈఓగా అంతర్జాతీయ క్రికెట్‌ను వ్యవహారాలను చక్కబెట్టే పనిలో పడతారు.

7

ఐసీసీ సీఈఓగా నియమితుడైన ఏడో వ్యక్తి సంజోగ్ గుప్తా. గతంలో డేవిడ్ రిచర్డ్స్ (1993-2001), మాల్కం స్పీడ్ (2001-2008), హరూన్ లోర్గాట్ (2008-2012), డేవిడ్ రిచర్డ్‌సన్ (2012-2019), మనూ సాహ్నీ (2019-2021), జెఫ్ అలర్డైస్ (2021-2025) ఈ బాధ్యతలు నిర్వర్తించారు.

367 నాటౌట్

వియాన్ ముల్డర్ అద్భుత ప్రదర్శన



- టెస్టుల్లో ఐదో అత్యుత్తమ వ్యక్తిగత స్కోరు
- రికార్డులు బద్దలు కొట్టిన దక్షిణాఫ్రికా బ్యాటర్

వియాన్ ముల్డర్ ఓవర్‌నైట్ స్కోరు 264... రెండో రోజు మరో 38 బంతులు ఆడే సరికి 'ట్రిపుల్ సెంచరీ' పూర్తయింది... మరో 5 బంతుల తర్వాత దక్షిణాఫ్రికా తరఫున టెస్టుల్లో టాప్ స్కోరర్ రికార్డు సొంతమైంది... ఆ తర్వాత మరిన్ని రికార్డుల వేట మొదలైంది... జోరు కొనసాగిస్తూ దిగ్గజాలను దాటుకుంటూ పోయాడు... సంగక్కర, వీరేంద్ర సెహ్వాగ్, క్రిస్ గేల్, గూచ్, డాన్ బ్రాడ్‌మన్, మార్క్ టేలర్, హనీఫ్, జయసూర్య, గ్యారీ సోబర్స్... ఇలా అందరిని అధిగమించి టాప్-5లోకి వచ్చేశాడు. 367 పరుగులకు చేరాక లంచ్ విరామం వచ్చింది. ఇక తదుపరి లక్ష్యం బ్రియాన్ లారా 400 పరుగుల ఘనత... మరో 34 పరుగులు చేస్తే చాలు టెస్టు చరిత్రలో అతను శిఖరాన నిలిచిపోతాడు. కానీ దక్షిణాఫ్రికా శిబిరం నుంచి అనూహ్య ప్రకటన వచ్చింది. ఈ టెస్టులో కెప్టెన్‌గా వ్యవహరిస్తున్న ముల్డర్ ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేస్తున్నట్లు తానే స్వయంగా ప్రకటించాడు. 367 పరుగులతో నాటౌట్‌గా తన ఇన్నింగ్స్‌ను ముగించాడు. లారాను దాటకపోయినా... తన అద్భుత బ్యాటింగ్‌తో అతను ఎన్నో రికార్డులను తిరగరాశాడు.

బులవాయో: దక్షిణాఫ్రికా బ్యాటర్ వియాన్ ముల్డర్ టెస్టు క్రికెట్‌లో దిగ్గజాల సరసన నిలిచాడు. జింబాబ్వేతో జరుగుతున్న రెండో టెస్టులో అసాధారణ ప్రదర్శనతో అతను పలు ఘనతలు నమోదు చేశాడు. ఈ మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లో ముల్డర్ 334 బంతుల్లో 367 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. ఇందులో 49 ఫోర్లు, 4 సిక్స్‌లు ఉన్నాయి. టెస్టుల్లో అత్యధిక వ్యక్తిగత స్కోర్ల జాబితాలో ముల్డర్ ఐదో స్థానంలో నిలిచాడు. పేలవమైన జింబాబ్వే బౌలింగ్‌ను ఉతికి ఆరేసిన అతను పరుగుల వరద పారించాడు. ముల్డర్ ధాటికి దక్షిణాఫ్రికా తమ తొలి ఇన్నింగ్స్‌ను 114 ఓవర్లలో 5 వికెట్లకు 626 పరుగుల భారీ స్కోరు వద్ద డిక్లేర్ చేసింది. అనంతరం జింబాబ్వే తమ తొలి ఇన్నింగ్స్‌లో 170 పరుగులకే కుప్పకూలింది. సీన్ విలియమ్స్ (83 నాటౌట్) మినహా అంతా విఫలమయ్యారు. సఫారీ టీమ్‌కు 456 పరుగుల ఆధిక్యం లభించడంతోజింబాబ్వే ఫాలోఆన్ ఆడాల్సి వచ్చింది. సోమవారం రెండో రోజు ఆట ముగిసే సమయానికి జింబాబ్వే తమ రెండో ఇన్నింగ్స్‌లో వికెట్ నష్టానికి 51 పరుగులు చేసింది. మరో 405 పరుగులు వెనుకబడి ఉన్న జట్టు ఈ టెస్టులోనూ ఓడటం దాదాపు ఖాయమే!

ఎందుకీ డిక్లరేషన్?

లారా రికార్డును అధిగమించే ప్రయత్నం ముల్డర్ చేయకపోవడం ఆశ్చర్యం కలిగించింది. మ్యాచ్ రెండో రోజు ఒక సెషన్ మాత్రం ముగిసింది. లంచ్ తర్వాత మరో 34 పరుగులు అలవోకగా వచ్చేవి. సమయం ముగిసిపోతోందనే సమస్య లేదు. జట్టుకంటే సొంత రికార్డుపై దృష్టి పెట్టాడనే విమర్శలు వచ్చే స్థితి కూడా లేదు. బలహీన బ్యాటింగ్ ఉన్న జింబాబ్వేను మిగిలిన సమయంలో రెండు సార్లు ఆలౌట్ చేయడం కష్టం కాదు. స్వయంగా తానే కెప్టెన్ కూడా. జింబాబ్వే బౌలింగ్ చూస్తే అతడిని అవుట్ చేసేలా అస్సలు కనిపించలేదు. ఈతరం టి20ల జోరులో టెస్టు క్రికెట్‌లో సుదీర్ఘ ఇన్నింగ్స్‌లు కొరతగా మారిపోయాయి. ఇలాంటి సమయంలో వచ్చిన ఒక అరుదైన అవకాశాన్ని ముల్డర్ వృథా చేసుకున్నాడు. బలహీన జట్టుపైనే అయినా రికార్డు విలువ తగ్గదు. 'క్వాడ్రాపుల్ సెంచరీ'తో చరిత్రలో నిలిచిపోయే అవకాశాన్ని ముల్డర్ వదులుకున్నాడు.

లారాపై గౌరవంతోనే...

ట్రిపుల్ సెంచరీ సంగతేమో గానీ డబుల్ సెంచరీ చేస్తానని కూడా కలలో అనుకోలేదు. లారా ఒక దిగ్గజం. 400 రికార్డుకు ఒక ప్రత్యేకత ఉంది. ఈ విషయంపై కోచ్‌తో చర్చించా. దిగ్గజాల పేరిటే అలాంటి రికార్డు ఉండటం సబబని భావించాం. ఆ ఘనత లారా పేరిట ఉండటమే సరైంది. – ముల్డర్

2 సెహ్వాగ్ (278 బంతుల్లో) తర్వాత ఇది రెండో ఫాస్టెస్ట్ ట్రిపుల్ సెంచరీ (297 బంతులు).

2 దక్షిణాఫ్రికా తరఫున ట్రిపుల్ సాధించిన రెండో ప్లేయర్. గతంలో ఆమ్లా 311 పరుగులు చేశాడు

టెస్టుల్లో టాప్-5 వ్యక్తిగత స్కోర్లు

లారా (వెస్టిండీస్: 400 నాటౌట్... 2004లో ఇంగ్లండ్‌పై)	మాథ్యూ హేడెన్ (ఆస్ట్రేలియా: 380... 2003లో జింబాబ్వేపై)	లారా (వెస్టిండీస్: 375... 1994లో ఇంగ్లండ్‌పై)	జయవర్ధనే (శ్రీలంక: 374... 2006లో దక్షిణాఫ్రికాపై)	ముల్డర్ (దక్షిణాఫ్రికా: 367 నాటౌట్... 2025లో జింబాబ్వేపై)

జొకోవిచ్ 16వసారి...

వింబుల్డన్ టోర్నీ క్వార్టర్ ఫైనల్లో సెర్బియా దిగ్గజం

లండన్: రికార్డుస్థాయిలో 25వ గ్రాండ్‌స్లామ్ టైటిల్ వేటలో సెర్బియా దిగ్గజం నొవాక్ జొకోవిచ్ మరో అడుగు ముందుకేశాడు. వింబుల్డన్ టోర్నీలో ఏడుసార్లు చాంపియన్ జొకోవిచ్ 16వసారి క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. సోమవారం జరిగిన పురుషుల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో ఆరో సీడ్ జొకోవిచ్ 1-6, 6-4, 6-4, 6-4తో 11వ సీడ్ అలెక్స్ డిమినార్ (ఆస్ట్రేలియా)పై నెగ్గాడు. 3 గంటల 19 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో జొకోవిచ్ తొలి సెట్‌లో కేవలం ఒక గేమ్ మాత్రమే గెలిచాడు. అయితే రెండో సెట్ నుంచి గాడిలో పడ్డ జొకోవిచ్ ప్రత్యర్థికి ఆధిపత్యం చలాయించే అవకాశం ఇవ్వలేదు. మ్యాచ్ మొత్తంలో ఆరు ఏస్‌లు సంధించిన జొకోవిచ్ ఐదు డబుల్ ఫాల్ట్‌లు చేశాడు. నెట్ వద్దకు 52 సార్లు దూసుకొచ్చి 35 సార్లు పాయింట్లు నెగ్గిన జొకోవిచ్ 38 విన్నర్స్ కొట్టాడు. తన సర్వీస్‌ను ఆరుసార్లు కోల్పోయిన జొకోవిచ్ ప్రత్యర్థి సర్వీస్‌ను కూడా ఆరుసార్లు బ్రేక్ చేశాడు. ఓవరాల్‌గా వింబుల్డన్‌లో 101వ విజయం నమోదు చేసిన జొకోవిచ్ కెరీర్‌లో 63వసారి గ్రాండ్‌స్లామ్ టోర్నీల్లో క్వార్టర్ ఫైనల్ దశకు అర్హత సాధించాడు. క్వార్టర్ ఫైనల్లో ఇటలీ ప్లేయర్ ఫ్లావియో కొబోలితో జొకోవిచ్ ఆడతాడు. ఇతర ప్రిక్వార్టర్ ఫైనల్స్‌లో కొబోలి 6-4, 6-4, 6-7 (4/7), 7-6 (7/3)తో మారిన్ సిలిచ్ (క్రొయేషియా)పై... బెన్ షెల్టన్ (అమెరికా) 3-6, 6-1, 7-6 (7/1), 7-5తో సొనెగో (ఇటలీ)పై, డిఫెండింగ్ చాంపియన్ , రెండో సీడ్ అల్‌కరాజ్ (స్పెయిన్) 6-7 (5/7), 6-3, 6-4, 6-4తో 14వ సీడ్ ఆంద్రీ రుబ్లెవ్ (రష్యా)పై విజయం సాధించారు.



మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

సాక్షి సినిమా

పూరి సేతుపతి ఆరంభం



• విషు రెడ్డి, సంయుక్త, విజయ్ సేతుపతి, చార్మీ కౌర్, నారాయణ రావు, పూరి జగన్నాథ్

విజయ్ సేతుపతి హీరోగా పూరి జగన్నాథ్ దర్శకత్వంలో రూపొందుతున్న 'పూరి సేతుపతి' (వర్కింగ్ టైటిల్) సినిమా చిత్రీకరణ ప్రారంభమైంది. సంయుక్త హీరోయిన్‌గా, టబు, విజయ్ కుమార్ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. చార్మీ కౌర్ సమర్పణలో పూరి జగన్నాథ్, జేబీ నారాయణ రావు కొండ్రోల్ల ఈ సినిమాను నిర్మిస్తున్నారు. కాగా సోమవారం నుంచి హైదరాబాద్‌లో 'పూరి సేతుపతి' రెగ్యులర్ షూటింగ్ ప్రారంభమైందని ప్రకటించారు మేకర్స్. ''విజయ్ సేతుపతి, సంయుక్తలతో పాటు ఇతర కీలక తారాగణం పాల్గొంటున్న ఈ షెడ్యూల్‌లో కీలక సన్నివేశాల చిత్రీకరణ జరుగుతోంది. ఇందుకోసం భారీ సెట్ వేశాం. ఎలాంటి బ్రేక్స్ లేకుండా షూటింగ్ శరవేగంగా జరిగేలా ప్లాన్ చేశాం. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో ఈ చిత్రాన్ని రిలీజ్ చేస్తాం'' అని యూనిట్ పేర్కొంది.

కోలీవుడ్‌లో ఎంట్రీ



• శ్రీదేవి, కేజేఆర్

'కోర్ట్' సినిమాతో తెలుగమ్మాయి శ్రీదేవి హీరోయిన్‌గా పరిచయమయ్యారు. తన రెండో చిత్రంతో కోలీవుడ్‌లో (తమిళ్) అడుగుపెడుతున్నారామె. స్పోర్ట్స్, కోర్ట్ డ్రామా నేపథ్యంలో రూపొందుతోన్న 'గుర్తింపు' చిత్రంతో తెలుగు, తమిళ భాషల్లో హీరోగా పరిచయమవుతున్న నిర్మాత కేజేఆర్ కొత్త సినిమాలోనూ కథానాయకుడిగా నటిస్తున్నారు. దర్శకుడు ప్రశాంత్ పాండ్య రాజన్ శిష్యుడు రెగన్ స్టానిస్లాస్ ఈ చిత్రం ద్వారా దర్శకునిగా పరిచయం అవుతున్నారు. సోమవారం చెన్నైలో ఈ చిత్రం పూజా కార్యక్రమాలు జరిగాయి. 'మార్క్ ఆంటోనీ' చిత్రాన్ని నిర్మించిన మినీ స్టూడియో సంస్థ ఈ సినిమా రూపొందిస్తోంది. తెలుగులో ఈ చిత్రాన్ని గంగ ఎంటర్‌టైన్‌మెంట్స్ అందించనుంది. ''కేజేఆర్, శ్రీదేవిల జోడీ ఆకట్టుకుంటుంది. ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ త్వరలోనే మొదలుకానుంది'' అని మేకర్స్ పేర్కొన్నారు. ఈ చిత్రానికి సంగీతం: జిబ్రాన్, కెమెరా: పి.వి. శంకర్.

జోరుగా హుషారుగా...



• వెంకటేశ్

'సంక్రాంతికి వస్తున్నాం' వంటి బ్లాక్‌బస్టర్ మూవీ తర్వాత కొత్త సినిమాలను ఖరారు చేయడంలో వెంకటేష్ జోరు పెంచారు. ఆయన నటించనున్న కొత్త సినిమాలపై స్పష్టత వచ్చింది. అమెరికాలో జరిగిన 'నాట్స్–2025' వేడుకల్లో తన తర్వాతి చిత్రాల గురించి వెంకటేశ్ హుషారుగా మాట్లాడారు. ''త్రివిక్రమ్‌తో ఓ సినిమా చేయబోతున్నాను. అలాగే చిరంజీవి సినిమాలో అతిథి పాత్రలో నటిస్తాను. మీనాతో కలిసి ఓ సినిమా చేస్తాను (దృశ్యం 3). 'సంక్రాంతికి వస్తున్నాం' తర్వాత అనిల్ రావిపూడి దర్శకత్వంలోనే మరో సినిమా ఉంది. ఈ చిత్రాలతో పాటు నా మిత్రుడు, తెలుగులో ఓ పెద్ద స్టార్ హీరోతో కలిసి ఓ సినిమాలో నటించబోతున్నాను'' అని తెలిపారు. ఇక అనిల్ రావిపూడి దర్శకత్వంలో వెంకటేష్ చేయబోయే సినిమా 'సంక్రాంతికి వస్తున్నాం' సీక్వెల్ 'మళ్లీ సంక్రాంతికి వస్తున్నాం' అని, అలాగే వెంకటేశ్ ప్రస్తావించిన భారీ ప్రాజెక్ట్ బాలకృష్ణతో ఉంటుందనే టాక్ తెరపైకి వచ్చింది. అయితే ఈ విషయాలపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

ఏదో జరగబోతుంది



• విజయ్ దేవరకొండ

విజయ్ దేవరకొండ హీరోగా నటించిన 'కింగ్‌డమ్' సినిమా కొత్త రిలీజ్ డేట్ ఖరారైంది. ఈ చిత్రాన్ని ఈ నెల 31న విడుదల చేయనున్నట్లుగా మేకర్స్ ప్రకటించి, ప్రోమోను విడుదల చేశారు. ''ఏమైనా చేస్తా సార్... అవసరమైతే మొత్తం తగలబెట్టేస్తా సార్..., ఏదో పెద్దగా జరగబోతుంది'' వంటి డైలాగ్స్‌తో పాటు బ్యాక్‌గ్రౌండ్‌లో ఓ పాట కూడా వినిపిస్తుంది. భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా నటించిన ఈ సినిమాలో సత్యదేవ్ ప్రధాన పాత్ర చేశారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించిన ఈ చిత్రానికి అనిరుధ్ రవిచందర్ స్వరకర్త.

మారెమ్మ



• మాధవ్

హీరో రవితేజ సోదరుడు, నటుడు రఘు కుమారుడు మాధవ్ హీరోగా నటిస్తున్న చిత్రానికి 'మారెమ్మ' అనే టైటిల్ ఖరారు చేశారు. మంచాల నాగరాజ్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో దీపా బాలు కథానాయిక. మోక్ష ఆర్ట్స్ బ్యానర్‌పై మయూర్ రెడ్డి బండారు నిర్మిస్తున్నారు. ఈ సినిమాకి 'మారెమ్మ' టైటిల్ ప్రకటించి, ఫస్ట్ లుక్ రిలీజ్ చేశారు మేకర్స్. ''పవర్‌ఫుల్ రూరల్ గ్రామీణ యాక్షన్ డ్రామాగా రూపొందుతోన్న చిత్రం 'మారెమ్మ'. మాధవ్‌ను ఫెరోషియస్ రగ్డ్ లుక్‌లో ప్రజెంట్ చేస్తున్నారు నాగరాజ్. ఈ పాత్ర కోసం ఆయన పూర్తిగా మేకోవర్ అయ్యారు'' అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: ఉమేష్ విలాసాగరం, క్రియేటివ్ ప్రొడ్యూసర్: కుశాల్ రెడ్డి కందాలా, కెమెరా: ప్రశాంత్ అంకిరెడ్డి, సంగీతం: ప్రశాంత్ ఆర్ విహారి.

ఆ పాత్ర నా అదృష్టం

– మాళవికా మనోజ్



''గతంలో నేను నటించిన సినిమాల్లో సాధారణంగా ఉండే పల్లెటూరి అమ్మాయి పాత్రలు చేశాను. అయితే 'ఓ భామ అయ్యో రామ' చిత్రంలో ఎంతో మోడ్రన్‌గా, హైపర్‌గా, ఆటిట్యూడ్‌తో ఉండే సత్యభామ పాత్రలో నటించా.. ఇలాంటి పాత్ర చేయడం నా అదృష్టంగా భావిస్తున్నాను'' అని మాళవికా మనోజ్ తెలిపారు. సుహాస్, మాళవికా మనోజ్ జంటగా రామ్ గోధల దర్శకత్వం వహించిన చిత్రం 'ఓ భామ అయ్యో రామ'. హరీష్ నల్ల నిర్మించిన ఈ సినిమా ఈ నెల 11న విడుదలవుతోంది. ఈ సందర్భంగా మాళవికా మనోజ్ మాట్లాడుతూ–''నేను తమిళంలో నటించిన 'జో'లో నా నటన నచ్చడంతో 'ఓ భామ అయ్యో రామ'కి ఎంపిక చేశారు రామ్ గోధల. నాకు తెలుగు రాకపోయినా.. భావం అర్థం చేసుకుని సత్యభామ పాత్ర చేశాను. సుహాస్ సినిమా కోసం చాలా కష్టపడతాడు. హరీష్‌గారు ఎక్కడా రాజీ పడకుండా ఖర్చు పెట్టారు. రధన్‌గారు మంచి పాటలిచ్చారు. భాషతో సంబంధం లేకుండా ఈ పాటలు అందరికి నచ్చాయి. ఈ సినిమాలో హరీష్ శంకర్, మారుతిగార్లతో నటించడం సంతోషంగా ఉంది. నాకు చాలా అవకాశాలు వస్తున్నాయి. కానీ, నచ్చిన కథలు మాత్రమే చేస్తున్నాను. గ్లామరస్ రోల్స్ చేయాలా? వద్దా? అనే నిబంధన నాకు లేదు. కథ నచ్చితే చేస్తాను'' అన్నారు.

అతి పెద్ద యుద్ధం



• రిషబ్ శెట్టి

'కాంతార: చాప్టర్ 1' సినిమా చిత్రీకరణ పూర్తయింది. రిషబ్ శెట్టి హీరోగా నటించి, దర్శకత్వం వహించిన తాజా చిత్రం 'కాంతార: చాప్టర్ 1'. హోంబలే ఫిలింస్ నిర్మించిన ఈ సినిమా చిత్రీకరణ పూర్తయింది. ఈ సినిమా అక్టోబరు 2న విడుదల కానుంది. కాగా సోమవారం (జూలై 7) రిషబ్ శెట్టి బర్త్ డే. ఈ సందర్భంగా 'కాంతార: చాప్టర్ 1' నుంచి రిషబ్ శెట్టి కొత్త పోస్టర్‌ను రిలీజ్ చేసి, చిత్రీకరణ పూర్తయినట్లుగా చిత్రయూనిట్ పేర్కొంది. ''కాంతార (2022) సినిమాకు ప్రీక్వెల్‌గా 'కాంతార: చాప్టర్ 1' రానుంది. ఈ సినిమా కోసం జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో యుద్ధ సన్నివేశాలను రూపొందించాం. 25 ఎకరాల్లో ఓ టౌన్ సెట్ వేసి, 500 మందికి పైగా ఫైటర్స్, 3000 మంది జూనియర్ ఆర్టిస్ట్స్‌తో దాదాపు 50 రోజుల పాటు షూటింగ్ చేశాం. ఇండియన్ సినిమా చరిత్రలోనే ఓ బిగ్గెస్ట్ సీన్ ఇది'' అని మేకర్స్ పేర్కొన్నారు. ఈ సినిమాకు సంగీతం: అజనీష్ లోకనాథ్.

ఫిలించాంబర్ ఎన్నికలు నిర్వహించాలి

– నిర్మాతలు



• రామకృష్ణ గౌడ్, బసిరెడ్డి

''తెలుగు ఫిలించాంబర్ ఆఫ్ కామర్స్' ప్రస్తుత కమిటీ గడువు ఈ నెలలో ముగుస్తుంది. బైలా నిబంధనల ప్రకారం ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు చేయాలి. కానీ, అసోసియేషన్‌లోని కొందరు ఎన్నికలను వాయిదా వేయాలని ప్రయత్నిస్తున్నారు'' అని నిర్మాతలు ప్రతాని రామకృష్ణ గౌడ్, బసిరెడ్డి తెలిపారు. ఈ మేరకు పలువురు నిర్మాతలతో కలిసి వారు సోమవారం 'తెలుగు ఫిలించాంబర్ ఆఫ్ కామర్స్' ప్రతినిధులకు వినతి పత్రం అందించారు. అనంతరం నిర్మాతలు మాట్లాడుతూ– ''తెలుగు ఫిలించాంబర్‌లో ఇటీవల నిర్వహించిన ఈసీ మీటింగ్‌కి 48 మందికి ఓటు హక్కు ఉండగా 38 మంది హాజరయ్యారు. ఇప్పుడున్న కమిటీ సభ్యులు రెండు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలకు సన్నిహితంగా ఉన్నారు. అందుకే ప్రస్తుత కమిటీనే కొనసాగించాలని ఒక ఈసీ మెంబర్ లేఖ రాయడంతో 34 మంది సభ్యులు అంగీకారం తెలిపారు. అయితే ఒకరిద్దరు సభ్యులు మాత్రం తమ ఎన్నిక గడువు ముగిసినందున పదవులకు రాజీనామా చేస్తూ లెటర్స్ రాస్తున్నారు. మిగతా వారు కూడా అలాగే గౌరవంగా ఎన్నికల కోసం ముందుకు రావాలి'' అన్నారు.

ఫ్యామిలీ డ్రామా



• మిస్తీ, కార్తీక్

''కొత్త నిర్మాతలు ఏడాది పాటు అవగాహన పెంచుకుని వస్తే బాగుంటుంది. ఇందుకు సంబంధించి ప్రొడ్యూసర్స్ కౌన్సిల్, ఫిలించాంబర్ తరఫున మేము కౌన్సెలింగ్ ఇస్తూనే ఉన్నాం. పెద్ద–చిన్న సినిమాల మధ్య సమస్యలను గురించి చర్చించబోతున్నాం'' అని తెలుగు ఫిలిం ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ ప్రెసిడెంట్, ఫిలించాంబర్ సెక్రటరీ కె.ఎల్. దామోదర్ ప్రసాద్ అన్నారు. కార్తీక్ రాజు, మిస్తీ చక్రవర్తి జంటగా ఎం. పూర్ణానంద్ దర్శకత్వం వహించిన చిత్రం 'దీర్ఘాయుష్మాన్ భవ'. వంకాయలపాటి మురళీకృష్ణ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 11న రిలీజ్ కానుంది. నట్టీస్ ఎంటర్‌టైన్మెంట్స్ డిస్ట్రిబ్యూషన్ తరఫున నట్టి కుమార్ రిలీజ్ చేస్తున్నారు. ఈ చిత్రం ప్రీ రిలీజ్ వేడుకలో ట్రైలర్‌ను కె.ఎల్. దామోదర్ ప్రసాద్, ప్రోమోస్‌ను ఓ.కల్యాణ్ ఆవిష్కరించారు. ''అన్ని భావోద్వేగాలున్న ఫ్యామిలీ డ్రామా ఇది'' అన్నారు ఎం. పూర్ణా నంద్, మురళీకృష్ణ.

స్టాక్ మార్కెట్లు (సోమవారం రాత్రి 11.30 గంటలకు)

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▲ 10	నిఫ్టీ ▲ 0.30
83,443	25,461

విదేశీ సూచీలు			
నాస్‌డాక్	20,407	▽	193
డోజోన్స్	44,363	▽	466
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,806	▽	16
డాక్స్	24,073	▲	286
షాంఘై	3,473	▲	1
నికాయ్	39,588	▽	14

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో

		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	84.02	87.70
£	బ్రిటన్ పౌండ్	114.71	119.57
€	యూరో	98.58	103.02
¥	జపాన్ యెన్ (100)	47.99	69.82
AU$	ఆస్ట్రేలియా డాలర్	53.54	58.36
S$	సింగపూర్ డాలర్	64.87	69.55
SAR	సౌదీ రియాల్	21.99	23.50
UAE D	యూఏఈ దిర్హామ్	22.48	24.27
¥	చైనా యువాన్	11.09	12.90

ల్యాబ్ వజ్రం.. జిగేల్!



అంతర్జాతీయంగా ఎల్‌జీడీ మార్కెట్ @ 26 బిలియన్ డాలర్లు

- దేశీయంగా సుమారు 700 మిలియన్ డాలర్లు
- వినియోగం ఏటా 15–20 శాతం వృద్ధి
- అమెరికా తర్వాత కీలక మార్కెట్‌గా మారనున్న భారత్
- ట్రెంట్, సెన్కో తదితర పెద్ద కంపెనీలు కూడా బరిలోకి
- సహజ వజ్రాలతో పోలిస్తే 70–90 శాతం వరకు రేటు తక్కువ
- తెలుగు రాష్ట్రాల్లోనూ జోరుగా అమ్మకాలు

కోట్ల కొద్దీ సంవత్సరాలుగా రసాయనిక చర్యలకు గురై, ఎక్కడో భూమి లోతుల్లో నిక్షిప్తమై అత్యంత అరుదుగా లభించే వజ్రాలు.. ఇప్పుడు ప్రయోగశాలల్లో కూడా తయారవుతున్నాయి. సహజమైన వజ్రాలకు చౌక ప్రత్యామ్నాయమైన ఈ వజ్రాలను ల్యాబ్ గ్రోన్ డైమండ్లుగా (ఎల్‌జీడీ) పిలుచుకుంటున్నారు. సహజ వజ్రాల ధరలు పెరుగుతుండటంతో, బడ్జెట్ గురించి ఆలోచించే వర్గాల్లోనూ, యువతలోనూ ఈ ఎల్‌జీడీలకు ఆదరణ పెరుగుతోంది. ల్యాబ్‌లలో తయారు చేసే ఈ వజ్రాల ధర, సహజ డైమండ్లతో పోలిస్తే దాదాపు 70–90 శాతం తక్కువగా ఉండటంతో పాటు పర్యావరణ అనుకూలమైన విధానంలో తయారు చేస్తుండటం కూడా ఇందుకు కారణాలు. ఫార్చూన్ బిజినెస్ ఇన్‌సైట్స్ ప్రకారం అంతర్జాతీయంగా ఈ మార్కెట్ 2024లో సుమారు 26 బిలియన్ డాలర్లుగా ఉండగా 2032 నాటికి 75 బిలియన్ డాలర్లకు చేరనుంది. ఈ నేపథ్యంలో డైమండ్ కటింగ్, పాలిషింగ్‌కి పేరొందిన భారత్ ఇప్పుడు ఎల్‌జీడీ రంగంలో కూడా కీలకంగా మారుతోంది. దేశీయంగా ఏటా 8–10 శాతం పెరుగుతున్న రత్నాభరణాల మార్కెట్ దాదాపు 80–85 బిలియన్ డాలర్లుగా ఉండగా ఇందులో సహజ వజ్రాభరణాల వాటా సుమారు 10 శాతంగా ఉంటోంది. గతేడాది ఎల్‌జీడీల మార్కెట్ 600–700 మిలియన్ డాలర్లుగా ఉన్నట్లు అంచనా.

– సాక్షి, బిజినెస్ డెస్క్

ఇలా ఎల్‌జీడీల అమ్మకాలు గణనీయంగా పెరుగుతుండటంతో పలు దిగ్గజ సంస్థలు కూడా ఈ విభాగంలోకి ప్రవేశిస్తున్నాయి. ఉదాహరణకు ట్రెంట్ ఇటీవలే తమ ఎల్‌జీడీ బ్రాండ్ 'పోమ్'తో మార్కెట్లోకి ఎంట్రీ ఇచ్చింది. సెన్కో గోల్డ్ అండ్ డైమండ్స్ కూడా ఎల్‌జీడీ మార్కెట్లోకి ప్రవేశించడంపై కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. సెనెస్ ఫ్యాషన్ అనే అనుబంధ సంస్థ ల్యాబ్ గ్రోన్ డైమండ్స్‌తో పాటు పర్ఫ్యూమ్‌లు, లెదర్ యాక్సెసరీల్లాంటి లగ్జరీ ఐటమ్స్‌పైనా దృష్టి పెడుతోంది. ఇలా ఎల్‌జీడీలకు ఆదరణ పెరగడం ఒక కోణం అయితే ఇవి మిగతా సెగ్మెంట్లకు పోటీ కావడం మరో కోణంగా మారుతోంది. ఎల్‌జీడీలతో వివాహ ఆభరణాల సెగ్మెంట్‌కి వచ్చే నష్టమేమీ పెద్దగా లేకపోయినా.. రోజువారీ ఉపయోగించుకునేందుకు కొనుగోలు చేసే ఆభరణాలకు ఇవి పోటీగా మారొచ్చని పరిశ్రమ వర్గాలు తెలిపాయి.

తెలంగాణలో దాదాపు రూ. 150 కోట్లు

తెలుగు రాష్ట్రాల్లో ఎల్‌జీడీలకు గత కొన్నాళ్లుగా డిమాండ్ పెరుగుతోంది. దీంతో లైమ్‌లైట్ ల్యాబ్ గ్రోన్ డైమండ్స్, లాదియా తదితర సంస్థలు కార్యకలాపాలు విస్తరిస్తున్నాయి. తెలంగాణలో ప్రస్తుతం సుమారు రూ. 100–150 కోట్ల వరకు మార్కెట్ ఉంటుందని తెలుగు రాష్ట్రాలతో పాటు దేశవ్యాప్తంగా స్టోర్స్ ఉన్న లైమ్‌లైట్ ల్యాబ్ గ్రోన్ డైమండ్స్ సంస్థ ఇన్వెస్టర్ నిపుణ్ గోయల్ తెలిపారు. ఇది ఏటా 15–17 శాతం వరకు వృద్ధి చెందుతోందని చెప్పారు. ఎక్కువగా 18–30 ఏళ్లు, ఆ తర్వాత 45 ఏళ్లు పైబడిన వారు వీటిపై మక్కువ చూపిస్తున్నట్లు వివరించారు. సాధారణంగా రూ. 20–25 వేల వరకు సగటు ధర ఉండే రింగులు, పెండెంట్లు మొదలైన వాటికి డిమాండ్ ఉంటోందని పేర్కొన్నారు. తమ స్టోర్లు ఒక్కొక్కటి ప్రతి నెలా సుమారు రూ. 20–25 లక్షల వరకు సేల్స్ సాధిస్తున్నట్లు చెప్పారు. ఆంధ్రప్రదేశ్ మార్కెట్ కూడా గణనీయంగా వృద్ధి చెందుతోందని వివరించారు. అక్కడి వినియోగ ధోరణులను పరిశీలిస్తే పొరుగు రాష్ట్రాన్ని కూడా త్వరలోనే అధిగమించే అవకాశం ఉందన్నారు. సిసలైన డైమండ్‌తో పోలిస్తే ఎల్‌జీడీలు దాదాపు పదో వంతుకే లభిస్తున్నాయని గోయల్ తెలిపారు. ఉదాహరణకు సిసలైన డైమండ్ ఖరీదు రూ. 9 లక్షలుగా ఉంటే ఎల్‌జీడీ దాదాపు రూ. 1 లక్షకే లభిస్తుందని వివరించారు. ఎల్‌జీడీలకు ఎక్స్ఛేంజ్ ఆఫర్లు కూడా ఇస్తున్నట్లు చెప్పారు. ఇలా అందుబాటు ధరలో లభిస్తుండటం, పర్యావరణహితమైనవి కావడంలాంటివి ఎల్‌జీడీలకు సంబంధించి ఆకర్షణీయమైన అంశాలుగా ఉంటున్నాయి.

ఏమిటీ ఎల్‌జీడీలు..

- కార్బన్‌తో కూడుకున్న సహజసిద్ధమైన వజ్రాలను గనుల నుంచి వెలికితీస్తారు. డైమండ్ సీడ్‌ను ఉపయోగించి ఎల్‌జీడీలను హై–ప్రెజర్, హై టెంపరేచర్ (హెచ్‌పీహెచ్‌టీ), కెమికల్ వేపర్ డిపాజిషన్ (సీవీడీ) అనే పద్ధతుల్లో ప్రయోగశాలల్లో తయారు చేస్తారు. ఇవి అచ్చంగా సహజమైన డైమండ్లలాగే ఉంటాయి. ఒరిజినల్ డైమండ్‌ని, వీటిని పక్కపక్కన పెడితే పలు సందర్భాల్లో నిపుణులు సైతం ప్రత్యేక పరికరాలు లేకుండా వ్యత్యాసాన్ని గుర్తించడం కష్టంగా ఉంటుంది.
- సహజమైన రఫ్ డైమండ్ల సరఫరా ప్రస్తుతం సుమారు ఏటా 125 మిలియన్ క్యారట్లుగా ఉండగా 2050 నాటికి 14 మిలియన్ క్యారట్లకు పడిపోతుందని అంచనా. మరోవైపు డిమాండ్ మాత్రం 292 మిలియన్ క్యారట్లకు పెరుగుతుందని అంచనా.
- మన దగ్గర సూరత్, ముంబై ప్రధాన ఎల్‌జీడీ హబ్‌లుగా ఉంటున్నాయి. ఎల్‌జీడీ ఉత్పత్తిలో దాదాపు 98 శాతం వాటా వీటిదే ఉంటోంది.
- డైమండ్ విలువను నిర్దేశించేవి 4 ఇలు. కలర్ (రంగు), క్లారిటీ (స్వచ్ఛత), కట్, క్యారట్ బరువు. ఈ అన్ని ప్రమాణాల్లోనూ సహజ వజ్రాలకు ఎల్‌జీడీలు గట్టి పోటీనిస్తున్నాయి. మలినాలు లేని, అత్యంత స్వచ్ఛమైన 'టైప్ 2ఏ' రకం డైమండ్ల తరహా వజ్రాలను కూడా తయారు చేస్తున్నారు. 2023లో ప్రధాని నరేంద్ర మోదీ అమెరికాలో పర్యటించినప్పుడు, ఆ దేశ అధ్యక్షుడు జో బైడెన్, ఆయన సతీమణి జిల్ బైడెన్‌కు 7.5 క్యారట్ల ఎల్‌జీడీని బహూకరించారు. ఇది అత్యంత స్వచ్ఛమైనదిగా భావించే టైప్ 2ఏ కోవకు చెందిన వజ్రం. ఇలాంటివి ఎంత అరుదైనవంటే.. గనుల్లో నుంచి వెలికి తీసే వజ్రాల్లో 1–2 శాతం మాత్రమే ఈ కోవకి చెందినవై ఉంటాయి.
- సహజమైన వజ్రాలు ఏర్పడటానికి 100 కోట్ల నుంచి 330 కోట్ల సంవత్సరాలు పట్టగా, ఎల్‌జీడీలను ల్యాబొరేటరీల్లో కేవలం 2 వారాల నుంచి 10 వారాల్లోనే తయారు చేయొచ్చు.



ఆదరణ ఎందుకంటే ..

- గనుల్లో నుంచి తవ్వి తీసే సహజ వజ్రాల కన్నా పర్యావరణానికి అనుకూలమైన, నైతికంగా తయారు చేసే ప్రత్యామ్నాయాలుగా ఎల్‌జీడీలు ఆదరణ పొందుతున్నాయి.
- కొంత ఖర్చు చేయతగిన విధంగా ఆదాయాలు, విలువైన డైమండ్లపై పెట్టుబడి మీద అవగాహన పెరుగుతుండటం.
- వినియోగదారుల్లో, ముఖ్యంగా యువత అభిరుచి మారుతుండటం, ఎల్‌జీడీలతో మరింత కస్టమైజ్డ్ జ్యుయలరీ డిజైన్లను తయారు చేసేందుకు వీలుండటం.
- సహజమైన డైమండ్లతో పోలిస్తే అత్యంత తక్కువ వ్యయాలకే, చాలా తక్కువ సమయంలోనే ఉత్పత్తి చేయడం వల్ల నాణ్యమైన ప్రత్యామ్నాయ వజ్రాలు చౌకగా లభ్యమవుతుండటం
- ప్రభుత్వం కూడా వీటి తయారీని ప్రోత్సహించే దిశగా ఎల్‌జీడీ సీడ్స్‌పై కస్టమ్స్ సుంకాలను అయిదు శాతం నుంచి సున్నా స్థాయికి తగ్గించింది.

మార్కెట్లు యథాతథం

- రోజంతా స్వల్ప హెచ్చుతగ్గులు
- సెన్సెక్స్ 10 పాయింట్లు ప్లస్
- 83,443 వద్ద ముగింపు
- 25,461 వద్దనే నిలిచిన నిఫ్టీ



ముంబై: రోజంతా స్వల్ప హెచ్చుతగ్గుల మధ్య కదిలిన దేశీ స్టాక్ మార్కెట్లు దాదాపు యథాతథంగా ముగిశాయి. సెన్సెక్స్ 10 పాయింట్ల నామమాత్ర లాభంతో 83,443 వద్ద నిలిచింది. నిఫ్టీ యథాతథంగా 25,461 వద్దనే స్థిరపడింది. యూఎస్ విధించిన 90 రోజుల టారిఫ్‌ల గడువు 9న ముగియనున్న నేపథ్యంలో ఇన్వెస్టర్లు ఆచితూచి వ్యవహరిస్తున్నట్లు మార్కెట్ విశ్లేషకులు పేర్కొన్నారు. ఇంట్రాడేలో సెన్సెక్స్ 83,517–83,262 పాయింట్ల మధ్య ఊగిసలాడగా.. నిఫ్టీ 25,490–25,407 పాయింట్ల మధ్య ఆటుపోట్లు చవిచూసింది.

ఎఫ్‌ఎంసీజీ అప్: ఎన్‌ఎస్‌ఈలో ఎఫ్‌ఎంసీజీ 1.7 శాతం పుంజుకోగా.. మీడియా, ఐటీ, మెటల్ 1–0.6 శాతం మధ్య నీరసించాయి. నిఫ్టీ దిగ్గజాలలో హెచ్‌యూఎల్, టాటా కన్జూమర్, నెస్లే, ఐషర్, జియో ఫైనాన్స్, ఏషియన్ పెయింట్స్, ఐటీసీ, కొటక్ బ్యాంక్, ఆర్‌ఐఎల్ 3–1% మధ్య ఎగశాయి. అయితే బీఈఎల్, టెక్ మహీంద్రా, ఓఎన్‌జీసీ, అల్ట్రాటెక్, హెచ్‌సీఎల్ టెక్, మారుతీ, హిందాల్కో, గ్రాసిమ్, హీరో మోటో, ఇన్ఫోసిస్ 2.5–1 శాతం మధ్య క్షీణించాయి. కాగా.. నగదు విభాగంలో ఎఫ్‌పీఐలు రూ. 321 కోట్లు, దేశీ ఫండ్స్ రూ. 1,853 కోట్ల చొప్పున ఇన్వెస్ట్ చేశాయి.

రూపాయి నేలచూపు

54 పైసలు పతనం



డాలరుతో మారకంలో దేశీ కరెన్సీ తాజాగా 54 పైసలు పతనమైంది. 85.94 వద్ద ముగిసింది. ఇంటర్‌బ్యాంక్ ఫారెక్స్ మార్కెట్లో రూపాయి ట్రేడింగ్ 85.53 వద్ద ప్రారంభమైంది. తదుపరి 85.51–86.03 మధ్య ఆటుపోట్లను చవిచూసింది. ప్రపంచ కరెన్సీలతో డాలరు బలపడటం, యూఎస్ టారిఫ్‌ల గడువు దగ్గరపడటం తదితర అంశాలు రూపాయిని దెబ్బతీసినట్లు ఫారెక్స్ వర్గాలు పేర్కొన్నాయి. బ్రిక్స్ సదస్సు నేపథ్యంలో యూఎస్ ప్రెసిడెంట్ ట్రంప్ ఆయా దేశాలపై 10% అదనపు డ్యూటీలను విధించనున్నట్లు ప్రకటించడం సైతం రూపాయిపై ప్రభావం చూపినట్లు తెలియజేశారు. కాగా, ఆరు ప్రధాన కరెన్సీలతో మారకంలో డాలరు 0.25 శాతం పుంజుకుని 97.41కు చేరింది.

ఆకాశ ఎయిర్‌తో జీఎంఆర్ ఏరో టెక్నిక్ ఒప్పందం



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: విమానయాన సంస్థ ఆకాశ ఎయిర్‌తో ఒప్పందం కుదుర్చుకున్నట్లు జీఎంఆర్ ఏరో టెక్నిక్ వెల్లడించింది. దీని కింద ఆకాశ ఎయిర్‌కి చెందిన బోయింగ్ 737 మ్యాక్స్ విమానాలకు తమ అధునాతన ఎంఆర్‌వో కేంద్రంలో (మెయింటెనెన్స్, రిపేర్, ఓవర్‌హాల్) మెయింటెనెన్స్ సేవలు అందించనున్నట్లు వివరించింది. ఈ ఒప్పందం మూడేళ్ల పాటు అమల్లో ఉంటుంది. తమ సాంకేతిక నైపుణ్యాలు, నిర్వహణ సామర్థ్యాలపై విమానయాన సంస్థలకు గల నమ్మకానికి ఈ డీల్ నిదర్శనమని జీఎంఆర్ ఏరో టెక్నిక్ ప్రెసిడెంట్ అశోక్ గోపీనాథ్ తెలిపారు. దేశీయంగా ఎంఆర్‌వో వ్యవస్థ అభివృద్ధి చెందడంలో మద్దతిచ్చేందుకు ఈ ఒప్పందం దోహదపడుతుందని ఆకాశ ఎయిర్ సహ–వ్యవస్థాపకుడు బెల్సన్ కొటిన్హో పేర్కొన్నారు.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
డ్రోన్ మార్కెట్ @ రూ.2 లక్షల కోట్లు
ఎఫ్‌అండ్‌వోలో 91% రిటైలర్లకు నష్టాలే..

భవిత

స్పర్ధయా వర్ధతే విద్య

విద్య, ఉద్యోగ సమాచారం

బ్యాంక్ ఆఫ్ బరోడాలో 2500 లోకల్ బ్యాంక్ ఆఫీసర్ పోస్టులు

వడోదర(గుజరాత్)లోని బ్యాంక్ ఆఫ్ బరోడా దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో ఉన్న బ్రాంచ్‌లలో రెగ్యులర్ ప్రాతిపదికన లోకల్ బ్యాంక్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 2500.
» **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి. ప్రొఫెషనల్ డిగ్రీలు(సీఏ, కాస్ట్ అకౌంటెంట్, ఇంజనీరింగ్, మెడికల్) ఉన్నవారు కూడా అర్హులు. కనీసం ఏడాది బ్యాంకింగ్ అనుభవం(కమర్షియల్ బ్యాంక్ లేదా రీజనల్ రూరల్ బ్యాంక్‌లో) ఉండాలి.
» **వయసు:** 01.07.2025 నాటికి 21 నుంచి 30 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్లు, ఓబీసీ అభ్యర్థులకు మూడేళ్లు, పీడబ్ల్యూబీడీ అభ్యర్థులకు 15 ఏళ్ల వయోసడలింపు ఉంటుంది.
» **బేసిక్ పే:** రూ.48,480 నుంచి రూ.85,920 + ఇతర అలవెన్సులు.
» **ఎంపిక విధానం:** ఆన్‌లైన్ పరీక్ష, సైకోమెట్రిక్ టెస్ట్, భాషా నైపుణ్య పరీక్ష, గ్రూప్ డిస్కషన్/ఇంటర్వ్యూ ద్వారా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 24.07.2025
» **వెబ్‌సైట్:** www.bankofbaroda.in

సీఎస్ఐఆర్-ఐఎంటీ, చండీగఢ్‌లో వివిధ ఉద్యోగాలు

చండీగఢ్‌లోని సీఎస్ఐఆర్–ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మైక్రోబయాల్ టెక్నాలజీ(ఐఎంటీ) ..ప్రాజెక్ట్ అసోసియేట్, ప్రాజెక్ట్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 04.
» **పోస్టుల వివరాలు:** ప్రాజెక్ట్ అసిస్టెంట్1–01, ప్రాజెక్ట్ అసోసియేట్2–01, సీనియర్ ప్రాజెక్ట్ అసోసియేట్–02.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో పదో తరగతి, ఐటీఐ, ఇంటిగ్రేటెడ్ పీజీలో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **గరిష్ఠ వయోపరిమితి:** ప్రాజెక్ట్ అసోసియేట్2, ప్రాజెక్ట్ అసిస్టెంట్‌కు 35 ఏళ్లు, సీనియర్ ప్రాజెక్ట్ అసోసియేట్‌కు 40 ఏళ్లు.
» **వేతనం:** నెలకు సీనియర్ ప్రాజెక్ట్ అసోసియేట్‌కు రూ.42,000, ప్రాజెక్ట్ అసోసియేట్–2కు రూ.35,000, ప్రాజెక్ట్ అసిస్టెంట్‌కు రూ.18,000.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 08.07.2025.
» **వెబ్‌సైట్:** https://www.imtech.res.in

నాబార్డ్ కన్సల్టెన్సీ సర్వీస్‌లో కన్సల్టెంట్ పోస్టులు


ముంబైలోని నేషనల్ బ్యాంక్ ఫర్ అగ్రికల్చర్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్(నాబార్డ్) కన్సల్టెన్సీ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్.. ఒప్పంద ప్రాతిపదికన కన్సల్టెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 03.
» **పోస్టుల వివరాలు:** సీనియర్ లెవల్ కన్సల్టెంట్ (అగ్రికల్చర్)–01, జూనియర్ లెవల్ కన్సల్టెంట్–02.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఎంబీఏ/అగ్రికల్చర్/అగ్రిబిజినెస్‌లో డిగ్రీ ఉత్తీర్ణతతోపాటు కంప్యూటర్ పరిజ్ఞానం, ఉద్యోగానుభవం ఉండాలి.
» **వేతనం:** నెలకు సీనియర్ కన్సల్టెంట్‌కు రూ.55,000 నుంచి రూ.65,000, జూనియర్ కన్సల్టెంట్‌కు రూ.35,000 నుంచి రూ.45,000.
» **వయసు:** డేటా సైంటిస్ట్/ఏఐ ఇంజనీర్, డేటా ఇంజనీర్ పోస్టులకు 25 నుంచి 35 ఏళ్లు, డేటా సైంటిస్ట్‌కు 23 నుంచి 30 ఏళ్లు, స్పెషలిస్ట్‌కు 30 నుంచి 40 ఏళ్ల మధ్య ఉండాలి.
» **ఎంపిక విధానం:** విద్యార్హతల ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 10.07.2025.
» **పనిచేయాల్సిన ప్రదేశాలు:** తెలంగాణ, బిహార్, ముంబై.
» **వెబ్‌సైట్:** https://nabcons.com

బ్యాంక్ ఆఫీసర్.. కొలువు కొట్టేలా!

» 5,208 పీవో పోస్టుల భర్తీకి ఐబీపీఎస్ నోటిఫికేషన్
» ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తుకు అర్హులు
» ప్రిలిమ్స్, మెయిన్స్, ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక
» ఎంపికైతే ఆకర్షణీయ వేతనాలు, ఉజ్వల కెరీర్

ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో ఉద్యోగాల భర్తీకి ఎంపిక ప్రక్రియను చేపట్టే ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్యాంకింగ్ పర్సనల్ సెలక్షన్(ఐబీపీఎస్).. నిరుద్యోగులకు శుభవార్త చెప్పింది. వివిధ ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో 5,208 ప్రొబేషనరీ ఆఫీసర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రిలిమ్స్, మెయిన్స్, పర్సనాలిటీ టెస్ట్, ఇంటర్వ్యూలో ప్రతిభ ఆధారంగా నియామకాలు చేపట్టనుంది. ఈ నేపథ్యంలో.. ఐబీపీఎస్ పీవో పోస్టులు, వేతనాలు, దరఖాస్తుకు అర్హతలు, ఎంపిక ప్రక్రియ, పరీక్ష విధానం, సిలబస్ విశ్లేషణ, ప్రిపరేషన్ తదితర వివరాలు..



ఐబీపీఎస్ తాజాగా 2026–27 సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో ప్రొబేషనరీ ఆఫీసర్/మేనేజ్‌మెంట్ ట్రైనీ ఉద్యోగాల భర్తీకి కామన్ రిక్రూట్‌మెంట్ ప్రాసెస్‌కు నోటిఫికేషన్ విడుదల చేసింది. మొత్తం 11 ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో పోస్టులను భర్తీ చేయనుంది. అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానించి మూడంచెల్లో ఎంపిక ప్రక్రియ చేపట్టనుంది.

- **పోస్టులు:** ప్రొబేషనరీ ఆఫీసర్/మేనేజ్‌మెంట్ ట్రైనీ
- **మొత్తం పోస్టుల సంఖ్య:** 5208
- **బ్యాంకుల వారీగా ఖాళీలు:** బ్యాంక్ ఆఫ్ బరోడా –1000 పోస్టులు, బ్యాంక్ ఆఫ్ ఇండియా–700 పోస్టులు, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర–1000 పోస్టులు, కెనరా బ్యాంక్ –1000 పోస్టులు, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా–500 పోస్టులు, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్–450 పోస్టులు, పంజాబ్ నేషనల్ బ్యాంక్–200 పోస్టులు, పంజాబ్ అండ్ సింధ్ బ్యాంక్–358 పోస్టులు ఉన్నాయి. ఇండియన్ బ్యాంక్, యూకో బ్యాంక్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాల్లో ఖాళీల వివరాలు ప్రకటించలేదు.

అర్హతలు

21.07.2025 నాటికి గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఏదైనా డిగ్రీ (గ్రాడ్యుయేషన్) ఉత్తీర్ణత లేదా తత్సమాన అర్హత ఉండాలి. ఆన్‌లైన్ దరఖాస్తు చేసే నాటికి అభ్యర్థి వద్ద డిగ్రీ మార్కుల పత్రం/డిగ్రీ సర్టిఫికెట్ ఉండాలి. డిగ్రీలో పొందిన మార్కులను దరఖాస్తులో పేర్కొనాల్సి ఉంటుంది.

వయసు

01.07.2025 నాటికి 20 నుంచి 30 ఏళ్ల మధ్యలో ఉండాలి. 02.07.1995 నుంచి 01.07.2005 మధ్య జన్మించిన వారు అర్హులు. ఎస్సీ/ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు గరిష్ఠ వయోపరిమితిలో సడలింపు లభిస్తుంది.

వేతనం

నెలకు రూ.48,400–రూ.85,920 వేతన శ్రేణి లభిస్తుంది. దీంతోపాటు ఆయా బ్యాంకుల నిబంధనల మేరకు అలవెన్సులు, ఇతర సౌకర్యాలు అందుతాయి.

ఎంపిక ప్రక్రియ

ప్రిలిమినరీ పరీక్ష, మెయిన్ ఎగ్జామినేషన్, పర్సనాలిటీ టెస్ట్, ఇంటర్వ్యూల ఆధారంగా ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు.

వంద మార్కులకు ప్రిలిమ్స్

ఎంపిక ప్రక్రియలో తొలిదశ ప్రిలిమినరీ పరీక్షను కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ విధానంలో నిర్వహిస్తారు. ఇందులోఆబ్జెక్టివ్ తరహా మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు ఉంటాయి. ఈ పరీక్ష వంద ప్రశ్నలు–వంద మార్కులకు జరుగుతుంది. ఇందులో ఇంగ్లిష్ లాంగ్వేజ్ 30 ప్రశ్నలు–30 మార్కులకు, క్వాంటిటేటివ్ అప్టిట్యూడ్ 35 ప్రశ్నలు–30 మార్కులకు, రీజనింగ్ ఎబిలిటీ 35 ప్రశ్నలు–40 మార్కులకు ఉంటాయి. ప్రతి విభాగానికి 20 నిమిషాల చొప్పున మొత్తం 60 నిమిషాల సమయం కేటాయించారు. అభ్యర్థులు ప్రతి విభాగంలో కనీస అర్హత మార్కులు సాధించాల్సి ఉంటుంది. ఇంగ్లిష్ లాంగ్వేజ్ మినహా ఈ పరీక్ష ప్రశ్న పత్రం ఇంగ్లిష్/హిందీలో ఉంటుంది. ఈ ఆబ్జెక్టివ్ పరీక్షలో నెగిటివ్ మార్కుల నిబంధన ఉంది. ప్రతి తప్పు సమాధానానికి 0.25 మార్కులను తగ్గిస్తారు. ప్రిలిమ్స్ మార్కులను తుది ఎంపికలో పరిగణనలోకి తీసుకోరు.

మెయిన్ ఎగ్జామ్

ప్రిలిమ్స్‌లో సాధించిన స్కోర్ ఆధారంగా పోస్టుల సంఖ్యను అనుసరించి కేటగిరీల వారిగా అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేసి మెయిన్ పరీక్షకు అనుమతిస్తారు. మెయిన్ (కంప్యూటర్ బేస్డ్ టెస్ట్) పరీక్ష ఆబ్జెక్టివ్, డిస్క్రిప్టివ్ విధానంలో జరుగుతుంది.

- ఆబ్జెక్టివ్ పరీక్ష 145 ప్రశ్నలు–200 మార్కులకు నిర్వహిస్తారు. ఇందులో రీజనింగ్ 40 ప్రశ్నలు–60 మార్కులకు, జనరల్/ఎకానమీ/బ్యాంకింగ్ అవేర్‌నెస్/డిజిటల్ /ఫైనాన్షియల్ అవేర్‌నెస్ 35 ప్రశ్నలు–50 మార్కులకు, ఇంగ్లిష్ లాంగ్వేజ్ 35 ప్రశ్నలు–40 మార్కులకు, డేటా అనాలసిస్ అండ్ ఇంటర్‌ప్రిటేషన్ 35 ప్రశ్నలు–50 మార్కులకు ఉంటాయి. ఇంగ్లిష్ లాంగ్వేజ్ మినహా ప్రశ్నపత్రం ఇంగ్లిష్/హిందీలో ఉంటుంది. ఈ ఆబ్జెక్టివ్ పరీక్షలో నెగిటివ్ మార్కుల నిబంధన ఉంది. ప్రతి తప్పు సమాధానానికి 0.25 మార్కులను తగ్గిస్తారు. మెయిన్ ఆబ్జెక్టివ్ పరీక్షకు 160 నిమిషాల సమయం కేటాయించారు.
- ఆబ్జెక్టివ్ పరీక్ష పూర్తయిన తర్వాత 25 మార్కులకు డిస్క్రిప్టివ్ పరీక్ష నిర్వహిస్తారు. ఇందులో ఎస్సే, కాంప్రహెన్షన్‌పై 2 ప్రశ్నలు అడుగుతారు. ఇంగ్లిష్ మీడియంలో జరిగే ఈ పరీక్షలో ఆర్థిక, సామాజిక,బ్యాంకింగ్ అండ్ టెక్నాలజీలో తాజా ట్రెండ్స్, కరెంట్ ఈవెంట్స్, ఎథిక్స్ తదితర అంశాలపై ప్రశ్నలు అడిగే అవకాశముంది. ఇందులో అభ్యర్థి రాత సామర్థ్యాన్ని(రైటింగ్ ప్రొఫిషియన్సీ) పరీక్షిస్తారు. మెయిన్ డిస్క్రిప్టివ్ పరీక్షకు 30 నిమిషాల సమయం కేటాయించారు.
- మెయిన్ పరీక్షలోని ప్రతి విభాగంలో కనీస అర్హత మార్కులు సాధించడం తప్పనిసరి. ఈ కటాఫ్ మార్కులను ఐబీపీఎస్ నిర్ణయిస్తుంది.

ఇంటర్వ్యూకు వంద మార్కులు

మెయిన్ పరీక్షలో చూపిన ప్రతిభ ఆధారంగా పర్సనాలిటీ టెస్ట్‌కు ఎంపిక చేస్తారు. పర్సనాలిటీ టెస్టులో భాగంగా ఇంటర్వ్యూ ప్యానెల్ అభ్యర్థి ప్రొఫైల్‌ను పరిశీలిస్తుంది. అనంతరం వంద మార్కులకు ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. ఇందులో జనరల్ అభ్యర్థులు కనీసం 40 శాతం మార్కులు సాధించాలి. రిజర్వేషన్ కేటగిరీల అభ్యర్థులు(ఎస్సీ/ఎస్టీ /ఓబీసీ/పీడబ్ల్యూడీ) కనీసం 35 శాతం మార్కులు పొందాలి.

తుది ఎంపిక

మెయిన్స్ ఆబ్జెక్టివ్, డిస్క్రిప్టివ్ టెస్టులో సాధించిన స్కోర్‌తోపాటు ఇంటర్వ్యూలో పొందిన మార్కులను తుది ఎంపికలో పరిగణనలోకి తీసుకుంటారు. మెయిన్ పరీక్ష స్కోర్‌ను 80 మార్కులకు, ఇంటర్వ్యూ స్కోర్‌ను 20 మార్కులకు వెయిటేజీ కల్పించి మొత్తం వంద మార్కులకు అభ్యర్థులు సాధించిన స్కోర్ ఆధారంగా తుది మెరిట్ జాబితాను ప్రకటిస్తారు.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
- ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేది: 21.07.2025
- ఆన్‌లైన్ ప్రిలిమినరీ పరీక్ష తేది: ఆగస్టు, 2025
- ఆన్‌లైన్ మెయిన్ పరీక్ష తేది: అక్టోబర్, 2025
- వెబ్‌సైట్: https://www.ibps.in

ఆన్‌లైన్ పరీక్షలో రాణించేలా

- ప్రిలిమ్స్ ఆగస్టులో, మెయిన్స్ అక్టోబర్‌లో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. రెండు పరీక్షల మధ్య ఎక్కువ వ్యవధి లేదు. కాబట్టి ప్రిలిమ్స్, మెయిన్స్ రెండింటికి ఉమ్మడి ప్రిపరేషన్ సాగించేలా అభ్యర్థులు ప్రణాళిక రూపొందించుకోవాలి.
- తొలుత సిలబస్‌ను సమగ్రంగా పరిశీలించాలి. అనంతరం పాత ప్రశ్న పత్రాలను విశ్లేషించాలి. ఎలాంటి ప్రశ్నలు అడుగుతున్నారు. ఏ టాపిక్స్ నుంచి ఎక్కువ ప్రశ్నలు వస్తున్నాయో గమనించాలి.
- రెండు పరీక్షల్లో కామన్‌గా ఉన్న విభాగాలను గుర్తించాలి. ఇంగ్లిష్, క్వాంటిటేటివ్ అప్టిట్యూడ్, రీజనింగ్ రెండు పరీక్షల్లోనూ ఉన్నాయి. కాబట్టి తొలుత వీటి ప్రిపరేషన్ పూర్తి చేసుకోవాలి. ఆ తర్వాత కంప్యూటర్ అప్టిట్యూడ్, జనరల్ అవేర్‌నెస్/ఎకానమీ /బ్యాంకింగ్ నాలెడ్జ్‌పై దృష్టిసారించాలి.
- ఇంగ్లిష్‌లో ఎక్కువ స్కోర్ చేసేందుకు అవకాశం ఉంటుంది. ఇందులో రీడింగ్ కాంప్రహెన్షన్, గ్రామర్ నుంచి ప్రశ్నలు ఉంటాయి. వొకాబ్యులరీ, సెంటెన్స్ కరెక్షన్, క్లోజ్ టెస్ట్, సెంటెన్స్ రీ అరేంజ్‌మెంట్, జంబుల్డ్ సెంటెన్సెస్, మిస్ స్పెల్ట్ వర్డ్స్ తదితరాలపై ప్రశ్నలు వస్తాయి. అదేవిధంగా మెయిన్ పరీక్షలోని డిస్క్రిప్టివ్ టెస్ట్‌లో కమ్యూనికేషన్ స్కిల్స్‌కు సంబంధించి ఈ–మెయిల్స్, రిపోర్ట్, ప్రెసీ రైటింగ్‌ను ప్రాక్టీస్ చేయాలి.
- క్వాంటిటేటివ్ అప్టిట్యూడ్/డేటా ఇంటర్‌ప్రిటేషన్ విభాగంలో మంచి మార్కుల కోసం అరిథమెటిక్, నంబర్ సిరీస్, సింప్లిఫికేషన్స్, క్వాడ్రాటిక్ ఈక్వేషన్స్ తదితరాలపై పట్టు సాధించాలి. 8, 9, 10వ తరగతి గణితం పాఠ్యపుస్తకాల ద్వారా ప్రాథమిక భావనలపై అవగాహన పెంచుకోవాలి. ఆ తర్వాత సాధ్యమైనన్ని గత ప్రశ్నలు, మోడల్ ప్రశ్నలు ప్రాక్టీస్ చేయాలి.
- రీజనింగ్ విభాగంలో రాణించేందుకు పజిల్స్, సీటింగ్ అరేంజ్‌మెంట్స్, సిలాజిజమ్స్, కోడింగ్–డీకోడింగ్, డైరెక్షన్స్, బ్లడ్ రిలేషన్స్, కాజ్ అండ్ ఎఫెక్ట్, డేటా సఫిషియన్సీ అంశాలపై పట్టు సాధించాలి.
- జనరల్ అవేర్‌నెస్ విభాగం కోసం బ్యాంకింగ్ రంగ తాజా పరిణామాలు,ఎకానమీ, బ్యాంకింగ్ టెర్మినాలజీ, జాతీయ, అంతర్జాతీయ కరెంట్ అఫైర్స్‌ను తెలుసుకోవాలి. దీనికోసం ఏదైనా ప్రామాణిక దినపత్రికను అనుసరిస్తే సరిపోతుంది.

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

నేటి భవిత ఈ పేపర్‌లో..
» సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం- ఇండియన్ హిస్టరీ » టెట్/డీఎస్సీ ప్రత్యేకం–మెంటల్ ఎబిలిటీ
» గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం–జనరల్ స్టడీస్–బయాలజీ » బ్యాంక్ ఎగ్జామ్స్ ప్రత్యేకం–కంప్యూటర్ అవేర్‌నెస్

రొట్టె.. కోర్కెలు నెరవేరినట్టే..



శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరులోని నగరదారులన్నీ బారాషహీద్ దర్గా వైపే మళ్లాయి. రెండోరోజు సోమవారం రొట్టెల పండగకు భక్తులు పోటెత్తారు. బారాషహీదులను ప్రశాంతంగా దర్శించుకున్నారు. కోర్కెలు తీరిన భక్తులు రొట్టెలు వదిలేందుకు.. కొత్త కోర్కెల రొట్టెలు పట్టుకునేందుకు వచ్చే భక్తులతో బారాషహీద్ దర్గా ప్రాంగణం కిటకిటలాడింది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులే కాకుండా కేరళ, కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర, తెలంగాణ తదితర రాష్ట్రాల నుంచి భక్తులు రెండో రోజు భారీగా హాజరయ్యారు. మరో మూడురోజుల పాటు ఈ పండుగ జరగనున్నది. స్వర్ణాల చెరువు సమీపంలో రొట్టెల బోర్డులు వెలిశాయి. ప్రధానంగా విద్యా, ఆరోగ్య, సౌభాగ్య, ఉద్యోగ, వివాహ, సంతాన రొట్టెల బోర్డులు కనిపిస్తున్నాయి. ఈ ఏడాది ఎక్కువ మంది భక్తులు ఆరోగ్యం, ఉద్యోగం, వివాహ రొట్టెలకు అధిక ప్రాధాన్యమిచ్చారు.

- సాక్షి ప్రతినిధి, నెల్లూరు


వరుణ.. చూపాలి కరుణ



వర్షాలు కురవాలని, తమ కష్టాలు తీరాలని కోరుతూ చిత్తూరు జిల్లా శాంతిపురం మండలం, కర్లగట్ట, కడపల్లి పంచాయతీలకు చెందిన 8 గ్రామాల ప్రజలు సోమవారం వలస దేవర జరుపుకున్నారు. వర్షాభావ పరిస్థితుల్లో వరుణుడి కరుణ కోసం ఇలా పూజలు చేసే ఆచారం ఇక్కడి ప్రజలకు ఉంది. సూర్యోదయంతోనే ఇళ్ల నుంచి తమకు కావాల్సిన సామగ్రి తీసుకుని పశువులతో సహా వలస బాట పట్టారు. కొత్తవారు గ్రామాల్లోకి రాకుండా పొలిమేరల వద్ద కాపలా ఏర్పాటు చేశారు. ఊరికి దూరంగా పొలాల్లో కుటుంబాల వారీగా ఎవరికి వారు భోజనాలు వండుకుని అక్కడే తిన్నారు. మధ్యాహ్నం కర్లగట్ట సమీపంలోని 70సాన్నేగానిపల్లి వద్దకు చేరుకుని వరుణ దేవుడికి పూజలు చేసి నైవేద్యం సమర్పించారు. పుష్కలంగా వానలు కురిసి పాడి పంటలకు లోటు లేకుండా చూడాలని ప్రార్థించారు. కర్లగట్ట, చిన్నకర్లగట్ట, తంబిగానిపల్లి, 70సాన్నేగానిపల్లి, శివపురం, మంకప్పగారికొటాలు, బీరనకుప్పం, కాలిగానూరు గ్రామాల ప్రజలు అనాదిగా ఈ ఆచారాన్ని పాటిస్తున్నారు.

- శాంతిపురం

టుడేస్ గ్రాఫిక్



చదువుతో పాటు ప్రతి నెలా జీతం..

అంబేడ్కర్ వర్సిటీలో విద్యార్థులకు సరికొత్త ప్రోగ్రాం
వర్సిటీ వీసీ ఘంటా చక్రపాణి వెల్లడి


ఘంటా చక్రపాణి సమక్షంలో ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న ఎల్వీకే రెడ్డి, జేమ్స్ రాఫెల్

బంజారాహిల్స్ (హైదరాబాద్): విద్యార్థుల్లో చదువుతో పాటు నైపుణ్యాభివృద్ధి పెంచడం, ఉపకార వేతన ఆధారిత విద్యను అందించనున్నట్లు బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం వైస్‌చాన్సలర్ ఆచార్య ఘంటా చక్రపాణి చెప్పారు. సోమవారం బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం క్యాంపస్‌లో రిటైల్ సెక్టార్ స్కిల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాతో అంబేడ్కర్ విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఎల్వీకే రెడ్డి, రిటైల్ సెక్టార్ స్కిల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఎగ్జిక్యూటివ్ హెడ్ జేమ్స్ రాఫెల్.. ఘంటా చక్రపాణి సమక్షంలో అవగాహన ఒప్పందం పత్రాలపై సంతకాలు చేశారు. అనంతరం చక్రపాణి మాట్లాడుతూ రిటైల్ సెక్టార్ స్కిల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా, వర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహించే కోర్సులో చేరడం ద్వారా విద్యార్థులు నెలకు కనీసంగా రూ.7 వేల నుంచి గరిష్టంగా రూ.24 వేలు లేదా అంతకంటే ఎక్కువ సంపాదించుకునే అవకాశం ఉందన్నారు. ఈ ప్రోగ్రాంలో చేరడానికి 18–28 ఏళ్ల వయసు గల విద్యార్థులు అర్హులని తెలిపారు. జేమ్స్ రాఫెల్ మాట్లాడుతూ వ్యక్తిగతంగా ప్రతి విద్యార్థికి లబ్ధి చేకూరాలనే భావనతో ఈ కోర్సులను రూపొందించామన్నారు. రిటైల్ సెక్టార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ప్రతినిధి సమీర్ నర్సాపూర్, రిటైల్ సెక్టార్ స్కిల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఇండస్ట్రీ, అకడమిక్ (సౌత్ రీజియన్) జనరల్ మేనేజర్ చందా వడ్డే, విశ్వవిద్యాలయ అకడమిక్ డైరెక్టర్ పుష్పా చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

యువత చేతిలోనే దేశ భవిష్యత్తు

- కాకతీయ యూనివర్సిటీ స్నాతకోత్సవంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ
- హనుమకొండలో అట్టహాసంగా వేడుకలు
- పలువురికి గోల్డ్‌మెడల్, డాక్టరేట్లు ప్రదానం


దివ్యాంగుడికి పీహెచ్‌డీ పట్టా అందజేస్తున్న రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

సాక్షిప్రతినిధి, వరంగల్/కేయూ క్యాంపస్: యువత చేతిలోనే దేశ భవిష్యత్తు ఉందని, దేశాభివృద్ధిలో వారిదే కీలకపాత్ర అని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. స్నాతకోత్సవం కేవలం ఉత్సవం కాదని, అది ఒక శాస్త్రీయ సంకల్పం అని స్పష్టం చేశారు. హనుమకొండలోని కాకతీయ యూనివర్సిటీ 23వ స్నాతకోత్సవం సోమవారం కేయూ ఆడిటోరియంలో జరిగింది. కార్యక్రమంలో జిష్ణు దేవ్ వర్మ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, స్నాతకోత్సవంలో మీరు డిగ్రీలనే గాకుండా దేశవిశ్వాసాన్ని, బాధ్యతను స్వీకరిస్తున్నారని అన్నారు. పరిశోధన అభివృద్ధిలో యువత కీలక భూమిక పోషిస్తోందన్న ఆయన, ప్రధాని నరేంద్రమోదీ మాటలను ఈ సందర్భంగా ఉటంకించారు. జాతీయ నూతన విద్యావిధానం 2020 అమలులో స్థానికత, ఆవిష్కరణ ఉపాధి అవసరమైన నైపుణ్యాలపై కేయూ దృష్టిపెట్టడం ప్రశంసనీయమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పీహెచ్‌డీ పట్టభద్రులకు, గోల్డ్‌మెడల్స్ సాధించినవారికి అభినందనలు తెలిపారు.

2047 నాటికి 'సాంకేతిక దేశం'..

మరో ముఖ్యఅతిథి, హైదరాబాద్ ఐఐసీటీ డైరెక్టర్ డాక్టర్ డి.శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. భారతదేశం పరిశోధనరంగంలో మరింతగా ముందుకెళ్తోందని, 2047 నాటికి ప్రపంచం లోకెల్లా అత్యంత ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన దేశంగా భారత్ అవతరిస్తుందన్నారు. కార్యక్రమంలో కేయూ వీసీ ఆచార్య కె.ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య వి.రామచంద్రం మాట్లాడారు. పీహెచ్‌డీ అవార్డులు పొందిన అభ్యర్థులకు డాక్టరేట్ పట్టాలు, వివిధ కోర్సుల్లో గోల్డ్ మెడల్స్ సాధించిన వారికి గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, శ్రీనివాస్‌రెడ్డి, వీసీ ప్రతాప్ రెడ్డిలతో కలిసి ప్రదానం చేశారు. కేయూ పాలకమండలి సభ్యులు, వివిధ విభాగాల డీన్‌లు పాల్గొన్నారు.

టీబీ నియంత్రణపై గవర్నర్ సమీక్ష...

హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లో టీబీ ముక్త్ భారత్ అభి యాన్ కార్యక్రమంపై హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు, వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో గవర్నర్ సమీక్ష నిర్వహించారు. టీబీ నియంత్రణ కోసం చేపడుతున్న చర్యలను అడిగి తెలుసుకున్న గవర్నర్.. వ్యాధి నిర్మూలనకు కలెక్టర్లు, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, రెడ్‌క్రాస్ సొసైటీ పకడ్బందీ చర్యలు చేపట్టాలని సూచించారు.

సారొస్తారు.. ఆటోలో తెస్తారు..

బడికి రాని విద్యార్థుల కోసం ఉపాధ్యాయుల యత్నాలు


విద్యార్థులను బైక్‌పై బడికి తీసుకొస్తున్న ఉమాశంకర్‌గౌడ్

మునుగోడు/నెక్కొండ: బడికి రాని పిల్లలను బడికి రప్పించే విషయంలో ఉపాధ్యాయులు చేస్తున్న ప్రయత్నాలు ప్రశంసలు అందుకుంటున్నాయి. నల్లగొండ జిల్లాలో ఓ ఉపాధ్యాయుడు బడికి రాని విద్యార్థులను వారింటికి వెళ్లి మరీ బడికి తీసుకొస్తుంటే.. మరో ఉపాధ్యాయుడు పిల్లల కోసం అద్దెకు తీసుకుని ఆటో ఏర్పాటు చేశారు. నల్లగొండ జిల్లా మును గోడు మండలం కాశవారిగూడెం గ్రామ ప్రాథమిక పాఠశాలలో ఈ సంవత్సరం 13 మంది విద్యార్థులు చేరారు. అయితే, కొందరు విద్యార్థులు పాఠశాలకు సక్రమంగా రాకుండా ఇంటి వద్దే ఉంటుంటారు. దీంతో ఆ పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయులు ఉమాశంకర్‌గౌడ్, జానరెడ్డి విద్యార్థుల ఇంటికి వెళ్లి తమ బైక్‌పై ఎక్కించుకొని పాఠశాలకు తీసుకొచ్చి పాఠాలు బోధిస్తున్నారు.

దాత సాయంతో ఆటో తెచ్చి...



వరంగల్ జిల్లా నెక్కొండలోని హైస్కూల్‌కు పిల్లలను పంపాలని ఉపాధ్యాయులు సమీపంలోని గుండ్రపల్లి, మడిపల్లి గ్రామాల్లో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. పదిమంది విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలకు పంపేందుకు ఒప్పుకున్న తల్లిదండ్రులు.. రవాణా సౌకర్యం ఏర్పాటు చేయాలని కోరారు. దీంతో ఆ పాఠశాల ఉపాధ్యా యుడు వంగర లక్ష్మణ్ విషయాన్ని తన చిన్ననాటి స్నేహితుడైన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ కిరణ్‌ప్రసాద్ దృష్టికి తీసుకెళ్లాడు. ఆయన ప్రతినెలా ఆటోవాలాకు రూ.6,500 చెల్లించేలా ఒప్పుకున్నాడు. దీంతో సోమవారం పిల్లలు ఆటోలో స్కూల్‌కు వచ్చారు.

ఆదివారం మద్యం, మాంసం బంద్

గర్షకుర్తి గ్రామస్తుల తీర్మానం



గంగాధర (చొప్పదండి): ఆదివారం వచ్చిందంటే మాంసం దుకాణాల వద్ద ప్రజలు పడిగాపులు కాస్తారు. ఆరోజు సెలవు దినం కావడంతో పల్లెలు, పట్టణాల్లోని కుటుంబాలు మటన్, చికెన్ తినడానికి ప్రాధాన్యం ఇస్తుంటాయి. కాగా, కరీంనగర్ జిల్లా గంగాధర మండలం గర్షకుర్తి గ్రామస్తులు ఆదివారం పవిత్ర దినంగా భావిస్తూ ఆరోజు మటన్, చికెన్ తినడం మద్యం తీసుకోవడం నిషేధించుకున్నారు. ప్రవచనకర్త భూపతి శ్రీనివాస్ మార్చి 2 నుంచి గ్రామంలో మహాభారత, రామాయణంపై ప్రవచనాలు చేస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం ప్రాముఖ్యతను వివరించారు. ఆదివారం ఆదిదేవుడు సూర్యభగవానుడి రోజని ఆరోజు మద్యం తాగరాదని, మాంసం తినవద్దని బోధించారు. దీంతో గ్రామస్తులు సమావేశమై ఆదివారం ఏ ఇంట్లో మద్యం తీసుకోవడం, మాంసం తినడం చేయరాదని తీర్మానించారు. ఈ విషయం ఇంటింటికీ వెళ్లి వివరించారు. మద్యం, మాంసం నిషేధంపై గ్రామ కూడళ్లలో బోర్డులు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం గర్షకుర్తిలో ఆదివారం ఎవరూ మద్యం, మాంసం ముట్టడంలేదు.

కాచిగూడ-యశ్వంత్‌పూర్ వందేభారత్ బోగీల పెంపు

10 నుంచి 16 బోగీలతో పరుగులు

సాక్షి, హైదరాబాద్: కాచిగూడ–యశ్వంత్‌పూర్ వందేభారత్ ఎక్స్‌ప్రెస్ (20703/20704) బోగీలు పెరగనున్నాయి. ప్రస్తుతం ఈ రైలుకు 7 చైర్‌కార్‌లు, ఒక ఎగ్జిక్యూటివ్ క్లాస్‌తో మొత్తం 8 బోగీలు ఉన్నాయి. వీటి సంఖ్యను 16కు పెంచనున్నారు. ఈ నెల 10వ తేదీ నుంచి కొత్త బోగీలు అందుబాటులోకి రానున్నా యి. ఇందులో 14 చైర్‌కార్‌లు, 2 ఎగ్జిక్యూటివ్ కోచ్‌లు ఉంటాయని దక్షిణమధ్య రైల్వే సీపీఆర్వో శ్రీధర్ తెలిపారు. కాచిగూడ-యశ్వంత్‌పూర్ వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌ను 2023 సెప్టెంబర్ 24న ప్రధాని మోదీ వర్చువల్‌గా ప్రారంభించడం తెలిసిందే. అప్పటి నుంచి ఇది వంద శాతం ఆక్యుపెన్సీతో నడుస్తోంది. రోజూ 530 మంది ప్రయాణికుల సామర్థ్యంతో పరుగులు తీస్తోంది. కోచ్‌ల పెంపు వల్ల ప్రయాణికుల సంఖ్య 1128కి పెరగనుంది. రెండు ఎగ్జిక్యూటివ్ కోచ్‌లలో 104 మంది ప్రయాణించగలరు. ఐటీ తదితర వర్గాల ప్రయాణికులకు ఎంతో ప్రయోజనం కలగనుంది.

శ్రీశైలానికి మరమ్మతులు చేపట్టేలా ఏపీని ఆదేశించండి

కేంద్ర జల శక్తి శాఖకు తెలంగాణ ప్రభుత్వం లేఖ



సాక్షి, హైదరాబాద్: శ్రీశైలం ప్రాజెక్టు నిర్వహణలో ఏపీ ప్రభుత్వ నిర్లక్ష్యంపట్ల తెలంగాణ తీవ్ర అభ్యంతరం తెలిపింది. జలాశయానికి తక్షణమే మరమ్మతులు నిర్వహించాలని గతంలో నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ, సెంట్రల్ సాయిల్ అండ్ మెటీరియల్స్ రీసెర్చ్ స్టేషన్, డ్యామ్ సేఫ్టీ రివ్యూ ప్యానెల్‌లు చేసిన సిఫార్సులను అమలు చేయడంలో ఏపీ విఫలం కావడం వల్లే తాజాగా 5వ, 6వ గేట్ల నుంచి నీళ్లు లీక్ అయ్యాయని తప్పుబట్టింది. జలాశయానికి మరమ్మతులు నిర్వహించేలా ఏపీని ఆదేశించాలని కేంద్రాన్ని కోరింది. ఈ మేరకు కేంద్ర జలశక్తి శాఖకు రాష్ట్ర నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా లేఖ రాశారు. జలాశయం దిగువన ఏర్పడిన భారీ గుంత (ప్లంజ్ పూల్)తో జలాశయానికి ప్రమాదం పొంచి ఉందని గతంలో ఎన్డీఎస్‌ఏ తేల్చిచెప్పిందని లేఖలో గుర్తుచేశారు. ఎన్డీఎస్‌ఏ హెచ్చరించినా ఏపీ ప్రభుత్వం చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. ఒకవేళ ఏపీ ప్రభుత్వం మరమ్మతులకు ముందుకు రాకుంటే ఆ బాధ్యతను తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కాగా, ఏపీ సీఎం చంద్రబాబు మంగళవారం శ్రీశైలం జలాశయం గేట్లను ఎత్తి నీటిని విడుదల చేయనున్నారన్న వార్తల నేపథ్యంలో గేట్లను ఇప్పుడే ఎత్తొద్దని ఏపీని ఆదేశించాలని రాహుల్ బొజ్జా లేఖలో కోరినట్లు తెలిసింది.

193 టీఎంసీలకు చేరిన నిల్వ..

ప్రస్తుతం జలాశయానికి 1.70 లక్షల క్యూసెక్కుల వరద వస్తుండగా ఇరు రాష్ట్రాలు జల విద్యుదుత్పత్తి ద్వారా 67 వేల క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నాయి. జలాశయం గరిష్ట నీటిమట్టం 885 అడుగులు కాగా ప్రస్తుతం జలాశయంలో 881 అడుగుల మేర నీరు ఉంది. గరిష్ట నిల్వ సామర్థ్యం 215 టీఎంసీలకుగాను ప్రస్తుతం 193 టీఎంసీలకు నిల్వలు చేరాయి.


యూరియా వాడకాన్ని తగ్గించండి!

రైతులను జాగృతపరుస్తున్న వ్యవసాయ శాఖ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఏయేటికాయేడు పెరుగుతున్న యూరియా వాడకాన్ని తగ్గించేందుకు వ్యవసాయ శాఖ రంగంలోకి దిగింది. ఓవైపు ఏటా సాగు విస్తీర్ణం పెరుగుతుండడం, మరోవైపు కేంద్ర ప్రభుత్వం నుంచి అవసరమైన మేర యూరియా సరఫరా లేకపోవడంతో తలెత్తుతున్న ఇబ్బందులను అధిగమించేందుకు రైతులను చైతన్యపరచడం ఒక్కటే మార్గమనే నిర్ణయానికి వచ్చింది. ఈ నేపథ్యంలో అధిక యూరియా వాడకాన్ని నిరోధించేలా.. రాష్ట్రంలో క్లస్టర్ల వారీగా రైతుల్లో చైతన్యం తీసుకురావాలని నిర్ణయించింది. ఇందుకోసం కరపత్రాలతో పాటు.. సోషల్ మీడియా ద్వారా గ్రామాల వారీగా గ్రూపుల్లో విస్తృత ప్రచారం నిర్వహిస్తోంది. యూరియా ఎంత మోతాదులో వాడాలి? అధిక మోతాదులో యూరియా వినియోగిస్తే తలెత్తే పరిణామాలు తదితర అంశాలను ఈ ప్రచారం ద్వారా వివరిస్తున్నారు. యూరియా ఎక్కువ వాడకపోతే దిగుబడి రాదనే అపోహ తప్పని, ఎక్కువగా వాడటం వల్ల పెట్టుబడి పెరిగి, దిగు బడి తగ్గుతుందని అధికారులు స్పష్టం చేస్తున్నారు.

ఆగస్టు వరకు అవసరమైన యూరియా 6 లక్షల మెట్రిక్ టన్నులపైనే..

ఇప్పటికే పత్తి సాగు దాదాపు పూర్తికాగా, వరి సాగు ప్రక్రియ వేగవంతంగా సాగుతోంది. ఇప్పటికే పత్తికి, మొక్కజొన్నకు ఓ దఫా యూరియాను వినియోగించారు. ఈ నెలలో వరినాట్లు వేయగానే మొదటి దఫా యూరియాను వినియోగిస్తారు. ఆగస్టు చివరినాటికి వినియోగం అధికంగా ఉంటుంది. ఈ 2నెలల్లోనే దాదాపు 5.98 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అవసరమని వ్యవసాయశాఖ అంచనా వేసింది. ఐతే ఇప్పటి వరకు రాష్ట్రానికి కేంద్రం పంపిన యూరియా 3.18 లక్షల మెట్రిక్ టన్నులే. జూలై నాటికి 6.60 ఎల్ఎంటీ రావలసి ఉంటే,, అందులో సగమే కేంద్రం పంపించడం వ్యవసాయ శాఖను ఆందోళనకు గురిచేస్తోంది. ఈ నేపథ్యంలో యూరియా వాడకాన్ని తగ్గించేందుకు రైతులను జాగృతం చేయాలని, సేంద్రియ ఎరువుల వాడకాన్ని ప్రోత్సహించాలని భావిస్తోంది. ఇందులో భాగంగానే తొలిదశలో సోషల్‌మీడియా, కరపత్రాల ద్వారా ప్రచారం సాగిస్తోంది.



పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలంలో సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్న వ్యవసాయ శాఖ

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.



భద్రతా దళాలే లక్ష్యంగా మావోయిస్టులు అమర్చిన బూబీ ట్రాప్స్ (ఫైల్)



స్వాధీనం చేసుకున్న ఆయుధాలు, సామగ్రితో భద్రతా బలగాలు (ఫైల్)



యాంటీనక్సల్స్ ఆపరేషన్స్‌లో పాల్గొన్న భద్రతా దళాలు (ఫైల్)

ఆపరేషన్ కగార్.. కర్రి గుట్టలు

18 నెలలుగా కొనసాగుతున్న 'కగార్' ● ఇప్పటివరకు 439 మంది మావోయిస్టుల మృతి
మావోయిస్టుల ప్రతిదాడిలో 93 మంది మృత్యువాత ● 38 నుంచి 11 జిల్లాలకు తగ్గిన ప్రాబల్యం
తెలంగాణలో సంచలనంగా మారిన ఆపరేషన్ బ్లాక్ ఫారెస్ట్

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: వచ్చే ఏడాది మార్చి 31 నాటికి దేశంలో మావోయిస్టుల ఏరివేతే లక్ష్యంగా కేంద్ర సర్కారు ముందుకు సాగుతోంది. ఈ క్రమంలో చేపట్టిన ఆపరేషన్ కగార్ కారణంగా.. బస్తర్ అడవుల్లో తరచూ తుపాకులు గర్జిస్తున్నాయి. వందలాది మంది చనిపోతున్నారు. ఇందులో భాగంగా రాష్ట్రంలోని కర్రిగుట్టల్లో చేపట్టిన ఆపరేషన్ బ్లాక్ ఫారెస్ట్ తెలంగాణలోనూ చర్చనీయాంశమైంది.

పద్నాలుగేళ్లకు..

దేశంలోని సాయుధ విప్లవ పార్టీలన్నీ కలిసి 2004 సెప్టెంబర్ 20న భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)గా ఏర్పాటయ్యాయి. నేపాల్ నుంచి శ్రీలంక వరకు ప్రాంతంలో నూతన ప్రజాస్వామిక విప్లవం సాధించడమే లక్ష్యంగా రెడ్ కారిడార్ పేరుతో కదం తొక్కాయి. ఈ క్రమాన 2010 నాటికి దేశంలోని 126 జిల్లాల్లో మావోయిస్టుల ప్రాబల్యం పెరిగిపోయింది. అప్పటి నుంచి మావోయిస్టులను అణచి వేసేందుకు ప్రభుత్వాలు అనేక ఎత్తుగడలు అమలు చేస్తూ వచ్చాయి. ఫలితంగా 2024 నాటికి మావోయిస్టు ప్రభావిత జిల్లాల సంఖ్య 126 నుంచి 38 జిల్లాలకు పడిపోయింది. దీంతో మావోయిస్టు తరహా విప్లవ పంథా అనుసరించే వారిని దేశం నుంచి ఏరివేయడమే లక్ష్యంగా.. ఆపరేషన్ కగార్ (ఫైనల్ మిషన్)ను 2024 జనవరిలో కేంద్ర ప్రభుత్వం చేపట్టింది.

సుప్రీం కమాండర్ ఎన్‌కౌంటర్ పెద్ద దెబ్బ

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా చేపడుతున్న ఆపరేషన్లతో మావోయిస్టు పార్టీకి తీవ్ర నష్టం వాటిల్లింది. ఛత్తీస్‌గఢ్‌తో పాటు ఏపీ, తెలంగాణ, ఒడిశాలో చోటుచేసుకున్న వరుస ఎన్‌కౌంటర్లలో ఇప్పటి వరకు 439 మంది మావో యిస్టులు చనిపోయారు. ఇందులో జన మిలీషియా మొదలు పార్టీ సుప్రీం కమాండర్ నంబాల కేశవరావు వరకు ఉన్నారు. చలపతి, ప్రయాగ్‌మాంఝీ, తెంటు సుధాకర్, గాజర్ల గణేశ్ వంటి కేంద్ర కమిటీ సభ్యులతో పాటు పార్టీ కీలకమైన దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీకి చెందిన రేణుక, అరవింద్, ఊర్మిల వంటి ముఖ్యనేతలు మృతి చెందారు. తెలంగాణ కమిటీ లక్ష్యంగా జరిగిన ఎన్‌కౌంటర్లలో మైలారపు ఆడెళ్లు అలియాస్ భాస్కర్ చనిపోగా బడే దామోదర్ వంటి నేతలు తప్పించుకున్నారు. ఆపరేషన్ కగార్ మొదలైన తర్వాత భద్రాద్రి కొత్తగూడెం, ములుగు జిల్లాల్లో జరిగిన వేర్వేరు ఎన్‌కౌంటర్లలో 15 మంది మావోయిస్టులు చనిపోయారు. ఇప్పటి వరకు 1,457 మంది మావోయిస్టులు లొంగిపోగా మరో 1,469 మంది అరెస్ట్ అయ్యారు. మొత్తంగా 3,500 మంది వరకు సాయుధ విప్లవ పోరాట పంథాకు దూరమయ్యారు. మొత్తంగా కగార్ ప్రభావంతో మావోయిస్టు ప్రభావిత జిల్లాల సంఖ్య 38 నుంచి 11కు పడిపోయింది. ఈ జిల్లాల్లో తెలంగాణలోని భద్రాద్రి కొత్తగూడెం, ఏపీలోని అల్లూరి సీతారామరాజు ఉన్నాయి.

హైలైట్‌గా కర్రిగుట్టలు

ఆపరేషన్ కగార్ మొదలయ్యాక మే 21న ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణపూర్ జిల్లా గుండెకోట్ దగ్గర జరిగిన ఎన్‌కౌంటర్‌లో నంబాల కేశవరావు చనిపోవడం పోలీసులు సాధించిన అతిపెద్ద విజయంగా చెబుతారు. ఆ తర్వాత స్థానం తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ సరిహద్దులోని కర్రిగుట్టలపై 21 రోజుల పాటు భద్రతా దళాలు కొనసాగించిన ఆపరేషన్ బ్లాక్ ఫారెస్ట్‌కు దక్కుతుంది. సెంట్రల్ రీజనల్ బ్యూరో, తెలంగాణ, దండకారణ్య కమిటీలతో పాటు మోస్ట్ వాంటెడ్ హిడ్మాను పట్టుకోవడమే లక్ష్యంగా ఈ ఆపరేషన్ జరిగింది. ఇక్కడ చోటు చేసుకున్న ఎదురుకాల్పుల్లో 31 మంది మావోయిస్టులు చనిపోయారు. అయితే అగ్రనేతలెవరూ భద్రతా దళాలకు చిక్కలేదు. కానీ మావోయిస్టు పార్టీకి కంచుకోటగా ఉన్న కర్రిగుట్టలు పోలీసుల అధీనంలోకి వచ్చాయి. అంతకుముందు అక్టోబర్ 4న అబూజ్‌మడ్ అడవుల్లో జరిగిన తుల్‌తులీ ఎన్‌కౌంటర్‌లో ఏకంగా 38 మంది మావోయిస్టులు చనిపోయారు. సంఖ్యాపరంగా దేశంలో ఇదే అతి పెద్ద ఎన్‌కౌంటర్‌గా నిలిచింది. ఇదే సమయాన మావోయిస్టు ప్రభావిత బీజాపూర్, సుక్మా జిల్లాల్లో రికార్డు స్థాయిలో 72 కొత్త మొబైల్ నెట్‌వర్క్ టవర్లను నెలకొల్పారు.

ప్రతిపాదనలకే పరిమితం

ఆపరేషన్ కగార్ ఉధృతం కావడంతో మార్చి 28న మావోయిస్టులు శాంతి చర్చల ప్రస్తావన తీసుకొచ్చారు. తెలంగాణలో మెజార్టీ రాజకీయ పక్షాలు ఈ శాంతిచర్చల నిర్ణయాన్ని స్వాగతించాయి. కానీ కేంద్ర ప్రభుత్వం శాంతిచర్చలపై సానుకూలంగా ఒక్క ప్రకటనా చేయలేదు. పైగా చర్చలపై భేటీలు జరుగుతుండగానే.. ఆపరేషన్ బ్లాక్ ఫారెస్ట్ పేరుతో అతి పెద్ద యాంటీ నక్సల్స్ ఆపరేషన్ చేపట్టింది. ఈ సమయంలోనే నంబాలతో పాటు అనేక మంది అగ్రనేతలు నేలకొరిగారు. దీంతో శాంతి చర్చల అంశం ఒకేవైపు ప్రతిపాదనలకే పరిమితమైందనే భావన నెలకొంది.


కర్రిగుట్టలపై వినతికి ఏడాది

ఛత్తీస్‌గఢ్, తెలంగాణ సరిహద్దుల్లోని కర్రిగుట్టలను కేంద్రంగా చేసుకుని మావోయిస్టులు తమ రాష్ట్రంలో అడుగు పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని, వీటిని అడ్డుకోవాలని కోరుతూ 2024 జూలై 4న కేంద్ర హోంమంత్రి అమిత్‌షాకు సీఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. శాంతిభద్రతలకు సంబంధించిన అంశాలపై వారిద్దరి మధ్య గంటకు పైగా సమావేశం జరిగింది. ఇందులో మావోయిస్టుల రాకను అడ్డుకునేలా.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొండవాయి, ములుగు జిల్లా ఆలుబాకలో జాయింట్ టాస్క్‌ఫోర్స్ (జేటీఎఫ్) క్యాంపులు ఏర్పాటు చేయాలని సీఎం కోరారు. భద్రాద్రి కొత్తగూడెంతో పాటు ములుగు, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలను కూడా మావోయిస్టు ప్రభావిత జిల్లాలను గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. సీఎం రేవంత్ సూచనల ప్రకారం జేటీఎఫ్ క్యాంపులు, మావోయిస్టు ప్రభావిత గుర్తింపు ఇవ్వడంపై సానుకూల ప్రకటనలు రాలేదు. కానీ కర్రిగుట్టలపై పట్టు సాధించేలా భద్రతా దళాలు ఒక్కొక్క అడుగు ముందుకేస్తూ ఈ ఏడాది మే 15 నాటికి విజయం సాధించాయి.

అరవైలో ఇరవై!

● మార్షల్ ఆర్ట్స్ మంత్రం
● షష్టిపూర్తి తర్వాతా చురుగ్గా ఉండేందుకు సాయం..
● నడక లేదా స్వల్ప వ్యాయామం కంటే వీటితో మేలు
● తై చీ, ఐకిడో, వింగ్ చున్ వంటి వాటితో మనసుకూ ఉత్తేజం..
● హార్వర్డ్ మెడికల్ స్కూల్ తాజా అధ్యయనంలో వెల్లడి

సాక్షి, హైదరాబాద్: వయసు పెరిగే కొద్దీ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలంటే అధిక శాతం మంది నడక లేదా స్వల్ప శరీర వ్యాయామమే సరిపోతుందనుకుంటారు. అయితే.. తాజాగా హార్వర్డ్ మెడికల్ స్కూల్ అధ్యయనం ప్రకారం చూస్తే.. వయసు పైబడినవారు ఆరోగ్యంగా, ఉల్లాసంగా ఉండాలంటే కేవలం నడక సరిపోదని.. మొత్తంగా వారి ఆలోచనల్లో మార్పు రావడానికి శారీరకంగా చైతన్యంగా ఉండేందుకు కదలికలు అవసరమని వెల్లడైంది. ఈ ప్రయోగంలో శరీరానికి మాత్రమే కాక, మనసుకు కూడా ఉత్తేజం కలిగించే వ్యాయామాల ప్రాధాన్యాన్ని వివరించారు. తై చీ, ఐకిడో, వింగ్ చున్.. వంటి మార్షల్ ఆర్ట్స్ పద్ధతులు వృద్ధుల ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని ఈ అధ్యయనంలో పేర్కొన్నారు.



ఏమిటీ అధ్యయనం..?

హార్వర్డ్ మెడికల్ స్కూల్‌కు చెందిన డాక్టర్ పీటర్ ఎం.వె యిన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పరిశీలనలో తై చీ వంటి నెమ్మదిగా, స్వల్ప కదలికలతో సాగే మార్షల్ ఆర్ట్స్ మనుషుల శరీరంలో 'ఫిజి యొలాజికల్ కాంప్లెక్సిటీ' ను పెంచుతాయని వెల్లడైంది. అంటే.. వృద్ధాప్యంలో ఎదురయ్యే అడ్డంకులకు మెరుగ్గా స్పందించే సామర్థ్యం శరీరానికి పెరుగుతుందని తేలింది.

● ఇవి కేవలం శారీరక ఆరోగ్య ప్రయోజనాలు మాత్రమే కాక, జీవన నాణ్యత మెరుగుదలకు తోడ్పడుతున్నట్టు స్పష్టమైంది.
● ఇప్పటిదాకా మన దగ్గర పెద్దల ఆరోగ్యంపై దృష్టి చికిత్సాపరంగా ఉండేది. కానీ తాజా అధ్యయనం సూచిస్తున్న మార్గం ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు, పునరావాస కేంద్రాలు, సామాజిక కార్యక్రమాల రూపంలో మార్షల్ ఆర్ట్స్ వంటి చురుకైన లేదా మృదువైన కదలికలతో కూడిన వ్యాయామాలను ప్రవేశపెట్టాల్సిన అవసరం ఉందని స్పష్టం చేస్తోంది.

నడకతో పోలిస్తే ?

నడక.. కేవలం కాలి కదలికలతో పరిమితమైన వ్యాయామం. తైచీ.. శరీరం, శ్వాస, మేధస్సు.. మూడింటినీ ఒకే సమయంలో సమతుల్యంగా ఉత్తేజపరిచే ప్రక్రియ. వృద్ధులకు.. మరీ ముఖ్యంగా 60 ఏళ్లు దాటిన వారికి సులభ, స్వల్ప తరహా మార్షల్ ఆర్ట్స్ ఎంతో ఉపయోగపడతాయి.

● ఇది వృద్ధుల్లో.. తూలిపడిపోవడం వంటి వాటిని తగ్గిస్తుంది
● నిద్ర నాణ్యత మెరుగవుతుంది
● మానసిక స్థైర్యం పెరుగుతుంది

తెలుగు రాష్ట్రాల్లో వృద్ధుల పరిస్థితి

● మార్పు ఆవశ్యకత..
● తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో వృద్ధుల జనాభా అనేది 13 శాతానికి పైగా ఉందని 2011 జనగణన ద్వారా వెల్లడైంది. 2036 నాటికి ఇది 20 శాతం దాటే అవకాశం ఉంది. ఈ వయోధిక వర్గానికి సరిపడే ఆరోగ్య విధానాలు, శారీరక దృఢత్వం కలిగించే వ్యాయామాలను అందుబాటులోకి తేవడం అత్యావసరం.

వృద్ధులకు ఎలాంటి మార్షల్ ఆర్ట్స్ తగినవి.. ఉపయోగాలు..

● తై చీ: నెమ్మదిగా జరిగే ప్రవాహ రూప కదలికలు, శ్వాస నియంత్రణ, శరీర సమతుల్యత, మానసిక ప్రశాంతత
● ఐకిడో: శక్తిని మళ్లించే శక్తివంతమైన కాన్సెప్ట్, కణజాలానికి మెరుగైన కదలికలు
● వింగ్ చున్: ఓ మోస్తరు క్లిష్టమైన కదలికలు, మెరుగైన ప్రతిస్పందన సామర్థ్యం, స్వీయ రక్షణ

వృద్ధాప్యం ఓ ప్రతిబంధకం కాదు. అది మనం కొత్త విషయాలు నేర్చుకోవాలనే సంకల్పానికి తెరలేపే అవకాశంగా భావించాల్సి ఉంటుందని నిపుణులు సూచిస్తున్నారు. ఈ అంశంపై వృద్ధుల్లోనే కాకుండా అందరి ఆలోచనా ధోరణిలోనూ మార్పు వచ్చి అవగాహన పెరిగితే సమాజానికి మంచి ప్రయోజనాలు చేకూరుతాయని స్పష్టం చేస్తున్నా రు. వృద్ధుల్లో ఆరోగ్యకరమైన వాతావరణం ఏర్పడడంతో పాటు.. 60 ఏళ్ల తర్వాత జీవితానికి సంబంధించి కచ్చితమైన అవగాహన, చైతన్యం ఏర్పడతాయని వారు పేర్కొంటున్నారు.

ప్రాజెక్టుల దగ్గరకు వస్తే తాట తీస్తాం: ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్ నాయకులు రాష్ట్రంలో ఎక్కడైనా ప్రాజెక్టుల దగ్గరకు వస్తే తాట తీస్తామని దేవరకద్ర కాంగ్రెస్ ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి హెచ్చరించారు. సోమవారం ఆయన సీఎల్పీలో మీడియాతో మాట్లాడారు. కొత్త బిచ్చగాడు పొద్దెరగడన్నట్లు ప్రాజెక్టుల గురించి హరీశ్‌రావు మాట్లాడుతున్నాడని, కన్నెపల్లి, కల్వకుర్తి పంప్‌హౌస్‌లు మీరు ఓపెన్ చేస్తారా అని అడగడం ఏంటని ప్రశ్నించారు. హరీశ్‌రావు.. కన్నెపల్లి, కల్వకుర్తి దగ్గరకు వస్తే మీ కాళ్లు విరగ్గొడతారు జాగ్రత్త అని మధుసూదన్‌రెడ్డి హెచ్చరించారు. కేసీఆర్ ప్రభుత్వ అవినీతి నిర్వాకం వలన మేడిగడ్డ కూలిపోయిందని, ముచ్చుమర్రి నుంచి ఆంధ్రప్రదేశ్ కృష్ణా నీళ్లు తోడుకుపోతుంటే బీఆర్‌ఎస్ ప్రభుత్వం పదేళ్లు పట్టించుకోలేదని ఆరోపించారు. కేసీఆర్ సర్కార్ చేసిన తప్పిదాలతోనే కృష్ణా జలాలను ఆంధ్రప్రదేశ్ అప్పనంగా తీసుకెళ్తోందని, కేసీఆర్, హరీశ్‌రావు, కేటీఆర్ చేసిన దోపిడీ వల్ల తెలంగాణ 100 ఏళ్లు వెనక్కి పోయిందని ధ్వజమెత్తారు. కేసీఆర్‌ను బాపు అంటున్న బీఆర్‌ఎస్ నేతలూ.. ఫోన్ ట్యాపింగ్ చేసి భార్యాభర్తల జీవితాలను నాశనం చేసిన వ్యక్తి బాపు అయితడా? అని మధుసూదన్‌రెడ్డి ప్రశ్నించారు. సీఎం రేవంత్‌రెడ్డి, ఉత్తమ్ కుమార్‌రెడ్డి పోరాటంతోనే బనకచర్లను తాత్కాలికంగా కేంద్రం ఆపిందన్నారు.

13 మంది అడిషనల్ ఎస్పీల బదిలీ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా 13 మంది అడిషనల్ ఎస్పీ (నాన్‌కేడర్)లను బదిలీ చేస్తూ హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవి గుప్తా సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇంటెలిజెన్స్‌లో అడిషనల్ ఎస్పీగా పనిచేస్తున్న జి.వెంకటేశ్వర బాబును ఎక్సైజ్ శాఖకు బదిలీ చేశారు. సీఐడీలో అడిషనల్ ఎస్పీగా పనిచేస్తున్న జి.బాలస్వామిని డీజీపీ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఆదేశించారు. కామారెడ్డిలో అడ్మిన్ అడిషనల్ ఎస్పీగా పనిచేస్తున్న కోట్ల నర్సింహారెడ్డిని సీఐడీ అడిషనల్ ఎస్పీగా బదిలీ చేశారు. నాగర్‌కర్నూల్‌లో అడ్మిన్ అడిషనల్ ఎస్పీగా పనిచేస్తున్న జీహెచ్ రామేశ్వర్ రాచకొండ క్రైమ్స్ అడిషనల్ డీసీపీగా బదిలీ అయ్యారు. వెయిటింగ్‌లో ఉన్న అడిషనల్ ఎస్పీలలో కె.నరహరిని టీజీపోలీస్ అకాడమీ అసిస్టెంట్ డైరెక్టర్‌గా,ఎ.నాగేశ్వర్‌రావును గద్వాల్ అడ్మిన్ అడిషనల్ ఎస్పీగా, కె.రాంకుమార్‌ను సైబరాబాద్ సైబర్ క్రైమ్స్-1 అడిషనల్ డీసీపీగా, బి.శ్రీకృష్ణగౌడ్‌ను హైదరాబాద్ సిటీ సౌత్ వెస్ట్ జోన్ అడిషనల్ డీసీపీగా, కోట్ల వెంకటరెడ్డిని టీజీ ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ అడిషనల్ ఎస్పీగా, జి.భిక్షంరెడ్డిని సీఐడీ అడిషనల్ ఎస్పీగా బదిలీ చేశారు. సీఐడీలో అడిషనల్ ఎస్పీగా ఉన్న కె.శేఖర్‌ను డీజీపీ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఆదేశించారు. వరంగల్ ఆపరేషన్స్ అడిషనల్ డీసీపీ బోనాల కిషన్ ట్రాన్స్‌కో జేఎండీగా బదిలీ అయ్యారు. హైదరాబాద్ సిటీ సీసీఎస్, ఈఓడబ్ల్యూ-2 అడిషనల్ డీసీపీ ఎం.సుదర్శన్‌ను జీహెచ్ఎంసీ కమిషనర్ కార్యాలయానికి బదిలీ చేశారు.

కొత్త చట్టాలు.. నిర్బంధ పాశాలు..!

నాలుగు లేబర్‌కోడ్‌లతో కార్మికవర్గం కీలుబొమ్మ

● ప్రయోజనకరమైన హక్కులన్నీ హరి
● చట్టాలకు వ్యతిరేకంగా ఉద్యమాలు
● కేరళ, పశ్చిమ బెంగాల్ తప్ప మిగతా రాష్ట్రాలన్నీ అనుకూలం
● ఈ నెల 9న దేశ వ్యాప్త సమ్మెకు కార్మిక సంఘాల పిలుపు
● అమలైతే సింగరేణి కార్మికులపై గుదిబండేనని ఆందోళన



శ్రీరాంపూర్: కేంద్రం కొత్తగా తెచ్చిన లేబర్ కోడ్‌లు కార్మికవర్గానికి యమపాశాలుగా మారాయి. ఇన్నాళ్లు కార్మికుల ప్రయోజనకారిగా ఉన్న చట్టాలను రద్దు చేసి వాటి స్థానంలో కొత్తగా నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చింది. ప్రస్తుతం ఈ లేబర్‌కోడ్‌లపై సింగరేణి వ్యాప్తంగా చర్చ జరుగుతోంది. వీటిని వ్యతిరేకిస్తూ ఈనెల 9న దేశ వ్యాప్తంగా కార్మిక సంఘాలు సమ్మెకు పిలుపునిచ్చాయి. సింగరేణిలోనూ విజయవంతానికి కార్మిక సంఘాలు విస్తృతంగా ప్రచారం, గేట్ మీటింగ్‌లు నిర్వహిస్తూ కార్మికులను సన్నద్ధం చేస్తున్నాయి. బీఎంఎస్ మినహా అన్ని జాతీయ సంఘాలు, ప్రాంతీయ సంఘాలు ఈ సమ్మెలో పాల్గొంటున్నాయి. అసలు ఈ లేబర్‌కోడ్‌లు అంటే ఏంటి? ఇన్నాళ్లు లేని ఈ సమస్య నేడు కొత్తగా ఎందుకు తెరపైకి వచ్చింది? దీని వల్ల కార్మికవర్గానికి భవిష్యత్తులో ఎదురయ్యే ఇబ్బందులు ఏంటో తెలియజెప్పే ప్రయత్నమే ఇది.

అమలుకు అడుగు దూరమే..

దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కార్మికవర్గానికి ప్రయోజనకారిగా ఉన్న చట్టాల్లో 29 కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం ఇటీవల రద్దు చేసి వాటి స్థానంలో కొత్తగా నాలుగు లేబర్‌కోడ్‌లను తీసుకొచ్చింది. విదేశీ పెట్టుబడులు, కార్పొరేట్ సంస్థలకు మేలు చేసే ఉద్దేశంతో ఈ కోడ్‌ల అమలుకు నిర్ణయించింది. కొన్ని చట్టాల సంకలనమే ఈ కోడ్‌గా చెప్పవచ్చు. ఇక నుంచి ఈ కోడ్‌లలో ఉన్న చట్టాల ప్రకారమే అన్ని ప్రభుత్వ, ప్రైవేటు కంపెనీలు నడుచుకోవాల్సి ఉంటుంది. వేజెస్ కోడ్ 2019లో, మిగతా మూడు కోడ్‌లు 2020 పార్లమెంటులో చట్టంగా మార్చారు. ప్రస్తుతం వీటి అమలుకు నిబంధనలు రూపొందించారు. వీటిని ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు ఈ చట్టాలకు లోబడి ఇంప్లిమెంటేషన్ నోటిఫికేషన్ ఇవ్వాల్సి ఉంది. త్వరలోనే ఈ నోటిఫికేషన్లు రానున్నాయి. కేరళ, పశ్చిమ బంగ ఈ లేబర్ కోడ్‌లను వ్యతిరేకించగా మిగతా అన్ని రాష్ట్రాలు అనుకూలంగా ఉన్నాయి. వీటి అమలు ఇక అడుగు దూరంలోనే ఉంది. దీంతో అన్ని జాతీయ కార్మిక సంఘాలు కలిసి కేంద్రంపై ఒత్తిడి తేవడం మొదలు పెట్టాయి. ఇందులో భాగంగా ఈ ఏడాది మార్చి 18న ఢిల్లీలో కార్మిక సంఘాలన్నీ కలిసి లేబర్ కోడ్‌లను అడ్డుకోవడానికి ఈనెల 9న దేశ వ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చాయి. దీంతో లేబర్‌కోడ్‌లపై చర్చ మొదలైంది.

లేబర్ కోడ్‌లు

1. ఇండస్ట్రియల్ రిలేషన్ కోడ్
2. సోషల్ సెక్యూరిటీ కోడ్
3. వేజెస్ కోడ్
4. ఆక్యుపేషనల్ హెల్త్, సేఫ్టీ వర్క్ కండిషన్ కోడ్

ఇండస్ట్రియల్ రిలేషన్ కోడ్ పరిణామాలు

● ట్రేడ్ యూనియన్ చట్టం-1926, ఇండస్ట్రియల్ ఎంప్లాయ్‌మెంట్ (స్టాండింగ్ ఆర్డర్స్)-1946, పారిశ్రామిక వివాదాల చట్టం-1947లో ఉన్న చట్టాలతో కార్మికవర్గం ఇన్నాళ్లు హక్కులకు రక్షణ పొందింది. అయితే ప్రస్తుతం ఈ కోడ్‌లో ఇవన్నీ రద్దు అవుతున్నాయి. దీని పర్యవసానంగా ఇక శాశ్వత నియామకాలు ఉండవు. అన్నీ కూడా టైం బాండ్ నియామకాలుగా ఉంటాయి. సమయం ముగిసిన తర్వాత కార్మికులను తీసేసే హక్కు కంపెనీకి ఈ చట్టం ద్వారా కల్పించారు. ఇప్పటివరకు కాంట్రాక్టర్ వద్ద కాంట్రాక్ట్ కార్మికులు పనిచేస్తే వారిని పని పూర్తయ్యాక ఎలా తొలగిస్తారో ఇప్పుడు కంపెనీ ఉద్యోగులను కూడా తొలగిస్తుంది.

● ఇన్నాళ్లు 100 మందిలోపు కార్మికులు పనిచేసే ప్రైవేటు కంపెనీల్లో లేఆఫ్, లాకౌట్‌కు కార్మిక శాఖ అనుమతి అవసరం లేదు. ఇప్పుడు దాన్ని 300 మందికి పెంచారు. దేశంలో 60 శాతం కంపెనీలు వీటి పరిధిలోనే ఉన్నాయి. ఇది సింగరేణి వంటి వాటిల్లో ఓబీ సంస్థల్లో పనిచేసే కాంట్రాక్ట్ కార్మికులపై ప్రభావం చూపనుంది.

● కొత్తగా యూనియన్ పెట్టుకోవాలంటే రిజిస్ట్రేషన్‌కు కనీసం ఏడుగురు సభ్యులు ఉంటే చాలు. ఇప్పుడు ఏ కంపెనీలో రిజిస్ట్రేషన్ కావాలో అందులో ఉన్న ఉద్యోగుల్లో 10 శాతం మంది సంతకాలు చేస్తేనే కొత్త యూనియన్ రిజిస్ట్రేషన్ అవుతుంది. సింగరేణిలో కొత్త కార్మిక సంఘం పెట్టాలంటే 4,300 మంది సంతకాలు చేస్తేనే యూనియన్ ఏర్పాటు అవుతుంది.

● సమ్మె చేయాలంటే కూడా ఆ కంపెనీలో ఉన్న 51 శాతం మంది కార్మికులు మద్దతుగా సంతకాలు చేసి నోటీసు ఇవ్వాలి. లేకుంటే ఈ సమ్మె చట్టబద్ధత కాదు. 43 వేల మంది కార్మికులు ఉన్న సింగరేణిలో సమ్మె చేయాలంటే 21,600 మంది సంతకాలు చేయించడం సాధ్యమయ్యే పనికాదు. దీంతో సమ్మె చేసే హక్కును కార్మికులు కోల్పోతున్నారు.

● ఇంతకుముందు 14 రోజుల ముందు సమ్మె నోటీసు ఇవ్వాల్సి ఉండేది. ఇప్పుడు దాన్ని 60 రోజులకు చేశారు. చర్చలు జరుగుతుండగా సమ్మెలోకి వెళ్లడానికి వీలు లేదు. వెళ్తే జరిమానా లేదా జైలు శిక్ష కూడా ఇందులో ఉంది.

● యాజమాన్యం ఏ కార్మిక సంఘానికైనా ప్రాతినిధ్యం కల్పించి చర్చలు జరపాలన్నా, ఒప్పందాలు చేసుకోవాలన్నా వారికి 51 శాతం కార్మికుల మద్దతు ఉన్నట్లు సంతకాలతో నిరూపణ చేసుకోవాలి. అంటే 51% మంది ఓట్లు వారికి వేసి ఉండాలి. అలా జరగని పక్షంలో 20% ఉంటే ఒక సభ్యునికి మాత్రమే ప్రాతినిధ్యం ఇస్తారు. అలా వచ్చిన వారికి ప్రాతినిధ్యం కల్పిస్తారు. దీంతో కార్మిక సంఘాలు నీరుగారిపోతాయి. గుర్తింపు ఎన్నికల్లో ఏ ఒక్క సంఘానికి ఈ ఓటు శాతం సాధించడం సాధ్యం కాని పని.

సోషల్ సెక్యూరిటీ కోడ్ పరిణామాలు

● ఉద్యోగుల పరిహారం-1922, ఈఎస్ఐ చట్టం-1948, ఈపీఎఫ్ చట్టం-1952, ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజెస్ చట్టం-1959, మెటర్నిటీ బెనిఫిట్స్-1961, గ్రాట్యుటీ చెల్లింపు-1992, అసంఘటిత కార్మిక సాంఘిక భద్రత చట్టం-2008 ఇలా కార్మికులు, ఉద్యోగ వేతన భద్రత ఉన్న 9 చట్టాలు ప్రస్తుతం రద్దవుతున్నాయి.

● ఇప్పటివరకు 12 శాతం పీఎఫ్ రికవరీ ఉంటే దాన్ని 10 శాతం చేసుకునేలా కంపెనీలకు అనుమతిచ్చారు. కంపెనీ నష్టాల్లో ఉంటే కంపెనీ వాటాను కూడా చెల్లించే అవకాశం లేకుండా మినహాయింపు ఇచ్చింది. అన్ని అలవెన్సులు కలిపి బేసిక్ మొత్తం సగానికి మించరాదు. ఈ చట్టంతో వేతనాలు గణనీయంగా తగ్గిపోతాయి. అలవెన్సులు అనేవి నామమాత్రంగానే ఉండి కార్మికుడు ఆర్థిక దోపిడీకి గురికావాల్సి వస్తుంది.

వేజెస్ కోడ్ పరిణామాలు

● వేతనాల చెల్లింపు చట్టం-1936, కనీస వేతనాలు చట్టం-1948, బోనస్ చెల్లింపు చట్టం-1965, సమాన వేతన చట్టం-1976 అన్ని కూడా వేజెస్ కోడ్ 2019తో రద్దవుతాయి.

● ఇప్పటివరకు 8 గంటల పని సమయం ఉండేది. వారానికి 48 గంటలు మించకుండా పని చేయించుకోవాలనే నిబంధన ఉండేది. ప్రస్తుతం కోడ్‌లలో 9 గంటలపాటు కార్మికులతో పని చేయించుకోవచ్చు.

● వారానికి ఇన్నిగంటలు అనే పరిమితి లేకపోవడంతో కార్మికులు శ్రమ దోపిడీకి గురయ్యే ప్రమాదం ఉంది.

● పే కమిషన్ ప్రకారం ప్రతి ఐదేళ్లకోసారి కనీస వేతనాన్ని సవరించాలి. సంవత్సరానికి రెండుసార్లు డీఏ సవరించాలి. కానీ కొత్త రూల్స్‌లో ఐదేళ్లకోసారి సవరించాలని గ్యారంటీ లేదు. అందులో 'మే బీ రివైజ్డ్' అని పొందుపర్చారు.

ఆక్యుపేషనల్ హెల్త్, సేఫ్టీ అండ్ వర్క్ కండిషన్ కోడ్ పరిణామాలు

● ఫ్యాక్టరీల చట్టం-1948, కార్మికుల చట్టం-1951, మైన్స్ యాక్ట్-1952, ఇలా వర్గాలకు చెందిన 13 చట్టాలు ప్రస్తుతం ఆక్యుపేషనల్ సేఫ్టీ, హెల్త్ అండ్ వర్కింగ్ కండిషన్ కోడ్‌తో రద్దు కానున్నాయి. ఇక నుంచి ఈ చట్టం ప్రకారం గనుల్లో సేఫ్టీ, ప్రమాదంపై విచారణ చేసి చర్యలకు ఆదేశాలిచ్చే డైరెక్టర్ జనరల్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ అధికారులు నేరుగా వచ్చి గనులను తనిఖీ చేయడానికి వీలు లేదు. ముందుగా ప్రభుత్వ అనుమతి తీసుకోవాలి. కంపెనీకి తాము తనిఖీ చేసే తేదీ, పూర్తి షెడ్యూల్ ఇచ్చిన తర్వాతే తనిఖీలు చేయాల్సి ఉంటుంది.

● ఈ చట్టంతో రక్షణ ఉల్లంఘనలకు కంపెనీలు పాల్పడే అవకాశం ఉంటుంది. దీంతో కార్మికుల ప్రాణాలకు రక్షణ కొరవడుతుంది.

● 50 మంది కాంట్రాక్ట్ కార్మికులతో చేసే పని ఉంటేనే దానికి కాంట్రాక్టర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. తక్కువగా ఉంటే అవసరం లేదు. దీంతో కాంట్రాక్ట్ కార్మికులు శ్రమ దోపిడీకి గురి అవుతారు.

● అప్రెంటీస్ విధానానికి ఇంతకుముందు నిర్దిష్టకాల పరిమితి ఉండేది. ఇప్పుడు ఎంత కాలం అనేది కంపెనీ ఇష్టాలకు వదిలేశారు. ఇలా అనేక రకాల నిర్బంధ చట్టాలు ఈ కొత్త లేబర్ కోడ్‌లలో ఉన్నాయని కార్మిక సంఘం నాయకులు పేర్కొంటున్నారు. దీన్ని రద్దు చేయకుంటే ముమ్ముందు ప్రభుత్వరంగ సంస్థలు మూత పడటంతోపాటు కార్మికవర్గం ఉనికి ప్రశ్నార్థకంగా మారి యాజమాన్యాల ఆధిపత్యం పెరుగుతుందని విశ్లేషకులు చెబుతున్నారు. ఈ సమ్మె విజయవంతమైతే కేంద్రంలో మార్పు వచ్చి ఈ లేబర్ కోడ్‌లను వెనక్కి తీసుకుంటుందా లేదా వేచిచూడాలి.


దుబాయ్‌లో వైఎస్సార్ జయంతి సందర్భంగా కేక్‌ను కట్ చేస్తున్న యాత్ర-2 సినీ నిర్మాత శివ మేక, యూఏఈ వైఎస్సార్ అభిమానులు


సౌదీ అరేబియాలో వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న అభిమానులు


సింగపూర్ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విభాగం ఆధ్వర్యంలో వైఎస్సార్ జయంతి వేడుకలు

విదేశాల్లో ఘనంగా వైఎస్సార్ జయంతి

• కేక్ కట్ చేసిన వైఎస్సార్‌సీపీ నాయకులు • కార్మికులకు అన్నదానం • వైఎస్సార్ సేవలను స్మరించుకున్న అభిమానులు


వైఎస్సార్‌సీపీ ఎన్ఆర్ఐ సౌత్ ఆఫ్రికా ఆధ్వర్యంలో జోహానెస్‌బర్గ్ మిడ్‌రాండ్‌లో వైఎస్సార్ జయంతి కార్యక్రమం

సాక్షి,అమరావతి/కడప కార్పొరేషన్/తిరుపతి గాంధీ రోడ్: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్సార్ జయంతి (జూలై 8)ని పురస్కరించుకుని వివిధ దేశాల్లో వైఎస్సార్ అభిమానులు, వైఎస్సార్‌సీపీ నేతలు ఘనంగా వేడుకలు నిర్వహించారు. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)లోని దుబాయ్‌లో సోమవారం వైఎస్సార్ అభిమానులు మహ్మద్ జిలానీ బాషా, అక్రమ్ బాషా, కోటేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి యాత్ర-2 చిత్ర నిర్మాత శివ మేక ముఖ్య అతిథిగా హాజరై కేక్ కట్ చేశారు. అనంతరం 500 మంది కార్మికులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్ జయంతిని నిర్వహించేందుకు తన స్థలాన్ని కేటాయించిన సోనాపూర్ లేబర్ క్యాంప్ యజమాని మసూద్ అహ్మద్‌కు శాలువా కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రసన్న సోమిరెడ్డి, పవన్ కుమార్, కరుణాకర్, లోకనాథ్ రెడ్డి, రెడ్డయ్య రెడ్డి, శ్రీనివాస్ చౌదరి, షేక్ అబ్దుల్లా, ఫహీమ్, ఖాజా ముతాలిబ్, చక్రి, కర్ణ, పవన్ కుమార్, హనుమంత్ రెడ్డి, మహేశ్వర రెడ్డి, క్రాంతి కుమార్ రెడ్డి, గోపాల్, రమణా రెడ్డి, షోయబ్, అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సౌదీ అరేబియాలో..

సౌదీ అరేబియాలోని జుబైల్ ప్రాంతంలో వైఎస్సార్ జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. అకియాకునో కంపెనీ క్యాంపులో కడపకు చెందిన షేక్ ఇలాహి ఆధ్వర్యంలో వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం కంపెనీలో పని చేసే సుమారు 100 మంది కార్మికులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

సింగపూర్‌లో ఘనంగా వైఎస్సార్ జయంతి ..

వైఎస్సార్ జయంతిని సింగపూర్‌లో ప్రవాసాంధ్రులు ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సింగపూర్ విభాగం ఆధ్వర్యంలో సోమవారం కేక్‌ను కట్ చేశారు. తెలుగు జాతి ఈ నేల మీద నడయాడుతున్నంత కాలం.. జనానికి, జగతికి గుర్తుండి పోయే పేరు వైఎస్సార్ అని.. ఇప్పటికి ఆయన పేరు తలుచుకుంటే.. ఒక ఉద్వేగం.. ఓ పులకింత.. ఓ సంక్షేమ భావన గుర్తుకు వస్తాయని ప్రవాసాంధ్రులు పేర్కొన్నారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎన్ఆర్ఐ గ్లోబల్ కో ఆర్డినేటర్ ఎ. సాంబశివారెడ్డి ప్రత్యేక ఆహ్వానితులుగా వీడియో కాన్ఫరెన్స్(జూమ్)ద్వారా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సింగపూర్ వైఎస్సార్సీపీ విభాగం సలహాదారు కోటి రెడ్డి, కన్వీనర్ దువ్వూరు మురళీకృష్ణారెడ్డి, కో కన్వీనర్స్ - ప్రకాష్ , సంతోష్ తో పాటు పవన్, రామిరెడ్డి, శ్రీనివాస రెడ్డి, దొర బాబు, ప్రసాద్, శ్రీనేహారెడ్డి, స్వాతి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభిమానులు, వైఎస్సార్ ఆప్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సౌత్ ఆఫ్రికాలో ఘనంగా వైఎస్సార్ జయంతి

వైఎస్సార్‌సీపీ ఎన్నారై సౌత్ ఆఫ్రికా విభాగం ఆధ్వర్యంలో జోహన్స్‌బర్గ్‌లోని మిడ్ రాండ్లో వైఎస్సార్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ వైఎస్సార్ ప్రవేశపెట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్ ద్వారానే చదువుకుని విదేశాల్లో ఉద్యోగం చేస్తూ స్థిరపడ్డామన్నారు. అనంతరంచిల్డ్రన్స్ హోమ్‌లో పెద్ద ఎత్తున అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రవాస భారతీయులు నరసింహారెడ్డి కళ్ల, సూర్యరామిరెడ్డి, శివ రాజవరపు, విక్రం రెడ్డి పెట్లూరు, కృష్ణారెడ్డి, అంజలి రెడ్డి, మనోజ రాజవరపు, సూర్య రామిరెడ్డి, శ్రావణి రెడ్డి పెట్లూరు, వాసు సింగారెడ్డి, మధు పల్లె, హరి ఆత్మకూరి, వెంకట్ మాగంటి, అంజి రెడ్డి సానికొమ్ము, నవీన్ రెడ్డి, వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


సౌదీ అరేబియాలో అన్నదాన కార్యక్రమంలో భోజనం చేస్తున్న కార్మికులు

పొగాకు కొనుగోలులో ప్రభుత్వ నిర్లక్ష్యం

సాక్షి, అమరావతి: ప్రభుత్వం పొగాకు కొనుగోలులో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వి.కృష్ణయ్య, కె.ప్రభాకరరెడ్డి సోమవారం ఓ ప్రకటనలో మండిపడ్డారు. వర్జీనియా, తెల్లబర్లీ, నల్లబర్లీ, చుక్కబర్లీ, సిరి వంటి రకాల పొగాకు పండించిన రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారన్నారు. పొగాకు కొనుగోలులో ఐటీసీ, జీపీఐ, అలయన్స్, ఎంఎల్, దక్కన్ కంపెనీలు నిర్లక్ష్య వైఖరితో వ్యవహరిస్తుంటే ప్రభుత్వం పట్టించుకోవట్లేదని మండిపడ్డారు. ఆగస్టు 15లోగా రైతుల నుంచి పొగాకు మొత్తాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.

సార్వత్రిక సమ్మెకు యువజన సంఘాల మద్దతు

సాక్షి, అమరావతి: లేబర్ కోడ్ రద్దు, ప్రభుత్వరంగ సంస్థల పరిరక్షణ, దేశంలో పెరుగుతున్న నిరుద్యోగ సమస్య పరిష్కరించాలని ఈనెల 9న తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు యువజన సంఘాలు మద్దతు తెలిపాయి. ఈ మేరకు నిరుద్యోగ ఐక్య సమితి రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్ర ఎంబేటి, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజా, భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.రామన్న, అఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్ఐ) రాష్ట్ర కార్యదర్శి పి.రాజేంద్ర, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.రామారావు, వ్యాయామ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దేవేంద్ర, డీఎస్సీ సాధన కమిటీ నాయకులు రఘు, శ్రీను సోమవారం సంయుక్తంగా ఓ ప్రకటన విడుదల చేశారు.

పశుగ్రాస వారోత్సవాలు ప్రారంభం

సాక్షి, అమరావతి: పశుగ్రాస వారోత్సవాలను ప్రారంభించినట్టు పశుసంవర్ధక శాఖ సంచాలకులు టి.దామోదరనాయుడు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాడి పశువుల పెంపకంలో కీలకమైన పశుగ్రాసంపై ఈ నెల 14 వరకు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు.

ఏపీ డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ల కార్యవర్గం ఎన్నిక

నెల్లూరు(అర్బన్): ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ల సంక్షేమ సంఘం-అమరావతి రాష్ట్ర సర్వసభ్య సమావేశం సోమవారం నెల్లూరు నగరంలోని ధనలక్ష్మీపురంలో జరిగింది. ఈ సందర్భంగా నూతన రాష్ట్ర కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించండి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్‌ను ఉత్తరాంధ్ర టీచర్స్ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు కోరారు. ఈ మేరకు సోమవారం సచివాలయంలో సీఎస్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.

మంత్రి డోలాకు హైకోర్టులో ఊరట

సాక్షి, అమరావతి: సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామికి హైకోర్టులో ఊరట దక్కింది. 2021లో ముఖ్యమంత్రి దిష్టి బొమ్మ దహనం కేసులో సింగరాయకొండ పోలీసులు ఆయనపై నమోదు చేసిన కేసులో 8 వారాల పాటు తదుపరి చర్యలన్నీ నిలిపేసింది. ఫిర్యాదుదారుకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ కొనకంటి శ్రీనివాసరెడ్డి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

భూములు ఇవ్వాలంటే ఎవరికైనా బాధ ఉంటుంది

ఇండోసోల్ భూములపై మంత్రి అచ్చెన్నాయుడు

సాక్షి, న్యూఢిల్లీ: ×తాతలు, తండ్రుల నుంచి వచ్చిన భూమిని ఇవ్వాలంటే ఎవరికైనా బాధ ఉంటుంది. వాళ్లతో మాట్లాడి సరిచేసి వెళ్లాల్సి ఉంది, వాళ్లతో మాట్లాడకుండా వెళ్లడం వల్ల సమస్య వచ్చింది. వారితో మేం మాట్లాడుతున్నాం, ఒకవేళ సమస్య ఉంటే సరిచేస్తాం, మరీ అంత సమస్య ఉంటే ప్రభుత్వం మూర్ఖంగా అయితే వెళ్లదు× అంటూ ఇండోసోల్ భూములపై వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు చెప్పారు. తాము ఇండోసోల్‌ను వెళ్లగొడుతున్నామంటూ వస్తున్న కథనాలు అవాస్తవమన్నారు. తోతాపురి మామిడి వ్యవహారంపై కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌ను కలిసేందుకు ఢిల్లీ వచ్చిన మంత్రి అచ్చెన్నాయుడు సోమవారం శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్‌తో కలిసి మీడియాతో మాట్లాడారు. మిర్చి రైతులకు ప్రయోజనాలు కల్పించేందుకు తమ ప్రభుత్వం ఎంతో కృషి చేసిందని తెలిపారు. ఇందులో భాగంగా మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీమ్ కింద కొనుగోలు చేసేలా తాము జీవో తేగలిగినట్లు చెప్పారు. విపరీతమైన పెట్టుబడి కారణంగా మిర్చి రైతులు నష్టపోయారని తెలిపారు. చిత్తూరు మామిడి రైతుల దగ్గర 3.5 లక్షల మెట్రిక్ టన్నులు సేకరించామని, మామిడి ధరపై మాజీ సీఎం వైఎస్ జగన్ రాజకీయం చేస్తున్నారని ఆరోపించారు. తోతాపురి మామిడి సేకరణకు కిలోకు ప్రభుత్వం రూ.12 ధరను నిర్ణయించిందని, అందులో రూ.8 ప్రాసెసర్లు/వ్యాపారులు భరించాలని, అదనపు మద్దతు ధరగా రాష్ట్ర ప్రభుత్వం రూ. 4 చెల్లిస్తుందని వివరించారు. మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీమ్ కింద కేంద్ర వాటాగా రూ. 130 కోట్లు విడుదల చేయాలని కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలను సమర్పించినట్లు చెప్పారు. తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర వెటర్నరీ యూనివర్సిటీ పరిధిలోని గరివిడిలో ఉన్న కాలేజ్ ఆఫ్ వెటర్నరీ సైన్స్‌లో 2022-23, 2023-24 విద్యా సంవత్సరాలకు గానూ మూడు, నాలుగేళ్ల బీవీఎస్సీ, ఏహెచ్ కోర్సుల పునరుద్ధరణపై కేంద్రాన్ని కోరినట్లు తెలిపారు. దీనిపై కేంద్ర ప్రభుత్వం స్పందించి సంబంధిత కోర్సులకు అనుమతులను పునరుద్ధరిస్తూ లేఖను విడుదల చేసిందన్నారు.

తిరుపతి నగరంలో సైకో వీరంగం

- కత్తితో ముగ్గురిపై దాడి
- ఒకరి మృతి, ఇద్దరికి గాయాలు


సైకోను తీసుకెళ్తున్న పోలీసులు

తిరుపతి క్రైమ్: తిరుపతి నగరంలో సోమవారం ఓ సైకో కత్తితో దాడిచేశాడు. ఈ ఘటనలో ఒకరు మృతి చెందగా, ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. అలిపిరి ఎస్ఐ లోకేశ్ వివరాల మేరకు..తిరుపతి కపిలతీర్థం రోడ్డులోని అలిపిరి పోలీస్ స్టేషన్ సమీపంలో సోమవారం ఓ వ్యక్తి సైకోలా ప్రవర్తించి తనకు ఎదురుపడినవారిపై విరుచుకుపడ్డాడు. శేఖర్ (55) అనే యాచకుడిపై, కపిల తీర్థం సమీపంలోని వాహనాల పార్కింగ్ స్థలంలో పనిచేస్తున్న సుబ్రహ్మణ్యం, కల్పనపై కత్తితో విచక్షణారహితంగా దాడిచేశాడు. స్థానికులు వెంటనే గాయపడ్డ వ్యక్తులను రుయా ఆసుపత్రికి తరలించారు. వీరిలో శేఖర్ చికిత్స పొందుతూ మృతి చెందాడు.మరో ఇద్దరు చికిత్స పొందుతున్నారు.

వలలో బంధించి..

ఘటనకు మూలకారకుడైన సైకో గంటపాటు పోలీసులకు, స్థానికులకు చుక్కలు చూపించాడు.రోడ్లపై వీరవిహారం చేస్తూ అందరినీ భయభ్రాంతులకు గురిచేశాడు. మొదట అతను కపిలతీర్థం నుంచి మున్సిపల్ పార్క్ వరకు కత్తితో వీరంగం చేశాడు. అతన్ని చూసి స్థానికులంతా పరుగులు తీశారు. సైకో దృఢంగా ఉండటంతో అతన్ని అదుపులోకి తీసుకోవడానికి ఎవరూ సాహసించలేకపోయారు. చివరికి మున్సిపల్ సిబ్బందితో కలసి ఎస్ఐ లోకేశ్, కానిస్టేబుల్ స్వయంప్రకాశ్ వలవిసిరి చాకచక్యంగా బంధించారు. సైకో వద్ద ఓ కత్తి కూడా ఉంది. అతను తమిళనాడుకు చెందిన వ్యక్తిగా పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు.

వెంటాడుతున్న బదిలీల వివాదం

- మహిళా శిశు సంక్షేమ శాఖలో ఇష్టానుసారం బదిలీలు
- తంతు ముగిసినా కొనసాగుతున్న ఫిర్యాదులు
- ఫలితంగా ఆర్జేడీ వ్యవస్థ రద్దుకు ప్రతిపాదనలు?

సాక్షి, అమరావతి: రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖలో బదిలీల బంతాట ముగిసినప్పటికీ.. ఈ తంతు వెనుక జరిగిన అవకతవకలు అధికారులను వెంటాడుతున్నాయి. కూటమి నేతల సిఫార్సులు, చేతులు మారిన నగదుతో బదిలీల వ్యవహారం సాగింది. ఈ వ్యవహారంపై ఉద్యోగులు నోరు మెదపకపోయినా.. ఉద్యోగ సంఘాలు మాత్రం వదలడం లేదు. కొద్దిరోజుల క్రితం విశాఖపట్నం రీజినల్ జాయింట్ డైరెక్టర్(ఆర్జేడీ)పై మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి సూర్యకుమారికి ఏపీ ఎన్‌జీవో కీలక నేతలు ఫిర్యాదు చేయడం చర్చనీయాంశమైంది. ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఆ శాఖ ఉద్యోగులను ఇష్టానుసారం బదిలీ చేశారని, నిబంధనలు పాటించలేదని ఆర్జేడీపై ఎన్‌జీవో నేతలు ఫిర్యాదు చేశారు. క్యాన్సర్‌తో బాధపడుతున్న ఉద్యోగిని ఏజెన్సీలోని అరకు ప్రాంతానికి బదిలీ చేయడం ఆర్జేడీపై ఎన్‌జీవో నేతల ఆగ్రహానికి కారణమైంది. దీంతోపాటు విశాఖ ఆర్జేడీ పరిధిలో అనేక అవకతవకలు జరిగినట్టు ఉన్నతాధికారుల దృష్టికి ఫిర్యాదులు వెల్లువెత్తాయి. మైదాన ప్రాంతం నుంచి ఏజెన్సీకి, ఏజెన్సీ నుంచి మైదాన ప్రాంతానికి అవకాశం ఇవ్వాలన్న నిబంధన పాటించలేదని, ఐదేళ్లు ఒకేచోట పనిచేసిన వారికి తప్పనిసరి బదిలీ చేయాల్సి ఉండగా రెండు, మూడేళ్లు మాత్రమే పనిచేసిన వారు అడగకుండానే బలవంతపు బదిలీ చేసినట్టు ఫిర్యాదులు వచ్చాయి. త్వరలో పదవీ విరమణ చేయనున్న విశాఖ ఆర్జేడీపై శాఖాపరమైన చర్యలు తీసుకోవడానికి ఉన్నతాధికారులు ఆలోచిస్తున్నట్టు సమాచారం. ఇదే సమయంలో కర్నూలు ఆర్జేడీ తీరుపైనా ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందాయి. ఈ నేపథ్యంలో ఆర్జేడీ వ్యవస్థను రద్దు చేయాలనే ప్రతిపాదనను మహిళా, శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి సూర్యకుమారి ప్రభుత్వం ముందు పెట్టినట్టు ఉద్యోగ వర్గాలు చెబుతున్నాయి.

ఆర్జేడీ వ్యవస్థ రద్దు ప్రతిపాదనపై కలకలం

ఉమ్మడి 13 జిల్లాలకు విశాఖపట్నం, ఏలూరు, ఒంగోలు, కర్నూలు కేంద్రాలుగా నాలుగు ఆర్జేడీ కార్యాలయాలు ఉన్నాయి. వీటిని ఎత్తివేసి ఉద్యోగులందరినీ రాష్ట్ర కార్యాలయానికి అటాచ్ చేస్తే ఆయా జిల్లాల పరిధిలోని స్థానిక అధికారులకు అవస్థలు తప్పవు. ఇప్పటికే తగినంత సిబ్బంది లేకపోవడం, ఉన్నవారికి టీఏ, డీఏలు రాకపోవడం, పదోన్నతులు లేక అవస్థలు పడుతున్న తాము రోజుల తరబడి రాజధాని పరిధిలోని రాష్ట్ర కార్యాలయం వద్ద పడిగాపులు పడలేమని వారు వాపోతున్నారు. 2025 నుంచి 2028 మధ్య భారీగా ఉద్యోగులు పదవీ విరమణ చేస్తున్నారని, ఈ పరిస్థితుల్లో ఆర్జేడీ కార్యాయాలు ఎత్తివేస్తే తీవ్ర ఇబ్బందులు తప్పవని ఉద్యోగ సంఘాల నేతలు చెబుతున్నారు.

డేటా క్లీన్‌తో దుబారాకు అడ్డుకట్ట

ఈ ప్రక్రియతో రూ.వేల కోట్లు ఆదా అయ్యాయి



- పీఎం కిసాన్‌లో 1.71 కోట్ల మంది అనర్హుల తొలగింపు ద్వారా — 2024లో రూ.9,000 కోట్లు..
- రెండేళ్లలో 3.5 కోట్ల బోగస్ ఎల్పీజీ కనెక్షన్ల తొలగింపు ద్వారా — రూ.21,000 కోట్లు..
- ఏడాదిలో 1.6 కోట్ల బోగస్ రేషన్ కార్డుల ఏరివేత ద్వారా — రూ.10,000 కోట్లు ఆదా అయ్యాయి

- డేటాలో తప్పులను గుర్తించకపోతే జరిగే ఆర్థిక నష్టం అపారం
- తద్వారా పౌరుల విశ్వాసాన్ని తీవ్రంగా దెబ్బతీస్తుంది
- ఈ విషయంలో ప్రతి మంత్రిత్వ శాఖ నుండి సమిష్టి చర్యలు అవసరం
- డేటా నాణ్యత బలోపేతంపై నీతి ఆయోగ్ నివేదిక

సాక్షి, అమరావతి : దేశంలో డిజిటల్ ఆర్థిక వ్యవస్థ పరిణతి చెందుతున్న కొద్దీ అధిక నాణ్యతతో కూడిన డేటా రూపకల్పనకు చర్యలు తీసుకోవాల్సిన ఆవశ్యకత ఉందని నీతి ఆయోగ్ నివేదిక స్పష్టంచేసింది. గత దశాబ్దంలో భారత్ డిజిటల్ ప్రజా మౌలిక సదుపాయాల్లో ప్రపంచ నాయకుడిగా గుర్తింపు సాధించిందని.. తద్వారా యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్‌తో నెలకు ట్రిలియన్ల రూపాయల లావాదేవీలు నిర్వహిస్తోందని తెలిపింది. అలాగే, వివిధ మంత్రిత్వ శాఖల ద్వారా అమలుచేస్తున్న సంక్షేమ పథకాల డేటాను క్లీన్ చేయడం ద్వారా దుర్వినియోగాన్ని అరికట్టడంతో పాటు నాణ్యతతో కూడిన కచ్చితమైన సమాచారంతో అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందుతాయని వివరించింది. డేటా నాణ్యత బలోపేతంపై నీతి ఆయోగ్ తాజాగా ఓ నివేదికను విడుదల చేసింది. అందులో ముఖ్యాంశాలు ఏమిటంటే..

డేటా పొరపాట్లతో భారీ మూల్యం..

డిజిటల్ పేమెంట్స్‌లో ఇప్పుడు డేటా నాణ్యతకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలి. లేదంటే పౌరుల విశ్వాసాన్ని తీవ్రంగా దెబ్బతీస్తుంది. డిజిటల్ యుగంలో ఒక తప్పు అంకె పెన్షన్‌ను ఆపగలదు లేదా ఆరోగ్య సంరక్షణను తిరస్కరించగలదు. డేటాలో చిన్నచిన్న తప్పులు భారీ ఖర్చులకు కారణమవుతుంది. అలాగే, ఆధార్ నమోదు సమయంలో ఒక తప్పు అంకె పెన్షన్‌ను బ్లాక్ చేస్తే.. నకిలీ మొబైల్ నంబరు ఆసుపత్రి క్లెయిమ్‌ను నిలిపివేయొచ్చు. భూమి రికార్డులో తప్పుగా నమోదైన పేరువల్ల పరిహారాన్నీ అలస్యం చేస్తుంది. దేశవ్యాప్తంగా అమలవుతున్న కేంద్ర పథకాలు, రాష్ట్ర కార్యక్రమాల్లో ఇలాంటి తప్పులను గుర్తించకపోతే జరిగే ఆర్థిక నష్టం ఊహించలేం. డేటాలోని తప్పులు నిజాయతీ క్లెయిమ్స్‌ను తిరస్కరించడమే కాదు.. అనేక అనర్థాలకు దారితీస్తుంది. ఈ నేపథ్యంలో.. డేటా నాణ్యత విధానాన్ని తక్షణం సమూలంగా మార్చాల్సిన అవసరం ఉంది. ఈ విషయంలో.. ప్రతీ మంత్రిత్వ శాఖ నుంచి సమిష్టి చర్యలు.. స్పష్టమైన జవాబుదారీతనం, నిబద్ధత అవసరం.



డేటా క్లీన్ ద్వారా రూ.వేల కోట్లు ఆదా..



- గత ఏడాది దేశవ్యాప్తంగా పీఎం కిసాన్ పథకం లబ్ధిదారుల డేటాను క్లీన్ చేయడం ద్వారా 1.71 కోట్ల మంది అనర్హుల పేర్లను తొలగించగా.. రూ.9,000 కోట్లు ఆదా అయ్యాయి.
- గత రెండేళ్లలో దేశవ్యాప్తంగా ఎల్పీజీ కనెక్షన్ల డేటాను క్లీన్ చేయడం ద్వారా 3.5 కోట్ల బోగస్ ఎల్పీజీ కనెక్షన్లను తొలగించగా రూ.21,000 కోట్లు ఆదా అయ్యాయి.
- అలాగే, ఏడాది కాలంలో దేశవ్యాప్తంగా 1.6 కోట్ల బోగస్ రేషన్ కార్డులను తొలగించడం ద్వారా రూ.10,000 కోట్లు ఆదా అయ్యాయి.


డేటా నాణ్యత జాతీయ ఆవశ్యకత..



ప్రతి రికార్డ్ కచ్చితమైనదిగా ఉండాలి. డేటా నాణ్యత అనేది ఫ్రంట్‌లైన్ పాలనగా మారాలి. డిజిటల్ ఇండియాను నిర్మించడానికి డేటా నాణ్యతను బలోపేతం చేయడం ద్వారా మన ఆశయాలను సాకారం చేసుకోవాలి. డిజిటల్ పరిణామం తదుపరి దశను ప్రారంభించే సమయంలో డేటా నాణ్యతపై దృష్టిపెట్టాలి. ఇది కేవలం ఆకాంక్ష కాదు.. జాతీయ ఆవశ్యకత. మరోవైపు.. క్రమం తప్పకుండా డేటా ఆడిట్‌లను నిర్వహించాలి. తరచూ సమీక్షల ద్వారా చిన్నచిన్న సమస్యలు సంక్లిష్టం కాకుండా నివారించాలి.

• పార్కిన్‌సన్స్ డిసీజ్..!

డోపమైన్ లోపం వణికిస్తుంది



పార్కిన్‌సన్స్ వ్యాధి

కాస్త వయసు పెరిగిన వాళ్లలో అంటే 60 ఏళ్లు పైబడిన వారిలో కనిపించే వ్యాధి. ఇందులో బాధితుల వేళ్లు, చేతులు వణుకుతుంటాయి. ఈ వ్యాధిని డాక్టర్ జేమ్స్ పార్కిన్‌సన్ అనే వైద్యనిపుణుడు 1817లో గుర్తించి, మొదట్లో దానికి 'షేకింగ్ పాల్సీ' అని పేరు పెట్టినప్పటికీ... వ్యాధినిమొదట గుర్తించిన ఫిజీషియన్ పేరిట ఇది ప్రాచుర్యం పొందింది. కొందరిలో మెదడులోని డోపమైన్ అనే రసాయనం ఉత్పత్తి తగ్గడం వల్ల, శరీర కదలికలను అదుపులో ఉంచే నాడీకణాలు తగ్గిపోతాయి. దాంతో దేహం వణకడం మొదలై పార్కిన్‌సన్స్ వ్యాధి మొదలువుతుంది. ఈ వ్యాధి గురించి తెలుసుకుందాం...



డాక్టర్
ఎస్. శ్రీకాంత్ రెడ్డి
సీనియర్ కన్సల్టెంట్
న్యూరో & స్పైన్ సర్జన్

పార్కిన్‌సన్ వ్యాధి ఉన్నవాళ్లలో తొలుత నడకతో మొదలై... తర్వాత అన్ని రకాల కదలికలూ ప్రభావితమవుతాయి. ఇలా ఒక వ్యక్తి కదలికలు తగ్గిపోయే గుణాన్ని 'హైపోకైనేసియా' అంటారు. తర్వాత చెయ్యి వణకడం మొదలవుతుంది. ఈ వణకడమనేది ఏ పనీ చేయని దశలో... అంటే ఓ వ్యక్తి ఏ పనీ చేయకుండా పూర్తిగా రెస్ట్‌లో ఉన్నప్పుడు కూడా వస్తుంది ఉంటుంది. కాబట్టి ఈ వణుకుడును 'రెస్ట్ ట్రిమర్స్'గా చెబుతారు. ఇలాంటి వ్యక్తులు పక్కకు తిరగబోయే ప్రయత్నంలో అకస్మాత్తుగా బ్యాలెన్స్ కోల్పోయి పడిపోతూ ఉంటారు. ఇలా బ్యాలెన్స్ కోల్పోవడాన్ని 'పోష్చురల్ ఇన్‌స్టెబిలిటీ' అంటారు. ఇవన్నీ ఈ జబ్బుకు ఉన్న ముఖ్యమైన లక్షణాలు. ఇవేగాక ఇంకా చాలా అనుబంధ లక్షణాలూ కనిపిస్తుంటాయి.

గుర్తించడమిలా...

అంతవరకు చాలా చురుగ్గా ఉండేవారిలో కదలికలు క్రమంగా నెమ్మదిస్తూ పోతాయి. కాలం గడుస్తున్న కొద్దీ ఆ నెమ్మదించే వేగం మరింత పెరుగుతూ... అదే పని మునపటికంటే చాలా ఆలస్యంగా చేస్తుండటం పార్కిన్‌సన్ వ్యాధి బాధితుల విషయంలో గమనించవచ్చు. ఇలా వాళ్ల శారీరక కదలికలతో ముడిపడ్డ ప్రతి పనీ ఆలస్యమవుతూ ఉంటుంది. అంటే... తినడం, దుస్తులు ధరించడం, నడవడం, మెట్లు ఎక్కడం, దిగడం... ఇలా అన్నీ నెమ్మదిస్తాయి. అంతేకాదు... మాట కూడా నెమ్మదిగా, పక్కవాళ్లకూ వినపడనంత మెల్లగా ఉంటుంది. దీన్నే 'మోనోటోనస్ లో వాల్యూమ్ స్పీచ్' అంటారు. ఈ జబ్బు ఉన్నవారు పెద్ద స్వరంతో మాట్లాడలేరు. మాట్లాడేటప్పుడు, నవ్వేటప్పుడు మునుపు వారిలో కనిపించే ముఖకవళికలూ (ఫేషియల్ ఎక్స్‌ప్రెషన్స్) తగ్గుతాయి. నడిచేటప్పుడు చేయి ఊపడం (ఆర్మ్ స్వింగ్) తగ్గుతుంది. జబ్బు ముదిరేకొద్దీ శరీరాన్ని ముందుకు వంచి నడుస్తారు. చిన్నచిన్న అడుగులు చాలా తొందరగా వేస్తూ నడుస్తుంటారు. చూసేవారికి వీళ్ల ముందుకు ఒంగి పరుగెడుతున్నట్లుగా ఉంటుంది. నడిచేటప్పుడు అకస్మాత్తుగా ఏదైనా అడ్డు వస్తే వెంటనే ఆగలేరు కాబట్టి అడ్డొచ్చిన దానికి కొట్టుకుని పడిపోతారు. కూర్చుని లేచేటప్పుడు, పక్కకు తిరిగేటప్పుడు తమాయించుకోలేక బాలెన్స్ తప్పి పడిపోతుంటారు. ముఖం జిడ్డుగా ఉంటుంది. కొందరిలో మలబద్ధకం కూడా రావచ్చు. ఈ జబ్బు ఉన్నవారిలో కాళ్లూచేతులు స్టిఫ్‌గా ఉంటాయి. వీరిలో కొందరికి డిప్రెషన్ లాంటి మానసిక రుగ్మతలూ మొదలయ్యే అవకాశముంది.

వ్యాధి నిర్ధారణ ఇలా...

ఈ జబ్బులో కనిపించే లక్షణాలతోనే దాదాపు అందరిలోనూ (అంటే 100 శాతం మందిలోనూ వ్యాధిని నిర్ధారణ చేయవచ్చు. అయితే కొందరిలో పై లక్షణాలతో పాటు... తలనొప్పి చాలా ఎక్కువగాఉన్నా, వాంతులు ఎక్కువగా అవుతున్నా, ఒక పక్క కాళ్లూచేతులు చచ్చుబడినట్లుగా ఉన్నా... వెంటనే సీటీ స్కాన్ (బ్రెయిన్), లేదా ఎమ్మారై (బ్రెయిన్) తీయించి, ఈ జబ్బును నిర్ధారణ చేస్తారు.

నిర్ధారణ కోసం మరికొన్ని వైద్య పరీక్షలు...

- మెదడు ఎమ్మారై పరీక్ష, అయోఫ్లు పేన్ సింగిల్ ఫొటాన్ ఎమిషన్ టోమోగ్రఫీ (స్పెక్ట్) పరీక్ష, దీన్నే డాట్ స్కాన్ అని కూడా అంటారు
- ఎఫ్-డోపల్-6 ఫ్లూరో -3, 4 డై హైడ్రాక్సీ ఫినైల్ అలనైన్ (18 ఎఫ్- డోపా) పాజిట్రాన్ ఎమిషన్ టోమోగ్రఫీ (పెట్) స్కాన్ పరీక్ష.

కొన్ని నివారణ పద్ధతులు

- వ్యాయామం పార్కిన్‌సన్ వ్యాధిని కొంతమేరకు నివారిస్తుంది
- ఫిజియోథెరపీ, రీ-హ్యాబిలిటేషన్, మింగలేని సమయాల్లో వచ్చే పోషకాహార లోపాలను అధిగమించడానికి విటమిన్ సప్లిమెంట్స్ తీసుకోవడంతో పాటు పార్కిన్‌సన్ వ్యాధి వల్ల కుంగుబాటు (డిప్రెషన్) వంటి కొన్ని రకాల మానసిక సమస్యలు రావడంతో పాటు అవే సమస్యలు పార్కిన్‌సన్ వ్యాధికి దారితీసే ప్రమాదం ఉన్నందున సైకియాట్రిక్ ఇవాల్యుయేషన్ కూడా అవసరం కావచ్చు.
- **జబ్బు గురించి కొన్ని కొత్త విషయాలు :** ఈ జబ్బుతో బాధపడే వారి జీవన పరిస్థితులను (క్వాలిటీ ఆఫ్ లైఫ్) మెరుగుపరిచేందుకు ఎన్నో మందులు అందుబాటులో ఉన్నాయి. మెదడులో డోపమైన్ అనే రసాయన పదార్థం ఉత్పత్తి తగ్గడం వల్ల ఈ జబ్బు వస్తుంది కాబట్టి జబ్బు ఉన్నవారిలో ఇదే పదార్థాన్ని బయట నుంచి టాబ్లెట్ల రూపంలో ఇవ్వడం ఒక చికిత్స ప్రక్రియ.

కొన్ని ప్రధాన చికిత్స ప్రక్రియలు :

- మెదడులో తగ్గిన డోపమైన్ ఉత్పత్తిని పెంచే మందులతో లక్షణాల్ని అదుపులోకి తేవచ్చు. అయితే పెరిగే వయసుతో పాటు డోపమైన్ ఉత్పాదన / మెదడులో దాని మోతాదు తగ్గుతూ వస్తుండటంతో మందుల మోతాదును పెంచుతూ పోవాల్సి ఉంటుంది.
- లెవోడోపా / కార్బిడోపా అనే మందులు దేహంలోకి వెళ్లగానే డోపమైన్‌గా మారతాయి. మావో-బి ఇన్హిబిటార్స్ మందులు మరింత డోపమైన్ లభ్యమయ్యేలా చేస్తాయి.
- యాంటీ కొలెనెర్జిక్ మందులు లక్షణాల తీవ్రతను తగ్గించి, ఉపశమనాన్నిస్తాయి.
- ఎమ్మారై ఇమేజింగ్ సమయంలో ఫోకస్‌డ్ అల్ట్రాసౌండ్ థెరపీతో థలామస్‌లో కొన్ని లీజన్స్ కల్పించడమూ ఓ చికిత్సగా చెప్పవచ్చు. ఇదొక నాన్-ఇన్వేజివ్ ప్రక్రియ. అంటే... కత్తి కోత గానీ లేదా గాటు గానీ పడకుండా చేసే చికిత్స.

పై చికిత్సలతో పాటు పాటు గత పది పదిహేనేళ్ల వ్యవధిలో దీనికి అనేక కొత్త చికిత్స పద్ధతులు అందుబాటులోకి వచ్చాయి. వాటిలో కొన్ని ముఖ్యమైనవి...

శస్త్రచికిత్స : మందుల మోతాదు పెరుగుతున్న కొద్దీ ఓ దశలో దుష్ప్రభావాలు మొదలవుతాయి. అందుకే మాత్రలు వేసుకున్నా ప్రయోజనం లేని సందర్భాల్లో ఇక చివరి యత్నంగా 'డీప్ బ్రెయిన్ స్టిమ్యులేషన్ సర్జరీ' అనే శస్త్రచికిత్స అవసరం పడవచ్చు.

- **డీబీఎస్ :** డీప్ బ్రెయిన్ స్టిమ్యులేషన్ అనే రూపానికి ఇంగ్లిష్ పొడి అక్షరాలే డీబీఎస్. ఇదో శస్త్రచికిత్స ప్రక్రియ. ఇందులో చాలా మోతాదులో తక్కువ కరెంట్‌ను పంపి డోపమైన్ కణాలను ఉత్తేజపరుస్తారు. జబ్బు బాగా ముదిరిపోయి, ఇక మందులు ఎలాంటి ప్రభావం చూపని దశలోనే ఈ శస్త్రచికిత్స చేస్తారు. ఈ కరెంట్ పంపే పరికరం గుండెకు అమర్చే పేస్‌మేకర్‌లా ఉంటుంది. మెదడు లోపల 'సబ్‌స్టాన్షియా నైగ్రా' అనే ప్రాంతంలో దీని తాలూకు ఎలక్ట్రోడ్‌ను అమర్చుతారు. బయట దాన్ని అనుసంధానించడానికీ, మోతాదు నియంత్రించడానికీ ఒక బటన్‌ను అమర్చుతారు.

ఏ వయసు వారిలో...

పార్కిన్‌సన్స్ వ్యాధికి గురైన వారిలో 98 శాతం మంది 50 ఏళ్లు పైబడిన వారే. కేవలం రెండు శాతం లోపు వారిలోనే ఇది 50 ఏళ్లలోపు వారిలో కనిపించింది. పార్కిన్‌సన్స్ వ్యాధి మహిళల్లో కంటే పురుషుల్లో దాదాపు ఒకటిన్నర రెట్లు ఎక్కువ. కొందరిలో మరీ యుక్తవయసులో అంటే 30 ఏళ్ల వారిలోనూ కనిపిస్తుడటంతో దీన్ని వంశ పారంపర్యంగా కనిపించే పార్కిన్‌సనిజమ్ (హెరిడిటరీ పార్కిన్‌సనిజమ్) అంటున్నారు.

ఎందుకు వస్తుందీ జబ్బు?

మన మెదడు నిర్మాణం చాలా సంక్లిష్టంగా ఉంటుందన్నది తెలిసిందే. అందులోని ఒక చిన్న భాగం పేరు 'సబ్‌స్టాన్షియా నైగ్రా'. దీని నుంచి డోపమైన్ అనే రసాయనం (బయోకెమికల్) వెలువడుతుంది. ఇది మన దేహం కదలికలను నియంత్రిస్తుంది. సాధారణంగా 50 ఏళ్లు పైబడ్డ వ్యక్తులు కొందరిలో ఈ రసాయనం సరిగా వెలువడదు. ఆ రసాయనం లోపించడం వల్లనే కదలికల్లో లోపాలు కనిపించడం మొదలవుతుంది.


కారణాలు...

నిర్దిష్టంగా కారణం ఇదీ అని చెప్పలేనప్పటికీ కొన్ని పరిశీలనల ద్వారా పార్కిన్‌సన్ జబ్బు రావడానికి అనేక కారణాలు ఉన్నాయన్నది వైద్య శాస్త్రవేత్తల మాట. అందులో ముఖ్యమైనది జన్యులోపం. ఈ జన్యులోపం ఉన్నవారిలో ఒక వయసు దాటాక ఈ జబ్బు తప్పనిసరిగా బయటపడుతుంది. అలాగే కొందరిలో తీవ్రమైన ఒత్తిడి కారణంగా డోపమైన్ సరిగా వెలువడక జబ్బు వస్తుంది. మరి కొందరిలో వారు తీసుకునే పానియాల్లో లేదా పీల్చే గాలిలో కొన్ని రకాల విషపదార్థాలు (టాక్సిక్ మెటీరియల్స్) ఉన్న కారణంతో... ఆ విషాలు డోపమైన్ విడుదల చేసే కణాలను దెబ్బతీనందువల్ల డోపమైన్ సరిగా విడుదల కాకపోవడంతో ఈ జబ్బు వస్తుంది. అంతేకాకుండా మరికొందరిలో తలకు పదే పదే దెబ్బలు తగలడం వల్ల కూడా ఈ జబ్బు రావచ్చు. ఇంకొందరిలో మెదడుకు కొన్ని వైరల్ ఇన్ఫెక్షన్స్ రావడం వల్ల కూడా ఈ జబ్బు వచ్చేందుకు అవకాశం ఉంది. ఇవన్నీ ఈ జబ్బుకు కారణమయ్యే అంశాలు. అయితే ఈ జబ్బుకు గురైన దాదాపు 50 శాతం మందిలో మాత్రం ఏ కారణం లేకుండా కూడా రావచ్చు. ఇంకా విచిత్రం ఏమిటంటే... ఈ జబ్బు ఎలాంటి చెడు అలవాట్లు (అంటే స్మోకింగ్, ఆల్కహాల్) లేకపోవడం లేదా కనీసం కాఫీ, టీలు తాగని వారిలోనూ కనిపించడమన్నది చాలామంది వైద్యశాస్త్రవేత్తలూ, అధ్యయనవేత్తల దృష్టికి వచ్చిన ఆశ్చర్యకరమైన అంశం.

మరికొన్ని లక్షణాలు

- కాళ్లూ, చేతుల్లోని కండరాలు బిగుసుకుపోవడం, విపరీతంగా వణకడం
- తీవ్రమైన అలసట (ఫెటీగ్)కనిపిస్తూ, తరచూ నిద్రాభంగం. ఈ పరిణమాలతో పాటు మెదడులోని కొన్ని రసాయనాల అసమతౌల్యత వల్ల కుంగుబాటు (డిప్రెషన్), నిద్రసమస్యలు (స్లీపింగ్ ప్రాబ్లమ్స్)
- పీడకలలూ, రాత్రి నిద్రలేమితో కొందరిలో అకస్మాత్తుగా పగటినిద్ర
- కొందరిలో మింగడం కష్టంకావడం, మింగలేకపోవడంతో ఆహారం గొంతులో పట్టేయడం /ఇరుక్కుపోవడం
- కొందరిలో కండరాల నొప్పులు / కీళ్ల నొప్పులు
- కొన్ని రకాల చర్మ సమస్యలతో పాటు నాడీ వ్యవస్థ దెబ్బతినడం వల్ల మూత్ర విసర్జన సమస్యలూ అలాగే మలబద్ధకం వంటి లక్షణాలూ కనిపించవచ్చు.

మొదట్లో కనిపించే ఈ లక్షణాలను నిర్లక్ష్యం చేస్తే, లక్షణాలు మరింత ముదిరి బాధితులు తమ రోజువారీ పనులు చేసుకోలేనంతగా ఇబ్బంది పడతారు.



నిర్వహణ: యాసీన్

మందుల దుష్ప్రభావాలు మొదలైతే

ప్రత్యామ్నాయం డీప్ బ్రెయిన్ స్టిమ్యులేషన్ సర్జరీ... పార్కిన్‌సన్ వ్యాధిలో వాడుకునే మందులు మూడు నుంచి ఐదేళ్ల వరకు సమర్థంగా పనిచేసినా... ఆ తర్వాత రెండు రకాల దుష్ప్రభావాలు మొదలవుతాయి. కొందరిలో టాబ్లెట్ ప్రభావం కొనసాగినంతసేపు బాగానే ఉన్నా... దాని ప్రభావం తగ్గగానే లక్షణాలు బయటపడుతుంటాయి. దీన్నే 'ఆన్ ఆర్ ఆఫ్ ఫినామెనా' అంటారు. మరికొందరిలో మాత్ర వేసుకున్నప్పుడు వ్యాధి తీవ్రత పెరిగినట్లుగా... దేహంలో కదలికలు మరింత పెరిగిపోతూ ఉంటాయి. ఈ రెండు రకాల దుష్ప్రభావాలూ సుదీర్ఘకాలం మందులు వాడినవారిలో కనిపిస్తాయి. ఇలాంటి పరిస్థితుల్లో మందుల్ని ఆపలేక... కొనసాగించలేక బాధితులు ఇబ్బంది పడతారు. ఇలాంటివారికి 'డీప్ బ్రెయిన్ స్టిమ్యులేషన్ సర్జరీ' అన్నది ఓ వరప్రదాయని అనుకోవచ్చు.

డీబీఎస్ సర్జరీకి ముందు పరీక్ష...

పార్కిన్‌సన్ వ్యాధి మందులతో అదుపు కావడంలేదని నిర్ధారణ చేసుకోవడం కోసం వైద్యులు ఓ పరీక్ష నిర్వహిస్తారు. ఇందులో బాధితులకు మొదట మందులు ఇవ్వకుండా వారి చేత కొన్ని పనులు చేయిస్తారు. వాటితో మందు ప్రభావమూ, దుష్ప్రభావాల తీవ్రత తెలుస్తాయి. మందులతో ఇక ఏమాత్రమూ ప్రయోజనం కనిపించని బాధితులను మాత్రమే సర్జరీకి ఎంపికచేస్తారు. అంతేకాదు... వాళ్లకు ఎలాంటి మానసిక రుగ్మతలూ ఉండకూడదు. సర్జరీ తర్వాత కొందరిలో మానసిక సమస్యలు తలెత్తే అవకాశం ఉంటుంది. కాబట్టి సర్జరీకి ముందు ఎలాంటి మానసిక సమస్యలూ లేవని సైకియాట్రిస్ట్ తొలుత నిర్ధారణ చేయాలి.

డీబీఎస్ సర్జరీలో ఏంజరుగుతుందంటే...

డీప్ బ్రెయిన్ స్టిమ్యులేషన్ కోసం మెడ్‌ట్రానిక్స్, బోల్టన్ సైంటిఫిక్, సెయింట్ జ్యూడ్ మొదలైన కంపెనీల ఉత్పత్తులు అందుబాటులో ఉన్నాయి. మూడు నుంచి నాలుగు గంటల సమయం పట్టే ఈ శస్త్రచికిత్సలో భాగంగా... ఎలక్ట్రోడ్‌లను కలిగిన లీడ్‌లను మెదడులో అమర్చుతారు. వాటికి విద్యుత్తును అందించే పల్స్ జనరేటర్‌ను ఛాతీలో అమర్చుతారు. ఈ రెండూ వైర్‌తో అనుసంధానమై ఉంటాయి. బ్యాటరీతో నడిచే ఈ పల్స్ జనరేటరు నిరంతరం పనిచేస్తూ, విద్యుత్ ప్రసారాన్ని వెలువరిస్తూ ఉండటం వల్ల మెదడుకు నిరంతరాయంగా కరెంట్ సరఫరా జరుగుతూ ఉంటుంది. దాంతో లక్షణాలు అదుపులోకి వస్తాయి. బ్యాటరీతో పనిచేసే ఈ పల్స్ జనరేటర్ గురించి భయపడాల్సిన అవసరం లేదు. వీటిలో రీచార్జ్, సింగిల్ యూజ్ అనే రెండు రకాల బ్యాటరీలు ఉంటాయి. సింగిల్ యూజ్ బ్యాటరీలు ఏకంగా మూడు నుంచి ఐదేళ్ల వరకు పనిచేస్తాయి. కాలం చెల్లిన తర్వాత చిన్న సర్జరీతో బ్యాటరీని మార్చుకోవాల్సి ఉంటుంది. అదే రీచార్జ్ బ్యాటరీ అయితే 15 నుంచి 20 ఏళ్ల వరకు పనిచేస్తాయి. వీటిని ఫోన్ ఛార్జ్ చేసుకున్నట్లుగా, ఓ వైర్‌లెస్ ఛార్జర్‌ను ఛాతీకి కట్టుకుని బ్యాటరీని ఛార్జ్ చేసుకోవచ్చు.

డీప్ బ్రెయిన్ స్టిమ్యులేషన్ సర్జరీ అంటే..?

డోపమైన్‌ను బయటి నుంచి అందించకుండానే... ఆ న్యూరోట్రాన్స్‌మిటర్ శరీరంలో ఉందనే భావనను మెదడుకు కలిగించేలా చేసే సర్జరీ ఇది. ఇందుకోసం... మెదడులో శరీర కదలికలను నియంత్రించే 'న్యూక్లియస్'లలోకి ఓ లీడ్‌ను అమర్చుతారు. దాన్ని బ్యాటరీకి అనుసంధానిస్తారు. శస్త్రచికిత్స ద్వారా ఆ బ్యాటరీని ఛాతీలో ఉంచుతారు. ఆ బ్యాటరీ నుంచి వెలువడే 'ఎలక్ట్రిక్ ఇంపల్స్' మెదడును ప్రేరేపిస్తాయి. దాంతో న్యూక్లియస్‌లన్నీ గాడిలో పడి, డోపమైన్ ఉన్నట్లుగా మెదడుకు భ్రమ కలిగిస్తాయి. ఫలితంగా పార్కిన్‌సన్ వ్యాధి అదుపులోకి వస్తుంది. అంతేకాదు... మందుల తాలూకు దుష్ప్రభావాలలో కనిపించే 'ఆన్ అండ్ ఆఫ్ ఫినామినా' కండిషన్ తొలగిపోతుంది. బ్యాటరీ నుంచి విద్యుత్తు నిరంతరాయంగా మెదడుకు ప్రసరిస్తూ ఉండటం వల్ల లక్షణాలు పెరగడం / తగ్గడం లాంటివి కూడా ఉండవు. అలాగే సర్జరీ తర్వాత మందుల మోతాదు కూడా తగ్గిస్తారు. దాంతో అదనపు కదలికలూ తగ్గుతాయి.

డీబీఎస్ సర్జరీకి ఎవరు అర్హులు?


పార్కిన్‌సన్ బాధితులందరూ ఈ సర్జరీకి అర్హులు కారు. మరి అర్హులు ఎవరంటే...

- వ్యాధి నిర్ధారణ తర్వాత మూడేళ్లు గడిచి ఉండాలి
- మందుల తాలూకు దుష్ప్రభావాలు మొదలవ్వాలి
- ఎమ్మారై ఫలితాలు శస్త్రచికిత్సకు అనుకూలంగా ఉండాలి
- సర్జరీకి ముందు చేపట్టే ఆన్ ఆఫ్ పరీక్షలో పాజిటివ్ ఫలితం రావాలి.

డీబీఎస్ సర్జరీ ఫలితం ఇలా...

ఈ శస్త్రచికిత్సతో పార్కిన్‌సన్ వ్యాధిని మరింత పెరగకుండా అక్కడికి అదుపుచేయవచ్చు. అయితే గతంలో జరిగిపోయిన నష్టాన్ని మాత్రం భర్తీ చేయడం సాధ్యం కాదు. బాధితులు ఒకింత నాణ్యమైన జీవితం గడపడం కోసమే 'డీప్ బ్రెయిన్ స్టిమ్యులేషన్' చికిత్స ఉపయోగపడుతుంది తప్ప... ఇది పూర్తిగా వ్యాధిని నయం చేయలేదని గ్రహించాలి. సర్జరీ సమయానికి రోగి శారీరక స్థితి ఎలా ఉందో, అదే పరిస్థితి కొనసాగడం లేదా అంతకంటే దిగజారకుండా ఉండటానికి మాత్రమే డీబీఎస్ ఉపయోగపడుతుంది.

- **స్టెమ్‌సెల్ థెరపీ:** పార్కిన్‌సన్ డిసీజ్‌కు శాశ్వత చికిత్స అందించే ప్రయత్నాల్లో ఈ చికిత్స ప్రక్రియను మొదటిదిగా పేర్కొనవచ్చు. మన శరీరంలోని వేర్వేరు అవయవాల్లో ఉండే కణాలు వేర్వేరుగా ఉంటాయి. ఉదా: మెదడు కణాలను న్యూరాన్లుగా, రక్తకణాల్లో ఎర్రరక్తకణాలు, తెల్లరక్తకణాలు, ప్లేట్‌లెట్స్‌గా, కాలేయకణాలు హెపటోసైట్స్, కండరకణాలు మయోసైట్స్‌గా, ఎముకకణాలు ఆస్టియోసైట్స్‌గా ఉంటాయి. అయితే ఈ కణాలన్నీ ఉత్పత్తి అయ్యే మూల (ప్రిమిటివ్) కణాన్ని ఇంగ్లిష్‌లో 'స్టెమ్‌సెల్' అంటారు. ప్రస్తుతం బొడ్డుతాడు నుంచి సేకరించిన కణాలను కొన్ని ప్రక్రియలు, దశల తర్వాత స్టెమ్‌సెల్‌గా మార్చి అమర్చితే... అది అమర్చిన ప్రదేశాన్ని బట్టి... అది సదరు అవయవానికి సంబంధించిన కణంగా మారిపోతుంది. ఈ తరహా చికిత్సనే స్టెమ్‌సెల్ థెరపీ అంటారు. ఈ చికిత్సలో భాగంగా స్టెమ్ సెల్స్‌ను మెదడులో సబ్‌స్టాన్షియా నైగ్రా (ఎస్.ఎన్.) ఉన్న ప్రాంతంలో ప్రవేశపెడతారు. అక్కడ అవి కొత్త ఎస్.ఎన్. కణాలుగా తయారవుతాయి. దాంతో ఆ కొత్త కణాలనుంచి మళ్లీ శరీరానికి కావాల్సిన డోపమైన ఉత్పత్తి అవుతుంటుంది. కాబట్టి ఈ జబ్బు లక్షణాలన్నీ పూర్తిగా తగ్గిపోయేందుకు అవకాశముంది.
- **స్టెమ్‌సెల్స్ ఉత్పత్తి ఇలా :** మన శరీరంలో ఏదో ఒక శాంపుల్ నుంచి కణాలను సేకరిస్తారు. (ప్రధానంగా రక్తం లేదా బొడ్డు తాడులో ఉన్న రక్తంలో స్టెమ్‌సెల్స్ ఎక్కువగా ఉంటాయి). ఈ శాంపుల్‌ను ఒక యంత్రంలో ఉంచి మరిన్ని కణాలు ఉత్పత్తి అయి వాటి సంఖ్య పెరిగేలా ఇంక్యుబేట్ చేస్తారు. ఇలా ఒక మూలకణం... కణవిభజన ప్రక్రియ ద్వారా మరెన్నో కణాలుగా విభజన అయి చాలా కణాలు తయారవుతాయి. వాటినే మనం మూలకణాలుగా అవసరమైన చోట ఉపయోగించుకోవచ్చు. ప్రస్తుతం ఈ ప్రక్రియ గురించి విస్తృతంగా ప్రయోగాలు జరుగుతున్నాయి. అయితే ప్రస్తుత పురోగతిని బట్టి ఈ ప్రక్రియ ద్వారా రానున్న కొన్నేళ్లలో ఇవి కచ్చితంగా మంచి ఫలితాలే వస్తాయని తప్పక చెప్పవచ్చు.



- **ఫీటల్ సెల్‌ట్రాన్స్‌ప్లాంటేషన్ :** ఈ ప్రక్రియలోనూ అనుసరించే విధానం ఇంచుమించు పైన పేర్కొన్నట్లుగానే ఉంటుంది. బిడ్డ పుట్టగానే ఆ చిన్నారి బొడ్డుతాడును, దాంతో పాటు కొద్దిగా రక్తాన్ని (ఫీటల్ బ్లడ్)ను సేకరించి, ప్రత్యేకమైన ల్యాబ్‌లో ప్రాసెస్ చేసి, మూలకణాలను తయారు చేస్తారు. వాటిని అవసరమైనప్పుడు కావాల్సిన చోట వాడుకుంటారు. అప్పుడు ఆ ప్రదేశంలో కొన్ని మూలకణాలను అమర్చగానే అది పూర్తి అవయవంగా రూపుదిద్దుకోవాలన్నదే ఈ ప్రక్రియ లక్ష్యం.
- **జీన్ థెరపీ :** ఈ ప్రక్రియపై గత 15-20 ఏళ్లుగా ఎన్నో ప్రయత్నాలు, ప్రయోగాలు జరుగుతున్నాయి. పార్కిన్‌సన్స్ డిసీజ్ అనే ఈ జబ్బు... 'పార్క్' అనే ఒక జన్యువు లోపం కారణంగా వస్తుంది. కాబట్టి ఈ జన్యువులో వచ్చే లోపాలను నివారిస్తే అసలు జబ్బు రాకుండానే నివారించే అవకాశం ఉంది. ఇలా అరికట్టడం అనే ప్రక్రియ రాబోయే దశాబ్దకాలంలో అందరికీ అందుబాటులోకి రావచ్చని ప్రస్తుతం ఉన్న పురోగతిని బట్టి శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు.
- **ప్రొసావిన్ చికిత్స :** ప్రొసావిన్ అనే పదార్థాన్ని మెదడుభాగంలోకి ఇంజెక్ట్ చేయడం వల్ల మంచి ఉపయోగాలు ఉన్నాయని తేలింది. ప్రస్తుతం ఇంగ్లాండ్‌లోని ఆక్స్‌ఫర్డ్ బయోమెడికా సంస్థలో ఈ చికిత్స ప్రక్రియపై పరిశోధనలు జరుగుతున్నాయి.
- **బ్రైట్‌లైట్ :** ఒక ఫ్రీక్వెన్సీలో ఉండే కాంతి తరంగాలను ప్రసరింపజేయడం వల్ల మెదడులో ఉండే మెలటోనిన్‌ను తగ్గించి డోపమైన్ ఉత్పత్తిని ఎక్కువ చేయవచ్చనే అంశం ఆధారంగా జరిగే చికిత్స ఇది.
- **ట్రాన్స్ క్రేనియల్ ఆల్టర్నేట్ కరెంట్ స్టిమ్యులేషన్స్:** ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు కరెంట్ ఇచ్చి, నైగ్రల్ సెల్స్‌ను ఉత్తేజపరచి, డోపమైన్ ఉత్పత్తి జరిగేలా తమ ప్రయోగాలను కొనసాగిస్తున్నారు.

పైన పేర్కొన్న చికిత్స ప్రక్రియలతో పాటు న్యూరల్ గ్రోత్ ఫ్యాక్టర్, జీడీఎన్‌ఎఫ్ (గ్లయల్ డిరైవ్‌డ్ న్యూరోట్రాఫిక్ ఫ్యాక్టర్) వంటి కొన్ని అంశాలను రక్తంలోకి ప్రవేశింపజేయడం వల్ల అవి మళ్లీ మెదడులోకి ప్రవేశించి అక్కడ నైగ్రల్ సెల్స్‌ను అభివృద్ధి చేసేలా చూస్తే ప్రక్రియలపైన చాలా విస్తృతమైన అధ్యయనం జరుగుతోంది. మునుపటితో పోలిస్తే ప్రస్తుతం పార్కిన్‌సన్స్ డిసీజ్‌ను తగ్గించేందుకు కొంతమేర మంచి చికిత్స ప్రక్రియలే అందుబాటులో ఉన్నాయని, కొన్నాళ్లలో ఇంకా మెరుగైన చికిత్సలు అందుబాటులోకి వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయని నమ్మకంగా చెప్పవచ్చు.

బిజినెస్ రీల్

బజాజ్ ఫిన్‌సర్వ్ నుంచి చోటాసిప్!



ముంబై: బజాజ్ ఫిన్‌సర్వ్ అస్సెట్ మేనేజ్‌మెంట్ చోటాసిప్‌ను తీసుకువచ్చే ప్రణాళికతో ఉన్నట్టు ప్రకటించింది. ఇందులో సాధ్యాసాధ్యాలను అంచనా వేసిన తర్వాత నిర్ణయం తీసుకుంటామని కంపెనీ ఎండీ గణేష్ మోహన్ తెలిపారు. ఈ దిశగా టెక్నాలజీ పరిష్కారం కోసం కృషి చేస్తున్నామని చెప్పారు. చోటాసిప్ అన్నది ఆసక్తికరమైన చొరవగా పేర్కొన్నారు. తగినంత అధ్యయనం అనంతరం దీన్ని ప్రారంభించేందుకు ఆరు నెలల సమయం తీసుకుంటుందన్నారు. ఇన్వెస్టర్లు మ్యూచువల్ ఫండ్స్‌లో కనీసం రూ.100 నుంచి ఇన్వెస్ట్ చేసుకునేందుకు వీలుగా సెబీ ఈ ఏడాది ఆరంభంలో మైక్రోసిప్‌ను ఆవిష్కరించడం గమనార్హం. ఎస్‌బీఐ, కోటక్ మ్యూచువల్ ఫండ్స్ ఇప్పటికే రూ.100 సిప్‌ను అందిస్తున్నాయి. మిగిలిన మ్యూచువల్ ఫండ్స్ పథకాల్లో అయితే కనీసం రూ.500 నుంచి ఇన్వెస్ట్ చేసుకోవాల్సి ఉంటుంది.

క్యూ1లో జేఎల్‌ఆర్ అమ్మకాలు డౌన్



న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్–జూన్ త్రైమాసికంలో జాగ్వార్ ల్యాండ్‌రోవర్ (జేఎల్‌ఆర్) హోల్‌సేల్, రిటైల్ అమ్మకాలు తగ్గాయి. డీలర్లకు సరఫరా (టోకు విక్రయాలు) వార్షికంగా 11 శాతం క్షీణించి 87,286 యూనిట్లకు పరిమితమయ్యాయి. తొలి త్రైమాసికంలో ఉత్తర అమెరికా, యూరప్, బ్రిటన్‌లో హోల్‌సేల్ అమ్మకాలు వరుసగా 12 శాతం, 14 శాతం, 25 శాతం తగ్గినట్లు జేఎల్‌ఆర్ ఒక ప్రకటనలో తెలిపింది. ఇక రిటైల్ అమ్మకాలు 15 శాతం క్షీణించి 94,420 యూనిట్లుగా నమోదైనట్లు వివరించింది. సమస్యాత్మక పరిస్థితులు నెలకొన్న తరుణంలో అంచనాలకు అనుగుణంగానే అమ్మకాలు ఉన్నట్లు కంపెనీ పేర్కొంది. వారసత్వంగా వస్తున్న మోడల్స్‌ను క్రమంగా నిలిపివేసి కొత్త జాగ్వార్ మోడల్‌సను ప్రవేశపెట్టనుండటం, అమెరికాలో దిగుమతి సుంకాల వ్యవహారం కారణంగా ఏప్రిల్‌లో ఎగుమతులు తాత్కాలికంగా నిలిచిపోవడం తదితర అంశాలు విక్రయాలు తగ్గడానికి కారణమని వివరించింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

8-7-2025

విశాఖ	560–00
చిత్తూరు	633–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	535–00
విజయవాడ	570–00
రిటైల్ ధర (డజను)	78.00
హైదరాబాద్	560–00
వరంగల్	562–00
రిటైల్ ధర	6.20

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
HINDUNILVR	2,408.70	2.97
TATACONSUM	1,106.00	1.50
NESTLEIND	2,420.40	1.15
EICHERMOT	5,688.00	1.05
JIOFIN	328.30	1.03

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
BEL	417.00	-2.47
TECHM	1,622.40	-1.98
ONGC	241.40	-1.57
ULTRACEMCO	12,356.00	-1.20
HCLTECH	1,707.00	-1.10

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	5,042
ఎన్ఎస్ఈ	76,916
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	1,01,425
ఎఫ్ఐఐ	+ 321
డీఐఐ	+ 1853

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	67.81 (రాత్రి 11.30కు)	$ 66.50 (క్రితం ముగింపు)
బ్రెంట్	69.44 (రాత్రి 11.30కు)	$ 68.30 (క్రితం ముగింపు)

టాటా మోటార్స్ నుంచి ఏస్ ప్రో మినీ ట్రక్‌లు

ధర రూ. 3.99 లక్షల నుంచి ప్రారంభం



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వాహనాల తయారీ సంస్థ టాటా మోటార్స్ తాజాగా కార్గో రవాణా కోసం ఏస్ ప్రో పేరిట 4–వీల్ మినీ ట్రక్కులను ప్రవేశపెట్టింది. వీటి ధర రూ. 3.99 లక్షల నుంచి ప్రారంభమవుతుంది. దాదాపు 750 కేజీల పేలోడ్ సామర్థ్యంతో, పెట్రోల్, బై-ఫ్యుయెల్, ఎలక్ట్రిక్ వేరియంట్లలో ఈ వాహనాలు లభిస్తాయని సంస్థ వైస్ ప్రెసిడెంట్ పినాకి హల్దార్ తెలిపారు. ఎలక్ట్రిక్ వెర్షన్ ఒకసారి చార్జ్ చేస్తే సుమారు 125 కి.మీ. నుంచి 155 కి.మీ. వరకు మైలేజి ఇస్తుందని పేర్కొన్నారు. మారుతున్న మార్కెట్ పరిస్థితుల నేపథ్యంలో తేలికపాటి వాణిజ్య వాహనాల పరిశ్రమ వృద్ధి ప్రస్తుతం ఒక మోస్తరుగానే ఉన్నప్పటికీ మధ్యకాలికం, దీర్ఘకాలికంగా మెరుగ్గా ఉంటుందని హల్దార్ చెప్పారు.

జియో బ్లాక్‌రాక్ ఎన్ఎఫ్‌వోలు సూపర్‌హిట్

మూడు డెట్ ఫండ్స్‌లోకి రూ.17,800 కోట్లు



న్యూఢిల్లీ: జియో బ్లాక్‌రాక్ అస్సెట్ మేనేజ్‌మెంట్ తొలిసారి న్యూ ఫండ్ ఆఫర్ల ద్వారా ఇన్వెస్టర్ల నుంచి రూ.17,800 కోట్లను సమీకరించింది. జియో బ్లాక్‌రాక్ ఓవర్‌నైట్ ఫండ్, జియో బ్లాక్‌రాక్ లిక్విడ్ ఫండ్, జియో బ్లాక్‌రాక్ మనీ మార్కెట్ ఫండ్‌లకు సంబంధించి న్యూ ఫండ్ ఆఫర్లు జూన్ 30న మొదలు కాగా, జూలై2తో ముగిశాయి. 90కు పైగా ఇనిస్టిట్యూషనల్ ఇన్వెస్టర్లు పెట్టుబడులు పెట్టినట్టు.. జియో బ్లాక్‌రాక్ అస్సెట్ మేనేజ్‌మెంట్ అందించే విలువ పట్ల వారిలో ఉన్న విశ్వాసానికి నిదర్శమని సంస్థ ప్రకటించింది. 67,000 మందికి పైగా రిటైల్ ఇన్వెస్టర్లు సైతం పెట్టుబడులు పెట్టినట్టు తెలిపింది. ఈ ఎన్ఎఫ్‌వోల ద్వారా దేశంలోని మొత్తం 47 మ్యూచువల్ ఫండ్ సంస్థల్లో.. డెట్ నిర్వహణ పెట్టుబడుల దృష్ట్యా జియో బ్లాక్‌రాక్ అస్సెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ 15వ స్థానంలో నిలిచినట్టు ప్రకటించింది.

డ్రోన్ మార్కెట్ @ రూ.2 లక్షల కోట్లు


2030 నాటికి చేరుకోవచ్చు

- నెక్స్‌జెన్ నివేదిక అంచనా
- సాగు, రక్షణ రంగాల నుంచి మద్దతు



న్యూఢిల్లీ: రక్షణ, వ్యవసాయం, లాజిస్టిక్స్, మౌలికం తదితర ఎన్నో రంగాల్లో డ్రోన్ల వినియోగంతో మంచి ఫలితాలు కనిపిస్తుండడంతో ఈ మార్కెట్ వచ్చే ఐదు సంవత్సరాల్లో గణనీయంగా వృద్ధి చెందనుందని నెక్స్‌జెన్ సంస్థ అంచనా వేసింది. 2030 నాటికి దేశీ డ్రోన్ తయారీ పరిమాణం 23 బిలియన్ డాలర్లకు (సుమారు రూ.1.96 లక్షల కోట్లు) చేరుకోవచ్చని పేర్కొంది. ఆధునిక యుద్ధ తంత్రాల్లో డ్రోన్లు కీలకంగా మారిన విషయాన్ని ప్రస్తావించింది. పహల్గాం ఉగ్రదాడి అనంతరం భారత్ నిర్వహించిన ఆపరేషన్ సిందూర్‌లో డ్రోన్ల వినియోగం స్పష్టమైన మార్పునకు నిదర్శనంగా పేర్కొంది. 15 పట్టణాలకు చెందిన 150 కంపెనీల అభిప్రాయాలను నెక్స్‌జెన్ తన సర్వేలో భాగంగా తెలుసుకుంది. ముఖ్యంగా వ్యవసాయం, కచ్చితమైన సాగు అవసరాలు 2030 నాటికి డ్రోన్ల డిమాండ్‌కు కీలకంగా నిలుస్తాయని 40 శాతం కంపెనీలు భావిస్తున్నాయి. ఆ తర్వాత రక్షణ రంగం నుంచి ఎక్కువ డిమాండ్ వస్తుందని పేర్కొన్నాయి. స్మార్ట్ సాగు రూపంలో వచ్చే ఐదేళ్లో గ్రామీణ వ్యవసాయంలో డ్రోన్లు బూమ్‌ను సృష్టిస్తాయని నమ్ముతున్నట్టు సర్వేలో 20 శాతం కంపెనీల ప్రతినిధుల తెలిపారు. లాజిస్టిక్స్ (వస్తు రవాణా), ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రంగాలు సైతం డ్రోన్ల తయారీకి చోదకంగా నిలుస్తాయని 15 శాతం కంపెనీలు అభిప్రాయపడ్డాయి.

ఢిల్లీలో అంతర్జాతీయ డ్రోన్స్ ప్రదర్శన



ఈ డిమాండ్‌కు మరింత మద్దతునిచ్చే చర్యల్లో భాగంగా ఈ నెల 31 నుంచి ఆగస్ట్ 1 వరకు ఢిల్లీలో అతిపెద్ద 'డ్రోన్ అంతర్జాతీయ ప్రదర్శన 2025' నిర్వహించనున్నట్టు నెక్స్‌జెన్ తెలిపింది. నెక్స్‌జెన్ ఎగ్జిబిషన్స్ దీన్ని నిర్వహిస్తుండడం గమనార్హం. రష్యా, తైవాన్, కెనడా, ఉక్రెయిన్, భారత్ సహా ఆరు దేశాలు తమ నూతన డ్రోన్ ఆవిష్కరణలను ఈ సందర్భంగా ప్రదర్శించనున్నట్టు వెల్లడించింది. అలాగే, 50కు పైగా అంతర్జాతీయ డ్రోన్ తయారీ సంస్థలు తమ ఉత్పత్తులను ప్రదర్శించనున్నట్టు తెలిపింది. ''ఆపరేషన్ సిందూర్ సమయంలో డ్రోన్లు చూపించిన అద్భుత సామర్థ్యాలను యావత్ ప్రపంచం గమనించింది. దేశీ తయారీ డ్రోన్లను ప్రోత్సహించడం 'భారత్‌లో తయారీ' కార్యక్రమాన్ని బలోపేతం చేస్తుందని, పలు రంగాల్లో దేశ శ్రేయస్సుకు మేలు చేస్తుందని భావిస్తున్నాను''అని నెక్స్‌జెన్ ఎగ్జిబిషన్స్ డైరెక్టర్ ఆధార్ బన్సాల్ తెలిపారు. వ్యవసాయంలో విత్తనాలు నాటడం, మందుల పిచికారీతోపాటు నిఘా, పంటల ఆరోగ్యం పరిశీలన సహా ఎన్నో రూపాల్లో డ్రోన్లు సేవలు అందిస్తుండడం గమనార్హం. అంతర్జాతీయంగా వ్యవసాయ డ్రోన్ల మార్కెట్ 2030 నాటికి చేరుకోవచ్చని 6 బిలియన్ డాలర్లకు చేరుకోవచ్చన్న అంచనాలను నెక్స్‌జెన్ నివేదిక ప్రస్తావించింది.

డెట్ సెక్యూరిటైజేషన్ మార్కెట్ రూ.49,000 కోట్లు

జూన్ త్రైమాసికంలో నమోదు



ముంబై: డెట్ సెక్యూరిటైజేషన్ పరిమాణం ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో (ఏప్రిల్–జూన్) రూ.49,000 కోట్లకు పెరిగింది. క్రితం ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో ఈ మొత్తం రూ.45,000 కోట్లుగా ఉంది. తమకు భవిష్యత్తులో రావాల్సిన రుణాలను సెక్యూరిటీల రూపంలో ఇతర సంస్థలకు కొంత తక్కువకు బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు విక్రయిస్తుంటాయి. దీన్ని డెట్ సెక్యూరిటైజేషన్‌గా చెబుతారు. జూన్ త్రైమాసికంలో డెట్ సెక్యూరిటైజేషన్ లావాదేవీల సంఖ్య 90గా ఉన్నట్టు క్రిసిల్ రేటింగ్స్ వెల్లడించింది. ఇందులో ఎన్‌బీఎఫ్‌సీలు నుంచే 92 శాతం ఉన్నాయి. క్రితం ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలోని మొత్తం డెట్ సెక్యూరిటైజేషన్‌లో ఎన్‌బీఎఫ్‌సీల వాటా 74 శాతంగా ఉండడం గమనార్హం. అంటే 24 శాతం పెరుగుదల కనిపించింది. వనరులను వైవిధ్యం చేసుకోవడంలో భాగంగా ప్రముఖ ఎన్‌బీఎఫ్‌సీలు సెక్యూరిటైజేషన్ మార్కెట్లో చురుగ్గా వ్యవహరించినట్టు క్రిసిల్ రేటింగ్స్ తెలిపింది. అదే చిన్న, మధ్య స్థాయి ఎన్‌బీఎఫ్‌సీల నుంచి డెట్ సెక్యూరిటైజేషన్ (సూక్ష్మ రుణాలు, వ్యక్తిగత రుణాలు) లావాదేవీలు మోస్తరుగానే ఉన్నాయని, ఆయా రుణ విభాగాల్లో అవి అప్రమత్తంగా ఉండడమే ఇందుకు కారణమని పేర్కొంది. బ్యాంకుల వైపు నుంచి కూడా ప్రముఖ బ్యాంకులు ఎక్కువగా పాల్గొన్నట్టు తెలిపింది.

శక్తి పంప్స్ నిధుల సమీకరణ


క్విప్ ద్వారా రూ. 293 కోట్లు



న్యూఢిల్లీ: సోలార్ పంపుల తయారీ కంపెనీ శక్తి పంప్స్ (ఇండియా) అర్హతగల సంస్థాగత ఇన్వెస్టర్లకు షేర్ల జారీ(క్విప్) ద్వారా రూ. 292.6 కోట్లు సమీకరించింది. షేరుకి రూ. 918 ధరలో 31.87 లక్షల షేర్లను కేటాయించింది. క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ నిబంధనల ప్రకారం ఫ్లోర్ ధర దాదాపు రూ. 966కాగా.. 5 శాతం డిస్కౌంట్‌లో షేర్లను జారీ చేసింది. నిధులను మధ్యప్రదేశ్‌లోని పిథంపూర్‌లో సోలర్ డీసీఆర్ సెల్, సోలార్ పీవీ మాడ్యూల్స్ తయారీ ప్లాంటు ఏర్పాటుకు వెచ్చించనుంది. అనుబంధ సంస్థ శక్తి ఎనర్జీ సొల్యూషన్స్ ద్వారా 2.2 గిగావాట్ల ఉత్పత్తి సామర్థ్యంతో ప్లాంటును నెలకొల్పనుంది. సోలార్ డీసీఆర్ సెల్స్‌ను సొంతంగా తయారు చేయడం ద్వారా బ్యాక్‌వార్డ్ ఇంటిగ్రేషన్‌కు తెరతీస్తోంది. దీంతో తయారీ వేల్యూ చైన్‌ను పటిష్టపరచుకోనుంది. కంపెనీ సోలార్ పంపులు, స్టెయిన్‌లెస్ స్టీల్ సబ్‌మెర్సిబుల్ పంపులు, ప్రెజర్ బూస్టర్ పంపులు, పంప్ మోటార్లు తదితర ప్రొడక్టులను రూపొందిస్తోంది. రెండు ప్లాంట్ల ద్వారా ఉమ్మడిగా ఏడాదికి 5,00,000 పంపుల తయారీ సామర్థ్యాన్ని కలిగి ఉంది.

స్మార్ట్‌వర్క్స్ స్పేసెస్ @ రూ. 387-407

- జులై 10–14 మధ్య పబ్లిక్ ఇష్యూ
- రూ. 583 కోట్ల సమీకరణకు రెడీ



న్యూఢిల్లీ: మేనేజ్‌డ్ క్యాంపస్‌లు, ఆఫీస్ సౌకర్యాలు కల్పించే స్మార్ట్‌వర్క్స్ కోవర్కింగ్ స్పేసెస్ పబ్లిక్ ఇష్యూ ఈ నెల 10న ప్రారంభంకానుంది. 14న ముగియనున్న ఇష్యూకి రూ. 387–407 ధరల శ్రేణిని తాజాగా ప్రకటించింది. యాంకర్ ఇన్వెస్టర్లకు ఈ నెల 9న షేర్లను కేటాయించనుంది. ఇష్యూలో భాగంగా రూ. 445 కోట్ల విలువైన ఈక్విటీని కొత్తగా జారీ చేయనుంది. అంతేకాకుండా మరో 33.79 లక్షల షేర్లను ప్రస్తుత ఇన్వెస్టర్లు ఆఫర్ చేయనున్నారు. తద్వారా రూ. 583 కోట్లు సమీకరించాలని ఆశిస్తోంది. అయితే తొలుత రూ. 550 కోట్ల విలువైన ఈక్విటీ జారీసహా.. 67.59 లక్షల షేర్లను విక్రయానికి ఉంచాలని కంపెనీ ప్రణాళికలు వేసింది. తాజా ప్రైస్‌బ్యాండ్ ప్రకారం కంపెనీ మార్కెట్ విలువ రూ. 4,645 కోట్లుగా నమోదుకానుంది. ఈక్విటీ జారీ నిధుల్లో రూ. 226 కోట్లు కొత్త కేంద్రాల ఏర్పాటుకు, రూ. 114 కోట్లు రుణ చెల్లింపులకు వెచ్చించనుంది. మిగిలిన నిధులను సాధారణ కార్పొరేట్ అవసరాలకు కేటాయించనుంది. కంపెనీ ప్రధాన ప్రాంతాలలో ఆధునిక సౌకర్యాలతో కూడిన టెక్నాలజీ ఆధారిత పూర్తిస్థాయి క్యాంపస్‌లను నెలకొల్పుతోంది. స్పోర్ట్స్ జోన్లు, కేఫ్‌టేరియాలు, జిమ్, మెడికల్ సెంటర్లతో కూడిన వర్క్ సెంటర్లను ఏర్పాటు చేస్తోంది.

పెన్షన్ పథకాలకు పీవోపీలుగా మ్యూచువల్ ఫండ్స్

నిబంధనలు సవరించనున్న సెబీ



న్యూఢిల్లీ: అస్సెట్ మేనేజ్‌మెంట్ కంపెనీలు (ఏఎంసీలు) లేదా వాటి సబ్సిడరీలు ఎన్‌పీఎస్ మాదిరి పెన్షన్ స్కీమ్‌లకు పాయింట్ ఆఫ్ ప్రెజెన్స్ (పీవోపీ) సేవలు అందించేందే దిశగా సెబీ కీలక ప్రతిపాదన చేసింది. అలాగే, ఏఎంసీలు తాము నిర్వహిస్తున్న ఫండ్స్‌కు సంబంధించి అంతర్జాతీయ డిస్ట్రిబ్యూటర్లు లేదా అడ్వైజర్లుగానూ సేవలు అందించొచ్చన్న ప్రతిపాదన తీసుకొచ్చింది. ప్రస్తుతం ఏఎంసీలు, వాటి సబ్సిడరీలు తాము నిర్వహిస్తున్న ఫండ్స్‌కు సంబంధించి మాత్రమే నిర్వహణ, అడ్వైజరీ సేవలు అందించేందుకు అనుమతి ఉంది. ఏఎంసీల సబ్సిడరీలు పెన్షన్ ఫండ్ మేనేజర్లుగా రిజిస్టర్ చేసుకోవడం ద్వారా.. పీవోపీ సేవలను ఆఫర్ చేస్తూ పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ (పీఎఫ్‌ఆర్‌డీఏ) నుంచి కొంత పరిహారం అందుకోవచ్చని సెబీ తన తాజా ప్రతిపాదనల్లో పేర్కొంది. అయితే, మ్యూచువల్ ఫండ్స్ ఇన్వెస్టర్ల ప్రయోజనాలకు విఘాతం కలగకుండా ఏఎంసీలు చూడాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. ఇప్పటి వరకు ఏఎంసీల సబ్సిడరీలు పెన్షన్ ఫండ్‌కు డైరెక్ట్ ప్లాన్ రూపంలోనే పీవోపీలుగా పనిచేసేందుకు అనుమతి ఉంది. దీనివల్ల పెన్షన్ ఫండ్ అడ్వైజరీ సేవలపై వాటికి ఎలాంటి కమీషన్ లభించడం లేదు. దీంతో సెబీ కొత్త ప్రతిపాదనలు తీసుకొచ్చింది. ఇక అంతర్జాతీయ ఇన్వెస్టర్లకు మ్యూచువల్ ఫండ్స్ సేవలతోపాటు ఇతర సేవలను సైతం ఏఎంసీలు ఆఫర్ చేసేందుకు సెబీ ప్రతిపాదించింది. వీటిపై ఈ నెల 28 వరకు ప్రజాభిప్రాయాలను సెబీ ఆహ్వానించింది.

స్కోడా 'గ్రూప్'లో బెంట్లీ



న్యూఢిల్లీ: భారత్‌లో స్కోడా ఆటో ఫోక్స్‌వ్యాగన్ ఇండియా (ఎస్ఏవీడబ్ల్యూఐపీఎల్) గొడుగు కిందికి మరో బ్రాండ్ వచ్చి చేరింది. బ్రిటన్‌కు చెందిన సూపర్ లగ్జరీ బ్రాండ్ బెంట్లీని ఆరో బ్రాండ్‌గా చేర్చుకున్నట్లు సంస్థ తెలిపింది. దీంతో ఇకపై బెంట్లీ వాహనాల దిగుమతులు, విక్రయం, సర్వీసింగ్ మొదలైనవన్నీ ఎస్ఏవీడబ్ల్యూఐపీఎల్ చేపడుతుంది. జూలై 1 నుంచి ఇది అమల్లోకి వచ్చింది. బెంట్లీ ఇండియా బ్రాండ్ డైరెక్టరుగా అబీ థామస్ నియమితులయ్యారు. భారత్‌లో పెరుగుతున్న అత్యంత సంపన్న వర్గాలకు(యూహెచ్ఎన్ఐ) ఈ డీల్‌తో ప్రయోజనం చేకూరుతుందని ఎస్ఏవీడబ్ల్యూఐపీఎల్ ఎండీ పీయుష్ ఆరోరా తెలిపారు.

ఎఫ్అండ్‌వోలో రిటైలర్లకు నష్టాలే..

- గతేడాది 91% రిటైల్ ఇన్వెస్టర్లు బేర్
- సెబీ తాజా నివేదికలో వెల్లడి



న్యూఢిల్లీ: గతేడాది(2024–25) ఈక్విటీ డెరివేటివ్స్‌లో అత్యధిక శాతం రిటైల్ ఇన్వెస్టర్లు నష్టపోయినట్లు క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ తాజాగా విడుదల చేసిన నివేదిక పేర్కొంది. అంత క్రితం ఏడాది నమోదైన రీతిలోనే డెరివేటివ్స్‌లో చిన్న ఇన్వెస్టర్లు భారీగా దెబ్బతిన్నట్లు తెలియజేసింది. ఈ విభాగంలో వ్యక్తిగత ఇన్వెస్టర్ల నికర నష్టాలు వార్షికంగా 41 శాతం పెరిగి రూ. 1,05,603 కోట్లను తాకినట్లు వెల్లడించింది. ఎఫ్అండ్‌వో విభాగంలో రిటైలర్లకు 2023–24లో రూ. 74,812 కోట్ల నష్టాలు నమోదైన సంగతి తెలిసిందే. ఈ బాటలో ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్ విభాగంలో లావాదేవీలు చేపట్టే వ్యక్తిగత ఇన్వెస్టర్ల సంఖ్య సైతం 20 శాతం తగ్గినట్లు నివేదిక తెలియజేసింది. అంతకుపూర్వం రెండేళ్లలో ఈ విభాగంలో లావాదేవీలు చేపట్టే ప్రత్యేక రిటైలర్ల సంఖ్య 24 శాతం పుంజుకోవడం గమనార్హం! ఈక్విటీ ఇండెక్స్ డెరివేటివ్స్ మార్గదర్శకాలను పటిష్టపరుస్తూ 2024 అక్టోబర్ 1 నుంచి కొత్త చర్యలు ప్రకటించాక ఈక్విటీ డెరివేటివ్ విభాగంలో లావాదేవీలపై సెబీ విశ్లేషణ చేపట్టింది. ఇందుకు 2024 డిసెంబర్ నుంచి 2025 మే వరకూ మొత్తం రిటైల్ ఇన్వెస్టర్ల వ్యక్తిగత లావాదేవీలను పరిగణనలోకి తీసుకుంది. మొత్తం రిటైల్ ట్రేడర్ల లాభనష్టాలను విశ్లేషించాక దాదాపు 91 శాతం మంది నష్టపోయినట్లు గుర్తించింది. 2024 బాటలోనే రిటైల్ ట్రేడర్లు భారీగా పెట్టుబడులను కోల్పోయినట్లు సెబీ నివేదిక వివరించింది.

నష్టాల తీరిలా: గత ఆరు నెలల కాలంలో ఇండెక్స్ ఆప్షన్స్ టర్నోవర్ ప్రీమియంలవారీగా చూస్తే వార్షికంగా 9 శాతం క్షీణించినట్లు సెబీ నివేదిక పేర్కొంది. నోషనల్‌గా మదింపు చేస్తే 29 శాతం తగ్గింది. అయితే రెండేళ్ల క్రితం పరిస్థితితో పోలిస్తే ఇండెక్స్ ఆప్షన్స్ పరిమాణం ప్రీమియంలవారీగా 14 శాతం పుంజుకుంది. నోషనల్‌గా 42 శాతం ఎగసింది. ఈక్విటీ డెరివేటివ్ విభాగంలో ప్రీమియంలవారీగా రిటైలర్ల టర్నోవర్ 11 శాతం క్షీణించింది. అయితే రెండేళ్ల క్రితం ఇదే కాలంలో 36 శాతం జంప్‌చేసింది. ఈ హెచ్చుతగ్గులు దేశీ మార్కెట్లో ఈక్విటీ డెరివేటివ్స్ విభాగంలో ప్రధానంగా ఇండెక్స్ ఆప్షన్స్‌లో అధిక లావాదేవీలను పట్టిచూపుతున్నట్లు నివేదిక ప్రస్తావించింది. ఇన్వెస్టర్ల పరిరక్షణ, మార్కెట్ నిలకడ యోచనతో ఇండెక్స్ ఆప్షన్స్‌లో లావాదేవీలు, టర్నోవర్‌ను పర్యవేక్షిస్తున్నట్లు సెబీ వివరించింది. ఈ బాటలోనే 2025 మే 29న రిస్కుల పర్యవేక్షణా విధానాలు తదితరాలకు సెబీ తెరతీసింది.

జేన్ స్ట్రీట్ లాంటి రిస్కులు పెద్దగా లేవు

సెబీ చైర్మన్ తుహిన్ కాంత పాండే



ముంబై: మార్కెట్లో కలకలం రేపిన హెడ్జ్ ఫండ్ జేన్ స్ట్రీట్ తరహా రిస్కులేమీ పెద్దగా కనిపించడం లేదని సెబీ చైర్మన్ తుహిన్ కాంత పాండే తెలిపారు. నిఘాపరమైన సవాళ్ల వల్లే ఈ ఉదంతం చోటు చేసుకుందని, ఈ నేపథ్యంలో సర్వైలెన్స్‌పై సెబీ మరింతగా దృష్టి పెడుతోందని ఆయన చెప్పారు. నియంత్రణాధికారాలకు లోబడే జేన్ స్ట్రీట్‌పై చర్యలు తీసుకున్నామని, అయితే నిఘా, నిబంధనలను పటిష్టంగా అమలు చేయడం ద్వారానే నేరాలకు పాల్పడే వారిని కట్టడి చేయడానికి వీలవుతుందని పాండే పేర్కొన్నారు. డెరివేటివ్స్ మార్కెట్లో రిటైల్ ఇన్వెస్టర్ల ప్రయోజనాలను పరిరక్షించేందుకు నియంత్రణ సంస్థ ఎలాంటి చర్యలు తీసుకున్నా అవి డేటా ఆధారితమైనవిగానే ఉంటాయని చెప్పారు. క్యాష్, డెరివేటివ్స్ విభాగాల్లో పొజిషన్లతో సూచీలను ప్రభావితం చేయడం ద్వారా రెండేళ్ల వ్యవధిలో అక్రమంగా ఆర్జించిన రూ. 4,800 కోట్ల మొత్తాన్ని ఎస్క్రో ఖాతాకు బదలాయించాలని ఆదేశిస్తూ, జేన్ స్ట్రీట్ గ్రూప్ సంస్థలు భారత మార్కెట్లో లావాదేవీలు జరపకుండా సెబీ నిషేధం విధించిన సంగతి తెలిసిందే.

పట్టుదల... పోరాటం... అద్భుతం



భారత మహిళల ఫుట్‌బాల్ జట్టు విజయగాథ

- ప్రతికూలతలను దాటి ఆసియా కప్ టోర్నీకి అర్హత
- సభ్యులందరి సమష్టి ఘనత

సాక్షి క్రీడా విభాగం

ఆసియా కప్‌లో ఆడకుండానే బరి నుంచి తప్పుకోవడం మొదలు ఇప్పుడు అర్హత సాధించడం వరకు భారత మహిళల ఫుట్‌బాల్ జట్టుకు ఎన్నో ఎదురుదెబ్బలు తగిలాయి. సరైన దిశా నిర్దేశం లేకుండా, అఖిల భారత ఫుట్‌బాల్ సమాఖ్య (ఏఐఎఫ్‌ఎఫ్) తమ బాధ్యతను మరిచి పట్టించుకోకపోవడంతో అనాథలా కనిపించింది. అసలు జాతీయ జట్టు ఉందనే విషయాన్ని కూడా అంతా మర్చిపోయారు. ఒకటా, రెండా ఎన్నో పరిణామాలు మహిళల ఫుట్‌బాల్ పతనానికి దారి తీశాయి. అండర్–17 జట్టు కోచ్‌పై లైంగిక వేధింపుల ఆరోపణలు, 'శాఫ్' టోర్నీ సెమీస్‌లో నేపాల్ చేతిలో పరాజయం, అండర్–17 వరల్డ్ కప్‌లో ఆడిన మూడు మ్యాచ్‌లలో ఓడి నిష్క్రమణ, ఆసియా క్రీడల్లో చివరి స్థానం, ఒలింపిక్ క్వాలిఫయర్స్‌లో ఆఖరి స్థానం, పేరుకే ఇండియన్ ఉమెన్ లీగ్ ఉన్నా కనీస సౌకర్యాలు కల్పించలేని ఫెడరేషన్... ఇలా మహిళల జట్టుకు సమస్యలు నిర్విరామంగా సాగుతూనే వచ్చాయి. ఇలాంటి స్థితి నుంచి పైకి లేచి మన టీమ్ ఆసియా కప్‌కు అర్హత సాధించడం చిన్న విషయమేమీ కాదు. నాలుగు మ్యాచ్‌లలో నాలుగూ గెలవడం అసాధారణ ప్రదర్శనగా చెప్పవచ్చు. ముఖ్యంగా కొంత మంది ప్లేయర్లకు వ్యక్తిగతంగా కూడా ఇది ఎంతో ప్రత్యేక ఘనత. అందుకే థాయ్‌లాండ్‌తో మ్యాచ్ గెలవగానే వారంతా కన్నీళ్లపర్యంతమయ్యారు. వారి భావోద్వేగాలను నిలువరించడం ఎవరి వల్లా కాలేదు.

వరుసగా కోచ్‌ల మార్పు...

భారత మహిళల జట్టుకు ఎదురైన ఇటీవలి అనుభవాలు చూస్తే టీమ్ ఎలా నడుస్తోందో అర్థమవుతుంది. సంవత్సరాల తరపడి స్వయంగా ఫెడరేషన్ నిర్వహించే లీగ్‌లో కూడా ఆట జరుగుతుందా లేదా అనే సందేహాలు, జాతీయ శిబిరానికి వెళ్లినా తర్వాతి రోజు కోచ్ వస్తాడా లేదా అనుమానం, అసలు మహిళలుగా తమకు కనీస భద్రత కూడా ఉంటుందా లేదా అని పరిస్థితిని వారు దాటుకుంటూ వచ్చారు. ఏఐఎఫ్‌ఎఫ్ వరుసగా కోచ్‌లను మారుస్తూ పోయింది. డెనర్‌బై, సురేశ్ ఛెత్రి, ఛోబా దేవి, సంతోష్ కశ్యప్, జోకిమ్ అలెగ్జాండర్సన్... ఇలా కోచ్‌లు రావడం, పోవడం జరిగిపోయాయి. చివరకు క్రిస్పిన్ ఛెత్రి చేతుల్లోకి కోచింగ్ బాధ్యతలు వచ్చాయి. అతనికి అసిస్టెంట్‌గా పీవీ ప్రియను తీసుకున్నారు. ఆసియా కప్ కోసం మన జట్టు థాయ్‌లాండ్‌లో అడుగు పెట్టినప్పుడు కూడా ఎలాంటి అంచనాలు లేవు. 2022లో కోవిడ్ కారణంగా టోర్నీకి దూరమైన జట్టులో ఉన్నవారిలో చాలామంది ఈ సారి కూడా టీమ్‌లో ఉన్నారు.

జనవరి 2022... ఆతిథ్య దేశం హోదాలో భారత మహిళల ఫుట్‌బాల్ జట్టు ఆసియా కప్‌లో తొలి మ్యాచ్ ఆడేందుకు సిద్ధమైంది. అయితే ఒక్కసారిగా ప్రపంచాన్ని తలకిందులు చేసిన కోవిడ్ మహమ్మారి ప్రభావం ఈ జట్టుపై కూడా పడింది. చైనీస్ తైపీతో తొలి మ్యాచ్ సమయానికి కోవిడ్ కారణంగా మన జట్టుకు కనీసం 13 మంది ప్లేయర్లు కూడా అందుబాటులో లేకుండా పోయారు. దాంతో నిబంధనల ప్రకారం మొదటి మ్యాచ్ నుంచే కాకుండా మొత్తం టోర్నీ నుంచి టీమ్ తప్పుకోవాల్సి వచ్చింది. క్వాలిఫయింగ్ పోటీలు లేని సమయంలో 2003లో చివరిసారిగా ఆసియా కప్‌కు నేరుగా అర్హత సాధించిన మన జట్టు ఈసారి ఎంతో ఉత్సాహంతో, పట్టుదలతో సొంతగడ్డపై ఆసియా కప్‌కు సన్నద్ధమైంది. అయితే అనూహ్య పరిణామాలు ఎదురు కావడం మన మహిళలకు ఇది తీరని వేదన మిగిల్చింది. ఇప్పుడు మూడున్నరేళ్ల తర్వాత క్వాలిఫయింగ్ టోర్నీలో సత్తా చాటి మన మహిళలు దర్జాగా ఆసియా కప్‌కు అర్హత సాధించారు. అయితే గత టోర్నీ, ప్రస్తుత క్వాలిఫికేషన్‌కు మధ్య ఎంతో పోరాటం ఉంది. సవాళ్లు, ప్రతికూలతలు అధిగమించి అమ్మాయిలు సాధించిన ఈ గెలుపునకు ఎంతో ప్రత్యేకత ఉంది.

నాటి గాయం వారి మనసుల్లో ఇంకా మిగిలే ఉంది. కోచ్‌పై లైంగిక వేధింపుల ఆరోపణ వివాదం వచ్చినప్పుడు అండర్–17 టీమ్‌లో భాగమైన హేమమ్ షిల్కీ దేవి, లిండా కోమ్, మార్టినా తోక్‌చోమ్ ఇప్పుడు సీనియర్ టీమ్‌లో ఉన్నారు. పురుషుల ఫుట్‌బాల్ జట్టు చిత్తుగా ఓడిన సందర్భాల్లోనూ వార్తల్లో ఉంటుండగా... మహిళల టీమ్‌ను అసలు ఎవరూ పట్టించుకున్న పాపాన పోలేదు. ఇలాంటి స్థితిలో వారు తమ పోరాటాన్ని మొదలు పెట్టారు.

పటిష్ట ప్రత్యర్థిని పడగొట్టి...

మంగోలియాపై 13–0తో, తిమోర్ లెస్టెపై 4–0తో, ఆపై ఇరాక్‌పై 5–0తో ఘన విజయం... అంచనాలకు భిన్నంగా చక్కటి ప్రదర్శనతో మన మహిళలు వరుసగా మూడు విజయాలు సాధించారు. అయితే సరే ఆసియా కప్ క్వాలిఫికేషన్‌పై ఇంకా సందేహాలు ఉన్నాయి. ఎందుకంటే చివరి లీగ్‌లో ఆతిథ్య థాయ్‌లాండ్ ప్రత్యర్థిగా ఎదురైంది. 'ఫిఫా' ర్యాంకింగ్స్‌లో మనకంటే ఎంతో ముందుండటం మాత్రమే కాదు, ఈ టీమ్ గత రెండు 'ఫిఫా' వరల్డ్ కప్‌లు కూడా ఆడింది. పైగా పెద్ద సంఖ్యలో విదేశీ ఆటగాళ్లు ఉండటంతో పాటు ప్రముఖ జపాన్ కోచ్ ఫుటోషీ ఐకెడా కోచింగ్ ఇస్తున్నాడు. మనకంటే బలమైన థాయ్‌లాండ్ జట్టు ఆరంభంలోనే దూకుడుగా ఆడి గోల్‌పోస్ట్‌పై దాడులు చేస్తూ ఆధిపత్యం ప్రదర్శించింది. అయితే భారత్ పదునైన డిఫెన్స్‌తో వాటిని నిలువరించగలిగింది. తాము ఇంత కాలంగా పడిన ఆవేదన, చేసిన పోరాటం వారిలో ఒక్కసారిగా స్ఫూర్తి నింపినట్లుంది. అంతే... ఆ తర్వాత జట్టులో ఒక్కసారిగా కొత్త ఉత్సాహం వచ్చింది. ప్రత్యర్థి ఎవరనేది పట్టించుకోకుండా చివరి వరకు పట్టు విడవకుండా చెలరేగిన జట్టు విజయాన్ని అందుకుంది.

అన్ని రకాలుగా సన్నద్ధమై...



మ్యాచ్ ముగిశాక సంగీత బస్‌ఫోర్ ఆనందానికి హద్దుల్లేవు. రెండు గోల్స్‌తో ఆమె ఈ చిరస్మరణీయ విజయంలో కీలక పాత్ర పోషించింది. కోవిడ్ కారణంగా 2022 ఆసియా కప్‌కు జట్టుకు దూరంగా కాగా, అంతకుముందే గాయంతో సంగీత టోర్నీ నుంచి తప్పుకుంది. 2019 నుంచి జట్టులో ప్రధాన సభ్యురాలిగా ఉన్న ఆమె ఆపై కోలుకోవడానికి ఏడాది పట్టింది. అదే సమయంలో ఆమె తండ్రిని కూడా కోల్పోయింది. సీనియర్ ప్లేయర్ అయిన తనకు భవిష్యత్తులో మళ్లీ ఎప్పుడు ఈ స్థాయిలో విజయానందం వరిస్తుందో అంటూ ఆమె ఆనందభాష్పాలు రాల్చింది. టోర్నీకి ముందు తమదైన రీతిలో ప్లేయర్లు సన్నద్ధమయ్యారు. మనీషా కళ్యాణ్, జ్యోతి చౌహాన్, తెలంగాణ ప్లేయర్ గుగులోత్ సౌమ్య యూరోపియన్ క్లబ్స్ ట్రయల్స్‌కు వెళ్లి కాంట్రాక్ట్‌లు పొంది తమ ఆటకు పదును పెట్టారు. మిగిలిన వారు ఐ–లీగ్‌లో బరిలోకి దిగి సాధ్యమైనంత ఎక్కువగా ప్రాక్టీస్‌పై దృష్టి పెట్టారు. ఈ విజయం కచ్చితంగా ఏఐఎఫ్‌ఎఫ్‌ది మాత్రం కాదు. తమ శక్తి, స్వేదం, కన్నీళ్లు ధారబోసిన 23 మంది మహిళా ఫుట్‌బాలర్లదే. వచ్చే ఏడాది ఆసియాకప్‌లో కూడా ఇదే రీతిలో సత్తా చాటితే వరల్డ్ కప్‌లో పాల్గొనే స్వప్నం కూడా సాకారమవుతుంది.

బాధపడకు తమ్ముడు... దేశం కోసం బాగా ఆడు

- ఆకాశ్‌కు అక్క జ్యోతి ఓదార్పు
- అతనొక ఫ్యామిలీ మ్యాన్



లక్నో: భారత పేసర్ ఆకాశ్‌దీప్ విజయవంతమైన బౌలింగ్ ప్రదర్శన పట్ల సంతోషం వ్యక్తం చేసిన అతని సోదరి అఖండ్ జ్యోతి సింగ్ భావోద్వేగానికి గురైంది. క్యాన్సర్‌తో పోరాడుతున్న జ్యోతికి పది వికెట్ల ప్రదర్శన అంకితమిస్తున్నట్లు మ్యాచ్ ముగిసిన అనంతరం ఆకాశ్‌దీప్ వ్యాఖ్యానించాడు. దీనిపై ఓ జాతీయ వార్తా చానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో స్పందించిన జ్యోతి తన సోదరుడికి తన అనారోగ్యంపై చింతించకుండా దేశం కోసం శ్రమించాలని చెప్పినట్లు వెల్లడించింది. క్యాన్సర్ బారిన పడటంతో తన కుటుంబానికి దూరమైన ఆనందాన్ని ఆకాశ్‌దీప్ తన ఆటతీరు ద్వారా తిరిగి తీసుకొచ్చాడని సంతోషం వ్యక్తం చేసింది.


తమ్ముడు ఆకాశ్‌దీప్‌తో అఖండ్ జ్యోతి

తమ కుటుంబాన్ని 2015 ఏడాది పెను విషాదంలో ముంచిందని... మళ్లీ ఇన్నాళ్లకు ఆనందం వెల్లివిరిసిందని జ్యోతి చెప్పింది. 'మా నాన్న చనిపోయినపుడు ఆకాశ్ ఢిల్లీలో క్లబ్ క్రికెట్ ఆడుతున్నాడు. అయితే ఆశించిన ఎదుగుదల రాలేదు. దీంతో నేను గట్టిగా చెప్పాను. క్రికెట్‌ను సీరియస్‌గా తీసుకుంటేనే రాణిస్తావని చెప్పా. ఇక్కడ కుదరకపోతే మరో చోటయినా ప్రయత్నించాలని సూచించాను. దీంతో 2017లో కోల్‌కతాకు మారాక బెంగాల్ అండర్–23 జట్టు తరఫున నిలకడగా రాణించడం మొదలుపెట్టాడు. ఒకే ఏడాది తండ్రి, ఓ తమ్ముడు మరణించడంతో మా కుటుంబాన్ని ఆర్థిక కష్టాలు చుట్టుముట్టాయి. అయినా సరే దేనికి దిగులు చెందక ఆకాశ్ లక్ష్యాన్ని చేరుకునేందుకు మా వంతు ప్రయత్నం మేం చేశాం' అని జ్యోతి వివరించింది.

జబ్బు గురించి చెప్పాలనుకోలేదు

ఈ మ్యాచ్‌ను మేమంతా చూశాం. వికెట్ తీసిన ప్రతీసారి గట్టిగా చప్పట్లతో సంబరం చేసుకున్నాం. దీంతో ఇరుగు పొరుగువారు వచ్చి ఏమైందని అడిగి వెళ్లిపోయారు. దేశానికి విజయాన్నిచ్చిన అతని ప్రదర్శన మాకైతే పండగను తెచ్చింది. ఇక మీడియాలో నా జబ్బు సంగతి చెప్పినట్లు మొదట తెలియదు. ఎందుకంటే నా క్యాన్సర్ గురించి బయటికి వెల్లడించేందుకు మా కుటుంబం సిద్ధంగా లేదు. బహుశా నాపై అప్యాయత కొద్దీ ఆ క్షణం భావోద్వేగానికి గురై అక్కకు అంకితం చేస్తున్నానని చెప్పి ఉండొచ్చు. నేనన్నా... కుటుంబమన్నా అతనికి వల్లమాలిన ప్రేమ. నాకిప్పుడు క్యాన్సర్ మూడో దశలో ఉంది. ఇంకో ఆర్నెళ్ల చికిత్స అవసరమని వైద్యులు చెప్పారు. ఆ తర్వాతే ఎమవుతుందో చూడాలి.

ఐపీఎల్ సమయంలో హాస్పిటల్‌కు...

ఐపీఎల్‌లో లక్నో సూపర్ జెయింట్స్‌కు ప్రాతినిధ్యం వహించే ఆకాశ్ లీగ్ జరిగే సమయంలో పది వేదికలు మార్చి మార్చి ఆడే అంతటి బిజీ షెడ్యూల్‌లోనూ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నన్ను పరామర్శించేందుకు మ్యాచ్ ముందో, తర్వాతో తప్పకుండా వచ్చేవాడు. ఎడ్జ్‌బాస్టన్ వేదికపై విజయం సాధించాక రెండుసార్లు వీడియో కాల్‌లో మాట్లాడుకున్నాం. అప్పుడు అతను నాతో అక్క ఏమాత్రం బాధపడకు. దేశం మొత్తం మనవెంటే ఉందని చెప్పడంతో ఆ క్షణం నన్ను నేను నియంత్రించుకోలేక భావోద్వేగానికి గురై ఏడ్చేశాను. నిజం చెబుతున్నా... ఇలాంటి తమ్ముడు చాలా అరుదుగా ఉంటాడు. మాకెప్పుడు అండగా ఉంటాడు. మాకు చెప్పందే ఏదీ చేయడు. ప్రతి విషయాన్ని కుటుంబంతో పంచుకుంటాడు. ఆర్నెళ్ల వ్యవధిలోనే మా నాన్న, ఒక సోదరుడు మరణించడంతో కుటుంబభారాన్ని ఆకాశే అన్నీ తానై మోస్తున్నాడు.

ఆకాశమంత ధైర్యం

నేను క్యాన్సర్ చికిత్స తీసుకుంటున్నప్పుడు ఆకాశ్ మాటలే నా స్థయిర్యాన్ని పెంచేవి. నా ఆరోగ్యం గురించే ఆలోచించేవాడు. అప్పుడు నేను అతని దృష్టి ఆటపైనే కేంద్రీకరించేందుకు ధైర్యం చెప్పేదాన్ని. 'నేనిప్పుడు బాగానే ఉన్నాను. నా కోసం బాధపడొద్దు. నాకు తోడుగా నా భర్త ఉన్నాడు. నీవేం విచారించకు' అని చెబితే... వెంటనే కల్పించుకొని తానేం చేసినా, సాధించినా సోదరిల కోసం, కుటుంబం కోసమే అని బదులిచ్చాడు. మా తల్లిదండ్రులకు మేం ఆరుగురు సంతానం. ముగ్గురు అబ్బాయిలు, ముగ్గురు అమ్మాయిలం. ఆకాశ్ అందరికంటే చిన్నవాడు. నేను తనకంటే పదేళ్లు పెద్ద. చిన్నప్పటి నుంచి కూడా మా ఇద్దరి మధ్య అప్యాయత ఎక్కువే. మ్యాచ్‌కు ముందు, తర్వాత నాకు వీడియో కాల్ చేసి మాట్లాడతాడు. నేను తీసిన ఈ వికెట్లు నీ కోసం, దేశం కోసం' అని గర్వంగా చెబుతాడు.

రాగానే దహీ వడ తినిపిస్తా

ఇంగ్లండ్ నుంచి స్వదేశానికి రాగానే ఆకాశ్ దీప్‌కు ఇష్టమైన వంట చేసి పెడతా. తనకిష్టమైనవే కాదు... తను ఏం కావాలన్నా సరే వండిపెడతా. నేను చేసే దహీ వడ అంటే అతనికెంతో ఇష్టం. ఆకుకూరలతో చేసిన వంటకాలను ఇష్టంగా తింటాడు. మా ఇంటికి ఎప్పుడొచ్చినా అవే చేసిపెట్టాలంటాడు.

యువ భారత్ ఓటమి


వైభవ్ సూర్యవంశీ

వార్సెస్టర్: భారత అండర్–19 జట్టు వన్డే సిరీస్‌ను పరాజయంతో ముగించింది. ఐదు మ్యాచ్‌ల పోరులో భాగంగా జరిగిన చివరి మ్యాచ్‌లో ఇంగ్లండ్ అండర్–19 టీమ్ 7 వికెట్ల తేడాతో భారత్‌పై ఘన విజయం సాధించింది. అయితే సిరీస్ 3–2తో భారత్ ఖాతాలో జరిగింది. సోమవారం జరిగిన ఐదో వన్డేలో టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 210 పరుగులు చేసింది. ఆర్ఎస్ అంబరీశ్ (81 బంతుల్లో 66 నాటౌట్; 6 ఫోర్లు) అర్ధసెంచరీ చేయగా... వైభవ్ సూర్యవంశీ (42 బంతుల్లో 33; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) ఫర్వాలేదనిపించాడు. అనంతరం ఇంగ్లండ్ 31.1 ఓవర్లలోనే 3 వికెట్లకు 211 పరుగులు చేసి విజయాన్నందుకుంది. బెన్ మాయెస్ (76 బంతుల్లో 82 నాటౌట్; 11 ఫోర్లు, 1 సిక్స్), బీజే డాకిన్స్ (53 బంతుల్లో 66; 9 ఫోర్లు, 3 సిక్స్‌లు), కెప్టెన్ థామస్ ర్యూ (37 బంతుల్లో 49 నాటౌట్; 7 ఫోర్లు, 1 సిక్స్) దూకుడుగా ఆడి జట్టును గెలిపించారు.

యూకీ జోడీ పరాజయం



లండన్: వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో భారత టెన్నిస్ క్రీడాకారుల పోరాటం ముగిసింది. పురుషుల డబుల్స్‌లో యూకీ బాంబ్రీ (భారత్)–రాబర్ట్ గాలోవే (అమెరికా) ద్వయం ప్రిక్వార్టర్ ఫైనల్లో 4–6, 6–3, 7–6 (10/4)తో గ్రానోలెర్స్ (స్పెయిన్)–జెబలాస్ (అర్జెంటీనా) జోడీ చేతిలో ఓడిపోయింది. యూకీ–గాలోవే జోడీకి 43,750 పౌండ్లు (రూ. 51 లక్షల 19 వేలు) ప్రైజ్‌మనీగా లభించాయి.

మహారాష్ట్ర జట్టులో చేరిన పృథ్వీషా



ముంబై: భారత బ్యాటర్ పృథ్వీ షా దేశవాళీ క్రికెట్‌లో మహారాష్ట్ర తరఫున బరిలోకి దిగేందుకు సిద్ధమయ్యాడు. ముంబై సంచలనంగా టీమిండియాకు ప్రాతినిధ్యం వహించిన పృథ్వీ షా కొన్నాళ్లకే క్రమశిక్షణ, బాధ్యతారాహిత్యం, ఫిట్‌నెస్ సమస్యలతో జాతీయ జట్టుకు తర్వాత ఐపీఎల్ ఫ్రాంచైజీలకు తాజాగా ఇప్పుడు ముంబై జట్టుకు దూరమయ్యాడు. ఆటతీరు, ఫిట్‌నెస్‌పై ఏమాత్రం శ్రద్ధ పెట్టకపోవడంతో ముంబై గత సీజన్‌లో పట్టించుకోకపోవడంతో గతనెల జట్టు మారేందుకు ముంబై క్రికెట్ సంఘం (ఎంసీఏ) నుంచి నిరభ్యంతర పత్రం (ఎన్‌ఓసీ) తీసుకున్నాడు. ముందే మహారాష్ట్రతో సంప్రదింపులు జరిపిన పృథ్వీ షా ఈ సీజన్‌కు అందుబాటులో ఉండేందుకు ఆసక్తి చూపించాడు. 'అంతర్జాతీయ క్రికెటర్, భారత జట్టులో టాపార్డర్ బ్యాటర్‌గా ఆడిన పృథ్వీ షా అధికారికంగా ముంబై జట్టును వీడి ఈ సీజన్‌లో మహారాష్ట్ర క్రికెట్ సంఘం జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తాడు' అని మహారాష్ట్ర సంఘం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ మార్పుతో భారత దేశవాళీ క్రికెట్‌లో మహారాష్ట్ర పటిష్ట జట్టుగా తయారయ్యేందుకు దోహదం చేస్తుందని, అంతర్జాతీయ క్రికెట్‌లో మూడు ఫార్మాట్లు ఆడిన అనుభవమున్న క్రికెటర్ తమ జట్టుకు అందుబాటులో ఉండటం ముమ్మాటికి తమకు కలిసివచ్చే అంశమే అవుతుందని అందులో పేర్కొంది. క్రికెటర్ పృథ్వీ షా మాట్లాడుతూ 'ఈ దశలో తాజా మార్పు నా కెరీర్‌కు ఎంతగానో తోడ్పాటు అందిస్తుందని ఆశిస్తున్నా. మహారాష్ట్ర జట్టు క్రికెటర్‌గా ఉన్నత శిఖరాలు అందుకునేందుకు ఎప్పట్లాగే శ్రమిస్తాను. టీనేజ్ నుంచి ఇప్పటివరకు ఎంతగానో అండగా నిలిచిన ముంబై క్రికెట్ సంఘానికి నా కృతజ్ఞతలు. నా క్రికెట్ ప్రయాణానికి అండగా నిలిచిన ముంబైకి, ఇకపై నిలవబోతున్న మహారాష్ట్రకు నేను ఎప్పటికీ రుణపడే ఉంటాను' అని అన్నాడు. 25 ఏళ్ల పృథ్వీ షా భారత్ తరఫున 5 టెస్టులు ఆడి 339 పరుగులు, 5 వన్డేలు ఆడి 189 పరుగులు, ఒక టి20 ఆడి డకౌట్ అయ్యాడు.

రెండో రౌండ్‌లో వంతిక అగర్వాల్



బతూమి (జార్జియా): మహిళల ప్రపంచ కప్ నాకౌట్ చెస్ టోర్నమెంట్‌లో భారత క్రీడాకారిణులకు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. వంతిక అగర్వాల్, పద్మిని రౌత్, పీవీ నందిత రెండో రౌండ్‌లోకి ప్రవేశించగా... కిరణ్ మనీషా మొహంతి తొలి రౌండ్‌లోనే నిష్క్రమించింది. కె.ప్రియాంక భవిత్యం నేడు జరిగే టైబ్రేక్ గేమ్‌లలో తేలనుంది. తొలి రౌండ్‌లో వంతిక 1.5–0.5తో లాలా షాహోర్దోవా (తుర్క్‌మెనిస్తాన్)పై, పద్మిని 2–0తో జాంగ్ లాన్‌లిన్ (చైనా)పై, నందిత 2–0తో ఒరిట్జ్ అనాహి (ఈక్వెడార్)పై గెలుపొందారు. కిరణ్ మనీషా 0.5–1.5తో సాంగ్ యుజిన్ (చైనా) చేతిలో ఓడిపోయింది. తొలి రౌండ్‌లోని రెండు గేమ్‌లు ముగిశాక ప్రియాంక–గాల్ జొసోకా (హంగేరి) 1–1తో సమంగా నిలిచారు. షాహోర్దోవాతో ఆదివారం తొలి గేమ్‌ను 'డ్రా' చేసుకున్న వంతిక సోమవారం జరిగే రెండో గేమ్‌లో 29 ఎత్తుల్లో నెగ్గింది. జాంగ్ లాన్‌లిన్‌పై తొలి గేమ్‌లో గెలిచిన పద్మిని సోమవారం జరిగిన రెండో గేమ్‌లో 34 ఎత్తుల్లో... అనాహిపై తొలి గేమ్‌లో నెగ్గిన నందిత రెండో గేమ్‌లో 64 ఎత్తుల్లో విజయం అందుకున్నారు. సాంగ్ యుజిన్ చేతిలో తొలి గేమ్‌లో ఓడిపోయిన మనీషా రెండో గేమ్‌ను 30 ఎత్తుల్లో 'డ్రా' చేసుకొని ఇంటిదారి పట్టింది.


ఉత్తరాఖండ్‌లోని హరిద్వార్‌లో వార్షిక కావడి యాత్ర సందర్భంగా సోమవారం శివుడి పూజ కోసం గంగా జలాలను తీసుకొస్తున్న భక్తులు


లద్దాఖ్‌లోని లేహ్ శివారులో హెమిస్ ఆశ్రమంలో ఉత్సవ దుస్తుల్లో సంప్రదాయ నాట్యం చేస్తున్న బౌద్ధ సన్యాసులు


ఇండోనేసియాలో బాలి దీవిలో తమన్ ఆయున్ ఆలయంలో జరిగే వేడుకకు తలపై నైవేద్యాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు


స్పెయిన్‌లోని పంప్లోనాలో 'బుల్ రన్నింగ్ వేడుక' సందర్భంగా ప్రధాన కూడలి వద్ద వేలాదిగా గుమిగూడిన జనం

బ్యాంకులోకి చేరిన వరద.. జనం కాపలా

సిమ్లా: హిమాచల్ ప్రదేశ్‌లో భారీ వర్షాలు కురుస్తుండటం తెల్సిందే. మండి జిల్లాలోని థునాగ్ పట్టణంలోని రాష్ట్ర సహకార బ్యాంకు కార్యాలయంలోకి వరద నీరు చేరింది. రెండంతస్తుల ఈ భవనం మొదటి అంతస్తు వరద, చెత్తాచెదారంతో నిండిపోయింది. వరద తీవ్రతకు బ్యాంకు షట్టర్ ఒకటి ఊడిపోగా మరో రెండు షట్టర్లు వంకర్లు తిరిగి ఊడిపడేందుకు సిద్ధంగా ఉన్నాయి. బ్యాంకులో ఖాతాదార్లు తాకట్టు పెట్టిన, లాకర్లలో భద్రంగా ఉంటుందని భావించిన లక్షలాది రూపాయల విలువైన నగలు, విలువైన పత్రాలు, కోట్లాది రూపాయల డబ్బు ఉన్నట్లు సమాచారం. అయితే, నష్టం వివరాలు వెల్లడికాలేదు. చెత్తాచెదారం, వ్యర్థాలను తొలగించిన తర్వాతే నష్టాన్ని అంచనా వేసేందుకు వీలుంటుందని చెబుతున్నారు. థునాగ్ మార్కెట్ ప్రాంతంలో ఉన్న ఈ బ్యాంకులో నిత్యం 150 మంది వరకు వ్యాపారులు లావాదేవీలు జరుపుతుంటారు. ఎనిమిదివేల జనాభా కలిగిన థునాగ్ పట్టణంలో బ్యాంకు ఇదొక్కటే. వరదల కారణంగా కొట్టుకువచ్చిన విలువైన వస్తువులను ఎవరైనా ఎత్తుకుపోయే ప్రమాదముందని భావిస్తున్న స్థానికులు నిత్యం కాపలా కాస్తున్నారు. జూన్ 20–జూలై 6వ తేదీల మధ్య హిమాచల్‌లో భారీ వర్షాలకు తీవ్ర నష్టం వాటిల్లింది.

శాంతంగా ఉండండి

ఎవరికీ బీపీ తెప్పించకండి.. షుగర్ స్థాయిలు పెంచకండి
- కోర్టుల్లో కోపం ప్రదర్శించే జడ్జీలకు సీజేఐ గవాయ్ సూచన
- బాంబే హైకోర్టు లైవ్–స్ట్రీమింగ్ ప్రారంభోత్సవంలో ప్రసంగం

ముంబై: న్యాయస్థానాల్లో వాడీవేడీగా వాదనలు జరుగుతుంటే సంయమనంతో ఉండాల్సిన న్యాయమూర్తులు సైతం పట్టరాని ఆవేశంతో లాయర్లపై విరుచుకుపడుతున్నారని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్ వ్యాఖ్యానించారు. ఇలాంటి ఆవేశాలు కోర్టుల్లో ప్రశాంత పనివాతావరణాన్ని పాడుచేస్తాయని ఆయన వ్యాఖ్యానించారు. ముంబైలో బాంబే హైకోర్టులో కేసుల వాదోపవాదనల ప్రత్యక్ష ప్రసారాల సదుపాయాన్ని అందుబాటులోకి తెచ్చే కార్యక్రమాన్ని సీజేఐ గవాయ్ ప్రారంభించి తర్వాత ప్రసంగించారు. ''బాంబే హైకోర్టులో న్యాయమూర్తులు వెలువర్చిన ఎన్నో తీర్పులను చూసి గర్వపడ్డా. తీర్పులను చాలా చక్కగా రాశారు. అయితే ఈ హైకోర్టు జడ్జీలపై కొన్ని అభ్యంతరాలు సైతం వ్యక్తమవుతున్నాయి. కొందరు న్యాయమూర్తులు కోపాన్ని నియంత్రించుకోలేక కోర్టుల్లోనే తిట్టేస్తున్నట్లు నాకు సమాచారం అందింది. న్యాయమూర్తిగా పనిచేయడం అనేది మిగతా ఉద్యోగాల మాదిరి ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం ఐదింటి వరకు పనిచేసేది కాదు. సమాజం, దేశం కోసం చేసే అత్యుత్తమమైన సేవల్లో ఇదీ ఒకటి. ఇందుకు అంకితభావం, నిబద్ధత చాలా అవసరం. అయితే కొందరు జడ్జీలు తరచూ లాయర్లతో మర్యాదలేకుండా, పరుష పదజాలం ఉపయోగిస్తూ తిడుతున్నట్లు కనిపిస్తోంది. తరచూ లాయర్లకు, కొందరు ఉన్నతాధికారులకు సమన్లు జారీచేస్తున్నారు. అనవసరంగా సమన్లు జారీచేయడం వల్ల పెద్దగా ఒరిగేదేమీ ఉండదు. జడ్జీలు ప్రశాంతంగా ఉంటే కోర్టుహాల్‌లో వాతావరణం హుందాగా ఉంటుంది. అలాంటప్పుడే లాయర్లుసహా అక్కడ ఉండేవాళ్లందరి రక్తపోటు, చక్కెర స్థాయిలు సాధారణ స్థాయిలో ఉంటాయి. ఇది న్యాయమూర్తులకూ వర్తిస్తుంది''అని అనగానే అక్కడ ఉన్నవారంతా ఫక్కున నవ్వారు.

పార్ట్‌టైమ్ జడ్జీల్లా తయారయ్యారు

''కొందరు జడ్జీలు రోజువారీ విధులను సంపూర్ణంగా చేయకుండా మధ్యలోనే వదిలేస్తున్నారు. ఇలాంటి పార్ట్‌టైమ్ జడ్జీలతో సమస్యే. కొన్ని ధర్మాసనాల్లో కొందరు జడ్జీల వైఖరిపై నాకు పక్కా సమాచారం అందింది. పేర్లు వెల్లడించనుగానీ వాళ్లు కోర్టు మొదటి సెషన్‌లో కొద్దిసేపు, తర్వాతి సెషన్‌లో కొద్దిసేపు అలా ధర్మాసనంపై కూర్చుని వెళ్లిపోతున్నారు. ఇలాంటి పార్ట్‌టైమ్ జడ్జీల వైఖరి మంచిది కాదు. సమాజానికి, దేశానికి సేవచేస్తామని జడ్జీగా ప్రమాణంచేశాక ఇలాంటి ధోరణి ప్రదర్శించడం ఆ ప్రమాణాన్ని చిన్నచూపు చూడటమే అవుతుంది. ఇలాంటి చర్యలతో న్యాయస్థానాలకు చెడ్డపేరు తీసుకురావొద్దు. ఎంతో మంది గొప్ప న్యాయమూర్తులు, లాయర్లు అంకితభావం, కృషితో సమున్నత స్థాయికి చేరిన న్యాయస్థానాల ఘనకీర్తికి మచ్చ తీసుకురాకండి''అని హితవు పలికారు.


జస్టిస్ గవాయ్

కాలానుగుణంగా చట్టాలను అన్వయించుకోవాలి

విస్తృతస్థాయిలో రాజ్యాంగ సవరణ అధికారం పార్లమెంట్‌కు ఉందంటూ ఇటీవల చర్చ జరుగుతున్న నేపథ్యంలో ఆ అంశంపై సీజేఐ మాట్లాడారు. ''రాజ్యాంగంలో సమూలస్థాయిలో మార్పులు చేయాలన్న వాదనలు ఎక్కువయ్యాయి. వాస్తవానికి రాజ్యాంగం అనేది సజీవ పత్రం. మారుతున్న కాలానుగుణంగా, సమాజ అవసరాలకు తగ్గట్లుగా పార్లమెంట్ రాజ్యాంగంలో మార్పులు చేయొచ్చు. సామాజిక, ఆర్థికాభివృద్ధికి బాటలువేసేలా ఆ మార్పులు ఉండాలి. చట్టాలు, రాజ్యాంగాన్ని నేటి సమాజ సవాళ్లకు పరిష్కారాలు వెతికేందుకు అనువుగా మాత్రమే అన్వయించుకోవాలి. సమాజ అవసరాలు తీర్చేలా న్యాయవితరణలో న్యాయస్థానాలు చట్టాలు, రాజ్యాంగాన్ని ఆపాదించుకోవాలి, అన్వయించుకోవాలి''అని సీజేఐ అన్నారు. ''జడ్జీ పోస్ట్‌లోకి సిఫార్సుచేసేముందుగా ఆయా అభ్యర్థులను ప్రత్యక్షంగా కలిసి మాట్లాడే కొత్త సంస్కృతికి సుప్రీంకోర్టు తెరలేపింది. అయితే ఒక హైకోర్టులో అభ్యర్థులే ముందుగా చొరవతీసుకుని జడ్జీలను కలిసే ప్రయత్నంచేసినట్లు నాకు తెలిసింది. ఇలాంటి అనుచిత ధోరణి బాంబే హైకోర్టులో ఉండబోదనే ఆశిస్తున్నా''అని ఆయన అన్నారు.

మమ్దానీని వెంటాడుతున్న పాత పోస్టులు

న్యూయార్క్: న్యూయార్క్ నగర మేయర్ పదవికి పోటీ పడుతున్న జొహ్రాన్ మమ్దానీని 2015లో 'ఎక్స్'లో అల్ ఖైదా ఉగ్రవాదికి అనుకూలంగా చేసిన వ్యాఖ్యలు వెంటాడుతున్నాయి. అమెరికాలో జన్మించిన అన్వర్ అల్–ఔలాకీ అనే మత బోధకుడు తీవ్రవాదం బాట పట్టడానికి ఎఫ్‌బీఐ నిఘా కారణం కావొచ్చంటూ అప్పట్లో ఆయన వ్యాఖ్యలు చేశారు. వందశాతం కమ్యూనిస్ట్ పిచ్చోడంటూ మమ్దానీని ఉద్దేశించి అధ్యక్షుడు ట్రంప్ వ్యాఖ్యానించాక ఆయన పాత పోస్టులు తాజాగా వెలుగు చూశాయి. న్యూమెక్సికోలో యెమెన్ దేశస్తుల కుటుంబంలో జన్మించిన ఔలాకీ అమెరికాలోని మసీదుల్లో బోధనలు చేసేవాడు. అటు తర్వాత అల్‌ఖైదాలో అగ్ర నాయకుల్లో ఒకడయ్యాడు. అమెరికాలోని వరల్డ్ ట్రేడ్ సెంటర్, పెంటగాన్ తదితరాలపై 2001 సెప్టెంబర్ 11న దాడులకు పాల్పడిన ముగ్గురు ఉగ్రవాదులు ఇతడికి సన్నిహితులని తేలడంతో ఎఫ్‌బీఐ నిఘా పెంచింది. అటు తర్వాత అతడు 2004లో యెమెన్‌కు వెళ్లిపోయాడు. అమెరికా ఆస్తులపై దాడులు ఇతడు ఉగ్రవాదులకు పిలుపు ఇచ్చాడనే ఆరోపణలపై 2011లో అధ్యక్షుడు ఒబామా ఆదేశాల మేరకు యెమెన్‌పై జరిపిన డ్రోన్ దాడుల్లో హతమయ్యాడు. ఎలాంటి నేరారోపణలు లేని అమెరికా పౌరుడిని ప్రభుత్వమే చంపడం అసాధారణ విషయమని న్యూయార్క్‌పోస్ట్ అప్పట్లో వ్యాఖ్యానించింది.

గతేడాది కంటే 10% ఎక్కువగా పంటల సాగు

సాక్షి, న్యూఢిల్లీ: దేశ వ్యాప్తంగా ఈ ఏడాది కురిసిన ముందస్తు వర్షాలు పంటల సాగుకు కొత్త ఊపిరులూదాయి. జూన్‌లోనే అనుకున్న స్థాయికి మించి వర్షాలు కురవడంతో నీటి లభ్యత పెరిగిది. దీంతో పంటల సాగు గత ఏడాది కన్నా 10శాతం అధికంగా జరిగింది. వ్యవసాయ శాఖ వెల్లడించిన గణాంకాల మేరకు.. దేశంలో పంటల సాగు సగటు విస్తీర్ణం 10.96 కోట్ల హెకార్లు కాగా, ఈ ఏడాది ఇప్పటికే 4.37 కోట్ల హెక్టార్లలో సాగు పూర్తయింది. ఇది గత ఏడాది సాగు విస్తీర్ణం 3.13 కోట్ల హెక్టార్లతో పోలిస్తే 10 శాతం ఎక్కువ. ఈ ఏడాది వరి సాగు 4 కోట్ల హెక్టార్ల వరకు ఉంటుందన్నది అంచనా కాగా, ఇప్పటికే 69.30లక్షల హెక్టార్లలో నాట్లు వేశారు. ఇది గత ఏడాది కంటే 6.9 శాతం ఎక్కువ. పప్పుధాన్యాలు సైతం గతేడాది కంటే 26% ఎక్కువగా 42.57లక్షల హెక్టార్లలో సాగైంది. ఇందులో కంది గతేడాది కంటే కొద్దిగా తక్కువగా ఉన్నా మినుము, పెసర సాగు 10శాతం మేర అధికంగా ఉంది. నూనెగింజలు సైతం గతంతో పోలిస్తే 12శాతం అధికంగా 1.05 కోట్ల హెక్టార్లలో సాగైనట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి.

టెక్సాస్ వరదల్లో 90కి చేరిన మరణాలు

గల్లంతైన వారి కోసం కొనసాగుతున్న గాలింపు

కెర్‌విల్లె: అమెరికాలోని టెక్సాస్‌లో ఆకస్మికంగా సంభవించిన వరదల్లో మృతుల సంఖ్య 90కి చేరింది. గల్లంతైన వారి కోసం గాలింపు ముమ్మరంగా సాగుతోంది. శుక్రవారం రాత్రి సంభవించిన వరదల్లో హంట్ పట్టణ సమీపంలోని గ్వాడలుపె నదికి వచ్చిన వరదల్లో 'క్యాంప్ మిస్టిక్' సమ్మర్ క్యాంపులోని బాలికలు పదుల సంఖ్యలో కొట్టుకుపోవడం తెల్సిందే. ఇప్పటి వరకు 28 మంది బాలికల మృతదేహాలను కనుగొన్నారు. మరో 10 మందితోపాటు వారి ఇన్‌స్ట్రక్టర్ ఆచూకీ కోసం వెదుకుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 41 మంది జాడ తెలీడం లేదని టెక్సాస్ గవర్నర్ గ్రెగ్ అబాట్ తెలిపారు. భారీ వర్షాలు కొనసాగుతున్నందున మరింత ప్రమాదకరస్థాయిలో వరదలు సంభవించే అవకాశముందని ఆయన హెచ్చరించారు. 'క్యాంప్ మిస్టిక్' ఉన్న ఒక్క హిల్ కౌంటీలోనే 28 మంది బాలికలు సహా 68 మంది మృతి చెందారని అధికారులు తెలిపారు. ట్రావిస్, బర్నెట్, కెండాల్, టామ్ గ్రీన్, విలియంసన్ కౌంటీల్లో మరో 10 మంది ప్రాణాలు కోల్పోయారన్నారు.

మండి కంటే టెక్సాసే బాగా నచ్చినట్టుంది..!

ప్రధాని మోదీపై కాంగ్రెస్ విసుర్లు

న్యూఢిల్లీ: అమెరికాలోని టెక్సాస్‌లో అనూహ్యంగా సంభవించిన వరదల్లో భారీగా జరిగిన ప్రాణనష్టంపై ప్రధాని మోదీ విచారం వ్యక్తం చేయడంపై కాంగ్రెస్ పార్టీ స్పందించింది. హిమాచల్‌లో వరదలతో తీవ్రంగా నష్టపోయిన మండి జిల్లా కంటే ఆయనకు టెక్సాసే బాగా నచ్చినట్టుగా ఉందంటూ కాంగ్రెస్ మీడియా హెడ్ పవన్ ఖేరా సోమవారం 'ఎక్స్'లో ఎద్దేవా చేశారు. మండిలో ఈ సీజన్‌లో వర్షాలు, వరదలు, కొండచరియలు విరిగిపడిన ఘటనల్లో సుమారు 80 మంది చనిపోయారంటూ ఆయన..'ప్రపంచవ్యాప్తంగా ప్రజల కష్టాలపై మాట్లాడుతున్న ప్రధాని మోదీ హిమాచల్‌లో నష్టం గురించి ఒక్క మాట కూడా మాట్లాడలేదు. తనున్న చోట ఏముందో చూడలేని ప్రధాని మోదీ పర్వతాల కింద ఏముందో మాత్రం చెప్పగలరు..! విదేశీయుల ప్రాణాల కంటే భారతీయుల ప్రాణాలు అంత చౌకనా? సానుభూతి తెలిపేందుకు కూడా రాజకీయాలేనా?'అంటూ నిప్పులు చెరిగారు.

ఉత్తరాదిన భారీ వర్షాలు

హిమాచల్, ఉత్తరాఖండ్‌లలో రెడ్ అలర్ట్

ఢిల్లీ సహా పలు రాష్ట్రాల్లో వర్ష బీభత్సం

సాక్షి, న్యూఢిల్లీ: ఉత్తరాది రాష్ట్రాలు భారీ వర్షాలతో అతలాకుతలమవుతున్నాయి. హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్ వంటి పర్వత ప్రాంతాల్లో భారీ వర్షాల కారణంగా వాతావరణ విభాగం రెడ్ అలర్ట్ జారీ చేసింది. అదే సమయంలోనూ ఢిల్లీ సహా మైదాన రాష్ట్రాల్లోనూ వర్షాలు ఆగని పరిస్థితి కనిపిస్తోంది. ఇప్పటికే వర్షాల కారణంగా వాణిజ్య కార్యకలాపాలు, రవాణా, విద్యుత్ సరఫరా వ్యవస్థలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. పలు ప్రాంతాల్లో వర్షాలతో నదులు పొంగిపొర్లుతున్నాయి.

ఢిల్లీలో ఉక్కపోతకు ఉపశమనం

దేశ రాజధాని ఢిల్లీలో ఉక్కపోతకు వర్షం కొంత ఉపశమనం ఇచ్చింది. సోమవారం ఉదయం నుంచి ఢిల్లీ, పరిసర ప్రాంతాల్లో వర్షం కురిసింది. వర్షాల వల్ల ఉష్ణోగ్రతలు తక్కువయ్యాయి. తదుపరి రెండు రోజులు కూడా తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ వెల్లడించింది. ఉత్తరప్రదేశ్‌లోని 47 జిల్లాల్లో భారీ వర్షాలు పడే అవకాశముంది. సహారన్‌పూర్, బాగ్‌పత్, ముజఫర్‌నగర్, రాంపూర్, బిజ్నోర్‌లో భారీ వర్షాల హెచ్చరిక జారీ అయ్యింది. ఘజియాబాద్, నోయిడా, మీరట్, హాపూర్, మురాదాబాద్, బరేలీ, పిలిభిత్, అలీగఢ్, మథుర, ఆగ్రా, లలిత్‌పూర్ తదితర ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ పేర్కొంది.

ఎడతెరిపి లేకుండా వానలు

హిమాచల్ ప్రదేశ్‌లో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. ఈ సీజన్‌లో జూన్ 20వ తేదీ నుంచి ఆకస్మిక వరదల ఘటనలు 23, కుండపోత వానలు 19, కొండచరియలు విరిగిన 16 ఘటనలు నమోదయ్యాయి. మొత్తం 52 మంది చనిపోయారు. భారీ వర్షాలు కురుస్తున్న చంబా, మండీ, కాంగ్రా జిల్లాల్లో రెడ్ అలర్ట్ ప్రకటించారు. రాష్ట్రంలో 243 రోడ్లపై రాకపోకలు నిలిచిపోయాయి. 244 ట్రాన్స్‌ఫార్మర్లు, 278 నీటి సరఫరా పథకాలు పనిచేయడం మానేశాయి. ఉత్తరాఖండ్‌లోని రుద్రప్రయాగ్‌లో అలకానంద నది ఉగ్రరూపం దాల్చింది. యమునోత్రి రహదారి 10 రోజులుగా మూతబడే ఉంది. ఉత్తరకాశీ, టెహ్రీ, బాగేశ్వర్, డెహ్రాడూన్, రుద్రప్రయాగ్ జిల్లాల్లో వచ్చే ఐదు రోజులపాటు భారీ వర్షాల హెచ్చరిక జారీ చేశారు. మధ్యప్రదేశ్‌లోనూ విస్తృత వర్షాలు కురుస్తున్నాయి. ఈ కారణంగా అనూప్‌పూర్, జబల్‌పూర్, దామోహ్, సివ్ని, షహ్డోల్, ఉమ్రియా వంటి 13 జిల్లాల్లో వరద హెచ్చరిక జారీ చేశారు. జబల్‌పూర్‌లో బర్గీ డ్యామ్ 9 గేట్లు ఎత్తడంతో నర్మద తీర ప్రాంతాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. రాజస్తాన్‌లో 22 జిల్లాలకు వర్ష హెచ్చరిక జారీ చేశారు. సీకర్, జైపూర్, చురూ, ఉదయ్‌పూర్, కోటా జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. అదే సమయంలో జమ్మూకశ్మీర్, బిహార్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, పశ్చిమబెంగాల్, సిక్కిం రాష్ట్రాల్లో వర్షాలు కురుస్తున్నాయి.

ఒప్పందం లేకుండానే...!

ముగిసిన ఇజ్రాయెల్, హమాస్ చర్చలు

దోహా: హమాస్ ఇజ్రాయెల్ మధ్య ఖతార్‌లో జరిగిన తొలి విడత పరోక్ష కాల్పుల విరమణ చర్చలు ఎలాంటి ఒప్పందమూ లేకుండానే ముగిశాయి. హమాస్‌తో ఒప్పందాన్ని ఖరారు చేసే అధికారం ఇజ్రాయెల్ ప్రతినిధి బృందానికి లేకపోవడమే ఇందుకు కారణమని ఆ వర్గాలు సోమవారం తెలిపాయి. ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు అమెరికా పర్యటనకు ముందు చర్చలు తిరిగి ప్రారంభమయ్యాయి. ఇజ్రాయెల్ సంధానకర్తలకు స్పష్టమైన సూచనలిచ్చినట్లు అమెరికా బయల్దేరే ముందు నెతన్యాహు అన్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో తన సమావేశం కాల్పుల విరమణ చర్చలను ముందుకు తీసుకెళ్లడానికి దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. హమాస్ నిర్బంధంలో ఉన్న తమ బందీలను విడుదల చేయడం, ఇజ్రాయెల్‌కు ఆ ఉగ్ర గ్రూపు ముప్పును తొలగించడం తమ ప్రధాన లక్ష్యాలన్నారు. అయితే గాజాలో కాల్పుల విరమణకు ఒత్తిడి పెరుగుతున్న కొద్దీ నెతన్యాహుకు సొంత కేబినెట్ నుంచే వ్యతిరేకత పెరుగుతోంది. సంకీర్ణంలోని కొందరు సభ్యులు కాల్పుల విరమణను వ్యతిరేకిస్తుండగా, విదేశాంగ మంత్రి గిడియాన్ సార్‌తో సహా మరికొందరు మద్దతిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే 60 రోజుల కాల్పుల విరమణకు అవసరమైన షరతులకు ఇజ్రాయెల్ అంగీకరించిందని ట్రంప్ గత వారం ప్రకటించారు. హమాస్ కూడా అందుకు సానుకూలత తెలిపినా అలాంటిదేమీ లేదని నెతన్యాహు తేల్చిచెప్పారు.

రెండువైపులా సవాళ్లు

కాల్పుల విరమణ కోసం అమెరికా నుంచి ఒత్తిడి ఉన్నా ఇజ్రాయెల్, పాలస్తీనాలకు అడ్డంకులు అలాగే ఉన్నాయి. మానవతా సహాయం, ఈజిప్టులోకి రఫా సరిహద్దు క్రాసింగ్ తెరవడం, గాజా నుంచి ఇజ్రాయెల్ దళాల ఉపసంహరణ వంటి హమాస్ డిమాండ్లు ఆమోదయోగ్యం కాదని నెతన్యాహు కుండబద్దలు కొట్టారు. తమ బందీలను విడుదల చేయడంతో పాటు హమాస్ ఆయుధాలు వదిలేయాలని ఆయన డిమాండ్ చేస్తున్నారు. ఈ డిమాండ్‌పై చర్చకు బృందం అంగీకరించలేదు. మరోవైపు ఇరాన్‌తో ఇటీవలి వైమానిక సంఘర్షణను పొడిగించాలని, దీన్ని ట్రంప్ ముందు లేవనెత్తాలని నెతన్యాహు యోచిస్తున్నారు. మంగళవారం వైట్‌హౌస్‌లో ఆయనతో జరిగే భేటీలో ఇరాన్‌తో శాశ్వత ఒప్పందంపై చర్చలుంటాయని చెప్పారు.

పంజాబ్‌లో పట్టపగలు... వ్యాపారి కాల్చివేత!

తమ పనేనన్న బిష్ణోయ్ గ్యాంగ్

చండీగఢ్: పంజాబ్‌లోని అబోహర్ నగరంలో సోమవారం ఉదయం సంజయ్ వర్మ అనే వస్త్ర వ్యాపారవేత్త, సామాజిక కార్యకర్తను గుర్తు తెలియని దుండగులు కాల్చిచంపారు. 'న్యూ వేర్ వెల్ జెంట్స్ టైలర్' షోరూమ్ సహ యజమాని అయిన వర్మ ఉదయం 10.15 ప్రాంతంలో తన దుకాణం దగ్గర కారు దిగుతుండగా దాడి జరిగింది. ముసుగుల్లో వచ్చిన ముగ్గురు దుండగులు అతి సమీపం నుంచి కాల్పులు జరిపడంతో ఆయన అక్కడికక్కడే మరణించారు. కాల్పుల తర్వాత దుండగులు మోటార్‌సైకిల్‌పై పారిపోతూ కొద్ది దూరంలోనే జారి పడిపోయారు. వేరే వ్యక్తి మోటార్ సైకిల్ లాక్కొని దానిపై తప్పించుకున్నారు. వాళ్ల దాడికి ముందు అక్కడే తిరగడం, తర్వాత పారిపోవడం సీసీ కెమెరాల్లో నమోదైంది. ఈ హత్య తమ పనేనని ప్రస్తుతం జైల్లో ఉన్న లారెన్స్ బిష్ణోయ్, అతని సోదరుడు అన్‌మోల్ బిష్ణోయ్‌కు అత్యంత సన్నిహితుడు, గ్యాంగ్‌స్టర్ ఆర్జూ బిష్ణోయ్ ప్రకటించుకున్నాడు.

లోక్‌సభ ఎన్నికల్లో ఓటేసినవారు... ఇప్పుడు చొరబాటుదారులా?

బిహార్ ఓటర్ల జాబితా ప్రక్షాళనపై ఒవైసీ

న్యూఢిల్లీ: బిహార్‌లో అసెంబ్లీ ఎన్నికల వేళ జరుగుతున్న ఓటర్ల జాబితాల ప్రత్యేక సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్–ఎస్ఐఆర్)పై మజ్లిస్ అధినేత అసదుద్దీన్ ఒవైసీ మండిపడ్డారు. భారత ఎన్నికల సంఘం అనుసరించిన ప్రక్రియ, సమయం సందేహాస్పదంగా ఉన్నాయన్నారు. సోమవారం ఈసీ కార్యాలయాన్ని సందర్శించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ''సవరణకు మేం వ్యతిరేకం కాదు. కానీ ఇంత తక్కువ సమయంలో ఇంత పెద్ద కసరత్తును ఈసీ ఎలా నిర్వహించగలదనేదే మా ప్రశ్న. అంతిమంగా దీని పర్యవసానాలను ఎదుర్కోవాల్సింది ప్రజలే. బిహార్‌లో నిజంగానే అక్రమ వలసదారులు ఉంటే 2024 లోక్‌సభ ఎన్నికల్లో వారు ఓటేయడానికి ఎందుకు అనుమతించారు?'' అని ప్రశ్నించారు. 1971 యుద్ధం తర్వాత భారత్‌కు వచ్చిన బంగ్లాదేశీయులు ఇప్పుడు అకస్మాత్తుగా చొరబాటుదారులుగా ఎలా మారారని ప్రశ్నించారు. ''ఓటరు జాబితా నుంచి పేర్లను తొలగించడమంటే ఓటు హక్కును కోల్పోవడం మాత్రమే కాదు. ప్రజల జీవనోపాధి, సంక్షేమ ప్రయోజనాలను పొందే అవకాశాన్ని కాలదన్నడమే. ఇది పేదల మనుగడ సమస్య. తొందరపాటు నిర్ణయమని ఈసీకి చెప్పాం. తదుపరి చర్యలపై ఇతర విపక్షాలను సంప్రదిస్తున్నాం. ''బిహార్‌లో 2 శాతం మందికి మాత్రమే పాస్‌పోర్టులున్నాయి. 14 శాతం మంది మాత్రమే గ్రాడ్యుయేట్లు. చాలామంది పేదల వద్ద పత్రాల్లేవు. వరదల్లో వాటిని పోగొట్టుకున్నారు. వారంతా ఇప్పుడు ఓటు హక్కును కోల్పోయే ప్రమాదంలో పడ్డారు'' అని మజ్లిస్ బిహార్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే అఖ్తరుల్ ఇమాన్ ఆందోళన వ్యక్తం చేశారు. బిహార్ ఓటర్ల జాబితాల ప్రక్షాళనకు జూన్ 24న ఈసీ ఆదేశించింది. మరణించిన ఓటర్లు, అక్రమ వలసదారులు, అనర్హుల పేర్లను తొలగించడం, నిజమైన పౌరులు మాత్రమే జాబితాలో ఉండేలా చూడటం దీని లక్ష్యమని తెలిపింది.

బద్దలైన లెవొటోబి అగ్నిపర్వతం

ఇండోనేసియా గ్రామాలపై పడుతున్న బూడిద కుప్పలు

జకార్తా: అణుబాంబు పేలితే వెలువడే పుట్టగొడుగులాంటి అగ్నిగోళం తరహాలో తూర్పు ఇండోనేసియాలో ఒక అగ్నిపర్వతం బద్దలై ఏకంగా 18 కిలోమీటర్ల ఎత్తువరకు ఆకాశంలోకి భారీ స్థాయిలో దుమ్ము, ధూళిని ఎగజిమ్మింది. ఇప్పుడు అదంతా సమీప గ్రామాలపై కుప్పలుతెప్పలుగా పడుతోంది. దీంతో అక్కడి స్థానికులు, పర్యాటకులను ప్రభుత్వం హుటాహుటిన సుదూర సురక్షిత ప్రాంతాలకు తరలిస్తోంది. సోమవారం ఫ్లోర్స్ ద్వీపంలోని లెవోటోబీ లకిలకి అగ్నిపర్వతం బద్దలవడంతో ఈ అనూహ్య ఘటన చోటుచేసుకుంది. విపరీతంగా దుమ్ముధూళి అక్కడి ఆకాశమంతటా పరుచుకోవడంతో ఆ ప్రాంతం మీదుగా వెళ్లే విమాన రాకపోకలను నిలిపేశారు. దీంతో బాలీ నుంచి ఆస్ట్రేలియా, సింగపూర్, దక్షిణకొరియాలకు నడపాల్సిన పలు విమానసర్వీసులు రద్దయ్యాయి. భారీస్థాయిలో అగ్నిపర్వతం బద్దలై సమీప ప్రాంతాలపై లావా పడినా అక్కడ ఎవరూ లేకపోవడంతో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. ఆకాశంలో టన్నులకొద్దీ ధూళితో దట్టంగా దుమ్ముమేఘం అలుముకోవడంతో సూర్యకిరణాలుపడక ఒక అరగంట దాకా మొత్తం చీకటి అలుముకుందని వోల్కనాలజీ, జియోలజీ విపత్తు నిర్వహణ విభాగ సారథి హదీ విజయ చెప్పారు.



మహారాష్ట్ర తీరంలో బోటు కలకలం

- అనుమానాస్పదంగా పాక్ పడవ!
- రాష్ట్రవ్యాప్తంగా భద్రత కట్టుదిట్టం

రాయ్‌గఢ్: పాకిస్తాన్‌కు చెందినదిగా భావిస్తున్న ఓ పడవ మహారాష్ట్రలో రాయ్‌గఢ్ తీర ప్రాంతంలో అనుమానాస్పదంగా కనిపించింది. రెవ్‌దండాలోని కొర్లై తీరానికి రెండు నాటికల్ మైళ్ల దూరంలో భద్రతా సిబ్బంది దాన్ని గమనించినట్టు అధికారులు తెలిపారు. రాయ్‌గడ్ పోలీసులు, బాంబు గుర్తింపు, నిర్వీర్య దళం (బీడీడీఎస్), త్వరిత ప్రతిస్పందన బృందం (క్యూఆర్టీ), నేవీ, కోస్ట్ గార్డ్ బృందాలు హుటాహుటిన ఘటనా స్థలికి చేరుకున్నాయి. రాయ్‌గఢ్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ అంచల్ దలాల్, సీనియర్ పోలీసు అధికారులతో కలిసి పరిస్థితిని పర్యవేక్షించారు. అయితే భారీ వర్షం, బలమైన గాలుల కారణంగా పడవను చేరుకునే ప్రయత్నాలకు ఆటంకం కలిగింది. ప్రతికూల వాతావరణం కారణంగా వెనుదిరిగి రావలసి వచ్చిందని దలాల్ తెలిపారు. నౌకపై వేరే దేశ గుర్తులు ఉన్నాయని ప్రాథమికంగా తెలిసిందని, అది తీరానికి కొట్టుకుపోయి ఉండవచ్చని ఉన్నతాధికారులు భావిస్తున్నారు. ముందుజాగ్రత్త చర్యగా ముంబైతో పాటు రాష్ట్రవ్యాప్తంగా భద్రత పెంచారు. భారీగా పోలీసులను మోహరించినట్టు అధికారులు వెల్లడించారు.

ఉక్రెయిన్‌పైకి రష్యా వంద డ్రోన్లు

11 మంది మృతి, 80 మందికి గాయాలు

కీవ్: ఉక్రెయిన్‌పైకి రష్యా డ్రోన్ల దండయాత్ర కొనసాగుతోంది. ఆదివారం రాత్రి రష్యా మరో 100 డ్రోన్లను తమ భూభాగంపైకి ప్రయోగించిందని ఉక్రెయిన్ ఆర్మీ తెలిపింది. ఈ దాడుల్లో 10 మంది పౌరులు చనిపోగా, ఏడుగురు చిన్నారులు సహా 80 మంది గాయపడ్డారంది. మృతుల్లో ఒడెసాలో ఒకరు, సుమీలో ఇద్దరు, డొనెట్స్క్‌లో ఏడుగురు ఉన్నట్లు వివరించింది. ఖర్కీవ్‌లో 71 మంది గాయపడగా, కీవ్‌లోని రెండు జిల్లాల పరిధిలో శిథిలాల కారణంగా నష్టం కలిగిందని తెలిపింది. గత వారం రోజుల్లో రష్యా మొత్తంగా 1,270 డ్రోన్లు, 39 క్షిపణులు, దాదాపు వెయ్యి శక్తివంతమైన గ్లైడ్ బాంబుల్ని ప్రయోగించిందని అధ్యక్షుడు జెలెన్‌స్కీ సోమవారం వెల్లడించారు.

ధనికుల్ని మరింత ధనికులుగా చేస్తోంది

మోదీ ప్రభుత్వంపై కాంగ్రెస్ నేత రాహుల్ విమర్శలు

న్యూఢిల్లీ: ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్(ఎఫ్ అండ్ ఓ)మార్కెట్‌లో బడా సంస్థలు చేసే మోసాలపై మౌనంగా ఉంటున్న మోదీ ప్రభుత్వం ధనికుల్ని మరింత ధనికులుగా చేస్తూ సాధారణ మదుపరులను నాశనం చేస్తోందని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ సోమవారం ఆయన 'ఎక్స్'లో మండిపడ్డారు. ఎఫ్ అండ్ ఓ మార్కెట్ బడా సంస్థలు, వ్యక్తులకు ఆటస్థలంగా మారిందని, సామాన్య మదుపరుల జేబులు ఎప్పుడూ గుల్లవుతున్నాయని చెప్పారు. ఈ విషయాన్ని తాజాగా అంగీకరించిన సెబీ..ఇప్పటి వరకు ఎందుకు మౌనంగా ఉందంటూ ప్రశ్నించారు.

వీమా కాడ్‌ఫైసెస్ ఆదరించిన శైవమత శాఖి?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ హిస్టరీ

మౌర్యుల అనంతర యుగం -2

మౌర్యుల అనంతరం క్రీ.పూ 200 - క్రీ.శ 300 మధ్య కాలంలో భారతదేశంలో అనేక విదేశీ రాజ్యాలు ఏర్పడ్డాయి. మధ్యాసియా, ఇరాన్ నుంచి వచ్చిన విదేశీ తెగలు స్థానిక పరిస్థితులను ఆసరాగా చేసుకుని స్వతంత్ర రాజ్యాలను ఏర్పాటు చేశాయి. వారిలో ముఖ్యమైన వారు ఇండోగ్రీకులు, శకులు లేదా సైథియన్లు, పార్థియన్లు, యూచీలు.

ఇండో గ్రీకులు

వీరు మౌర్యానంతర యుగంలో భారతదేశంపై దండెత్తిన తొలి విదేశీయులు. వీరినే యవనులని, బాక్ట్రియా గ్రీకులని పిలుస్తారు. భారత్‌లో శకాల కేంద్రంగా యూథిడిమస్, తక్షశిల కేంద్రంగా యూక్రటైడ్స్ అనే రెండు రాజ్యాలు ఏర్పడ్డాయి.

డియోడోటస్: ఇతడు మొదట సెల్యూసిడ్ సామ్రాజ్యంలో బాక్ట్రియాకు గవర్నర్‌గా ఉండేవాడు. సెల్యూసిడ్ రాజు రెండో ఆంటియోకస్‌కు వ్యతిరేకంగా తిరుగుబాటు చేసి స్వతంత్ర ఇండో గ్రీకు రాజ్యాన్ని స్థాపించాడు.

యూథిడిమస్ వంశం

యూథిడిమస్: ఇతడు డియోడోటస్‌ను వధించి యూథిడిమస్ వంశ పాలనను ప్రారంభించాడు. ఇండోగ్రీకు సామ్రాజ్యానికి తొలి స్వతంత్ర రాజుగా ఇతణ్ని పరిగణిస్తారు.

డెమిట్రియస్-1: భారతదేశ భూభాగాలను జయించి ఇండోగ్రీకు సామ్రాజ్యంలో భాగంగా చేసినవాడు డెమిట్రియస్. తన సేనాపతి మినాండర్‌తో కలిసి తక్షశిలను జయించాడు. శకాలను నూతన రాజధానిగా చేసుకోవడమే కాక దాని పేరును యూథిడేమియాగా మార్చాడు.

మినాండర్: ఇతడు రెండో డెమిట్రియస్ తర్వాత శకాల రాజ్యాన్ని పరిపాలించాడు. భారతదేశాన్ని పాలించిన ఇండోగ్రీకు రాజులందరికంటే ఇతడు గొప్పవాడు. బౌద్ధ మతస్థుడు. 'మిళింద పన్హ' అనే గ్రంథంలో ఇతనికి, బౌద్ధ తత్త్వవేత్త నాగసేనునికి మధ్య జరిగిన సంభాషణల గురించి వివరంగా ఉంది.

యూక్రటైడ్స్ వంశం

యూక్రటైడ్స్: డెమిట్రియస్ భారతదేశ దండయాత్రలో ఉండగా, యూక్రటైడ్స్ బాక్ట్రియాను ఆక్రమించి తక్షశిల కేంద్రంగా తన పేరుతో స్వతంత్ర రాజ్యాన్ని స్థాపించాడు. తన కుమారుడు హీలియోకిల్స్ చేతిలో హత్యకు గురయ్యాడు.

ఆంటియాల్ సిదాస్: ఇతడు హెలియోడోరస్ అనే తన రాయబారిని మగధరాజు భాగభద్రుని వద్దకు పంపాడు. ఈ హీలియోడోరస్ వేయించినదే బేస్‌నగర్ స్తంభ శాసనం.

హర్మయూస్: యూక్రటైడ్స్ వంశంలో చివరి రాజు. ఇతని తర్వాత వీరి సామ్రాజ్యాన్ని పహ్లవులు(పార్థియన్లు), శకులు ఆక్రమించారు.

శకులు

మధ్యాసియా నుంచి వచ్చి భారతదేశంపై దండెత్తిన మరో విదేశీ తెగ. వీరినే సైథియన్లు, క్షాత్రపులు అంటారు. భారతదేశంలో నాలుగు శకరాజ్యాలు ఏర్పడగా, ఆఫ్ఘనిస్తాన్‌లో ఒక రాజ్యం ఏర్పడింది. భారతదేశంలోని నాలుగు శకరాజ్యాల్లో అతి ముఖ్యమైనవి క్షహరాట, కార్ధమక.

తక్షశిల శకులు

మోగా (మౌయోస్): భారతదేశంలో శకుల అధికారాన్ని స్థాపించిన తొలిరాజు ఇతడు. తక్షశిల కేంద్రంగా క్రీ.పూ. 80 నుంచి 20 వరకు పాలించాడు. ఇతడు రాగి, వెండి నాణేలను జారీ చేశాడు. వాటిపై గ్రీకు దేవతలతోపాటు శివుడు, బుద్ధుడి బొమ్మలను ముద్రించాడు. మోగా తర్వాత ఏజెస్, ఎజిలిసెస్, ఏజెస్-2 అనే రాజులు పాలించారు.

క్షహరాట శకులు

వీరు మహారాష్ట్ర, గుజరాత్ మొదలైన ప్రాంతాలను పాలించిన పశ్చిమ క్షాత్రపులు. మొదట కుషాణులకు సామంతులుగా పాలించేవారు.

భూమకుడు: ఇతడు క్షహరాట వంశ స్థాపకుడు. మిన్నాగర (మాందసార్) వీరి రాజధాని. ఖరోష్ఠి, బ్రాహ్మీ లిపులను నాణేలపై ఉపయోగించాడు.

నహపాణుడు: ఈ వంశంలో అందరి కంటే గొప్పవాడు. అనేక రాగి, వెండి నాణేలు జారీ చేశాడు. ఇతడి అల్లుడు, సేనాధిపతి ఉషవదత్తుడు జారీ చేసిన శాసనాలు నహపాణుని విజయాలను, సామ్రాజ్య విస్తీర్ణం గురించి తెలుపుతున్నాయి. ఇతడు క్రీ.శ. 124లో శాతవాహన రాజు గౌతమీపుత్ర శాతకర్ణి చేతిలో మరణించాడు. గౌతమీపుత్ర శాతకర్ణి పేరుతో పునర్ముద్రించిన నహపాణుని నాణేలు జోగల్‌తంబి అనే ప్రాంతంలో భారీ సంఖ్యలో లభించాయి.

కార్ధమక శకులు

వీరు ఉజ్జయినీ కేంద్రంగా పశ్చిమ భారతదేశాన్ని పాలించారు.

చష్టానుడు: ఇతడు కార్ధమక శకుల వంశంలో మొదటి రాజు. టాలమీ రాసిన 'జాగ్రఫీ' అనే గ్రంథంలో ఇతన్ని టియస్తనీస్ అని పేర్కొన్నారు.

రుద్రదమనుడు: భారతదేశంలోని శకులందరిలోకి అత్యంత గొప్పవాడు. ఇతడు జునాఘడ్ (గిర్నార్ శాసనం) వద్ద సంస్కృత శాసనాన్ని వేయించాడు. శాతకర్ణి అనే రాజును రెండుసార్లు ఓడించినట్లు ఇందులో ప్రస్తావించాడు. చంద్రగుప్త మౌర్యుడి కాలంలో నిర్మించిన సుదర్శన తటాకాన్ని మరమ్మతు చేయించాడు. తన కుమార్తె రుద్రదమనికకు వాశిష్ఠీపుత్ర శివశ్రీ శాతకర్ణితో వివాహం చేశాడు.

3వ రుద్ర సింహుడు: రుద్రదమనుడి అనంతరం అనేకమంది బలహీన రాజులు పాలించారు. మూడో రుద్ర సింహుడు ఈ వంశంలో చివరివాడు. ఇతడు గుప్తరాజు రెండో చంద్రగుప్తుడి చేతిలో మరణించడంతో భారతదేశంలో ఈ వంశ పాలన ముగిసింది.

పార్థియన్లు

వీరినే పహ్లవులు అని కూడా అంటారు. వీరు ఇరాన్ ప్రాంతానికి చెందినవారు.

గోండోఫెర్నెస్: భారతదేశాన్ని పాలించిన ఇతర పార్థియన్ రాజుల ఆధారాలు అంతగా లభించలేదు. 'తఖ్త్-ఇ-బాహి' అనే శాసనం గోండోఫెర్నెస్ విజయాలను తెలుపుతోంది. ఇతడు అఫ్గానిస్తాన్‌ను పాలించిన చివరి శకరాజు హెర్మాయూస్‌ను ఓడించి, రాజ్యాన్ని స్వాధీనం చేసుకున్నాడు. సెయింట్ థామస్ అనే క్రైస్తవ మత బోధకుడు... గోండోఫెర్నెస్‌ను క్రైస్తవంలోకి మార్చాడని 'యాక్ట్స్ ఆఫ్ జుడాస్ థామస్, ది అపోజిల్' అనే సిరియన్ గ్రంథం పేర్కొంటోంది.

కుషాణులు

మధ్యాసియాలోని యూచీ అనే తెగలోని 5 శాఖల్లో ఒక దానికి చెందిన వారు కుషాణులు. వీరినే తొచేరియన్లు అని కూడా పిలుస్తారు. చైనాపై దాడి ద్వారా జీవనాన్ని గడిపే ఈ తెగలు చైనా మహాకుడ్య నిర్మాణం వల్ల ఆ అవకాశం కోల్పోయారు. దీంతో భారతదేశంపై దాడి చేశారు. ఇక్కడ పాలకులుగా ఉన్న పార్థియన్లు, శకుల స్థానాలను కుషాణులు ఆక్రమించారు. ఫలితంగా భారతదేశంలో ఖొరసాన్ నుంచి వారణాసి వరకు వారి సామ్రాజ్యం విస్తరించింది. వీరి మొదటి రాజధాని పురుషపురం. రెండో రాజధాని మధుర.

కాడ్ ఫైసెస్-1: ఇతడినే కుజుల కాడ్‌ఫైసెస్ అంటారు. భారతదేశంలో కుషాణ సామ్రాజ్యాన్ని స్థాపించిన వాడు ఇతడే. చివరి గ్రీకురాజు హెర్మాయూస్‌కు సామంతుడిగా ఉండి తర్వాత పార్థియన్లను అంతం చేసి స్వతంత్ర రాజ్యాన్ని స్థాపించాడు. ఇతడు కేవలం రాగి నాణేలను మాత్రమే ముద్రించాడు. అవి అగస్టస్ చక్రవర్తి నాణేలను పోలి ఉండేవి. ఇతడికి 'మహా రాజాధిరాజా' అనే బిరుదు ఉంది. ఇతడు బౌద్ధ, శైవ మతాలను ఆదరించినట్లు తెలుస్తోంది.



కాడ్‌ఫైసెస్-2 (వీమా కాడ్‌ఫైసెస్): కుషాణ సామ్రాజ్యం భారతదేశం లోపలి ప్రాంతాల వరకు విస్తరించడానికి ఇతడు ప్రధాన కారకుడు. శైవమతాన్ని ఆదరించాడు. బంగారు నాణేలను ముద్రించాడు. శైవాభిమానాన్ని నాణేల ద్వారా ప్రకటించాడు.

కనిష్కుడు: భారతదేశాన్ని పాలించిన కుషాణ రాజుల్లో అందరికంటే గొప్పవాడు కనిష్కుడు. ఇతడు క్రీ.శ. 78లో 'శక' అనే పేరుతో భారతదేశంలో ఒక నూతన శకాన్ని ప్రారంభించాడు. ఇతడిని అశోకుడి తర్వాత అతిపెద్ద సామ్రాజ్య నిర్మాతగా భావిస్తారు. పాటలీపుత్రం మీద దాడి సందర్భంగా ఇతడు అశ్వఘోషుడనే ప్రముఖ బౌద్ధ పండితుడిని తనతో పాటు పురుషపురానికి తీసుకొని వెళ్లాడు. కాశ్మీర్‌లో తన పేరుతో కనిష్కపుర అనే నగరాన్ని నిర్మించాడు. కుందలవనంలో నాలుగో బౌద్ధ సంగీతిని నిర్వహించాడు. ఇతడి ఆస్థానంలో అనేకమంది పండితులకు ఆశ్రయం లభించింది. వారిలో ముఖ్యమైన వారు పార్శ్వ, వసుమిత్ర, అశ్వఘోష, నాగార్జున, చరకుడు, మాతర మొదలైనవారు. రాగి నాణేలు, బంగారు నాణేలు జారీ చేశాడు. బంగారు నాణేలపై ఒక వైపు రాజు, మరో వైపు దేవత గుర్తులుండేవి. కనిష్కుడు దేవపుత్ర, సీజర్ అనే బిరుదులు పొందాడు. గాంధార శైలిలో బోధిసత్త్వుల విగ్రహాలను చెక్కడం ఇతడి కాలంలోనే ప్రారంభమైంది. మధుర శిల్పకళా శైలిని ప్రోత్సహించాడు.

కనిష్కుని తర్వాతి రాజులు

కనిష్కుడి అనంతరం వశిష్కుడు, హువిష్కుడు, రెండో కనిష్కుడు మొదలైన రాజులు పాలించారు. ఇతని తర్వాత కుషాణ సామ్రాజ్యాన్ని ససానియన్లు, నాగులు, భారశివులు ఆక్రమించారు.

మాదిరి ప్రశ్నలు

1. అలెగ్జాండర్ తర్వాత భారతదేశ లోపలి ప్రాంతాలపై దండయాత్ర చేసిన గ్రీకు రాజు?
   ఎ) యూథిడిమస్ బి) యూక్రటైడ్స్
   సి) డెమిట్రియస్ డి) మినాండర్
2. మహేశ్వర అనే బిరుదు పొందిన విదేశీ రాజు?
   ఎ) కుజుల కాడ్‌ఫైసెస్
   బి) ఆంటియాల్ సిదాస్
   సి) వీమా కాడ్‌ఫైసెస్
   డి) హెలియో డోరస్
3. వీమా కాడ్‌ఫైసెస్ ఆదరించిన శైవమత శాఖ?
   ఎ) పాశుపతం బి) కాపాలికం
   సి) కాలాముఖం డి) అఘోర శైవం
4. పాంచావో అనే చైనా సేనాని చేతిలో ఓడిన కుషాణ చక్రవర్తి?
   ఎ) కుజుల కాడ్‌ఫైసెస్ బి) కనిష్కుడు
   సి) వీమా కాడ్‌ఫైసెస్ డి) హువిష్కుడు
5. కనిష్కుడు ఎవరి సలహా వల్ల కుందల వనంలో నాలుగో బౌద్ధ సంగీతిని నిర్వహించాడు?
   ఎ) వసుమిత్రుడు బి) అశ్వఘోషుడు
   సి) శీలభద్రుడు డి) పార్శ్వ
6. శివుడు, నంది గుర్తు కలిగిన నాణేలను జారీ చేసిన కుషాణ చక్రవర్తి?
   ఎ) హువిష్కుడు బి) వాసుదేవుడు
   సి) రెండో కనిష్కుడు డి) వశిష్కుడు
7. కశ్యపమాతంగ ఎవరి పాలనా కాలంలో చైనాలో బౌద్ధాన్ని ప్రవేశపెట్టారు?
   ఎ) మౌర్యుల కాలంలో
   బి) శుంగుల కాలంలో
   సి) శకుల కాలంలో
   డి) కుషాణుల కాలంలో
8. మహారాజ మహాత్మా అనే బిరుదున్న శకరాజు?
   ఎ) రుద్ర దమనుడు బి) భూమకుడు
   సి) మోగా డి) నహపాణుడు
9. అభిషేక లక్ష్మి అనే భారతీయ దేవతను తన నాణేలపై ముద్రించిన శకరాజు?
   ఎ) చష్టానుడు బి) ఏజెస్
   సి) నహపాణుడు డి) అజిలిసెస్
10. 'పెరిప్లస్ ఆఫ్ ది ఎరిత్రియన్ సీ' గ్రంథంలో మంబారాస్ అనే పేరుతో ఎవరిని పేర్కొన్నారు?
    ఎ) మిళిందుడు బి) నహపాణుడు
    సి) రుద్ర దమనుడు డి) భూమకుడు
11. తన నాణేల మీద గ్రీకు, ఖరోష్ఠి, బ్రాహ్మీ లిపులను ఉపయోగించిన శకరాజు?
    ఎ) చష్టానుడు బి) భూమకుడు
    సి) మోగా డి) రుద్రదమనుడు
12. మహాక్షాత్రప అనే బిరుదు పొందిన రాజు?
    ఎ) నహపాణుడు బి) రుద్రదమనుడు
    సి) ఉషవదత్తుడు
    డి) భూమకుడు
13. భారతదేశంలో తొలి సంస్కృత శాసనాన్ని ఎవరి కాలంలో జారీ చేశారు?
    ఎ) సముద్రగుప్తుడు బి) కనిష్కుడు
    సి) రుద్రదమనుడు
    డి) గౌతమీపుత్ర శాతకర్ణి
14. ధర్మతిడ, సచధర్మతిడ అనే బిరుదులు ఉన్న కుషాణ చక్రవర్తి?
    ఎ) కనిష్కుడు
    బి) హువిష్కుడు
    సి) కుజుల కాడ్‌ఫైసెస్
    డి) వీమా కాడ్‌ఫైసెస్
15. సెల్యూసిడ్ రాజు 2వ ఆంటియోకస్ చేతిలో ఓడిన భారతీయ రాజు?
    ఎ) సుభాగ సేనుడు
    బి) బిందుసారుడు
    సి) భాగభద్రుడు డి) పుష్య మిత్రుడు

సమాధానాలు

1) సి; 2) సి; 3) ఎ; 4) బి; 5) డి; 6) బి; 7) డి; 8) సి; 9) డి; 10) బి; 11) ఎ; 12) బి; 13) సి; 14) సి; 15) ఎ.

వందేళ్లలో ఎన్ని విషమ రోజులు ఉంటాయి?



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

మెంటల్ ఎబిలిటీ

క్యాలెండర్

విషమ రోజులు: నెలలోని రోజులను వారాలుగా పొందుపరచగా మిగిలే రోజులను విషమ రోజులు అంటారు. అంటే ఇచ్చిన రోజులను 7తో భాగిస్తే వచ్చే శేషమే విషమ రోజులు. ఒక వారంలో విషమ రోజులు **(odd days)** 0.

రోజులు	విషమ రోజులు
28	0
29	1
30	2
31	3

ఉదా:

7)29(4
28
1

7)31(4
28
3

- ఈ రోజు సోమవారం అయితే 61 రోజుల తర్వాత వచ్చేవారం?

(Deputy Jailor, 2012)

ఎ) బుధవారం బి) శనివారం
సి) మంగళవారం డి) గురువారం

జవాబు: బి

సాధన: విషమ రోజులు

7)61(8
56
5

∴ సోమవారం + 5 విషమ రోజులు
= శనివారం.

నెలలు	విషమ రోజులు		
		Ju	2
		Jy	3
J	3	Au	3
F	0/1	S	2
M	3	O	3
A	2	N	2
M	3	D	3

- ఈ రోజు మంగళవారం. 94వ రోజు ఏ వారం?

ఎ) శుక్రవారం బి) శనివారం
సి) ఆదివారం డి) సోమవారం

జవాబు: ఎ

నెలల వారీగా విషమ రోజులు:

- ఆగస్టులో ఎన్ని విషమ రోజులున్నాయి?

ఎ) 1 బి) 2 సి) 3 డి) 4

జవాబు: సి

సాధన: ఆగస్టు నెలలో 31 రోజులుంటాయి.

7)31(4
28
3

= ఆగస్టులో 3 విషమ రోజులుంటాయి.

గమనిక: సాధారణ సంవత్సరం, లీపు సంవత్సరాల్లో ఒకే రోజు, ఒకే తేదీ ఉండే నెలలు

సాధారణ సంవత్సరం	లీపు సంవత్సరం
జనవరి - అక్టోబర్	జనవరి - ఏప్రిల్
ఫిబ్రవరి - నవంబర్	జనవరి - జూలై
మార్చి - నవంబర్	ఫిబ్రవరి - ఆగస్టు
ఏప్రిల్ - జూలై	మార్చి - నవంబర్
సెప్టెంబర్ - డిసెంబర్	ఏప్రిల్ - జూలై
	సెప్టెంబర్ - డిసెంబర్

ఉదాహరణ:

1. ఏదైనా ఒక సంవత్సరంలో (సాధారణ/ లీపు) ఒకే రోజుతో ప్రారంభమయ్యే రెండు నెలలేవి?
   ఎ) మార్చి-నవంబర్
   బి) మార్చి-జూలై సి) జూలై- ఆగస్టు
   డి) పైవేవీ కావు జవాబు: ఎ
2. సాధారణ సంవత్సరంలో ఏ నెలలు ఒకే రోజుతో ప్రారంభమవుతాయి?
   ఎ) జనవరి-జూలై బి) జూన్- ఏప్రిల్
   సి) ఏప్రిల్-అక్టోబర్
   డి) జనవరి- అక్టోబర్ జవాబు: డి
3. 31 రోజులున్న నెలలో చివరి రోజు బుధవారమైతే ఎన్ని సోమవారాలు ఉంటాయి?
   (General S.I. 2010)
   ఎ) 4 బి) 3 సి) 5
   డి) చెప్పలేం జవాబు: సి

వివరణ: 31 రోజులున్న నెలలో 29, 30, 31 రోజుల్లో వచ్చే వారాలు 5 వస్తాయి. అంటే 31 రోజులున్న నెలలో 1, 2, 3 తేదీల్లో వచ్చే వారాలు 5 సార్లు వస్తాయి. కాబట్టి సోమవారం అయిదుసార్లు వస్తుంది.

సంవత్సరాలకు విషమ రోజులు

సౌర సంవత్సరం:

- భూమి, సూర్యుడి చుట్టూ ఒకసారి తిరిగి రావడానికి 365 రోజుల 5 గంటల 48 నిమిషాల 48 సెకన్లు పడుతుంది. 365 రోజుల కంటే ఎక్కువగా ఉన్న సుమారు 6 గంటలను ఒక రోజుగా ఉంచడం వీలు కాదు. కాబట్టి సాధారణ సంవత్సరానికి 365 రోజులుగా తీసుకున్నారు.
- మిగిలిన ఆరు గంటలు నాలుగేళ్లలో 24 గంటలు.. అంటే ఒక రోజు అవుతుంది. దీన్ని ఫిబ్రవరి నెలలోని చివరి రోజు (29వ తేదీ)గా పరిగణిస్తారు. దీన్ని లీపు సంవత్సరం అంటారు.

సాధారణ సంవత్సరం: ఇచ్చిన సంవత్సరం చివరి రెండు స్థానాలు అంటే ఒకట్లు, పదుల స్థానాల్లోని సంఖ్య 4తో నిశ్శేషంగా భాగించకపోతే దాన్ని సాధారణ సంవత్సరం అంటారు. సాధారణ సంవత్సరంలో 365 రోజులుంటాయి.

సాధారణ సంవత్సరాలు	సాధారణ సంవత్సరాలు కానివి
1981, 82, 83	1988, 92, 96
2001, 2002	2000, 2004

$\frac{365}{7}$ = 52 వారాలు + 1 విషమ రోజు

- సాధారణ సంవత్సరంలో 1 విషమ రోజు ఉంటుంది.
- సాధారణ సంవత్సరం ఏ రోజుతో ప్రారంభమవుతుందో.. అదే రోజుతో ముగుస్తుంది.

లీపు సంవత్సరం: ఇచ్చిన సంవత్సరంలోని చివరి రెండు స్థానాలు అంటే ఒకట్లు, పదుల స్థానాల్లోని సంఖ్యను 4 నిశ్శేషంగా భాగిస్తే అది లీపు సంవత్సరం. లీపు సంవత్సరం ప్రతి 4 ఏళ్లకు ఒకసారి వస్తుంది. లీపు సంవత్సరంలో 366 రోజులుంటాయి.

- లీపు సంవత్సరంలో రెండు విషమ రోజులు ఉంటాయి.
- లీపు సంవత్సరంలో ప్రారంభ రోజు ఏ వారం అవుతుందో డిసెంబర్ 30 కూడా అదే వారం అవుతుంది.

1. కింది వాటిలో లీపు సంవత్సరం ఏది?
   ఎ) 1986 బి) 2002
   సి) 2100 డి) 1992
   జవాబు: డి

శతాబ్ద సంవత్సరాలు 4తో నిశ్శేషంగా భాగితమైతే అవి లీపు సంవత్సరాలు కావు. 400తో నిశ్శేషంగా భాగితమైతేనే అవి లీపు సంవత్సరాలు అవుతాయి. ప్రతి నాలుగో శతాబ్దం లీపు సంవత్సరం అవుతుంది.

లీపు సంవత్సరాలయ్యే శతాబ్దాలు:
400, 800, 1200, 1600, 2000, ...

లీపు సంవత్సరాలు కాని శతాబ్దాలు:
100, 200, 300, 500, 600 ...

2. కిందివాటిలో లీపు సంవత్సరం ఏది?
   ఎ) 1100 బి) 1300
   సి) 1700 డి) పైవేవీ కావు
   జవాబు: డి
3. కిందివాటిలో సాధారణ సంవత్సరం ఏది?
   ఎ) 1200 బి) 2400
   సి) 2600 డి) పైవేవీ కావు
   జవాబు: సి
4. కిందివాటిలో లీపు సంవత్సరం కానిది?
   ఎ) 1744 బి) 2016
   సి) 1982 డి) పైవేవీ కావు
   జవాబు: సి
5. 481 రోజుల్లో ఎన్ని విషమ రోజులు ఉన్నాయి?
   ఎ) 1 బి) 2 సి) 4 డి) 5
   జవాబు: డి

100 సంవత్సరాలకు విషమ రోజులు

- వందేళ్లలో ఎన్ని విషమ రోజులు ఉంటాయి?

100 ఏళ్లలో 24 లీపు సంవత్సరాలు, 76 సాధారణ సంవత్సరాలు ఉంటాయి.

ఒక సాధారణ సంవత్సరానికి ఒక విషమ రోజు, ఒక లీపు సంవత్సరానికి రెండు విషమ రోజులు ఉంటాయి. ఆ ప్రకారం.. 100 ఏళ్లకు విషమ రోజులు

= 76×1 + 24×2 = 76+48 = 124

$\frac{124}{7}$ = 5 విషమ రోజులు

సంవత్సరం	విషమ రోజులు
100	5 → 5
200	10 → 3
300	15 → 1
400	20 + 1 → 0
500	5
600	3
700	1
800	0

- 100 సంవత్సరాల్లో 5, 200 సంవత్సరాల్లో 3, 300 సంవత్సరాల్లో 1, ప్రతి 4వ శతాబ్దానికి 0 విషమ రోజులు ఉంటాయి.

విషమ రోజులు	వారం
1	సోమవారం
2	మంగళవారం
3	బుధవారం
4	గురువారం
5	శుక్రవారం
6	శనివారం
0	ఆదివారం

ఉదా:

1. క్రీ.శ.1వ సంవత్సరం జనవరి 1వ తేదీన ఏ వారం?
   ఎ) శనివారం బి) ఆదివారం
   సి) సోమవారం డి) మంగళవారం
   జవాబు: సి
2. కింది వాటిలో ఏదైనా శతాబ్దం చివరి రోజు కానిది ఏది? (General S.I. 2012)
   ఎ) శుక్రవారం బి) ఆదివారం
   సి) మంగళవారం డి) సోమవారం
   జవాబు: సి

వివరణ: శతాబ్దం చివరి నాటికి విషమ రోజులుగా మిగిలేవి 5, 3, 1, 0.

అంటే 5-శుక్రవారం, 3-బుధవారం, 1-సోమవారం, 0-ఆదివారం. వీటిలో ఏదో ఒకటి తప్పకుండా ఉంటుంది. కానీ మంగళవారం, గురువారం, శనివారాలు శతాబ్దం చివరి రోజులుగా రావు.

శతాబ్దం చివరి రోజులు		ప్రారంభ రోజులు
శుక్రవారం	→	శనివారం
బుధవారం	→	గురువారం
సోమవారం	→	మంగళవారం
ఆదివారం	→	సోమవారం

ఉదా:

1. కిందివాటిలో ఏదైనా శతాబ్ద సంవత్సరం ప్రారంభ రోజు కానిది?
   ఎ) శనివారం బి) మంగళవారం
   సి) బుధవారం డి) సోమవారం
   జవాబు: సి
2. 247 సంవత్సరాల్లో ఎన్ని విషమ రోజులు ఉంటాయి?
   ఎ) 1 బి) 3
   సి) 4 డి) 5

జ. 200 రోజులకు 3 విషమ రోజులు ఉంటాయి. 47 ఏళ్లకు ఉండే విషమ రోజుల సంఖ్య తెలుసుకోవాలి.

47 ఏళ్లు = 11×4 + 3 = 44 + 3.

అంటే 47 ఏళ్లలో 11 లీపు సంవత్సరాలు, 36 సాధారణ సంవత్సరాలు ఉంటాయి.

47 ఏళ్లలో ఉండే విషమ రోజులు
= 11×2 + 36×1 = 22 + 36 = 58
58/7 = 2 విషమ రోజులు ఉంటాయి.
247 ఏళ్లకు విషమ రోజులు = 2+3 = 5

జవాబు: డి

3. 481 సంవత్సరాల్లో ఎన్ని విషమ రోజులు ఉంటాయి?
   ఎ) 5 బి) 3 సి) 2 డి) 1
   జవాబు: బి
4. క్రీ.శ. 100వ సంవత్సరంలో ఎన్ని విషమ రోజులు ఉన్నాయి?
   ఎ) 5 బి) 4 సి) 2 డి) 1
   జవాబు: డి

గతంలో అడిగిన ప్రశ్న

- 1977 జూలై 1వ తేదీ శుక్రవారం అయితే 1970 జూలై 1 ఏ వారం అవుతుంది?

(అసిస్టెంట్ స్టేషన్ మాస్టర్, 2013)

1) బుధవారం 2) గురువారం
3) ఆదివారం 4) మంగళవారం

వివరణ: 1970 జూలై 1 నుంచి 1977 జూలై 1 వరకు విషమ రోజులు =

సంవత్సరాలు		విషమ రోజులు
1971	→	1
1972	→	2 (లీపు సంవత్సరం)
1973	→	1
1974	→	1
1975	→	1
1976	→	2 (లీపు సంవత్సరం)
1977	→	1

మొత్తం విషమ రోజులు = 9 ~ 2

కావలసిన రోజు = శుక్రవారం-2 = బుధవారం

జవాబు: 1

ప్రపంచంలో అత్యంత ప్రమాదకరమైన చేప ఏది?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

బయాలజీ



మాదిరి ప్రశ్నలు

1. కార్డేటాలలో ఏ నిర్మాణం ఉండటాన్ని ముఖ్య లక్షణంగా పేర్కొంటారు?
   1) హృదయం 2) చర్మం
   3) మెదడు 4) పృష్ఠవంశం
2. జీవశాస్త్రంలో విచిత్ర జీవులుగా వేటిని పేర్కొంటారు?
   1) హెమీ కార్డేట్‌లు 2) సెఫలో కార్డేట్‌లు
   3) యూరో కార్డేట్‌లు 4) కార్డేట్‌లు
3. సకశేరుకాల ఉద్భవానికి సంబంధించిన డింభకం ఏది?
   1) బైపిన్నేరియా లార్వా
   2) ఐఫియోప్లుటియస్
   3) ఆరిక్యులేరియా 4) ఎకైనోప్లుయస్
4. 'శీతల రక్త జీవులు (బాహ్యోష్ణ సకశేరుకాలు)'గా వేటిని పేర్కొంటారు?
   1) చేపలు 2) ఉభయచరాలు
   3) సరీసృపాలు 4) పైవన్నీ
5. కింది వాటిలో 'ఉష్ణరక్త జీవులు (అంతరోష్ణ సకశేరుకాలు)' ఏవి?
   1) సరీసృపాలు 2) పక్షులు
   3) క్షీరదాలు 4) 2, 3
6. అధిక సంఖ్యలో ఉన్న సకశేరుకాలేవి?
   1) చేపలు 2) ఉభయచరాలు
   3) సరీసృపాలు 4) పక్షులు
7. చేపల్లో ఏవిధమైన హృదయం ఉంటుంది?
   1) సిరా హృదయం 2) ధమని హృదయం
   3) మిశ్రమ హృదయం 4) ఏదీకాదు
8. చేపల హృదయం విశిష్ట లక్షణం ఏది?
   1) మంచి రక్తం ప్రవహించడం
   2) చెడు రక్తం ప్రవహించడం
   3) మిశ్రమ రక్తం ప్రవహించడం
   4) ఎలాంటి రక్తం ప్రవహించకపోవడం
9. విచ్ఛిన్న విస్తరణను ప్రదర్శించే చేపలు ఏవి?
   1) నియోసెరటోడస్ 2) ప్రోటాప్టిరస్
   3) లెపిడో సైరస్ 4) పైవన్నీ
10. కాలేయ నూనెకు ప్రసిద్ధమైన చేప?
    1) స్టోన్ ఫిష్ 2) బ్లూవేల్
    3) కాడ్ ఫిష్ 4) సిల్వర్ ఫిష్
11. దోమ డింభకాలను ఆహారంగా తీసుకుంటూ మలేరియా వ్యాధి నివారణకు దోహదపడే చేపలు ఏవి?
    1) ఎక్సోసీటస్ 2) హిప్పోకాంపస్
    3) గాంబూసియా యఫినిస్
    4) పైవేవీ కావు
12. కింది వాటిలో నిజమైన చేపలు ఏవి?
    1) జెల్లీ ఫిష్ 2) సిల్వర్ ఫిష్
    3) కటిల్ ఫిష్ 4) షార్క్ ఫిష్
13. ప్రపంచంలో అత్యంత ప్రమాదకరమైన చేప?
    1) స్టోన్ ఫిష్ 2) గోల్డెన్ ఫిష్
    3) సిల్వర్ ఫిష్ 4) స్టార్ ఫిష్
14. బెంగాలీలకు ప్రీతిపాత్రమైన హిల్సా చేప 1 కిలోల బరువు పెరుగడానికి ఎన్నేళ్లు పడుతుంది?
    1) 4 2) 3 3) 2 4) 5
15. ఇక్తియాలజీ అనేది వేటి గురించి అధ్యయనం చేసే శాస్త్రం? (Tech.Asst. in Archaeology-2012)
    1) చేపలు 2) సరీసృపాలు
    3) పక్షులు 4) క్షీరదాలు
16. బొటనవేలు లేకపోవడం అనేది కింది వాటిలో ఏ జీవి లక్షణం?
    1) కోతి 2) మానవుడు
    3) కుందేలు 4) కప్ప
17. భూమి మీద మొదట నివసించిన జీవులు ఏవి?
    1) తొండలు 2) డిప్నాయ్ చేపలు
    3) కప్పలు 4) సర్పాలు
18. రెడ్ ఇండియన్లు బాణాల చివరన విషంగా ఏ కప్ప చర్మగ్రంథుల స్రావాలను పూస్తారు?
    1) హైలా 2) రాకోఫోరస్
    3) పిల్లోబేటస్ 4) ఎలైటస్
19. కింది వాటిలో ప్రపంచంలో అత్యంత విష పూరిత ఉభయచరాల్లో ఒకటి ఏది? (Gr-II, 2005)
    1) బ్లూ డార్ట్ మండూకం 2) రాటిల్ స్నేక్
    3) స్పెర్మ్ వేల్ 4) గ్రీన్ టర్టిల్
20. బాహ్య ఫలదీకరణం జరిపే జీవులు ఏవి?
    1) చేపలు 2) కప్పలు
    3) బల్లులు-పాములు 4) 1, 2
21. టాడ్‌పోల్ లార్వా రూప విక్రియను నియంత్రించే హార్మోన్ ఏది?
    1) అడ్రినలిన్ 2) థైరాక్సిన్
    3) ఈస్ట్రోజన్ 4) ఆక్సిటోసిన్
22. 'వేసవి కాల నిద్ర' అంటే ఏమిటి?
    1) శీతాకాల సుప్తావస్థ
    2) ప్రతికూల పరిస్థితులు
    3) గ్రీష్మకాల సుప్తావస్థ 4) కోమా
23. స్పాన్ అంటే..?
    1) కప్ప అండాల సమూహం
    2) పుట్టగొడుగుల విత్తనాలు
    3) కప్ప శుక్రకణాల సమూహం
    4) 1, 2
24. రెండు కర్ణికలు, ఒక జఠరికతో కూడిన హృదయం ఏ జీవుల్లో ఉంటుంది?
    1) చేపలు 2) కప్పలు
    3) పాములు 4) పక్షులు-క్షీరదాలు
25. కప్పల గురించి అధ్యయనం చేసే శాస్త్రాన్ని ఏమంటారు?
    1) ఇక్తియాలజీ 2) బాట్రకాలజీ
    3) టార్పిడాలజీ 4) ఓఫియాలజీ
26. రూప విక్రియ ప్రదర్శించే జీవి ఏది?
    1) పాము 2) కప్ప
    3) హైడ్రా 4) చేప
27. మెడ, తోక, పొలుసులు లోపించిన జీవులు ఏవి?
    1) చేపలు 2) కప్పలు
    3) సరీసృపాలు 4) పక్షులు
28. సర్పాలకు సంబంధించి కింది వాటిలో సరైంది ఏది?
    1) కదిలే కనురెప్పలు ఉంటాయి
    2) కదలని కనురెప్పలు ఉంటాయి
    3) కనురెప్పలు ఉండవు
    4) నిమేశక పటలం ఉంటుంది
29. విషసర్పాల్లో విషగ్రంథులు వేటి రూపాంతరం?
    1) ఆస్య గ్రంథులు 2) లాలాజల గ్రంథులు
    3) తైల గ్రంథులు 4) అశ్రు గ్రంథులు
30. కింది వాటిలో పాము కరిచినప్పుడు విరుగుడుగా పనిచేసే మంచి ఇంజెక్షన్ ఏది?
    1) పెన్సిలిన్ 2) యాంటీవీనమ్
    3) యాంటీబయాటికిన్ 4) స్ట్రెప్టోమైసిన్
31. నాగుపామును దేని ఆధారంగా గుర్తిస్తారు?
    1) నలుపురంగు 2) పడగ
    3) రాళ్లలో నివసించడం వల్ల
    4) పడగ, మూడో అదివోష్ఠ పొలుసు
32. సర్పాల్లో మధ్య చెవి ఉండదు. అవి శబ్దాలను వేటి ద్వారా గ్రహిస్తాయి?
    1) నాలుక 2) చర్మం
    3) ముట్టె 4) గాలి
33. పాము విషానికి విరుగుడు ఇంజెక్షన్లను ఎక్కడ తయారు చేస్తున్నారు?
    1) A.C.D., ఢిల్లీ
    2) IICT, హైదరాబాద్
    3) హాఫ్‌కిన్ ఇన్‌స్టిట్యూట్, ముంబై
    4) పింప్రి, పుణే
34. సరీసృపాలన్నింటిలో మొసళ్లలో ఉన్న ప్రత్యేక లక్షణం ఏది?
    1) దృఢమైన దవడ కండరాలు
    2) నేలమీదకు రాగలిగే శక్తి
    3) నాలుగు గదుల గుండె
    4) అండం చుట్టూ గట్టి పెంకు ఉండటం
35. పక్షుల్లో ఉండే ప్రధాన లక్షణం?
    1) ముక్కు 2) రెక్కలు
    3) పొలుసులు 4) ఈకలు
36. పాముల గురించి అధ్యయనం చేసే శాస్త్రం?
    1) ఇక్తియాలజీ 2) ఓఫియాలజీ
    3) లెపిడాప్టరాలజీ 4) ఎంటమాలజీ
37. కింది వాటిలో శిశుత్పాదక సర్పం ఏది?
    1) కోబ్రా 2) కట్లపాము
    3) రక్తపింజర 4) రాట్ సర్పం
38. రక్తపింజర విషం ఏ వ్యవస్థపై ప్రభావం చూపుతుంది?
    1) జీర్ణ వ్యవస్థ 2) రక్తప్రసరణ వ్యవస్థ
    3) శ్వాస వ్యవస్థ 4) విసర్జన వ్యవస్థ
39. నాగుపాము విషం ఏ వ్యవస్థపై ప్రభావం చూపుతుంది?
    1) శ్వాస వ్యవస్థ 2) రక్తప్రసరణ వ్యవస్థ
    3) నాడీ వ్యవస్థ 4) జీర్ణ వ్యవస్థ
40. చలనంలో సర్పాలకు సహాయపడేవి ఏవి?
    1) తల 2) పొలుసులు
    3) పర్శుకలు 4) తోక
41. అతి తక్కువ కాలం చూలు మోసే జీవి?
    1) మేక 2) గుర్రం
    3) అపోజం 4) చుంచెలుక
42. కింది వాటిలో విష సర్పం కానిది?
    1) సముద్ర సర్పం 2) కట్లపాము
    3) రక్తపింజర 4) పైథాన్
43. కింది వాటిలో విష సర్పం ఏది?
    1) పైథాన్ 2) కట్లపాము
    3) ట్రి స్నేక్ 4) రాట్ స్నేక్
44. ఒక వ్యక్తి కాలికి ఏదో జీవి కరవడం వల్ల రెండు గాట్లు పడ్డాయి. ఆ గాట్ల ఆధారంగా కింది వాటిలో అది ఏ జీవి అయి ఉండవచ్చు?
    1) తేలు 2) ఎలుక
    3) విషరహిత సర్పం 4) విషపూరిత సర్పం
45. పరిసరాలను బట్టి రంగులు మార్చేది?
    1) పిల్లి 2) ఎలుక
    3) ఊసరవెల్లి (కెమీలియాన్) 4) తొండ
46. కింది వాటిలో దీర్ఘకాలం జీవించే జంతువు?
    1) ఏనుగు 2) ఒంటె
    3) నక్క 4) తాబేలు
47. డైనోసార్ ఒక...? (UPSC-1989)
    1) సరీసృపం 2) ఉభయచరం
    3) క్షీరదం 4) పక్షి
48. 'డైనోసార్' అనే పదానికి అర్థం?
    1) ఘోర పాకుడు జంతువు
    2) భయంకరమైన పాకుడు జంతువు
    3) ఘోర బల్లి
    4) అధమ పాకుడు జంతువు
49. కింది వాటిలో ఎగిరే డైనోసార్‌గా ప్రసిద్ధి చెందింది ఏది? (Polytechnic College, Lecturers)
    1) స్పైనోసారస్ 2) టైరోసారస్
    3) అర్జంటినో సారస్ 4) ఏదీకాదు
50. విషం గురించి అధ్యయనం చేసే శాస్త్రం? (Asst.social welfare officer in A.P. 2012)
    1) మార్ఫాలజీ 2) ఆస్టియాలజీ
    3) టాక్సికాలజీ 4) కాంకాలజీ
51. భూమిపై అతి పెద్ద పక్షి ఏది? (Asst.social welfare officer in A.P. 2012)
    1) ఈము 2) ఆస్ట్రిచ్
    3) ఆల్ బట్రాస్ 4) సైబీరియన్ క్రేన్
52. కింది వాటిలో దేనిలో వాతులాస్థులు ఉంటాయి?
    1) గబ్బిలం 2) తిమింగలం
    3) పక్షులు 4) ఎక్సోసీటస్
53. పక్షుల్లో కనిపించే దృష్టి లక్షణం ఏది?
    1) మోనాక్యులార్-టెలిస్కోపిక్ దృష్టి
    2) బైనాక్యులర్-మయోపిక్ దృష్టి
    3) బైనాక్యులర్-టెలిస్కోపిక్ దృష్టి
    4) మోనాక్యులర్- మయోపిక్ దృష్టి
54. పక్షుల గురించి అధ్యయనం చేసే శాస్త్రం? (Gr-II, 2012)
    1) హెర్పిటాలజీ 2) ఆర్నిథాలజీ
    3) ఇథాలజీ 4) ఫినాలజీ
55. కింది వాటిలో పక్షుల్లో ఏవి ఉండవు? (Gr-II, 2001)
    1) నరాలు 2) చెమట గ్రంథులు
    3) కనురెప్పలు 4) వాతులాస్థులు
56. నేలపై అతి వేగంగా పరుగెత్తే జంతువు? (Gr-I, 1998)
    1) లేడి 2) చిరుతపులి
    3) గుర్రం 4) పెద్దపులి
57. స్వేద గ్రంథులు లేని క్షీరదం?
    1) కోతి 2) ఆవు
    3) తిమింగలం 4) పంది
58. గబ్బిలం, తిమింగలం ఏ వర్గానికి చెందినవి?
    1) పక్షులు 2) సరీసృపాలు
    3) క్షీరదాలు 4) ఉభయచరాలు
59. కింది వాటిలో క్షీరదాల అత్యంత ప్రధాన లక్షణం ఏది?
    1) హెమియోథర్మిక్ 2) విభాజక పటలం
    3) శిశు ఉత్పాదకాలు 4) డైకాండైలిక్
60. ఏ జీవికి వేళ్లు ఉండవు కానీ, గోళ్లు ఉంటాయి?
    1) కంగారు 2) అపోజం
    3) బ్లూవేల్ 4) ఒంటె
61. గుడ్లు పెట్టే క్షీరదం?
    1) డక్‌బిల్ ప్లాటిపస్ 2) ఎకిడ్నా
    3) గబ్బిలం 4) 1, 2
62. ప్రపంచంలో అతి పెద్ద ప్రాణి ఏది? (Gr-I, 1998)
    1) ఇండియా ఏనుగు 2) బ్లూవేల్
    3) రైనోడాన్ 4) ఆఫ్రికా ఏనుగు
63. మానవుడి తర్వాత అతి తెలివైన క్షీరదం? (S.I.-2008)
    1) బ్లూవేల్-తిమింగలం 2) డాల్ఫిన్
    3) ఆఫ్రికా ఏనుగు 4) కంగారు
64. జంతువుల ప్రవర్తనను అధ్యయనం చేసే శాస్త్రం ఏది? (Gr-I, 2010)
    1) ఎంటమాలజీ 2) ఇథాలజీ
    3) ఎకాలజీ 4) యూజెనిక్స్

సమాధానాలు

1) 4; 2) 3; 3) 3; 4) 4; 5) 4;
6) 1; 7) 1; 8) 3; 9) 4; 10) 3;
11) 3; 12) 4; 13) 1; 14) 2; 15) 1;
16) 4; 17) 3; 18) 3; 19) 1; 20) 4;
21) 2; 22) 3; 23) 4; 24) 2; 25) 2;
26) 2; 27) 2; 28) 3; 29) 2; 30) 2;
31) 4; 32) 2; 33) 3; 34) 3; 35) 4;
36) 2; 37) 3; 38) 2; 39) 3; 40) 3;
41) 3; 42) 4; 43) 2; 44) 4; 45) 3;
46) 4; 47) 1; 48) 2; 49) 2; 50) 3;
51) 2; 52) 3; 53) 1; 54) 2; 55) 2;
56) 2; 57) 3; 58) 3; 59) 2; 60) 3;
61) 4; 62) 2; 63) 2; 64) 2.

Another term for hyperlink is..

BANK EXAMS

COMPUTER AWARENESS

The Internet is a worldwide network of networks. It can be defined as a global network of over millions of smaller heterogeneous computer networks consists of a set of national, regional and private. The internet is the common language where by dissimilar computers with various operating systems, are able to communicate with each other using a standard set of protocols.

The Internet is the world's largest computer network, a distinction it has earned by virtue of being a "network of networks." The Internet is an outgrowth of a network (ARPANET) established roughly a quarter-century ago to meet the needs of researchers working in the defense industry in the United States and a few of their colleagues in other countries.

The ARPANET grew slowly, from a handful of computers in 1971 to more than 1000 in 1984. Working with the ARPANET researchers came to regard high-speed computer networks as an indispensable tool for academic research in all fields and in 1986 the US National Science Foundation established NSFNET to provide network connections to more research institutions and improve international network cooperation. In 1987, the Internet served more than 10,000 computers. By 1989 the network had grown to more than 100,000.



Evolution of Internet

- The origin of Internet can be traced to a U.S. Department of Defense (DoD) organization called Advanced Research Projects Agency (ARPA).
- ARPA developed a four node packet switching network called ARPANET in 1969. The network was intended to support the military research on fault tolerant computer networks. DoD wanted to ensure a reliable data transfer in the event of a nuclear war, even if parts of the network has been destroyed.
- As the years pass by, the network grew in size and by 1st January 1983, the ARPANET no longer remained an experimental network but its control was passed over to Defense Communications Agency (DCA).
- The network then became available for the academic research, government employee and contractors.
- The world's fastest and most powerful computers were made available to an academic and scientific community.
- In 1990 the ARPANET was officially decommissioned.

Some of the major networks contributing to the growth of the internet are as follows:

- ARPANET
- USENET (User's network)
- CSNET (Computer science network)
- BITNET (Because it's time network)
- NSFNET (National science foundation network)
- WWW (World Wide Web)
- NREN (National research and education network)
- Intranet

It is said that the Internet is growing at a rate of 20% per month. The data speeds have gone up considerably, which makes the access even faster.

- The event which started as a military assistance program is now largely a private enterprise.

Services on the Internet

The services that are available on the Internet can be classified into two categories:

- Communication services (electronic mail (e-mail))
- Information retrieval services (Web (pages with links and multimedia content of its Web sites))

Applications of Internet

Traditionally the internet has the following applications.

1) E-mail 2) News
3) Remote login
4) File transfer
5) World wide web (www)

MODEL QUESTIONS

1. A ______ is a named location on a disk where files are stored.
   1) Folder 2) Pod 3) Version
   4) Bag 5) None of the above
2. The ______ allows you to choose where to go and is located below the Standards Buttons toolbar.
   1) System menu 2) Address bar
   3) Menu bar 4) Tool bar
   5) None of the above
3. A ______ is a set of computer instructions that carry out a task on the computer.
   1) Program 2) Database
   3) Memory file 4) Folder
   5) None of the above
4. An operating system version designed for home use is Microsoft Windows XP______
   1) Home Edition
   2) Media Center Edition
   3) Tablet PC Edition
   4) All of the above 5) None
5. A user-interface that is easy to use is considered to be______
   1) user-happy 2) user-simple
   3) user-friendly 4) Interface
   5) None of the above
6. When you press and release the secondary mouse button you are______
   1) Right-clicking
   2) Left-clicking
   3) Either 1 or 2
   4) All of the above
   5) Neither 1 nor 2
7. Another term for hyperlink is______
   1) Link 2) Source
   3) Bar 4) All of the above
   5) None of the above
8. A graphical user interface displays__________
   1) Graphics 2) Text
   3) Both 1 and 2
   4) Neither 1 nor 2 5) None
9. The ______ program compresses larger files into a smaller file.
   1) Win Zip 2) Win Shrink
   3) Win Style 4) Win small
   5) None of the above
10. The efficient data structure to insert/delete a number in a stored set of numbers is __________.
    1) Queue 2) Linked list
    3) Doubly linked list
    4) Binary tree
    5) None of the above
11. Caps lock, Num-lock are known as ______.
    1) Modifier key 2) Toggle key
    3) Function key 4) Numeric key
    5) None of these
12. Which of the following memories must be refreshed many times per second?
    1) Static RAM
    2) Dynamic RAM 3) EPROM
    4) ROM 5) None of these
13. Anurag is a supercomputer developed in ______
    1) China 2) USA 3) India
    4) England 5) None of these
14. A result of a computer virus can not lead to______.
    1) Disk Crash
    2) Mother Board Crash
    3) Corruption of program
    4) Deletion of files
    5) None of these
15. Choose the correct way to indicate that a line in a C++ program is a comment line, that is/a line they will not be executed as an instruction.
    1) Begin the line with a # sign
    2) Begin the line with double slashes (/ /)
    3) Begin and end the line with double hyphens (-_-)
    4) Indent the line
    5) None of these
16. Programming language built into user programs such as Word and Excel are known as_____.
    1) 4GLs 2) Macro languages
    3) Procedure-oriented languages
    4) Visual programming languages
    5) None of these
17. Firewalls are used to protect against _______.
    1) Unauthorized Attacks
    2) Virus Attacks
    3) Data Driven Attacks
    4) Fire Attacks
    5) All of these
18. System software is the set of programs that enables your computer's hardware devices and ______software to work together.
    1) Management 2) Processing
    3) Utility 4) Application
    5) None of these
19. RAM can be thought of as the ________ for the computer's processor.
    1) Factory 2) Operating room
    3) Waiting room
    4) Planning room
    5) None of these
20. The CPU and memory are located on the __________.
    1) Expansion board
    2) Motherboard
    3) Storage device
    4) Output device
    5) None of these
21. Word processing, spreadsheet and photo-editing are examples of ________.
    1) Application software
    2) System software
    3) Operating system software
    4) Platform software
    5) None of the above
22. To hyperlink on the web page through HTML language, _____ tag is used.
    1) <ahref> 2) <a> 3) <link>
    4) <hlink> 5) <href>
23. Drop cap option found in which menu?
    1) Insert 2) Format 3) Edit
    4) Tools 5) None of these
24. A half byte is known as_______.
    1) Data 2) Bit 3) Half byte
    4) Nibble 5) All of these
25. A piece of computer hardware that is physically placed between two devices each of which manages data in a different way is called______
    1) Modern 2) Interface
    3) Clue 4) Data bus
    5) All of these
26. ______ tags, when placed on an animal, can be used to record and track in a database all of the animals movements.
    1) POS 2) RFID 3) PPS
    4) GPS 5) None of these
27. Format for musical data communication between two devices such as computer and synthesizer is called_______.
    1) HTML 2) MP3 3) MPEG
    4) MIDI 5) None of these

KEY

1) 1	2) 2	3) 1	4) 1	5) 3
6) 1	7) 1	8) 3	9) 1	10) 3
11) 2	12) 2	13) 3	14) 2	15) 2
16) 4	17) 1	18) 4	19) 3	20) 2
21) 1	22) 1	23) 1	24) 4	25) 2
26) 2	27) 4			